# "నందకం"

## (ఆనందమూలం, నా ఆత్మకథ)

## నా మనసులో మాట

శాశ్వత ఆనందప్రాప్తి కోసం పరమాత్మ ప్రసాదించిన జ్ఞానంతో నేను చేసిన సత్యాన్వేషణ క్రమంలో నా మనస్సులో కలిగిన అద్భుతభావముల ప్రతిరూపమే "నందకం" అనే ఈ పుస్తకము.

మొదట్లో ఎన్నో సంశయాలకు లోనైన ఈ సత్యశోధన, క్రమక్రమంగా విజ్ఞానాన్ని సంతరించు కుంటూ ఆత్మానంద స్థితికి చేరుకుంది.

ఈ సత్యశోధనే నన్ను నా పూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ బాబాజీ మహాశయుల వద్దకు చేర్చింది. పూజ్య గురుదేవుల దర్శన, స్పర్శన, సంభాషణా భాగ్యాన్ని కలుగజేసింది. గురుదేవుల దివ్య దర్శనంతో, మహత్తర స్పర్శతో, అనుగ్రహభాషణతో నా సంశయాలన్నీ పటాపంచలయ్యేయి.

మనస్సు ఉప్పొంగింది! జ్ఞానం వికసించింది!
ఆనందం పరిమళించింది! సత్యం అవగతమైంది!
ఆత్మ అనుభవంలోకి వచ్చింది!!

"నందకం" అంటే ఆనందానికి మూలం (Source of Joy). ఈ నందకాన్నే, పరమాత్మ ఒక ఖడ్గరూపంలో ఆయుధంగా ధరిస్తాడు. మనుజులలో నెలకొన్న అజ్ఞానాన్ని రూపుమాపి వారిని జ్ఞానవంతులుగా తీర్చిదిద్ది తుదకు బ్రహ్మానందస్థితిని ప్రసాదించడమే ఆ పరమాత్మ ఉద్దేశ్యం.

ఈ నిత్యనూతన ప్రణాళికను తన ప్రజ్ఞానఘన ప్రతినిధులైన సద్గురువుల ద్వారా చేయిస్తాడు ఆ జ్ఞానానందస్వరూపుడైన సర్వాంతర్యామి.

"నందకం" అనే దివ్యపదానికి అసలు అర్థాన్ని సత్యవంతమైన విచారణతో, జ్ఞానవంతమైన విశ్లేషణతో, పరిపూర్ణమైన ఆనందంతో వున్నది వున్నట్లుగా మీ ముందు వుంచడమే, నా ఈ రచన ముఖ్యోద్దేశం.

ఆధ్యాత్మికంగా "సత్యం" అంటే శాశ్వతమైనది, చైతన్యవంతమైనది, సర్వవ్యాపకమైనది! ఈ విశ్వానికి ఆధారభూతమై వున్న "ఆత్మ లేదా పరమాత్మ" స్వరూపము!

ఆధ్యాత్మికంగా "జ్ఞానము" అంటే శుద్ధ ఎఱుక! ఏదైనా ఒక విషయముపై సంపూర్ణమైన అవగాహన కలిగివుండుట! ఆత్మజ్ఞానము అంటే తన నిజస్వరూపాన్ని గ్రహించడం!

ఆధ్యాత్మికంగా "ఆనందం" అంటే నిత్యతృప్తి! ఎటువంటి కోరికలు, వికారాలు లేని స్థితి! అందుకు జీవుడు తన నిజస్వరూపాన్ని గ్రహించాలి! ఆత్మతత్వాన్ని అనుభూతిపొందాలి!

అప్పుడు ప్రతీజీవుడు "నందకం" స్వరూపమే!
అంటే, నేనే సత్యం! నేనే జ్ఞానం! నేనే ఆనందం!!
అదే, చిదానంద రూపః శివోహం! శివోహం!!

మీ ఆత్మీయ మిత్రుడు,
**శాస్త్రి ఆత్రేయ (ఆకుండి శ్రీనివాస శాస్త్రి).**

# అధ్యాయం - 1

## నా బాల్యదశ, మొదటి గురువు మా నాన్నగారు

నేను పుట్టింది 1963, డిసెంబర్ ఒకటవ తేదీ (కార్తీక పౌర్ణమి చివరి ఘడియలు). మా తండ్రిగారు శ్రీ ఆకుండి సూర్యనారాయణ శాస్త్రి గారు (1911 - 1999), మా అమ్మగారు శ్రీమతి విశాలాక్షి (1929 - 1995). ఆ పుణ్యదంపతులకు పదునాలుగుమంది సంతానము (తొమ్మిదిమంది ఆడపిల్లలు, ఐదుగురు మగపిల్లలు). అందరిలో చిన్నవాడిని నేనే.

గృహిణిగా అమ్మ జీవితమంతా ఇల్లు, పిల్లల సౌరక్షణకే సరిపోయింది. నాన్నగారు విజయనగరం శ్రీ మహారాజావారి సంస్కృత కళాశాలలో విద్యనభ్యసించారు. ఉభయభాషా ప్రవీణ పట్టా పొంది, ఏభైనొక్క(51) సంవత్సరములు (1933 - 1984) అధ్యాపకవృత్తిలో స్థిరపడి, ఒడిషా రాష్ట్రంలో నున్న ఎన్నో కళాశాలల్లో, మూడు విశ్వవిద్యాలయాల్లో విభిన్న పదవులు నిర్వహించేరు. 58 ఏళ్ళకి రిటైర్ అయిన తరువాత కూడా 15 సంవత్సరాలు ADAV High School, HAL, Sunabeda, Odisha లో అధ్యాపక వృత్తిని చేపట్టేరు. ఎంతోమందికి విద్యాదానం చేసేరు.

గీతా ప్రచార సంఘము స్థాపించి ఎంతోమంది బాలబాలికలచేత భగవద్గీత లోని మొత్తం ఏడువందల శ్లోకాలను తాత్పర్యసహితంగా కంఠస్థం చేయించేరు. ప్రత్యక్ష రామాయణము(ప్రత్యక్ష ఆత్మానుభూతి రామాయణము) అను పద్యకావ్యమును, శ్రీమదధ్యాత్మ రామాయణము(ఉమా మహేశ్వర సంవాదము, ఆంధ్ర భాషానువాదము) అను గద్యకావ్యమును రచించేరు. తన కుటుంబ సభ్యుల మఱియు తిరుమల తిరుపతి దేవస్థానము వారి ఆర్థిక సహకారంతో ఇవి ముద్రింపబడ్డాయి. ఎంతో ప్రాముఖ్యతను సంపాదించుకున్నాయి.

ఏ ఒక్కరికీ ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఇంత పెద్ద సంసారాన్ని ప్రేమాభిమానాలతో పోషిస్తూ, ఉద్యోగ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తూ, తన సలహాలకై వచ్చిన ఎంతోమందికి తగు సూచనలిస్తూ, ఎన్నో సమస్యలతో తమ జాతకాన్ని పరీశీలించమని వచ్చిన వారికి ఎంతో ధైర్యాన్ని నింపుతూ, వారిబాగుకోసం శ్రీరామచంద్ర ప్రభువుని వేడుకునేవారు.

ఎంతోమందికి ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ప్రసాదిస్తూ, దేశభక్తిని మఱియు సామాజిక అభివృద్ధిని పెంపొందించే అనేక కార్యక్రమాలలో ఎంతో చురుగ్గా పాల్గొంటూ, సమస్యలను ధైర్యంగా ఎదుర్కొంటూ, ఆత్మజ్ఞానం పొందటానికి ఎంతో నిష్ఠతో కర్మ–జ్ఞాన సాధనాలు చేస్తూ, భక్తిజ్ఞానవైరాగ్యాలు పొందుటకు నిరంతరం శ్రీరాఘవుని పాదపద్మములను ధ్యానిస్తూ, మనసావాచాకర్మణా తత్వసాధనకు సత్యశోధనకు పరితపిస్తూ, శిష్యులుగా వచ్చిన ఎంతోమందిని ప్రభావితం చేస్తూ ఆయన గడిపిన జీవితాన్ని స్వయంగా చూసేను.

నాన్నగారు ఎన్నో రచనలు, కవితా వ్యాసంగములు రచించేరు. జ్యోతిషశాస్త్రంలో ఎంతో ప్రావీణ్యత సంపాదించి, ఆలోచనలకు అందని predictions ని ప్రతిపాదించి, ఎందరికో ధైర్యాన్నివ్వడం జరిగింది. ఒడిషా రాష్ట్రంలో గొప్ప జ్యోతిషశాస్త్రవేత్తగా పేరుప్రఖ్యాతలు గడించేరు.

శ్రీ సీతారామచంద్ర పరబ్రహ్మను మనసావాచాకర్మణా నమ్ముకొని, భక్తిజ్ఞానవైరాగ్యాలతో శ్రీరాఘవుని ఆరాధించి, శ్రీరాఘవుని ప్రత్యక్ష దర్శనం కోసం పరితపించి, ఆత్మజ్ఞానంతో సత్యదర్శనం చేసుకొని, ఆ పరమాత్మ అనుగ్రహంతో ఆత్మానుభూతి పొంది, తన మరణాన్ని తన సంతతికి ముందుగా సూచించి, 1999వ సంవత్సరములో, సూర్యనారాయణ శాస్త్రి నామధేయం గల నాన్నగారు, సంపూర్ణ సూర్యగ్రహణము ముందురోజున పరమాత్మలో ఐక్యమయ్యేరు.

ఓం శాంతి శాంతి శాంతిః!!

నా కన్నతండ్రే నాకు ఉపాధ్యాయునిగా, ఆధ్యాత్మిక గురువుగా లభించడం నేను పూర్వజన్మలో చేసుకున్న అదృష్టం.

# అధ్యాయం - 2

# నాన్నగారు ప్రసాదించిన జ్ఞానం

నాకు కాస్త జ్ఞానం వచ్చినప్పటినుండి నాన్నగారు నాచేత ఎన్నో శ్లోకాలు కంఠస్థం చేయించేరు. తెల్లారకముందే నన్ను తన ఒడిలో కూర్చోబెట్టుకొని నేను వల్లించే శ్లోకాలలో తప్పులను సరిదిద్దేవారు, వాటి అర్థాలను తెలియజేసేవారు. నాకు తెలిసి సుమారు వంద శ్లోకాలు పైనే నాకు నేర్పించేరు.

నాకు పన్నెండు సంవత్సరాలు నిండి ఇంకాస్త జ్ఞానం వచ్చిన తరువాత, నేను గ్రహించిన విషయమేమిటంటే, అప్పటికే నాన్నగారు ఆధ్యాత్మికంగా మంచి స్థితిలో నున్నారు. ఈ విషయాన్ని ఎంతోమంది నాన్నగారి మిత్రులు వారిలోవారు ముచ్చటించుకొంటుండగా నేను ఎన్నోసార్లు వినడం జరిగింది.

పదహారు సంవత్సరాలు వచ్చేసరికి నాకు భగవద్గీతలో ముఖ్య శ్లోకాలు రెండువందలకు పైగా తాత్పర్యసహితంగా నేర్పించేరు. బడిలో ఒక విద్యార్థిగా అయన చెప్పే పాఠాలు విన్నాను. పాఠాలు చెప్పే తీరులో ఒక అధ్యాపకునిగా అయన ప్రదర్శించిన నైపుణ్యాన్ని చూసేను.

వేదాలలో సూచించిన కర్మమార్గాన్ని, వేదాంతములలో(ఉపనిషత్తులు) సూచించిన జ్ఞానమార్గాన్ని ఎలా సమన్వయ పరుచుకోవాలో అన్న విషయాన్ని నాన్నగారి నుండి నేర్చుకోవడం జరిగింది. పురాణ, ఇతిహాసాలలో అంతర్లీనంగా చెప్పబడిన సత్య, ధర్మ సూత్రాలను ఏ రకంగా అవగతం చేసుకోవాలో అన్న విషయాన్ని ఉదాహరణలతో నాన్నగారు పేర్కొన్న విషయాలు నా మదిలో చిరస్థాయిగా ముద్రింపబడ్డాయి.

“సత్యాన్ని తెలుసుకోవడమే పరమావధి” అని నాన్నగారు చెప్పిన వాక్యం నా మనస్సులో నిలిచిపోయింది.

సత్యమే పరమాత్మ, సత్యాన్ని గుర్తించని జీవుడు పరమాత్మను చేరుకోలేడు. సత్యాన్ని ఆధారం చేసుకొనే ధర్మము ఆవిర్భవించింది. సత్యము లోపించిన ధర్మము ఎక్కువ కాలము నిలబడదు. ధర్మము లేనిదే శాంతి, ప్రేమ, అహింసలకు మనుగడలేదు. కావున “సత్యాన్ని శోధించు” అన్న నాన్నగారి మాటలను నేను నా జీవితంలో మర్చిపోలేను.

అమ్మ చెప్పిన ప్రకారము, నాన్నగారు మొదట్లో చాలా కర్మనిష్ఠలో వుండేవారు. ఆచారాన్ని నిప్పులు కడిగేలా పాటించేవారు. విహిత కర్మలను శాస్త్రోక్తంగా నిర్వహించేవారు. సంసారాన్ని నడపడం కోసం సకామా కర్మలను(ఫలితాన్ని ఆశించి) నిర్వచించేవారు. రానురాను నాన్నగారి దృక్పధం ప్రవృత్తి నుండి నివృత్తి లోకి మారింది.

నిష్కామంతో (ఫలితం ఆశించకుండా) కర్మలను ఆచరించడం ప్రారంభించేరు. ఈ మార్పుతో కొన్ని ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. పరమాత్మ పెట్టే పరీక్షలను ధైర్యంతో ఎదుర్కున్నారు. కానీ పట్టువిడవకుండా, శ్రీరాఘవుని పాదపద్మాలను ఆశ్రయించి అదే తన అంతిమ లక్ష్యంగా చేసుకొని, శ్రీరామవిభుని ప్రత్యక్ష దర్శనానికై పరితపించేరని అమ్మ నాతో ఒక సమయంలో చెప్పిన మాటలను విని నిర్ఘాంతపోయేను.

ఇది నిజంగా సాధ్యమా! ఇలా తత్వసాధన చేసింది మా నాన్నగారా! మనస్సులో ఆనందం ఉప్పొంగింది, తెలియని ధైర్యము నన్ను ఆవహించింది. ఆ రోజునుండి నాన్నగారు మాట్లాడే ప్రతి విషయాన్ని జాగ్రత్తగా వినడం మొదలుపెట్టేను.

సత్యంతో కూడిన ధర్మము ఎలావుంటుందో శ్రీసీతారాముల జీవితమే నిదర్శనమని, జ్ఞానాన్ని ప్రభోదించే అన్ని ఉపనిషత్తుల సారాంశము భగవద్గీతలో లభిస్తుందని, ఆ రెండింటిని పరిపూర్ణంగా అవగాహన చేసుకుంటే సత్యశోధనకు మార్గము సులువవుతుందని, ఆ పిమ్మట ఒక సద్గురువును ఆశ్రయించి, సేవించుటద్వారా ఆత్మజ్ఞానం కలిగి సత్యదర్శనం సిద్ధిస్తుందని బోధించేరు నా మొదటి గురువైన నాన్నగారు.

సద్గురువు లభించడం మన ఆధ్యాత్మిక పరిపక్వత బట్టీ వుంటుందని, అన్యఆలోచన చేయకుండా సత్యశోధన చేసుకుంటూ పోతే గురువు తనంతటతానే సాధకుడి వద్దకు వస్తాడని నాన్నగారు సూచించేరు.

ఏ భావంతో సాధన చేస్తామో అదే సిద్ధిస్తుందని, అటువంటి శక్తిని జీవునికి ఆ పరమాత్మ ప్రసాదించేడని, కాబట్టి తత్వసాధనకు భావన ఎంతో స్వచ్ఛంగా వుండాలని, మనలో భావమే బాహ్యకర్మలుగా వ్యక్తమౌతుందని, అందుకే జీవుడు ముందుగా మనస్సును తన ఆధీనంలోకి తెచ్చుకునే సాధన చెయ్యాలని బోధించేరు నాన్నగారు.

జ్ఞానం పొందడానికి, అజ్ఞానంతో జీవించడానికి మనస్సే ప్రధాన కారణము. మనస్సే మన మిత్రుడు లేదా శత్రువు కూడా. ఆలోచనలు కలిగేది, కోరికలు పుట్టేది మనస్సులోనే. మనస్సు ఆధీనంలోనే ఇంద్రియాలు వుంటాయి. ఇంద్రియాలు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోలేవు కానీ మనస్సును ప్రభావితం చెయ్యగలవు.

సాధకుడు ఈ విషయాన్ని పూర్తిగా అవగాహన చేసుకున్న తరువాతే సాధన ప్రారంభించాలి. లేకపోతె సాధన మధ్యలోనే పతనమౌతుందని నాన్నగారు అనేకసార్లు పేర్కొన్నారు.

పునాది ధృడంగా వుంటేనే ఆకృతి చిరకాలం నిలుస్తుందని మృదువుగా హెచ్చరించేరు.

నాన్నగారి ఆశీస్సులే నన్ను సత్యమార్గంలో నడిపిస్తాయన్న దృఢమైన విశ్వాసం నాలో నెలకొంది. నాన్నగారి అనుగ్రహంతో నా గురుదేవులను నేను కలుసుకోగలిగెను.

పూజ్య గురుదేవుల దర్శన, స్పర్శన, సంభాషణ భాగ్యం నాకు కలిగింది.

## అధ్యాయం - 3

## సత్యశోధనకు తొలి అడుగు

నా మొదటిగురువు, మా తండ్రిగారు పదేపదే చెప్పే సత్యం గురించి అధ్యయనం చేయడం మొదలుపెట్టాను. సత్యం గురించి ఎన్నో గ్రంథాలు, ఎంతోమంది గురువులు, మహనీయులు పేర్కొన్న విషయాలను పరిశీలించిన పిదప అసలు సత్యాన్ని తెలుసుకోవాలన్న జిజ్ఞాస నాలో రోజురోజుకూ పెరగసాగింది.

తవ్వుతున్నకొద్దీ కొత్తవిషయాలు తెలుస్తున్నాయి. ఇది జీవితాంతం చేయవలసిన ప్రక్రియగా బోధపడింది, చేస్తూనేవున్నాను. సత్యాన్ని మించిన సత్యము ఉండదని అర్ధమయింది. నా ఈ సత్యశోధన ఎన్నో ఏళ్ళపాటు సాగింది. అడుగడుగునా ఎన్నో ప్రశ్నలు, సందేహాలు, అపోహలు నా మనస్సులో ఉత్పన్నమయ్యేయి. శోధన తీవ్రతరం అవుతున్నకొద్దీ ప్రతి సంశయానికి సరైన సమాధానం లభిస్తూ వుండేది.

సత్యాన్వేషణలో సత్యము ఒక్కటే ప్రధానమనీ, దాన్ని విస్మరించి చేసే ప్రయత్నము ఏదైనా సరే అజ్ఞానానికి దారితీస్తుందనీ, తద్వారా ఆత్మానందానికి దూరమౌతామన్న విషయం స్పష్టంగా బోధపడింది.

అసలు సత్యాన్ని ఎన్నో రకాలుగా చూపించడం నేటి సమాజంలో జరుగుతున్న సర్వసాధారణ విషయం.

మనకు లభ్యమయ్యే ఎన్నో గ్రంథాలు సత్యము గురించి చాల విశ్లేషణ జరిపేయి. ఎన్నో మతగ్రంథాలు సత్యాన్ని ప్రతిపాదించేయి. సత్యము సరిగ్గా వివరించలేని పుస్తకాలు మరుగున పడిపోయేయి.

ఈ "సత్యశోధన" మన వాడుకలో వున్న "వాక్సత్యం" గురించి మాత్రమే కాదు. అసలు ఈ సృష్టికి మూలకారణమైన సత్యం గురించి. ఏ మూలసత్యాన్ని ఆధారం చేసుకొని ఈ చరాచర జగత్తు ఆవిర్భవించింది? ఎందుకు? ఎలా?

ఇటు జడ పదార్థాలు, అటు జీవ పదార్థాల ఉనికి వెనుకవున్న సత్యము ఏమిటి? మనకు ఎంతో పరిచయం వున్న భూప్రపంచంలో, అద్భుత జ్ఞానం కలిగిన మనిషి పుట్టుక వెనుక రహస్యం ఏమిటి?

సత్యాన్ని తెలుసుకొనే ప్రయత్నము, ఎంతో జ్ఞానం కలిగిన మనిషి మాత్రమే ఎందుకు చేయగలడు. అంత జ్ఞానం మానవునికి ఎలా సిద్ధించింది? అంటే మానవులలో వున్న అజ్ఞానము తొలగి పోతేగాని ఈ సత్యం బోధపడదని అర్ధమా? అంటే సంపూర్ణ జ్ఞానంతో విశ్లేషిస్తేగాని సత్యం అవగతంకాదా?

ఎంతోమంది భక్తిపరాయణులు, ఎంతోమంది ఆధ్యాత్మికవేత్తలు, ఎంతోమంది పీఠాధిపతులు, ఎంతోమంది జ్ఞానజిజ్ఞాసువులు, ఎంతోమంది ప్రవచనకర్తలు, ఎంతోమంది విద్యావేత్తలు, ఎంతోమంది స్వాములు, ఎంతోమంది ఆస్తికులు, ఎంతోమంది నాస్తికులు అందరి లక్ష్యం ఒక్కటే, ఏది సత్యం? ఏది అసత్యం?

"వేదాహమేతం పురుషం మహాన్తమ్, ఆదిత్యవర్ణం తమసస్తుపారే" అంటే, అజ్ఞానాంధకారమునకు సుదూరుడు, కోటిసూర్యకాంతి తేజస్సుతో

వెలిగిపోతున్న ఆ పరమ పురుషుణ్ణి (పరమ సత్యాన్ని) నేను తెలుసుకున్నాను అన్న పురుషసూక్త వాక్యానికి వెనుకనున్న అసలు సత్యం ఏమిటి?

అదంత సుళువుగా అర్థం కాదు! ఎన్ని దణ్ణాలు పెట్టినా, ఎన్ని దండాలు పట్టినా, ఎన్ని దానాలు చేసినా సరే! అర్థం కావాలంటే ఆత్రుత కావాలి, అన్వేషణ కావాలి, ఆచరణ కావాలి! సాధ్యమేనా అంటే సాధ్యమే మరి! కాదంటే అసాధ్యమే మరి! దణ్ణం, దండం తో పాటు అన్ని త్యజించిన వాడికి మాత్రమే సాధ్యం! ఏ ఒక్క ఆసరా కల్పించుకున్నా సరే, మిగిలేది ఆశే సుమీ!

మాయలో సత్యం! సత్యంలో మాయ! ఇదే మన అనునిత్య మాయాసత్యం! ఈ రకమైన ఎన్నో సంశయాలకు సరైన సమాధానం చెప్పగలిగే గురువుల కోసం వెతకడం మొదలుపెట్టేను.

## అధ్యాయం - 4

## గురువుల కోసం వెతుకులాట

జ్ఞానంతోనే అసలు సత్యం తెలుస్తుందని అర్ధమయ్యింది. అయితే జ్ఞానాన్ని ఎలా పొందాలని అన్వేషణ సాగించేను. గురువులుగా ప్రసిద్ధికెక్కిన ఎంతోమంది వ్యక్తులను కలిసేను. వారిని చాలా క్షుణ్ణంగా పరిశీలించేను. కానీ వారెవ్వరికి జ్ఞానోదయం కాలేదని అతిత్వరలోనే అర్ధమయ్యింది. అందులో చాలామంది బాహ్యగురువులే. ఎంతోమంది శిష్యులతో వారి వ్యాపారం బాగా సాగిపోతోంది. శిష్యులు కూడా, వారి కోరికలు కాస్తోకూస్తో తీరుతున్నాయి కాబట్టి గురువుగారికి బాగా దాసోహం అయ్యారు.

చాలామంది మతవిశ్వాసాల పేరిట ప్రజలను తమవైపు తిప్పుకుంటున్నారు. ఇంకొంతమంది బాగా శాస్త్రం అభ్యసించి, మంచి వాక్పటిమను సంపాదించారు కానీ, వారికి సత్యము అవగతం కాలేదు. కొందరికి పురాణజ్ఞానం వుందికాని ఆత్మజ్ఞానం కలగలేదు. కొంతమంది ప్రవచనాలు, సువార్తలు చెప్పడంలో పూర్తిగా నిమఘ్నమై, అసలు సత్యాన్ని విస్మరిస్తున్నారు. కొంతమంది టీవీ చానెల్స్ లో

ప్రాయోజిత కార్యక్రమం పేరిట ఒక మంత్రాన్ని, పేరులో మార్పుని, ఒక సంఖ్యని సూచించి సమాజంలో అజ్ఞానాన్నీ, అసత్యాన్నీ ప్రచారం చేస్తున్నారు.

కొందరు సాధనదశలోనే గురువులుగా తమనుతాము ప్రకటించుకొని ఆర్థికంగా బలపడుతున్నారు. కొంతమంది ఇంకాస్త ముందుకెళ్ళీ జ్ఞానశక్తిని ధారబోస్తామని సామాన్య ప్రజలను అజ్ఞానులుగా మార్చి లాభపడుతున్నారు. ఇలా చాలామంది డబ్బుతో, పరపతితో, తెలివితేటలతో, కాస్తంత శాస్త్రజ్ఞానంతో గురువులుగా పరిగణింప బడుతున్నారు, కానీ వారివారి గుణంలో ఎటువంటి మార్పులేదు.

ఆత్మజ్ఞానం పొందిన గురువులు ఎక్కడా తటస్థపడలేదు. ఇలా ఎన్నోయేళ్లు గడచిపోయేయి. లోపం నాలోనే వుందేమోనన్న ఆలోచనతో, ఎవరిని తక్కువుగా భావించరాదని నిశ్చయించుకొని, సానుకూల ధృక్పథంతో సత్యాన్వేషణ మొదలుపెట్టాను. ఎంతోమంది జ్ఞానవంతులను కలిసాను. వారివారి రంగాలలో వారు అద్భుతమైన జ్ఞానాన్ని ప్రదర్శించారు గాని, సత్యం గురించి వారికున్న సందేహాలు నాకంటే ఎక్కువుగా వున్నట్లు గమనించాను.

నా చుట్టూ వున్న ప్రపంచము చాలాకాలం సత్యంగా అనిపించింది. ప్రతిజీవి, ప్రతినిమిషం ఏదో పని చేసుకుంటూ గడిపేస్తున్నాయి. మానవులైతే ఎన్నో పనుల్లో సతమతమై పోతున్నారు. నాకు తెలిసి నా జీవితం కూడా ఇన్నాళ్లు చాల బిజీగా గడచిపోయింది. రానురాను తెలియకుండానే ఇంకా బిజీగా గడపడం కూడా జరిగిపోతోంది.

నాతో పాటు నా చుట్టూవున్న చాలామంది అసలు తిండికి, నిద్రకి కూడా సమయం కేటాయించలేక పోతున్నారు. ఇంత తీరికలేకుండా సమయం గడపటం వెనుక వున్న రహస్యము ఏమిటా అన్న సందేహం కలిగి విశ్లేషించడం మొదలుపెట్టేను.

తను, తనపరివార సుఖసంతోషాలకోసం మనిషి తీరికలేకుండా ఇంత కష్టపడుతున్నట్టు ముందుగా తెలిసింది. చాలామంది దీనిని ధృవీకరించారు. సత్తువ వున్నప్పుడే తమకి, తమ కుటుంబానికి కావలసినవన్నీ సమకూర్చుకోవడమే తెలివైనవారి లక్షణమని ఘంటాపథంగా తేల్చిచెప్పేసారు. తాను జీవితాంతము ఎంతో కష్టపడి సంపాదిస్తే, తరువాత తన పరివారం ఎంతోసుఖంగా వుంటుందని చాలామంది ప్రేమతో శెలవిచ్చారు. డబ్బు, పరపతి లేకుండా జీవించడం వృధా అని ఇంకొంతమంది పేర్కొన్నారు.

డబ్బు, హోదా, పరపతితోనే ప్రస్తుతకాలంలో గౌరవమర్యాదలు లభిస్తాయని, వారే ఈ సమాజంలో హుందాగా జీవించగలరని, ఇదే జీవితసత్యమని, ఇదికాక వేరే సత్యాన్ని అన్వేషించడం వృధా ప్రయాస యని, వారి జీవితం కష్టనష్టాలతో పరిసమాప్తమౌతుందని బల్లగుద్దిమరీ తమ భావాన్ని వ్యక్తంచేసేరు చాలామంది.

ఇందులో కొంత నిజం కనిపించింది కానీ సత్యం కనపడలేదు నాకు. కారణం ఎంత ప్రయత్నించినా చాలామందికి ధనార్జన అందని ద్రాక్షపళ్ళుగానే మిగిలిపోయింది. కొంతమందికి అనుకోకుండానే ఇది సునాయాసంగా వరించింది. ఇంకొందమందికి ఇది లభించినా సుఖం దూరమైంది. ఒకవేళ సుఖం లభించినా, వెనకాలే దుఃఖం కాటేసింది. ఇవి నేను స్వయానా అనుభవించినవీ, ఇతరులు నాతొ పాలుపంచుకున్నవి.

క్షుణ్ణంగా పరిశీలించిన పిదప ఇవన్నీ తాత్కాలికములే కానీ శాశ్వతమైనవి కావని తెలిసింది. శాశ్వతమైనదే సత్యమని బోధపడింది. ఒకరోజు ఒక పుస్తకంలో –

Childhood means simplicity.
Look at the world with the childs eye
- it is very beautiful

అన్న వివేకానందుని సూక్తిని చదివిన తరువాత, నా సత్యాన్వేషణ కొత్తమలుపు తిరిగింది.

## అధ్యాయం - 5

## సత్యశోధనకు దోహదపడే జ్ఞానవాక్కులు

ఎన్నో ఆలోచనల నడుమ అన్ని విశ్వాసాలకు సంబంధించిన ఎన్నో గ్రంధాలలో ప్రస్తావించిన మరియు ఎంతోమంది మహనీయులు తమ అపార అనుభవంతో పేర్కొన్న జ్ఞానవాక్కులను పరిశీలించడము ప్రారంభించేను.

సత్యం వద, ధర్మం చెర – వేదములు.
సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ – ఉపనిషత్తులు.
సత్యమే చుక్కాని – బ్రహ్మసూత్రములు.
సత్యమును తెలుసుకున్నవాడే వాడే నన్ను గ్రహింపగలడు
– భగవద్గీత.

సత్యమే నన్ను ఇంతవాడిని చేసింది – జొరాష్ట్రియన్.
అహింసకు బీజం సత్యము – మహావీర జైనుడు.
సత్యం లేనిదే ప్రపంచము లేదు – గౌతమ బుద్ధుడు.
అసలు సత్యాన్ని తెలుసుకుంటే, ఇంక తెలుసుకోవాల్సింది ఏమి మిగలదు
– సోక్రటీస్.

నాకు నా తండ్రికి ఉన్న బంధము సత్యమే సుమా – జీసస్.

సత్యం మాత్రమే  మనుజుని భగవంతుని చేర్చగలదు – మధ్వాచార్యులు.

ఉన్నది ఒకటే సత్యము, కానీ పండితులు ఎన్నో రకాలుగా విశ్లేషణ చేస్తారు
– ఆది శంకరులు.

సత్యాన్ని పదిమందికి పంచడము లోనే వుంది అసలు సత్యము – రామానుజులు.

నా పుట్టుటకు కారణము సత్యము – మొహమ్మద్ ప్రవక్త (Peace be upon Him).

నేను ఎవరు? అనే ప్రశ్నకు సమాధానం, సత్యము మాత్రమే చెప్పగలదు
– రమణ మహర్షి.

సత్యాన్వేషణే నా జీవిత లక్ష్యము – మహాత్మా గాంధీ.

ఈ మహత్తర జ్ఞానవాక్కులను దృష్టిలో పెట్టుకొని ఈ ప్రపంచాన్ని పరిశీలించడం మొదలు పెట్టేను.

## అధ్యాయం - 6

## లోకం పోకడ, మానవ నైజం

నా చుట్టూ వున్న ప్రపంచము చాలాకాలం సత్యంగా అనిపించింది. ప్రతిజీవి, ప్రతినిమిషం ఏదో పని చేసుకుంటూ గడిపేస్తున్నాయి. మానవులైతే ఎన్నో పనుల్లో సతమతమై పోతున్నారు. నాకు తెలిసి నా జీవితం కూడా ఇన్నాళ్లు చాల బిజీగా గడచిపోయింది. రానురాను తెలియకుండానే ఇంకా బిజీగా గడపడం కూడా జరిగిపోతోంది.

నాతో పాటు నా చుట్టూవున్న చాలామంది అసలు తిండికి, నిద్రకి కూడా సమయం కేటాయించలేక పోతున్నారు. ఇంత తీరికలేకుండా సమయం గడపటం వెనుక వున్న రహస్యము ఏమిటా అన్న సందేహం కలిగి విశ్లేషించడం మొదలుపెట్టేను.

తను, తనపరివార సుఖసంతోషాలకోసం మనిషి తీరికలేకుండా ఇంత కష్టపడుతున్నట్టు ముందుగా తెలిసింది. చాలామంది దీనిని ధృవీకరించారు. సత్తువ వున్నప్పుడే తమకి, తమ కుటుంబానికి కావలసినవన్నీ

సమకూర్చుకోవడమే తెలివైనవారి లక్షణమని ఘంటాపథంగా తేల్చిచెప్పేసారు. తాను జీవితాంతము ఎంతో కష్టపడి సంపాదిస్తే, తరువాత తన పరివారం ఎంతోసుఖంగా వుంటుందని చాలామంది ప్రేమతో శెలవిచ్చారు. డబ్బు, పరపతి లేకుండా జీవించడం వృధా అని ఇంకొంతమంది పేర్కొన్నారు.

డబ్బు, హొదా, పరపతితోనే ప్రస్తుతకాలంలో గౌరవమర్యాదలు లభిస్తాయని, వారే ఈ సమాజంలో హుందాగా జీవించగలరని, ఇదే జీవితసత్యమని, ఇదికాక వేరే సత్యాన్ని అన్వేషించడం వృధా ప్రయాస యని, వారి జీవితం కష్టనష్టాలతో పరిసమాప్తమౌతుందని బల్లగుద్దిమరీ తమ భావాన్ని వ్యక్తంచేసేరు చాలామంది.

ఇందులో కొంత నిజం కనిపించింది కానీ సత్యం కనపడలేదు నాకు. కారణం ఎంత ప్రయత్నించినా చాలామందికి ధనార్జన అందని ద్రాక్షపళ్ళు గానే మిగిలిపోయింది. కొంతమందికి అనుకోకుండానే ఇది సునాయాసంగా వరించింది. ఇంకొందమందికి ఇది లభించినా సుఖం దూరమైంది. ఒకవేళ సుఖం లభించినా, వెనకాలే దుఃఖం కాటేసింది. ఇవి నేను స్వయానా అనుభవించినవీ, ఇతరులు నాతొ పాలుపంచుకున్నవి.

క్షుణ్ణంగా పరిశీలించిన పిదప ఇవన్నీ తాత్కాలికములే కానీ శాశ్వతమైనవి కావని తెలిసింది.

ఈ కష్టసుఖాలు, కలిమిలేములు మానవులందరిలో చోటుచేసు కుంటున్నాయి. వీటినుంచీ తప్పించుకోవడం ఏ జీవికీ తప్పదన్న విషయం స్పష్టమైంది. అత్యంత తెలివైన మానవుడు ఎలా వీటిని ఎదుర్కొంటున్నాడో అలాగే పరిమిత జ్ఞానం కలిగిన పశుపక్షాదులు కూడా వీటిని అలానే ఎదుర్కొంటున్నాయి. అయితే కోరికలలో మాత్రము తేడావుందన్నది నిజం.

అన్ని జీవాలకు అవసరమైన ఆహారము, నిద్ర, మైథునము కాకుండా మనుష్యులకు మాత్రమూ వేరే కోరికలు ఉండటం అందరికి తెలిసిన విషయమే.

అంతేకాకుండా ఆ కోరికలకు అంతూ, అదుపూ ఉండదన్న విషయమూ అందరికీ విదితమే. తీరా అన్నీ పొందాక, అవి కేవలము తన మరణం వరకే అన్న విషయం కూడా అందరికీ ఎరుకే. అయినా సరే చేవ చావదు. అన్ని తెలుసుకున్న మనుజునికి తన మరణం ఎప్పుడు వస్తుందో తెలియదు.

కావునా ఈ మమకారం, సంపాదనా అంతా తాత్కాలికమైనవే. ఈ క్షణం ఆనందం మరుక్షణం ఉండకపోవచ్చు. ఈ రోజు ఇవి మనవి, రేపు ఇంకెవ్వరివో??

కొంతమంది ఈ జన్మలో ఎన్నో మంచి పనులు చేస్తున్నా, కష్టాలు చవిచూస్తున్నారు. ఇంకొంతమంది కూడని పనులు చేస్తూ సుఖాలు అనుభవిస్తున్నారు. ఎంత కష్టపడి ప్రయత్నించినా, కొందరికి ఆశించింది దొరకడంలేదు. అప్రయత్నంగా కొందరికి కొన్ని చేరువవుతున్నాయి. అందరి జీవితాలలో అకస్మాత్తుగా కొన్ని సంఘటనలు జరిగిపోతున్నాయి.

ఏమిటి దీని వెనుకవున్న రహస్యం?

ఖచ్చితమైన సమాధానం ఎవరూ చెప్పలేదు, కానీ ఇవన్నీ కూడా జీవుడు చేసే కర్మలమీద ఆధారపడి వుంటాయని చాలామంది ప్రతిపాదించారు. ఇది అంతుచిక్కని రహస్యం, దీనిని జ్ఞానంతోనే ఛేదించాలని కొంతమంది సూచించారు. సత్యాన్వేషణకు ఈ కర్మసిద్ధాంతం, ఒక చక్కని మార్గమని కొందరు పేర్కొన్నారు.

ఈ చట్రంనుండి బయటపడాలంటే అన్ని కర్మలు, నిష్కామంగా (కోరిక లేకుండా) చేయాలని జ్ఞానులు ప్రతిపాదించేరు. దీనివెనుక ఓ అద్భుతశక్తి వుందని, ఆ శక్తినే భగవంతుడని పేర్కొన్నారు కొందరు.

ఏ అద్భుతశక్తి లేదని, ఇదంతా జీవుని స్వశక్తిమీద ఆధారపడి ఉంటుందని కొందరి వాదన.

“స్వశక్తి”తో మనకు కనిపించని
“అద్భుతశక్తి”తో విలీనమైతే ఈ కర్మఫలిత
చక్రంనుండి తప్పించుకోవచ్చని కొందరి వాదన.

## అధ్యాయం - 7

## కర్మ అంటే ఏమిటి? కర్మబంధం అంటే ఏమిటి?

ఈ రకమైన ఆలోచనలతో అన్ని విశ్వాసాలకు సంబంధించిన ఎన్నో గ్రంథాలు, ఎంతోమంది మహనీయులు తమ అపార అనుభవంతో ప్రతిపాదించిన "కర్మసిద్ధాంతము"ను అవగాహన చేసుకుందామని, వాటిని పరిశీలించడము ప్రారంభించేను.

ఈ పరిశోధనలో నాకు కలిగిన కొన్ని సందేహాలు, లభించిన సమాధానాలు

కర్మ అంటే ఏమిటి?

జీవుడు మనసా, వాచా, కర్మణా నిర్వర్తించే విధులను కర్మ అంటారు!

కర్మబంధం అంటే ఏమిటి?

ఒకడు ఒక వంటకాన్ని వండేడు (కర్త)! ఒక వంటకం తయారైంది (క్రియ)! అయితే దాన్ని తిన్నప్పుడు అనుభవించే రుచి (ఫలం) ఎక్కడ నుండి వచ్చింది? వంట చేయడం ద్వారా వచ్చిందా? లేదా చేసే విధానం ద్వారా వచ్చిందా?

చేయడం ద్వారా కాదు, చేసే విధానంతో రుచి (ఫలం) ఏర్పడింది కదా! కర్మ అంటే ఇదే!

అందుకే కర్మ ఫలాన్ని అనుభవించాలి అంటారు!

కర్త అంటే చేసేవాడు! క్రియ అంటే ఫలితం! కర్మ అంటే చేసే విధానం! అంటే చేసే విధానాన్ని బట్టీ "ఫలం" వుంటుందని అర్ధమౌతుంది.

కర్మలను ఆచరింపక తప్పదా?

కర్మనాచరింపక ఎవ్వరునూ ఒక్క క్షణమైనా వుండలేరన్నది నిజమని బోధపడింది.

ఇవి మూడురకాలుగా విభజించేరు పెద్దలు –

నిత్యకర్మలు (తప్పకుండా నిత్యం చేయవలసిన కర్మలు).

నైమిత్తిక కర్మలు (ఒక నిమిత్తాన్ని పురస్కరించుకొని చేసే కర్మలు).

కామ్య కర్మలు (ఒక ప్రయోజనాన్ని ఆశించి చేసే కర్మలు).

వీటి నుండీ తప్పించుకొనుట ఎవ్వరికీ సాధ్యపడదు. అందుచేత వాటిని తప్పక ఆచరిస్తూనే జీవించాలి అన్నది కూడా నిజం.

ఇందులో ఇంకో నిజం కూడా వుంది, అదేంటంటే కర్మలు శాశ్వతము కావు, ఎందుచేతనంటే కాలానుగుణంగా కర్మలు మారుతూవుంటాయి. కాబట్టీ వాటి ఫలితాలు కూడా తాత్కాలిక మైనవే కదా!

అయితే దేహం చేసే కర్మలను నేను చేస్తున్నానని చెప్పుకుంటాము! అసలు చిక్కంతా ఇక్కడే వస్తుంది!

మనిషి కర్మజీవి. కర్మలు చెయ్యకతప్పదు. మంచిని ఆశించి చాలామంది సుకర్మలు చేస్తే, కొందరు తమ లబ్ధికోసం దుష్కర్మలు ఆచరిస్తుంటారు. వీటివల్ల మంచి, చెడు ఫలితాలు తప్పక సంప్రాప్తిస్తాయన్నది శాస్త్రవచనం.

మానవులు అనుభవిస్తున్న కష్టసుఖాలు, తాము చేసుకున్న కర్మమీద ఆధారపడి వుంటాయని జ్ఞానులు ప్రతిపాదించారు. తమ పూర్వజన్మ కర్మఫలితాలు, ఈ జన్మలో ఎదుర్కోవలసి వుంటుందని కర్మసిద్ధాంతం చెబుతుంది. అయితే ఇది

నిజంగా నిజమేనా? అన్న సంశయం కలుగుతుంది చాలామందికి. ఆ దిశగా ఆలోచించడం మొదలుపెట్టాను.

జీవుని కష్టసుఖాలకు కర్మలే కారణమా?

జీవుడు కర్మలో పుట్టి, కర్మలో పెరిగి, కర్మలో మరణిస్తున్నాడు! కావునా జీవుని సుఖదుఃఖాలకు కర్మయే కారణం!

కర్మలు ఆశించిన ఫలితాలను ఇవ్వగలవా?

కర్మలు జడం కాబట్టీ వాటికి ఫలము నిచ్చే శక్తిలేదు! పరమాత్మే కర్మఫల ప్రదాత! కారణం జీవుడు ఆచరించే అన్ని కర్మలకు అతడే సాక్షి!

కర్మ వున్నంత వరకు జన్మ తప్పదా?

కర్మ – జన్మ, ఒక దానిని ఇంకోటి వెంటాడుతూనే వుంటుంది! కర్మ వున్నంతవరకు జన్మ వుంటుంది!

కర్మఫలితాన్ని ఈ జన్మలోనే అనుభవించాలా?

చెప్పలేము! కొన్ని ఈ జన్మలో, మిగిలిపోతే వచ్చే జన్మలో అనుభవించవలసివస్తుంది! దీన్ని మూడు విధాలుగా విభజించేరు జ్ఞానులు!

సంచితకర్మ – అనేక జన్మలలో కూడబెట్టిన కర్మ.

ప్రారబ్ధకర్మ – ఈ జన్మలో అనుభవించాల్సిన సంచితకర్మలో కొంత భాగం!

ఆగామికర్మ – రాబోయే జన్మల్లో అనుభవించాల్సిన కర్మ!

కర్మలను ఎలా ఆచరిస్తే కర్మఫలం వుండదు?

నిష్కామంగా కర్మలు ఆచరిస్తే ఏ ఫలితం అంటదు!

నిష్కామ కర్మలు అంటే?

ఎటువంటి ఫలితం ఆశించకుండా, ఎటువంటి సంకల్పం చెయ్యకుండా ఆచరించే కర్మలు! ఫలితం ఆశించకుండా, కేవలం సంకల్పం చేసి కర్మలు ఆచరిస్తే?

సంకల్పమంటే తాను చేస్తున్నాననే భావనే కదా! ఇది కామ్యకర్మే అవుతుంది! అందుకు ఫలితం వుంటుంది! పరమాత్మకు అన్నీ తెలుసని అనుకున్నప్పుడు ఇక సంకల్పం దేనికి!

సంకల్పంతో కర్మలను చేసి, తుదకు ఈశ్వరార్పణ చేసేస్తే?

“సర్వం ఈశ్వరార్పణమస్తు” అని మనం అన్నంతమాత్రాన, మన కర్మలు ఆయనెందుకు స్వీకరించాలి! సంకల్పంతో చేసేము కాబట్టీ మంచోచెడో ఫలితం అనుభవించక తప్పదు!

అందుకే తప్పక ఆచరించాల్సిన కర్మలను జ్ఞానంతో ఆచరించు! ఎటువంటి భావన లేకుండా ఆచరించు! భావన లేదు కాబట్టీ, తప్పకా దాన్ని ఈశ్వరుడు స్వీకరించవలసిందే!

అప్పుడది కర్మయోగంగా మారిపోతుంది!

సంసారికైనా, సన్యాసికైనా ఆత్మానుభూతికి ఈ నిష్కామకర్మే పునాది!

పరమాత్మ అనుగ్రహం పొందడానికి జీవుల ముందున్న ఏకైక మార్గం ఇదే!

## అధ్యాయం - 8

## కర్మలో "మనస్సు, బుద్ధి, అహంకారం" పాత్ర

మనస్సు అంటే ఏమిటి? దాని విశిష్టత ఏమిటి?

మనస్సంటే సంకల్పాల మూట! అన్ని చింతలకు, కోరికలకు, ఆవేశాలకు మనస్సే కారణం! ఏ అనుభూతి యైన మనస్సే పొందుతుంది! జీవుని జీవనప్రస్థానంలో మనస్సు ప్రముఖపాత్ర పోషిస్తుంది!

పంచ కర్మేంద్రియాలను, పంచ జ్ఞానేంద్రియాలను శాశించేది మనస్సే! పని చెయ్యాలన్న కోరిక పుట్టేది మనస్సులోనే!

మనస్సు చేసే పనేంటంటే జ్ఞానేంద్రియాల ద్వారా విషయ దృశ్యాలను గ్రహించి బుద్ధికి చేర్చడం, బుద్ధి నిర్దేశించిన పనులను కర్మేంద్రియాల ద్వారా చేయించడం!

బుద్ధి అంటే నిర్ణయాత్మక శక్తి!

మనస్సు చంచలమైంది, చపలమైంది. దానిని నిగ్రహించుట కష్టము కానీ అసాధ్యము కాదు. ఈ చపలత్వము, చంచలత్వము నుండీ బయటపడాలంటే ముందుగా అవి మనస్సులో ఎలా ప్రవేసించేయో తెలుసుకోవాలి!

నిజం చెప్పాలంటే స్వతహాగా ఇవి జీవునిలో లేవు. జీవుని అజ్ఞానంవలన, అజాగ్రత్తవలన ఇవి ప్రవేశించేయి.

మనస్సు జడమైనది కావునా స్వతహాగా ఏ కార్యము చేయలేదు. జీవునిలో నెలకొన్న చైతన్యవంతమైన ఆత్మ వలన మనస్సుకి చైతన్యం వచ్చింది!

ఈ సత్యాన్ని తెలుసుకుంటే మనస్సు ఇంకా బలహీనమౌతుంది! మనస్సు సహకరించడంతోనే జ్ఞానం తన పని మొదలుపెడుతుంది, జ్ఞానంతో ఆత్మను గ్రహించడం సులభమే!

భగవంతునికి ఒక రూపం, ఒక నామం, ఒక మంత్రం కల్పించుకుంటున్నది మనస్సు! అనుమానం కలగడానికి, నమ్మకం కలగడానికి, కోరిక కలగడానికి, ద్వేషించడానికి, ప్రేమించడానికి, ఆలోచించడానికి మనస్సే కారణం!

ఏదైనా మనస్సు నుండే మొదలవుతుంది!

భగవంతుణ్ణి సాకారంగా ఆరాధించాలన్న, నిరాకారంగా అనుభూతి పొందాలన్న మనస్సే కారణం. అందుకే మనస్సు గురించి సాధకునికి పూర్తి అవగాహన వుండాలి!

దేని దగ్గరకు మనస్సు పదేపదే పరిగెడుతుందో, మనస్సు ద్వారా ఏదయితే పదేపదే స్మరించబడుతుందో అదే "ఆత్మ".

సంకల్ప, వికల్పాలను చేసేది జీవుని మనస్సే. అలాగే ఉపాసించేది కూడా మనస్సే. శుద్ధి పొందిన మనస్సుతో పరమాత్మను గ్రహించవచ్చు. ఆత్మానుభూతికి మనస్సే ప్రధానము.

ఉదాహరణకి –

మనం పుస్తకాలద్వారా, ప్రవచనాలద్వారా, పెద్దలద్వారా, గురువుద్వారా ఎన్నో క్రొత్త విషయాలు నేర్చుకుంటాం కదా! కానీ వాటిని మన మనస్సు వెంటనే అంగీకరించదు!

ఆలోచిస్తుంది, సందేహాలను రేకెత్తితుంది, బుద్ధితో చర్చిస్తుంది, అహంకారాన్ని పరిగణలోకి తీసుకుంటుంది, తెలుసుకున్నదాంట్లో తప్పులను యెంచుతుంది. మనస్సు చాలా బలమైనది! మనిషి బయటపడదు కాని లోపల మదనపడుతుంటాడు!

అహాన్ని జయిస్తే కానీ మనస్సు స్వాధీనంలోకి రాదు! అహాన్ని జయించాలంటే మనస్సే ముందుండాలి! అది బుద్ధితో ఏకమవ్వాలి!

ఇలా ఏకమవ్వగానే, బుద్ధి పనిచేస్తుంది! అన్ని రూపాలు ఆ పరమాత్మవే కదా! అని ఒక సలహా ఇస్తుంది. మనస్సు మళ్ళీ ఆలోచిస్తుంది, ఒక దృఢమైన నిర్ణయానికి వస్తుంది!

నిజం ఏమిటంటే మనస్సు, బుద్ధి, అహంకారము జడపదార్ధములు. కారణం ఇవి ఆత్మనుండి వ్యక్తమవుటా తిరిగి ఆత్మలో లీనమవుటా జరుగుతూ వుంటుంది!

ఆలోచించే పనిలో మనస్సుని పూర్తిగా లగ్నం చేస్తే, జ్ఞానం తన పని మొదలుపెడుతుంది.

మనస్సు– జ్ఞానం కలయికతో ఆత్మను గ్రహించడం సులభమౌతుంది.

మనస్సును మచ్చిక చేసుకోవడం కేవలం జ్ఞానంతోనే సాధ్యము!

మనస్సు చంచలమైంది, చపలమైంది. దానిని నిగ్రహించుట కష్టము కానీ అసాధ్యము కాదు.

ఈ చపలత్వము, చంచలత్వము నుండీ బయటపడాలంటే ముందుగా అవి మనస్సులో ఎలా ప్రవేసించాయో తెలుసుకోవాలి. నిజం చెప్పాలంటే స్వతహాగా ఇవి జీవునిలో లేవు. జీవుని అజ్ఞానంవలన, అజాగ్రత్తవలన ఇవి ప్రవేశించేయి.

అహంకారరహితుడై, చిత్తశుద్ధిని పొంది, జ్ఞానంతో వాటిని మెల్లగా బయటకు పంపాలి!

అహంకారాన్ని త్యజించడమే కర్మయోగికి ఆఖరి పాఠము!

జ్ఞానయోగికి మొదటి పాఠము!

## అధ్యాయం - ౭

## కర్మ చేసేందుకే అధికారం, ఫలితంపై లేదు

సనాతనధర్మం ప్రకారం కర్మ సృష్టిధర్మం. ప్రకృతిగుణాల వలన కర్మలు నిర్వహించబడతాయి. కర్మలకు దోషం వున్నప్పటికీ జీవులు కర్మబద్ధులు.

కర్మ మానడం కంటే కర్మ చేయడం మేలు. కర్మ చేయకపోతే జీవయాత్ర జరగదు.

జీవులు కర్మచేయకుండా ఒక్క క్షణమైనా వుండలేరు. అయితే కర్మలవలన ఫలం తప్పదు కాబట్టి సత్కర్మలు చెయ్యాలి. కర్మ చేసేందుకే మనకు అధికారం, ఫలితంపై లేదు. ప్రతిఫలాన్ని ఆశించకుండా కర్మఫలాన్ని దైవానికి అర్పించడం ద్వారా జీవుడు క్రమేపి జన్మరాహిత్యాన్ని పొందగలడని తీర్మానం చేసింది సనాతనధర్మం.

కర్మ జడం కాబట్టీ అది మనల్ని బంధించదు. నేను చేస్తున్నానన్న భావమే (కర్తృత్వం) బంధాన్ని కలుగజేస్తుంది.

అంటే కర్తృత్వం వుంటేనే కర్మల ప్రభావం మనపై వుంటుంది, కర్తృత్వం లేకపోతే ఏ ప్రభావం వుండదన్న మాట.

నేను చేస్తున్నానని భావించి(కర్తృత్యము), ఫలితముల యందు ఆసక్తితో కర్మలను చేసి, వాటి ఫలితాన్ని అనుభవించుటకు ఈ జన్మ చాలకపోతే ఇంకొన్ని జన్మలు ఎత్తవలసి ఉంటుంది. దానినే ప్రారబ్ధకర్మ అంటారు. కర్మఫలితాలతో బంధము ఏర్పడుతుంది.

ఈ కర్తృత్యమును మానవుడు అనవసరంగా తన నెత్తిన వేసుకుంటున్నాడు. తను తెచ్చింది లేదు, వెంట తీసుకుపోతున్నది లేదు.

మనం పుట్టక మునుపు, మరణము పిమ్మట ఇది ఎవరిదో? అది ఎవరో తెలుసుకొనుటకు సాధనచేయాలి. అప్పుడు బ్రహ్మాండమును నడుపువాడు దైవమని తెలుస్తుంది.

అతడినే పరమాత్మ అన్నారు విజ్ఞులు. అతని ప్రమేయంతోనే విశ్వముదయించిది. అతని అంశయే ఈ చరాచర జగత్తు. మానవుడు కేవలం నిమిత్తమాత్రుడు. మనతో పనులు చేయుంచునదియు అతడే. అతడే సూత్రధారి. అనంత కాలమును, అనంత సృష్టిని అతడే నడుపుతున్నాడు.

దేహంతో, వాక్కుతో, మనస్సుతో చేయబడే క్రియను కర్మ అంటారని తెలిసింది. అయితే కర్మను నిర్వహించేది శరీరం అయినప్పటికీ చేయించేది, అనుభవించేది మనస్సు కాబట్టీ కర్మఫలం మనస్సుకే వుంటుంది.

మనస్సుకి కర్త ఎవరు అని ఆలోచిస్తే “నేను – నాది” అన్న సమాధానం వచ్చింది.

ఆలోచిస్తే ఈ నేను ( I / Self ) అనేది శరీరం కాదు, ప్రాణం కాదు, జీవం కాదు, మనస్సు కాదు. ఇవన్నీ కూడా “నేను” కి “నావి” మాత్రమే. వాటన్నింటికీ

కర్తగా అసలు "నేను" వేరుగా వుంటుందని అర్ధమైంది.

ఆ నేను అనేది పరమాత్మ అని అర్ధమైంది.

పరమాత్మ జీవునికి పరిపూర్ణమైన జ్ఞానం ప్రసాదించినప్పటికీ మనోబుధ్యహంకార వికారముల వలన సాక్షాత్ పరమాత్మ స్వరూపుడైన జీవుడు అనేకమైన కర్మలు ఆచరించేడు కాబట్టి వాటి ఫలం అనుభవించడానికి ఇంకో దేహం ధరించవలసి వస్తుందని అర్ధమైంది.

అయితే కర్మలు జడం కాబట్టీ వాటికి ఫలము నిచ్చే శక్తిలేదు! పరమాత్మే కర్మఫల ప్రదాత! కారణం జీవుడు ఆచరించే అన్ని కర్మలకు అతడే సాక్షి! అందుకే తప్పక ఆచరించాల్సిన కర్మలను జ్ఞానంతో ఆచరించమని, ఎటువంటి భావన లేకుండా ఆచరించమని భగవద్గీత చెబుతుంది.

భావన లేదు కాబట్టీ, తప్పకా దాన్ని ఈశ్వరుడు స్వీకరించవలసిందే! అప్పుడది కర్మయోగంగా మారిపోతుంది. పరమాత్మ అనుగ్రహం పొందడానికి జీవుల ముందున్న ఏకైక మార్గం ఇదే.

సంసారికైనా, సన్యాసికైనా ఆత్మానుభూతికి ఈ నిష్కామకర్మే పునాది.

కర్మ – జన్మ, ఒక దానిని ఇంకోటి వెంటాడుతూనే వుంటుంది. కర్మ వున్నంత వరకు జన్మ వుంటుంది. కర్మరాహిత్య స్థితి అనేది వుండదు. జీవించినన్నాళ్ల కర్మ అనివార్యము. కర్మ నిష్కామంగా చెయ్యాలి (కర్మలో అకర్మ), నిష్కామకర్మనే కర్మగా భావించాలి ( అకర్మలో కర్మ). యోగులు చేసేది అదే! దాన్నే వైరాగ్యం అని అంటారు!

అజ్ఞానులు కర్మలో మునిగి ఎలా పని చేస్తారో, జ్ఞానులు కూడా లోకశ్రేయస్సు కోరుతూ అలాగే కర్మలు చెయ్యాలి.

కర్మలలో మునిగిపోయిన వారిని ఆక్షేపించకుండా, వారు సత్కర్మలు ఆచరించేలా జ్ఞానులు ప్రోత్సహించాలి. అహంకారం వలన తానే అన్నింటికీ కర్తనని అనుకుంటాడు అజ్ఞాని. కానీ గుణకర్మల యొక్క తత్వం తెలిసిన జ్ఞాని ఆ చట్రంలో చిక్కుకోడు.

ఈ ప్రశ్నలకు సమాధానం నాకు “కర్మయోగం” లో లభించింది.

## అధ్యాయం - 10

# నిష్కామకర్మకు నాంది కర్మ-జ్ఞాన యోగములు

అనేక జన్మలనుండి వెంటాడుతున్న పాపములను పరిహారంచేసుకొనే మార్గాన్ని కర్మయోగము ద్వారా మనకు బోధించేయి వేదములు. జ్ఞానయోగము ద్వారా ఆత్మజ్ఞానమును మానవాళికి పరిచయం చేసాయి ఉపనిషత్తులు.

మానవుడు ఏ యుగంలో పుట్టినప్పటికీ తనలో యున్న ఇంద్రియములు, మనస్సు, బుద్ధి యొక్క వికారములు మారలేదు. వీటి వికారముల వలన తనలో నున్న అఖండమైన ఆత్మశక్తిని కనుగొనలేక వివిధ కర్మలు చేస్తూ వాటి ఫలముల వలన సుఖదుఃఖములను అనుభవిస్తూ, తుదకు మరణించి మరల జన్మించి ఈ భవసాగరంలో కొట్టుమిట్టాడుతున్నాడు.

ఆసక్తితో, కోరికలతో, ఫలాపేక్షతో, అహమనే భావముతో చేసినది కేవలం "కర్మ". దీనివలన బంధము ఏర్పడుతుంది. అనాసక్తితో, ఫలాపేక్ష లేకుండా, ఎటువంటి కోరికలేక, అహంకారం లేకుండా చేయు కర్మ, "నిష్కామకర్మగా లేదా కర్మయోగంగా" మారిపోతుంది.

ఇది సాధ్యమా? అసాధ్యమా??

సాధ్యమే! ఎందుకంటే, ఈ లోకానికి వస్తూ మనమేమైనా తెచ్చుకున్నామా? వెళ్ళిపోతూ ఏమైనా పట్టుకుపోగలమా? ధనం, భూమి, ఇండ్లు, వాకిళ్లు, పరపతి యిలా ఏదైనా ఈ లోకంలో వదిలి పోవలసిందే కదా! ఇలా భావిస్తే నిష్కామకర్మ సాధ్యమే మరి!

ఏ ఫలితాన్ని ఆశించి గాలి, నీరు, నిప్పు, భూమి, చెట్లు మనకు ఉపయోగపడుతున్నాయి?

తాము చేస్తున్న కర్మలవలన మనుజుల గుణము బయటపడుతుంది. వ్యక్తిలో దాగివున్న సత్వ, రజో, తమో గుణములు కర్మలరూపంలో తేటతెల్లమవుతాయి. ఎంత కపటమును ప్రదర్శించినా కూడా అవి ఒకానాకప్పుడు బయటపడి తీరుతాయి.

ఇచ్చట కర్మ చేయడంగాని, చేయకపోవడంగాని ముఖ్యంకాదు. హృదయ మందు, మనస్సునందు మాలిన్యము అంతరించడమే ప్రధానము.

జ్ఞానములేని కర్మాచరణము, ఆచరణలేని జ్ఞానమువలన ఉపయోగములేదు.

పండితులు ఈ రెండింటికి భేదకల్పనచేసి వాదనలతో వృధాగా కాలాయాపన చేస్తుంటారు. సన్యాసమునకు కూడా నిష్కామకర్మయే పునాది. ఈ పునాది దృఢంగా ఉంటే భౌతికంగా సన్యసింపకుండానే పరబ్రహ్మమును తెలుసుకోగలడు.

జ్ఞానముతో చేయుకర్మే యజ్ఞము.

యజ్ఞము చేయువాడు, హోమమొనర్చు ద్రవ్యములు, హుతమొనర్చు అగ్ని పరబ్రహ్మస్వరూపములే, యజ్ఞఫలితము కూడా బ్రహ్మార్పణమే.

అలాగే శ్రాద్ధకాలమందు శ్రాద్ధము చేయువాడు, భోక్తలు, వారు భుజించు

అన్నము పరబ్రహ్మస్వరూపమే. ఆ శ్రాద్ధక్రియ ఫలితమూ బ్రహ్మార్పణమే.

జీవితమందలి సర్వకర్మలను యజ్ఞదృష్టితో చేయడాన్నే "బ్రహ్మకర్మసమాధినిష్ఠ" అంటారు.

ఈ నిష్ఠ గలవాడు పరబ్రహ్మస్థితిని పొందుతాడు.

ద్రవ్యం, ధనం వలన సాధించబడే యజ్ఞంకంటే, జ్ఞానయజ్ఞము శ్రేష్ఠమైనది. ఎందుకంటే సమస్తకర్మలు జ్ఞానంతోనే పరిసమాప్తం అవుతాయి కాబట్టి!

కొంతమంది దానధర్మాలే యజ్ఞంగా, తపస్సే యజ్ఞంగా, యోగసాధనే యజ్ఞంగా, వేదాధ్యయనమే యజ్ఞంగా భావించి జ్ఞానయజ్ఞము చేస్తారు. కొందరు ప్రాణాయామపరులు వాయుగతులను నిరోధించి అపానంలో ప్రాణము, ప్రాణంలో అపానము హెూమం చేస్తారు.

యోగులు బ్రహ్మమనే అగ్నితో, ఆత్మచేత తమ ఆత్మనే ఆహుతి చేస్తారు. వారిని వినయవిధేయతలతో నమస్కరించి, సర్వస్యశరణాగతి నొంది, వారిని సేవిస్తూ, సమయం సందర్భం చూసి ప్రశ్నించి తెలుసుకోవాలి.

జ్ఞానమనే అగ్ని సర్వకర్మలను భస్మం చేస్తుంది.

జ్ఞానంతో సరితూగే పవిత్రమైన వస్తువు ప్రపంచంలో ఇంకొకటి లేదు. జ్ఞానము కలిగిన వెంటనే పరమశాంతి లభిస్తుంది.

అందుకే తప్పక ఆచరించాల్సిన కర్మలను జ్ఞానంతో ఆచరించు! ఎటువంటి భావన లేకుండా ఆచరించు! భావన లేదు కాబట్టీ, తప్పకా దాన్ని ఈశ్వరుడు స్వీకరించవలసిందే! అప్పుడది కర్మయోగంగా మారిపోతుంది!

పరమాత్మ అనుగ్రహం పొందడానికి జీవుల ముందున్న ఏకైక మార్గం ఇదే! సంసారికైనా, సన్యాసికైనా ఆత్మానుభూతికి ఈ నిష్కామకర్మే పునాది!

## అధ్యాయం - 11

## కర్మ - జ్ఞాన అనుసంధానము

కర్మలు ఆచరించడానికి ఇంద్రియాలు వున్నాయి!
జ్ఞానం రూపుదిద్దుకోడానికి బుద్ధి వుంది!
ఈ రెండింటికి అనుసంధానంగా మనస్సు వుంది!

అందుకే మనం ఆచరించే అన్ని కర్మలు జ్ఞానంతో ఆచరించాలి! జ్ఞానంతో పరమాత్మను సులువుగా గ్రహించవచ్చు!

అసలైన సత్యాన్ని తెలుసుకోవాలంటే జ్ఞానం కావాలి. జ్ఞానం కావాలంటే చిత్తశుద్ధి కావాలి. చిత్తశుద్ధి పొందాలంటే నిష్కామకర్మలు చెయ్యాలని ఇంచుమించు అన్ని గ్రంధాలు బోధిస్తున్నాయి. జ్ఞానులుగా ప్రసిద్ధిగాంచిన ఎంతోమంది మహానుభావులు దీన్ని ధృవీకరించారు.

సత్యాన్ని తెలుసుకోవడమన్నా, జ్ఞానాన్ని పొందడమన్నా అందరికీ ఇష్టమే, కానీ అసలు సమస్యంతా చిత్తశుద్ధి పొందడంలోనే వుంది. ఫలితం ఆశించని కర్మలు చేస్తే తప్పా చిత్తశుద్ధి కలుగదు. ఫలితం ఆశించకుండా కర్మలు చెయ్యడం కష్టం. ఇలా చెయ్యాలంటే మళ్ళీ జ్ఞానం కావాలి.

అంటే ఇవన్నీ ఒకటికొకటి ముడిపడివున్నాయి. ఎంతో సాధన కావాలి. సాధనలో అహం (నేననే భావన) మాటిమాటికి అడ్డం వస్తుంటుంది. దాంతో స్వార్ధం తలెత్తుతుంది. స్వార్ధంతో పాటూ కామం, క్రోధం, లోభం, మొహం, మదం, మాత్సర్యం జత కలుస్తాయి.

అందుకే వేదాల్లో గాని, భగవద్గీతలో గాని, సనాతనధర్మానికి చెందిన అన్ని గ్రంధాల్లో, శాస్త్రాల్లో ఈ రెండింటి ప్రస్తావన ఖచ్చితంగా వుంటుంది.

భగవద్గీత కర్మ, జ్ఞాన యోగాలకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చింది! శ్రీ ఆదిశంకరులు తమ భాష్యంలో ఈ రెండింటినే ఎంచుకున్నారు!

కర్మ – జ్ఞాన అనుసంధానంతో అంతటా వ్యాపించి వున్న పరమాత్మ విభూతితో పాటూ మనలో నెలకొని వున్న ఆత్మవిభూతిని గ్రహించవచ్చు! అనుభూతి పొందవచ్చు!

పరమాత్మ అంటే సత్యం! దాన్ని తెలుసుకోవాలంటే కర్మ–జ్ఞానాలను అనుసంధానం చేసుకోవలసిందే! తప్పదు!

సత్యాన్ని తెలుసుకోవాలంటే ఇంత రభస వుందా? ఇంతకీ సత్యాన్ని ఎందుకు తెలుసుకోవాలి? తెలుసుకొని ఏమిటి సాధిస్తాము? తెలుసుకోడానికి మనం అంతకాలం బ్రతికివుంటామా? ఏదో పూజా, పునస్కారం చేసుకుంటూ, ఎంతో కొంత దానం చేస్తూ గడపడమే బెటర్ అని చాలామంది అభిప్రాయం.

కానీ.......సత్యాన్ని తెలుసుకుంటేగాని శాంతి లభించదు. జీవితాంతం అశాంతితో గడపవలసిందే. ఎంత ధనం గడించినా, పేరుప్రఖ్యాతలు ఆర్జించినా, పదవీపురస్కారాలు పొందినా, శాంతిలేని జీవితాన్ని ఊహించు కుంటేచాలు, ఒకరకం భయంపుడుతుంది. ఇలా చాలామంది అన్నీవున్నా అశాంతితో జీవిస్తున్నట్లు నా పరిశోధనలో తేలింది.

ఏమిటీ లోకం? ఎందుకీ వింత? అశాంతికి కారణం ఏంటి?

మనసు చంపుకొని తాను శాంతిగా బ్రతుకుతున్నానని పదిమందిలో నటన దేనికి?

శాంతితో ఆనందంగా జీవించాలంటే ఏంచెయ్యాలి? మహానుభావులందరూ శాంతినే ఎందుకు ప్రభోదిస్తారు? అన్ని విశ్వాసాలు శాంతికి ఎందుకింత ప్రాముఖ్యత యిస్తున్నాయి? శాంతిని %జూతీశీవశీవ% చెయ్యని మతవిశ్వాసము ఏదైనా వుందా?

అటువంటి శాంతిని పొందాలంటే మనుజులు ఎంచెయ్యాలి???

ధనం, ఆస్తులు, పదవి ఎంత సంపాదించినా తృప్తి కలుగదు. ఇంకా సంపాదించాలన్న కోరిక చావదు. ఈ అపరిమిత కోరికలే అశాంతికి ప్రధాన కారణం. అశాంతి వలన జ్ఞానం లోపిస్తుంది. జ్ఞానంలేని జీవితానికి అర్ధంలేదు. ఇలాంటి సంశయాలతో మానవుని జీవితం కాస్తా ముగుస్తుంది.

అందుకే సత్యాన్ని గ్రహించమని అన్ని గ్రంధాలు భోదిస్తాయి. ఈ సత్యాన్వేషణ అనే సాధన మొదట్లో కొంత ఇబ్బంది పెట్టినా, సత్యాన్ని అర్ధము చేసుకుంటున్నకొద్దీ శాంతి లభిస్తుంది. మనసు తేలిక పడుతుంది. బుద్ధి వికసిస్తుంది. తద్వారా ఒక అనిర్వచనీయమైన ఆనందం పొందుతాడు సాధకుడు.

దీనినే అద్వైతసిద్ధియని, బ్రహ్మైక్యస్థితియని, ప్రజ్ఞానఘన స్థితియని మోక్షమని, ముక్తియని, బ్రహ్మానందమని, సమాధిస్థితియని ఆత్మానుభూతియని, Liberation & Realisation అని పేర్కొన్నారు సాధించినవారు.

ఇది ఎవరికి వారు సాధించాలే తప్పా, ఇంకొకరు ఇచ్చే వస్తువుకాదు. సత్యాన్ని తెలుసుకోవడమంటే మనం ఎక్కడనుంచి వచ్చామో అక్కడికి చేరుకోవడమే.

అందుకే దీనిని యోగమని, Reunion అని పేరుపెట్టారు జ్ఞానులు. Religion అన్న పదానికి అసలైన అర్ధమిదేనని యోగులు పేర్కొన్నారు.

Liberation అంటే అన్ని బంధాలనుండి విముక్తనీ, Realisation అంటే అసలు సత్యాన్ని తెలుసుకోవడమని అన్ని తత్వశాస్త్రాలు బోధిస్తున్నాయి.

సత్యమైనది, జ్ఞానవంతమైనది, అనంతమైనది ఏదైతేవుందో దానికే భగవంతుడని, పరమాత్మయని పేరుపెట్టారు. ప్రతీ జడజీవ పదార్ధము పరమాత్ముని స్వరూపంగా వర్ణించేరు.

పరమాత్మనుండి బయటపడి మళ్ళీ పరమాత్మలోనే ఐక్యమయ్యేదే సృష్టి అని పేర్కొనటం జరిగింది.

ఈ విషయాన్ని అనేక గ్రంధాలు ఏఏ రకంగా వివరించాయో పరిశీలించాలన్న ఆలోచన కలిగి ఆ విధంగా శోధించడం ప్రారంభించాను. జాగ్రత్తగా పరిశీలిస్తే అన్ని విశ్వాసాలలో, సత్యాన్ని ఆధారంచేసుకొని ఎన్నో విషయాలు ప్రస్తావించుట జరిగింది.

ఇందులో నాకు అవగతమైన విషయాలు –

సనాతన ధర్మంలో సత్యానికి ప్రతిరూపంగ “లింగాన్ని” ఆరాధిస్తారు. ఎటునుంచి చూసినా లింగం ఒకేలా కనిపిస్తుంది. లింగానికి అసలైన అర్ధాన్ని కూడా జ్ఞానులు వివరించుట జరిగింది.

“లీనతే, గమయితే ఇతి లింగః” అని విజ్ఞులు ప్రతిపాదించేరు. దాని అర్ధము, దేనినుండి సకల చరాచర జగత్తు ఉద్భవించిందో, తిరిగి దేనిలో ఐఖ్యమవుతుందో, అదే “లింగం”.

అలాగే సత్యాన్ని ఒక పూర్ణం(సున్నా)గా భావించి – సత్యమైన పరమాత్మ తత్వము పరిపూర్ణమైనదని శాంతి మంత్రంలో చెప్పడము జరిగింది.

సత్యాన్ని– అకార, ఉకార, మకారాత్మకమైన “ఓంకారం”గా (సృష్టి, స్థితి, లయ) భావించి, ఆరాధించమని బోధిస్తుంది.

సత్యం ఒక్కటే, విప్రులు దాన్ని వివిధరకాలుగా వర్ణిస్తారని ఆది శంకరాచార్యులు సూచించడం జరిగింది.

భగవంతుడు – సత్యానికి, జ్ఞానానికి, సర్వవ్యాపకత్వానికి ప్రతీక అని వివరించడం జరిగింది.

సత్యరూపకమైన పరమాత్మ అంతటా, అన్నివేళలా వున్నాడని వివరించడం జరిగింది.

సత్యం శివమ్ సుందరమని కీర్తిస్తుంది.

"సత్యమేవ జయతే" సత్యం మాత్రమే విజయం సాధిస్తుంది అని ధ్రువీకరించడం జరిగింది. సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింస, ఈ ఐదు మానవుడు తప్పక ఆచరించాలని బోధిస్తూ, ముందుగా సత్యానికి పెద్దపీట వెయ్యడము జరిగింది.

ఇలా సత్యం గురించి, సనాతనధర్మంలో చాల ప్రస్తావన జరిగింది.

ఈ నిత్యసత్యమైన పరమాత్మను అన్నింటా చూడగలిగితే అసలు సత్యాన్ని గ్రహించవచ్చునీ అన్ని విశ్వాసాల గ్రంధాలు బోధిస్తున్నాయి. ఎంతోమంది యోగులు, గురువులు ఈ మార్గాన్ని అనుసరించి సత్యాన్ని దర్శించారని తెలుసుకున్నాను.

శ్రీకృష్ణుడు, జొరాష్ట్రియన్, మహావీర జైనుడు, పార్శ్వనాధుడు, గౌతమ బుద్ధుడు, జీసస్ క్రైస్ట్, ఆది శంకరులు, మధ్వాచార్యులు, రామానుజులు, గురునానక్, తాజుద్దీన్ బాబా మొదలగు మహానుభావులు సత్యాన్ని దర్శించి, ధర్మమార్గంలో నడచి తమ జీవితాలను సుసంపన్నం చేసుకున్నారని చరిత్ర మనకు చెబుతుంది.

గడచిన రెండు శతాబ్దాలలో కూడా, రామకృష్ణ పరమహంస, రమణమహర్షి, లాహిరి మహాశయులు, షిరిడీసాయి, గజానన్ మహారాజ్, తాజుద్దీన్ బాబా, అమ్మాజాన్, మెహెర్ బాబా, టెంబే స్వామి, శివానంద స్వామి, చిన్మయానంద, పరమహంస యోగానంద, వివేకానంద మొదలగువారు సత్యదర్శనంతో

ఆత్మజ్ఞానం పొంది సద్గురువులుగా ప్రసిద్ధిగాంచేరు. ఎంతోమంది వీరి అడుగుజాడలలో నడుస్తూ ధన్యులయ్యేరు.

వీరి జీవితాలను క్షుణ్ణంగా పరిశీలించిన పిమ్మట, అసలు సత్యం మనలోనే దాగివుందన్న విషయం అర్థమైంది. ప్రతిజీవిలో అది ఆత్మరూపంలో ప్రకాశిస్తూ వుందన్న నిజం బోధపడింది. ఈ ఆత్మ సాక్షాత్తు పరమాత్మ స్వరూపమని, దాన్ని దర్శించడమే అసలైన సత్యశోధనని అవగతమైంది.

జీవుని శరీరము నశిస్తుంది గాని ఆత్మ నశించదు. అది నిత్యసత్యం. కానీ జీవుడు, ఈ శరీరమే సత్యమని భావించి, దీనియందు మొహంతో, విషయవాంఛ లందు అనురక్తుడై, అందుకు తగినట్టు అనేక కర్మలను ఆచరిస్తూ, కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలకు లోనై, సుఖదుఃఖాలు అనుభవిస్తూ, తనలో నున్న నిత్యసత్యమైన ఆత్మను విస్మరిస్తున్నాడు.

తానుచేయు కర్మల యొక్క ఫలితాన్ని అనుభవిస్తూ తుదకు మరణిస్తున్నాడు. మిగిలిన కర్మఫలితాన్ని అనుభవించుటకు మరల జన్మిస్తున్నాడు.

ఎన్ని జన్మలెత్తినా, సత్యాన్ని దర్శింపకా, ఆత్మానుభూతి పొందలేక –
"పునరపి జననం, పునరపి మరణం! పునరపి జననీ జఠరే శయనం!"

అని ఆది శంకరులు చెప్పినట్టుగా ఈ జననమరణ చక్రంలో ఇరుక్కుంటున్నాడు.

మరి ఆత్మానుభూతిని పొందటం ఎలా?

దీనికి చక్కని మార్గాన్ని చూపించింది సనాతనధర్మము. దాన్ని పరిశీలించడం మొదలుపెట్టాను.......

## అధ్యాయం - 12

## భక్తి, జ్ఞాన, వైరాగ్యాలు

భక్తి – జ్ఞాన – వైరాగ్యాలు ఆత్మజ్ఞానానికి సోపానాలు –

భక్తి – ఏది సత్యమో దానియందు గాఢమైన విశ్వాసం!

జ్ఞానం – ఏది శాశ్వతమో దాన్ని తెలుసుకోవడం!

వైరాగ్యం – ఏది అసత్యమో దానిని విడిచిపెట్టడం!

భక్తి, జ్ఞానము, వైరాగ్యము ఒకదానితో ఒకటి ముడిపడివుంటాయి!

సుళువుగా చెప్పాలంటే, పరమాత్మ యందు పరమ ప్రీతిని భక్తి అంటారు!

జీవునికి భగవంతునికి వున్న సంబంధమే భక్తి!

భక్తితో జీవునికి ఎనలేని ఆనందం కలగాలి!

జీవుని శరీరం, మనస్సు ఆనందంతో పులకరించకపోతే అది భక్తి కాదు!

భక్తి వున్నచోట భయం వుండదు!

భయం వున్నచోటు భక్తి నటనే అవుతుంది!భక్తిని మూడు రకాలుగా చెప్పవచ్చు – సకామ భక్తి – దీనివలన కోరికలు నెరవేరవచ్చు కానీ ఆత్మజ్ఞానం సిద్ధించదు!

నిష్కామ భక్తి – ఎటువంటి కోరికలు వుండవు. ఇది అజ్ఞానాన్ని దూరం చేస్తుంది!

అనన్య భక్తి అంటే ఎటువంటి షరతులు లేని గాఢమైన విశ్వాసము!

అనన్య భక్తి ద్వారా అనుభవ జ్ఞానము లభిస్తుంది.

తద్వారా పరమాత్మ నేను ఒకటే అనే భావన అనుభూతి కలుగుతుంది.

చాలామంది అనుసరించేది ఈ మార్గమునే. ఇలా ప్రీతితో భగవంతుని ఆరాధించుటవలన, అతనికి "దాసోహం" అగుటవలన జీవుని అహంభావము క్రమక్రమముగా అంతరిస్తుంది. ప్రారంభదశలో ఇది చాలా సులువైన పద్ధతి. దేవునియందు ప్రీతితో కొన్ని మంచికార్యములు చేయుటవలన స్వార్ధబుద్ధి తొలగుతుంది. అయితే ఈ కార్యములన్ని భగవంతునియెడ ప్రీతితో చేయవలెను తప్పా భయముతో, స్వార్ధముతో చేయకూడదు.

ఈ రకంగా సాకారోపాసన (ఒక వస్తువు, చిత్రం / Photo లేదా విగ్రహం రూపంలో భగవంతుణ్ణి ఆరాధించడము) శ్రద్ధతో ఆచరిస్తూ, దైవముపై పరిపూర్ణ విశ్వాసముతో, భగవంతునికి యిష్టమైన కర్మలు ఆచరిస్తే ఉత్తమ ఫలితములు పొందవచ్చును.

సాకారమైన లేదా నిరాకారమైన, సగుణమైనా లేదా నిర్గుణమైనా కావలసింది శ్రద్ధాభక్తులు మాత్రమే.

బాహ్య పుష్పములతో భగవంతుని విగ్రహాలను పూజించు ప్రక్రియతో ఆరంభమైన భక్తి క్రమముగా మనస్సనే పుష్పమును పరమాత్మకు అర్పించే స్థితికి చేరుకోవాలన్నదే భక్తియొక్క ముఖ్యవుద్దేశము. కేవలం విగ్రహాలలో

మాత్రమేవున్నాడన్న ఆలోచనను వీడి, సకలచరాచర సృష్టిలో పరమాత్మను దర్శించడాన్నే పరాభక్తి లేక విశేషభక్తి అంటారు.

భగవంతుడు సృష్టించిన వస్తువులను తిరిగి అతనికి సమర్పించుటకన్నా, జీవుడు తన ప్రయత్నంతో శుద్ధిచేసుకున్న తన మనస్సును పరమాత్మకు సమర్పించవలెనని భగవద్గీతలో జగద్గురువు శ్రీకృష్ణుని బోధ.

బాహ్యపువ్వులు కొంతకాలానికి వాడిపోతాయి, కానీ పరాపూజయందు వాడే ఇంద్రియనిగ్రహం, సర్వభూతదయ, అహింస, క్షమాగుణము,

శాంతి, తపము, సత్యము, ధ్యానము అనే ఎనిమిది పువ్వులు

ఎన్నటికీ వాడకపోగా రానురాను వికసిస్తూ జీవునికి ఆత్మజ్ఞానమును ప్రసాదిస్తాయి.

ఈ అనన్య భక్తిమార్గము ద్వారా మనస్సును ఆధీనపరచుకొని దానిని ఆత్మయందు ప్రతిష్టించే సాధన చెయ్యాలి. అప్పుడు చిత్తము తన రూపమును కోల్పోయి చైతన్యాత్మగా ప్రకాశిస్తుంది.

ఎందుచేతనంటే మోక్షము అనునది మనస్సుకే కానీ ఆత్మకు కాదు. జీవుని బంధ, మోక్షములతో ఆత్మకు ఎలాంటి సంబంధంలేదు.

పునర్జన్మరహిత స్థితిని పొందాలంటే ఆత్మ తన నిజస్థానమైన పరమాత్మను చేరాలి.

ఆత్మ ఎప్పుడూ శుద్ధిగానే వుంటుంది. అది ఆత్మ లక్షణము. శుద్ధి చేయవలసిందల్లా మనస్సునే. ఆత్మవలే మనస్సు కూడా ఎప్పుడు శుద్ధి పొందుతుందో, జీవునికి అప్పుడు కైవల్యపదవి సిద్ధిస్తుంది.

భక్తియోగము (భక్తితో జ్ఞాన, వైరాగ్యాల కలయిక) ద్వారా దీనిని చాలా సులభంగా సాధించవచ్చుని గీతలో గీతాచార్యుడు, మానవులందరి ప్రతినిధియైన పార్థునికి తెలియజేసేడు!

భగవంతునియెడ అనన్యభక్తితో ఇది అతి సులభంగా సాధ్యపడుతుంది. పట్టు వదలకుండా భగవంతుని పాదాలను పట్టుకోవాలి. ఇక చేసేదిలేక ఆ భక్తుడికి తన చేయూతనిచ్చి, పైకిలేపి తనలో కలుపుకుంటాడు పరమాత్మ.

జీవుడు శుద్ధత్యముతోనే జన్మిస్తాడు కాబట్టి మరణించేటప్పుడు కూడా శుద్ధత్యముతోనే మరణించాలి.

ఈ మధ్యలో మాయ (అజ్ఞానము) వలనగాని, పూర్వజన్మ వాసనలు వలనగాని, జీవునికి ఎన్ని సవాళ్లు ఎదురైనా, ఎన్ని ఇబ్బందులు కలిగినా ఈ శుద్ధత్యమును పొందాలి. ఇదే జీవుడు సాధించవలసిన అంతిమ లక్ష్యము.

ఈ భక్తి మార్గమే అన్ని మార్గములకన్నా చాల సులువైన మార్గమని జగద్గురువు అర్జునునికి ఉపదేశించాడు.

ఇటువంటి శ్రద్ధాభక్తులతో కూడిన ఉపాసనతో క్రమముగా చిత్తశుద్ధి ఏర్పడి నిర్గుణోపాసనకు కావలసిన వివేకము, విచారణాబలము జీవునికి లభిస్తుంది.

"దాసోహం"తో ప్రారంభమైన ప్రక్రియ "సోహం" అనే ఉన్నతస్థితికి చేరుకుంటుంది.

భక్తిలో తప్పకుండా జ్ఞానం వుండాలి!
ఎక్కడ జ్ఞానము వుంటుందో అక్కడే వైరాగ్యం వుంటుంది!
ఎక్కడ వైరాగ్యం వుంటుందో అక్కడ పరమాత్మ వుంటాడు!

బాహ్య వస్తువులపై ఆసక్తి వున్నంతసేపు, ఆత్మ వస్తువు గోచరించదు! దృష్టిని బాహ్యం నుండి అంతర్ముఖం చెయ్యాలి! భక్తికి, జ్ఞానానికి, వైరాగ్యానికి ఇదే మొదటి మెట్టు!

కర్మ–జ్ఞాన యోగములతో వైరాగ్యం అలబడుతుంది!

అందుకే జ్ఞానులు తాముచేయు కర్మలన్నీ భగవంతునిపై ఆరోపించి, ఏమి ఆశింపక, మనోబుద్ధుల ప్రమేయంలేక కేవలం ఇంద్రియాలతో కర్మలు ఆచరిస్తారు!

వైరాగ్యము మనోవైఫల్యంతోనూ, మనోద్వేగంతోనూ పుడితే, అది శాశ్వతం కాదు!

కర్తృత్వమును విడిచిపెట్టి పనిచేస్తే వైరాగ్యం అలవడుతుంది!

"నా ఆత్మయే నీవు", "నాచే చేయిస్తున్నది నీవు"

అన్న సంకల్పంతో కర్మలాచరిండమే వైరాగ్యం!

## అధ్యాయం - 13

# సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ

సత్యం గురించి ప్రస్థానత్రయము (ఉపనిషత్తులు, బ్రహ్మాసూత్రములు, భగవద్గీత) లో చాలవివరంగా విశ్లేషణ చేయబడిందని గ్రహించి వాటిని అధ్యయనం చేయడం మొదలుపెట్టేను.

సత్యాన్ని గ్రహించాలంటే, ముందు "తత్వము" (అంటే ఒక వస్తువు యొక్క సహజధర్మం)ను తెలుసుకోవాలని సూచిస్తుంది ఈ ప్రస్థానత్రయము. ఎంతోమంది తత్వజిజ్ఞాసువులు (సృష్టి సత్యాన్ని తెలుసుకోవాలని శోధించినవారు) తపస్సు ద్వారా సత్యాన్ని కనుగొన్నారు. ఈ విశ్వమేమిటి, ఎలా పుట్టింది, దీనికి ఎవరు కారకులు, ఎంతకాలం వుంటుంది, చివరకు ఏమవుతుంది అన్న ప్రశ్నలకు సమాధానాలు కనుగొని మనకు అందించారు కూడా.

ఈ సత్యాన్ని ఎవరికివారు తపస్సు ( తెలుసు కోవాలన్న తపన) ద్వారా గ్రహించవచ్చున్న ధైర్యాన్ని కూడా ప్రసాదించేరు. తపస్సు అంటే ఇంద్రియాలను,

మనస్సును తన వశంలో వుంచుకొని, ఒకే లక్ష్యంపై నిశ్చలంగా మనస్సును గురిపెట్టాలని సూచించారు.

"సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ" అంటే అంతటా వ్యాపించి, అంతా తానే అయిన తత్వమే బ్రహ్మమన్న సత్యాన్ని, వారు స్వయానా అనుభవించి, బ్రహ్మానందమును అనుభూతిపొంది మనకు ఆ మార్గాన్ని సూచించడం జరిగింది.

పైన పేర్కొన్న మహావాక్యంలో,

సత్ అంటే ఉంది,

చిత్ అంటే చైతన్యము/జ్ఞానము,

అనంతం అంటే నిత్యము/శాశ్వతము

దానినే బ్రహ్మము అని పేర్కొన్నారు.

అంటే, అంతా వ్యాపించి, అంతా తానే అయిన తత్వము!

అదే అసలు సత్యము.

దానియొక్క ప్రభావమే (విభూతి) ఈ నామరూపాత్మకమైన జగత్తు అని వివరించడం జరిగింది.

ఈ సత్యమైన బ్రహ్మమే అన్ని జడ-జీవ పదార్థాలలో వ్యాపించివుంది. జడజీవ పరస్పర సంబంధమే ఈ సృష్టి. దీని వెనుకనున్న పరతత్వాన్ని శోధించి ఉపనిషత్తుల ద్వారా మనకు అందించారు ఎందరో తపఃసంపన్నులు. ఇది మొదటి ప్రస్థానం. అన్ని ఉపనిషత్తుల సారమే భగవద్గీత. ఇది రెండవ ప్రస్థానం. ఈ రెండింటి సారమే బ్రహ్మసూత్రములు. ఇది మూడవ ప్రస్థానం. రెండు, మూడు ప్రస్థానాలను వేదవ్యాసులు మనకు అందించడం జరిగింది.

పైనపేర్కొన్నవి చాల విస్తారమైన గ్రంధాలు. వాటిని పూర్తిగా అర్ధంచేసుకుని, జీర్ణించుకోవడం అంత సులభంకాదు. అందుకోసమే ఏమో, శ్రీ ఆది శంకరులు వీటన్నిటినీ క్రోడీకరించి తన భాష్యాన్ని నేటి సమాజ అభ్యుదయంకోసం సరళంగా మనకు అందించారు. జ్ఞాన సముపార్జనకై ఈ భాష్యాన్ని అర్ధంచేసుకొనే ప్రయత్నాన్ని ప్రారంభించేను.

ఈ ప్రయత్నంలో ముందుగా నన్ను ప్రేరేపించింది, ఒక మహత్తర శాంతి మంత్రము!

ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే।

పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవా వశిష్యతే॥

దాని అర్ధం – సత్యమైన పరమాత్మతత్వము పరిపూర్ణమైనది, అఖండమైనది, ఏకరూపం కలది. ఆ పరమాత్మనుండి ఈ జగత్తంతా ఉద్భవించింది. అందులోనే వుంటుంది. తుదకు అందులోనే విలీనమౌతుంది.

కానీ చూచుటకు విడిగా నున్నట్లు అనిపిస్తుంది.
ఈ భావన “అసత్యం/భ్రమ/అజ్ఞానం.

దీనిని తొలగిస్తే – పరమాత్మయే సత్యము, పరిపూర్ణము అని అవగతమౌతుంది.

సహజంగా ఈ జగత్తు సత్యంగా గోచరిస్తుంది. కారణం జీవుని జీవితంలో చాలాభాగం ఈ జగత్తుతోనే ముడిపడివుంటుంది. పుట్టుక నుండీ మరణం వరకు ఈ జగత్తుతో ఎక్కువ సంబంధం పెట్టుకుంటాడు జీవుడు. తద్వారా ఎన్నో బంధాలు, అనుబంధాలు ఏర్పడతాయి. వస్తు ప్రపంచంతో కూడా ఎంతో అనుబంధం పెంచుకుంటాడు.

కొన్ని వస్తువులు, కొందమంది మనుషులు లేకపోతే తన జన్మ వృధా అన్న భావనకు వస్తాడు. కొంత భయంతో, కొంత భక్తితో తనకు నచ్చిన దైవాన్ని కొలవడం ప్రారంభిస్తాడు. ఆ నమ్మకంతో తనకు కావలసినవి ప్రసాదించమని దైవాన్ని వేడుకుంటాడు.

అవి తీరితే దైవం చాల గొప్పదని పొగుడుతాడు. తీరక పోతే దైవాన్ని నిందిస్తాడు. అకస్మాత్తుగా కొన్ని కలిసివస్తే మళ్ళీ దైవాన్ని నమ్మి ఇంకాస్త ఎక్కువుగా కొలవడం మొదలుపెడతాడు. కొలిచే విధానం మారుతుంది. కాస్త ఆడంబరం, ఆధునికత చేరుతుంది. దైవారాధనలో ఖర్చు పెంచుతాడు.

తన పరపతి పెంచుకుంటాడు. తను నమ్మిన దైవం తనను ఎప్పటికి మోసం చెయ్యడన్న నమ్మకాన్ని పెంచుకుంటాడు. కొత్తవి, ఖరీదైన కోరికలు కోరడం మొదలుపెడతాడు. మెల్లగా ఈ భోగమంతా తన పూర్వజన్మ సుకృతమే అన్న భావనకు వస్తాడు.

తద్వారా – అహం పెరుగుతుంది, దైవం మీద నమ్మకం తగ్గుతుంది. భయం పెరుగుతుంది, అసలు సిసలైన భక్తి తగ్గుతుంది.

ఈ గందరగోళంలో అసలు సత్యాన్ని విస్మరిస్తాడు. సత్యాన్ని తెలుసుకొనే ప్రయత్నమే చెయ్యడు. జీవితాంతం భ్రమలోనే జీవిస్తాడు, భ్రమలోనే మరణిస్తాడు.

తాను ఆచరించిన పుణ్య, పాప కర్మల ఫలితాలు అనుభవించడానికి ఇంకో శరీరాన్ని దాలుస్తాడు. కానీ నిత్యసత్యమైన, నాశరహితమైన ఆత్మ మాత్రము ఒక సాక్షీభూతంగా అతనిలో మళ్ళీ నెలకుంటుంది.

పుట్టిన ప్రతిజీవి యొక్క శరీరము మార్పుచెందుతూ తుదకు నశిస్తుంది. అసలు మార్పుచెందనిది, శాశ్వతమైనది, ఆత్మ మాత్రమే.

ఈ నిత్యసత్యమైన ఆత్మ ప్రతిజీవిలో నెలకొనివుంది. ప్రతిజీవి ఆత్మ స్వరూపమే.

అన్ని జీవరాసులలో కెల్లా మనిషనే జీవి సహజంగా అత్యంత జ్ఞానసంపన్నుడు. ఇంద్రియాలను, మనస్సును, బుద్ధిని సమన్వయ పరుచుకొని ఆత్మజ్ఞానంతో ఆనందంగా జీవించే తెలివికలవాడు. అలాగే వాటికి సమన్వయ పరుచుకోలేక తన నిజస్వరూపాన్ని విస్మరించి జీవితాన్ని కష్టాలపాలు చేసుకునే తెలివితక్కువ వాడు కూడా ఈ మనిషే.

పరమాత్మ ప్రసాదంగా తనకు లభించిన జ్ఞానంతో, తనలో నెలకొనివున్న ఆత్మను

తెలుసుకొనే సాధన చెయ్యడమే ఆధ్యాత్మికము!

కానీ మాయకు వశుడై, అజ్ఞాన పరుడై ఈ శరీరమే నిత్యసత్యమైనదిగా భావిస్తూ, ఇంద్రియాలను నిగ్రహించుకోలేక, మనస్సులో ఉదయించిన కోరికలను అదుపుచేసుకోలేక, విషయవాంఛలకు లోనై, అనేక కర్మలను ఆచరిస్తూ, బంధాలను పెంచుకొని, ఆత్మజ్ఞానం పొందలేక, అసలు సత్యాన్ని గ్రహించలేకా తుదకు మరణిస్తున్నాడు. తనలో నున్న నిత్యసత్యమైన, పవిత్రమైన ఆత్మ శరీరాన్ని వదిలిపెడుతుంది.

జీవుడు జీవించినంతకాలం ఆ శరీరంలో నెలకొనివున్న ఆత్మ కేవలం ఒక సాక్షీభూతంగా వుంటుంది కావునా, ఆ దేహంతో జీవుడు ఆచరించిన ఏ కర్మఫలితము కూడా ఆత్మకు అంటదు. మంచి గాని, చెడు గాని, ఆ కర్మఫలితాలను అనుభవించుటకు జీవుడు ఇంకొక దేహాన్ని ధరింపక తప్పదు.

ఆత్మానుభూతి పొందటమంటే ఏ రకమైన కర్మఫలితం లేకపోవడమే. దానికే ముక్తియని, మోక్షమని పేరుపెట్టేరు ముముక్షువులు.

ఆత్మజ్ఞానం పొందాలంటే ముందుగా చిత్తశుద్ధి పొందాలి!

అల్లకొల్లోలమైన చిత్తం, ఆత్మను కనుగొనలేదు!

చిత్తం శుద్ధి కావాలంటే ముందుగా అహంకారం (నేను, నాది అనే భావన) పోవాలి!

ఇదే మొదటిమెట్టు. ప్రతినిమిషం తన స్వార్థం గురించి ఆలోచించే జీవునికి ఇది సాధ్యపడుతుందా? చేసే ప్రతికర్మ తన బాగోగులు కోసమే ఆచరించే జీవునికి ఇది సాధ్యమా? అకుంఠిత సాధనతో ఇది తప్పక సాధ్యమేనంటుంది సనాతనధర్మము.

ముందుగా ప్రతిజీవిలో ఆత్మవుందన్న విషయం స్పష్టం కావాలి, అన్ని జీవులను సమదృష్టితో చూచే స్వభావాన్ని అలవరచుకోవాలి. ఈ ప్రయత్నం నిరంతరం చేస్తుండాలి. అందుకు తాను ఆచరించే ప్రతి కర్మ నిష్కామంగా (ఫలితం ఆశించకుండా) ఆచరించాలి.

తన బాగోగులు, తాను కోరకుండానే భగవంతుడు ఇస్తాడన్న నమ్మకం వుండాలి. అందుకు కావాల్సిన ధైర్యం, ఓరిమి వుండాలి. అన్నింటా ఏకత్వాన్ని దర్శించే ప్రయత్నం చేస్తూవుండాలి.

పురాణ, ఇతిహాసాలలో దాగివున్న అంతరార్థాన్ని కనుగొనాలి. శాస్త్రాలలో ఇమిడివున్న సత్యాన్ని అన్వేషించాలి. వీటిలో పైపైన పేర్కొన్న కథావస్తువు కన్నా, అవి ప్రభోదించే సత్యధర్మాలను అవగతం చేసుకోవాలి. కేవలం కథకి మాత్రమే విలువిస్తే సందేహాలు జనిస్తాయి. సంశయాలు మిగిలిపోతాయి. సత్యం మరుగున పడుతుంది.

వేదాలలో విధించిన కర్మల వెనుకనున్న అసలు సత్యాన్ని గుర్తించాలి. వేదాంతములలో బోధించిన జ్ఞానాన్ని అర్థం చేసుకోవాలి.

“కర్మలో అకర్మను”, “అకర్మలో కర్మను” త్రికరణశుద్ధిగా ఆచరిస్తున్న గురువు కోసం నిరీక్షించాలి. పూర్తి విశ్వాసముంచితే గురువు తనంతటతానే వెతుక్కుంటూ వస్తారు.

## అధ్యాయం - 14

## ఆత్మ, పరమాత్మ, ఆత్మజ్ఞానం

ఆత్మ అంటే ఏమిటి? పరమాత్మ అంటే ఏమిటి?

ఆత్మ, పరమాత్మల సంబంధం ఏమిటి?

ఆత్మ వస్తువును ఇదియని వర్ణించుట దుర్లభము -

ఎందుకంటే అంతా అదే, అన్నీ అదే!

అదితిగా ఆరాధింపబడుతున్నది, ప్రాణశక్తిగా విరాజిల్లుతున్నది,

అన్ని భూతములయందు నెలకొనియున్నది ఆత్మ!

చెవికి చెవిగా, మనస్సునకు మనస్సుగా, వాక్కునకు వాక్కుగా, ప్రాణమునకు ప్రాణముగా, నేత్రమునకు నేత్రముగా అయివున్నదే ఆత్మ! దేని దగ్గరకు మనస్సు పదేపదే పరిగెడుతుందో, మనస్సు ద్వారా ఏదయితే పదేపదే స్మరించబడుతుందో అదియే "ఆత్మ". ఈ ఆత్మనే బ్రహ్మము అని అంటారు.

ఎలాగైతే నీరు, వాయువు ఏ వస్తువును ఆవహిస్తే ఆ రూపం దాలుస్తుందో, అలాగే ఆత్మ కూడా ఆయా భూతములను ఆవహించి, ఆయా రూపములను ధరిస్తుంది.

ఎలాగైతే సూర్యుని కాంతి ఒక వస్తువుపై పడినప్పుడు ఆ వస్తువు ప్రకాశిస్తుందో, అలాగే ఆత్మ ఒక ఉపాధిని ఆవహించినప్పుడు, ఆ ఉపాధి చైతన్యాన్ని పొందుతుంది.

ఆత్మ/బ్రహ్మము శాశ్వతమైనది, చైతన్యవంతమైనది, సర్వవ్యాపకమైనది, సాక్షీభూతమైనది, అన్ని జీవులలో నెలకొనివుంటుంది కాబట్టీ జ్ఞానంతో దాన్ని తెలుసుకోవచ్చు. జీవుని జ్ఞాననికి ఆధారంగా, సాక్షిగా ఈ ఆత్మచైతన్యస్ఫూర్తి ఎల్లప్పుడూ వెన్నంటివుంటుంది. అది సత్యము.

జీవాత్మకి, పరమాత్మకి ఉపాధి (body) విషయంలో బేధం వున్నప్పటికీ, ఇరువురిలో చైతన్యాంశ (ఆత్మస్వరూపము) మాత్రం ఒక్కటే!

పురమనగా శరీరము, అది పురుషునికి(ఆత్మకు) నివాసస్థానము. ఆ పురుషుని(ఆత్మను) ధ్యానించు వాడు ఎటువంటి దుఃఖమును పొందడు. శరీరం క్షీణించిపోతుంది, కొన్నాళ్ళకు నశిస్తుంది కానీ ఆత్మ మాత్రం నిత్యంగా వుండి ఇంకో శరీరాన్ని దాలుస్తుంది.

జీవాత్మకు ఈ దేహమే ఉపాధి!
పరమాత్మకు ఈ విశ్వమంతా ఉపాధే!
జీవాత్మల ఏకత్వమే పరమాత్మ!

స్వప్న, జాగ్రదావస్థలలో కూడా ఏదీ విశ్వంతో ముడిపడివుంటుందో అదే పరమాత్మ. సకల జీవులలో అది జీవాత్మగా ప్రకాశిస్తుంది.

జీవభావాన్ని పొందినవాడు, దానిని కలిగించువాడు కూడా పరమాత్మే!

ఏ శక్తితో గ్రహములు, నక్షత్రములు, ద్వాదశ సూర్యులు ఆకాశమున ఒక నిర్ణీతకక్షలో సంచరిస్తున్నాయో ఆ శక్తే పరమాత్మ.

పరమాత్మే జీవాత్మగా ఒక ఉపాధిని కల్పించుకొని వ్యక్తమయ్యేడు! ఉపాధితో కూడిన జీవభావము నశించినపుడు జీవాత్మ పరమాత్మగా బాసిస్తాడు.

ఈ జగత్తు యొక్క తత్వమే పరమాత్మ. ఈ ప్రపంచానికి పరమాత్మకి వాస్తవమైన బేధంలేదు.

అయమాత్మా బ్రహ్మ! జీవో బ్రహ్మైవ నా పరః! అహం బ్రహ్మాస్మి!
అన్న ఉపనిషత్తుల వాక్యాలకు అర్ధమిదే!

ఎచ్చటనుండి జీవుడు వచ్చేడో, అక్కడికి తప్పకా చేరుకోవలసిందే!

పరమాత్మనుండి వ్యక్తమైన జీవాత్మ (జీవుడు) మళ్ళీ పరమాత్మను చేరుకోవాలి!

అదే జీవాత్మ అసలు స్వరూపము! దానినే యోగము అన్నారు పెద్దలు!

అలా చేరినప్పుడే వ్యక్తి జీవిత నాటకము ముగుస్తుంది!

అంతేకాని జీవుని మరణముతో సమాప్తము కాదు.

జీవాత్మ, పరమాత్మతో యోగం కానంతసేపు జీవునికి జనన మరణాలు తప్పవు.

జీవుని పరమాత్మతో చేర్చునదియే జ్ఞానము.

ఇది నిష్కామ కర్మాచరణ వలన మాత్రమే సిద్ధిస్తుంది.

తన అసలు స్వరూపాన్ని తెలుసుకోవడమే "ఆత్మ సాక్షాత్కారము, ఆత్మ దర్శనము, భగవద్దర్శనము".

ఆత్మసాక్షాత్కారం పొందిన వ్యక్తి –

ఆ ఆత్మవస్తువును అనుభూతిపొంది, బ్రహ్మానందాన్ని పొందుతాడు!

# అధ్యాయం - 15

## కాలరూపుడు, కాలగమనుడు, కాలాతీతుడు

ఆదినుండి మానవుడు కాలంతో పోటీపడుతున్నాడు. కాలానుగుణంగా తన పనులన్నీ చెక్కబెట్టుకుంటున్నాడు. ప్రతిదానికి ఒక నిర్ణీతసమయం కేటాయిస్తున్నాడు

ఎంతోమంది మేధావులు గ్రహాల గమనాన్ని బట్టీ కాలాన్ని నిర్ణయించేరు.
ప్రపంచంలో నున్న దేశాలవారీగా కాలాన్ని విభజించేరు.
మళ్ళీ ప్రాంతాలవారిగా కాలాన్ని విభజించేరు.
గ్రహాలమధ్య దూరాన్ని కూడా కాలంతో లెక్కించేరు.

మన పూర్వులు కాలాన్ని విఘడియలుగా, ఘడియలుగా, హోరాలుగా, లగ్నాలుగా, సంధ్యలుగా, రోజులుగా, నెలలుగా, సంవత్సరాలుగా, యుగాలుగా, కల్పాలుగా విభజించి తన అద్భుత జ్ఞానాన్ని ప్రదర్శించేరు.

కాలాన్ని గణిచేందుకు ఎంతోమంది ఎన్నో ప్రయోగాలు చేశారు. ఎన్నో రకాలుగా గణించేరు. కొంతకాలం కొన్ని పాటింపబడ్డాయి. తరువాత కొన్ని

మరుగున పడ్డాయి. కాలాన్ని గణించడం అంత సులభం కాదు, కారణం, కాలము తాలుకు ఆధ్యంతాలు ఎవరు కనుగొనలేక పోవడమే! కావునా ఇవన్నీ మన మనుగడ కోసం మనం కల్పించుకొన్నవి.

ప్రముఖ చక్రవర్తులు, ప్రముఖ వ్యక్తులు ఆధారంగా ఎన్నో క్యాలెండరులు వెలిసేయి. దేశకాలమాన పరిస్థితులను బట్టీ అనాదిగా ఎన్నో పంచాంగాలు ఉద్భవించేయి. ఎవరి సాంప్రదాయం ప్రకారం వారివారి పంచాంగములను తయారుచేసుకున్నారు. అన్ని పంచాంగములలో కొన్ని మార్పులు, చేర్పులు, కూర్పులు ఉన్నాయన్నది సత్యము. మన దేశంలోనే ఎన్నో పంచాంగాలు వాడుకలోవున్నాయి. సూర్యమాన, చాంద్రమాన పంచాంగాలు ఎన్నో వాడుకలో ఉన్నాయి. బృహస్పతి గ్రహ సంచారాన్ని బట్టీ కొన్ని పంచాంగాలు ఉన్నాయి.

నేటి కాలంలో – బీ వీ రామన్, ఎన్ సీ లాహిరి, ద్వివేది, కృష్ణమూర్తి లాంటి ప్రముఖులు ఎంతో పరిశోధన చేసి, వారివారి పంచాంగాలు అందించడం జరిగింది. నాసా వాటిని పరిగణలోనికి తీసుకోవడం కూడా జరిగింది. అంతరిక్ష విశేషాలకు అవి ఎంతో ఉపయోగపడుతున్నాయి కూడా.

పరమాత్మ అనుగ్రహంతో, సుమారు పదునైదు సంవత్సరాలు నా తండ్రిగారి గురుత్వంలో, నేను జ్యోతిషశాస్త్రాన్ని అభ్యసించడము జరిగింది.

సౌర కుటుంబం, అందులో నవగ్రహాలు, వాటి దూరం, వాటివిశేషాలు, వాటి కారకత్వము, వాటి జాతులు, భూమిపై వాటిప్రభావం, భూమిపై నివసించే మనుజులపై వాటి ప్రభావం, వాటి గురుత్వాకర్షణ శక్తి, సూర్యుని చుట్టూ వాటి కాలగమనం, ఒక జీవి మీద వాటి ప్రభావము, గర్భస్థజీవి మీద వాటిప్రభావము, మనుజులమీద, ఇతర జీవులపైన వాటి ప్రభావము.

కేంద్రాలు, కోణాలు, రాశిపిండాలు, అష్టకవర్గు, గ్రహ వీక్షణాలు, దశలు, అంతర్దశలు, విదశలు, రాసి చక్రం, నవాంశ చక్రము, ఆరూఢ చక్రం, జన్మ

లగ్నం, చంద్ర లగ్నం, గోచారం, కుజ దోషం, భృగు షట్కమ్, లగ్న బలం, గురుబలం, యోగాలు, వాటి ఫలితాలు, సమాగమం, అస్తంగత దోషం, చండాలత్వం, కాలసర్ప దోషం, బాలారిష్టం, ఏల్నాటి శని, అర్ధాష్టమ శని, అష్టమ శని, స్త్రీ జాతకము, ముహూర్త కాలము, అధిక మాసాలు, సూన్య మాసాలు.

జడ పదార్ధములపైనా వాటి ప్రభావము, ప్రభావ కాలం ఎంత? వాటిప్రభావం నిజంగా జీవుల జీవిత గమనాన్ని మార్చేస్తుందా? ఎంతవరకు మారుస్తుంది? మానవ జీవితంలో జరిగే సంఘటలన్నీ ఈ గ్రహాలపై పూర్తిగా ఆధారపడివుందా?

అలాగైతే పూర్వజన్మ కర్మఫలిత వాసనలు వట్టిమాటేనా? ఆ వాసనలు కూడా ఈ గ్రహఫలితాలపై ఆధారపడివున్నాయా? పరమాత్మ ఈ గ్రహాలను నిజంగా వాడుకుంటున్నాడా? మనుజుల జీవితక్రమాన్ని మార్చేసేశక్తి నిజంగా ఈ గ్రహాలకు వుందా? కేవలం ఇది ఒక నమ్మకమేనా? ఈ గ్రహగమనాన్ని కేవలం కాలాన్ని నిర్ణయించే ఒక పద్ధతిగా పరిగణించవచ్చా? లేకా జీవుల తలరాత మార్చే శక్తిగా పరిగణించవచ్చా?

ఒకే లగ్నంలో, ఒకే గ్రహస్థితిలో, అచ్చు ఒకేలా వుండే జన్మ కుండలినిలో పుట్టిన కవల పిల్లల జీవితంలో ఎన్నో తారతమ్యాలు ఎందుకు? ఇక్కడ గ్రహాలు శాశిస్తున్నాయా లేక కర్మఫలితం శాశిస్తున్నాదా? పండితులు చెప్పిన ప్రకారంగా మన జీవితంలో అన్ని విషయాలు సమయానుకూలంగా జరుగుతున్నాయా? ఏది సత్యం, ఏది కల్పన?

అసలు మహర్షులు చెప్పిందేమిటి, మనం అర్ధం చేసుకున్నదేమిటి?

జ్యోతిషశాస్త్రం ఎల్లప్పుడూ మానవులను, సత్యం వైపు నడిపించే ప్రయత్నం చేసిందిగాని, వారిని చాంధసవాదులుగా మార్చడానికి కాదు.

అందుకే దానిని జ్యోతిశాస్త్రం అన్నారు!

కాలక్రమేణా కొందరు దాని అసలు స్వరూపాన్ని మార్చి,

మనుజులను భయాందోనళకు గురిచేసే శాస్త్రానిగా మార్చివేశారు.

కాలాన్ని గణించే శక్తిసామర్థ్యాలు గల జ్యోతిష శాస్త్రాన్ని, ఎంతోమంది ఎన్నోరకాలుగా వాడుకొన్నారు. కొంతమందికి భయంతో ఈ శాస్త్రం మీద నమ్మకం ఉన్నప్పటికీ చాలామందికి వ్యతిరేకత కూడా వుంది, కారణం సత్యాన్ని అద్దంపట్టే ఆ శాస్త్రాన్ని యధాతథంగా మనం అర్థం చేసుకోలేదు కాబట్టి.

ఏ శాస్త్రము కూడా మానవుల్ని భయాందోనళకు గురి చెయ్యదు!

సత్యాన్ని మాత్రమే ప్రభోదిస్తుంది!

సాధన ద్వారా మాత్రమే తెలుసుకోవాలనే ఉద్దేశంతో అవి కొన్ని సందేహాలను రేకెస్తితుంది.

దైవదత్తమైన జ్ఞానంతో మానవుడు, ఆ సందేహాలను నివృత్తి చేసుకోవాలి. అంతేకాని సంశయానికి లోను కాకూడదు. అందుకే సత్యాన్ని తెలుసుకోడానికి, జ్ఞానం చాలా అవసరమన్నారు పెద్దలు.

శాస్త్ర విషయాలలోనే కాకుండా పురాణ విషయాల అవగాహనలో కూడా ఎంతో జ్ఞానం అవసరం. జ్ఞానానికి ప్రతిరూపమైన వ్యాసుడు అష్టాదశ పురాణాలను ఎందుకు రచించాడు? వాటి వెనుక నున్న అసలు సత్యమేమిటి? వాటిలో పేర్కొన్న అంతరార్థమేమిటి? కథలుగా మాత్రమే మనం వాటిని గుర్తిస్తున్నాము. ఒక్కసారి జ్ఞానంతో వాటిని పరికిస్తే అసలు సత్యం మనకు అవగతమౌతుంది. అందుకే ఎన్నో ప్రయాసలకు లోనై వ్యాసుడు ఈ పురాణాలను మనకు అందించాడు.

ఒక్కో పురాణం ఒక్కో భగవత్ తత్వాన్ని ఆవిష్కరిస్తుంది!
ఆ తత్త్వం వెనుక అసలు సత్యం దాగివుంది!
వాటిని కథలుగా పరిగణిస్తే అవి కథలుగానే మిగిలిపోతాయి!

కొన్నాళ్ళకు వాటి ఉనికిని కోల్పోతాయి. వాటిని ఒక జ్ఞాననిధిగా కాపాడుకోవలసిన బాధ్యత, జ్ఞానవంతులపై ఆధారపడి వున్నదన్నది సత్యం. వాటిని వక్రీకరిస్తే మన ఉనికికే నష్టమని మనం తెలుసుకోవాలి.

ఎన్ని రకాలుగా విభజించినా కాలము మాత్రము ఎవ్వరిగురించి ఆగదు. తన పని తాను చేసుకుపోతుంది. ఇంతకీ ఈ కాలము వెనుక నున్న అసలు సత్యము ఏమిటి?

ఏ సత్యానికి లోబడి ఈ విశ్వకాలగమనం నడుస్తున్నది?
కాలగమనుడు ఎవరు?
కాలరూపుడు ఎవడు?
కాలాతీతుడు ఎవడు?
వీటికి సమాధానాలు దొరికితే, ఇక కాలంతో పనే లేదు.

## అధ్యాయం - 16

## మానవమేధస్సు, సాంకేతికత, విషయపరిజ్ఞానం

మానవుడు ఈనాడు ప్రతిదానిని సాంకేతికంగా విశ్లేషణ చేయడానికి ప్రయత్నిస్తున్నాడు. చాలా విషయాల్లో విజయము సాధించాడుకూడా. ఎంత పరిశోధన జరిపినప్పటికిని కొన్ని విషయాల్లో క్లారిటీ సంపాదించలేకపోయేడు.

గుండెను మార్చే పరిజ్ఞానాన్ని సొంతంచేసుకున్నాడు,
కానీ మనస్సును గుర్తించలేకపోయేడు!
వివిధ మనుషల్లో ఉదయించే ఆలోచనా సరళిని పసిగట్టలేకపోయేడు!
మెదడును మార్చే విజ్ఞానాన్ని ప్రదర్శించేడు,
కానీ ఏ మెదడులో ఏ జ్ఞానముందో కనుగొనలేకపోయాడు!

కనిపించని సత్యాన్ని కనుగొనలేకపోయింది మనిషిలో నున్న విజ్ఞానం. ఎన్ని ప్రయత్నాలు చేసినా, ఎన్ని కర్మలను ఆచరిస్తున్నా, ఎన్ని సాంప్రదాయాలను సృష్టించినా, అసలు సత్యాన్ని దర్శించడం కొంతమందికి మాత్రమే సాధ్యపడింది.

ఎన్నో మందులను కనుగొన్నాడు మానవుడు, ఎన్నో కొత్త రోగాలు ప్రతిసవాలుగా ఉత్పన్నమౌతున్నాయి. బాక్టీరియాను అరికట్టేడు, వైరస్ వచ్చింది. మందులేదు. సాధారణ జలుబుకి మందులేదు. దీనికి మందువాడితే వారంరోజులు, వాడకపోతే ఏడు రోజులు అన్న రీతిలో ప్రజలు భావిస్తున్నారు.

ఎన్ని రకాల కాన్సర్ లు వున్నాయో కనుగొన్నాడు గాని, ఏ కాన్సర్ కి పూర్తి నివారణ మాత్రం కనుగొనలేకపోయేడు. అసలు కాన్సర్ రావడానికి కారణం కూడా ఇంకా పరిశోధనలో వుంది. మనిషిలో తెలివితేటలు పెరుగుతున్న కొద్దీ, కొత్త ఛాలెంజెస్ పుట్టుకొస్తున్నాయి.

అలాగే అన్నింటినీ మనకు తెలిసిన సాంకేతికతతో అనుసంధానం చేయలేము. కొన్నింటికి సమాధానాలు ఎప్పటికీ దొరకవన్నది సత్యము. ఒప్పుకొని తీరాల్సిందే తప్పా ఛాలెంజ్ చేయలేము. అలాగే జీవం ఎలా పుట్టిందో అన్న విషయంపై ఇంకా పరిశోధనలు జరుగుతున్నాయి.

జీవము జీవంనుండి ఉద్భవించిందా లేకా నిర్జీవంనుండి ఉద్భవించిందా అన్నదానికి కూడా మనవద్ద సమాధానం లేదు.

సత్యాన్ని దర్శించడానికి మనిషికి ఇంత పరిజ్ఞానం అవసరమా? అన్న ప్రశ్న తలెత్తి శోధించడము మొదలుపెట్టేను. గమ్మత్తైన విషయమేమిటంటే ఆత్మజ్ఞానం పొందటానికి ఎంతో విషయజ్ఞానం అవసరంలేదని తేలింది. లౌకిక చదువుసంధ్యలతో దీనికి ఏమాత్రము సంబంధం లేదని అర్థమైంది.

కావలసిందల్లా సత్యాన్ని తెలుసుకోవాలన్న జిజ్ఞాస, అందుకు అవసరమగు సాధన వుంటే చాలని ఎంతోమంది ముముక్షువుల జీవితచరిత్ర మనకు చెబుతుంది.

ఇటీవల కాలంలో మనకు తెలిసిన – శ్రీ తులసీదాసు, శ్రీ కబీరుదాసు,

శ్రీ రమణమహర్షి, శ్రీ రామకృష్ణ పరమహంస, శ్రీ శారదామాత, శ్రీ ఆనందమయి మాత, శ్రీ మదర్ తెరెస్సా, శ్రీ తాజుద్దీన్ బాబా, శ్రీ గజానన్ మహారాజ్, శ్రీ అమ్మాజాన్, శ్రీ యుక్తేశ్వర్ గిరి, శ్రీ మాణిక్య ప్రభువులు, శ్రీ షిరిడి సాయిబాబా వారు, శ్రీ వాసుదేవానంద సరస్వతి, శ్రీ ఉపాసని బాబా, శ్రీ పరమాచార్య చంద్రశేఖరేంద్ర మహాస్వామి వారు ఇలా ఎంతోమంది సత్యదర్శకులు ఎటువంటి లౌకిక విద్యలను అభ్యసించకుండానే సాధనతో ఆత్మానుభూతి పొందేరు.

భక్తి, జ్ఞాన, వైరాగ్య సాధనే వారిని సత్యదర్శనం చేయించింది. పరమాత్మ మీద అచంచలమైన విశ్వాసమే భక్తి. ఈ భక్తి ఎన్నోరకాలుగా వ్యక్తంచేశారు ఎంతోమంది. ఏ రకంగానైనా కావచ్చుగాని భక్తికి ఆధారం మాత్రము అచంచల విశ్వాసము, ధైర్యంతో కూడిన సహనము. ఈ రెండూ లోపిస్తే భక్తి సాధన మధ్యలోనే నీరసించిపోతుంది.

శ్రద్ధ, సహనాలతో సాధనచేసే భక్తి క్రమంగా అజ్ఞానాన్ని దూరంచేస్తుంది. ఒక విగ్రహంలో లేదా ఒక వ్యక్తిలో చూస్తున్న దైవత్వం క్రమంగా అన్ని వస్తువులలో, అందరిలోనూ, అన్నిచోట్లా కనిపిస్తుంది.

ఈ ఎరుకే జ్ఞానానికి నాంది. అంతా పరమాత్మ మయంగా గోచరిస్తుంది. మాయ, భ్రమలు తొలగిపోతాయి. స్వచ్ఛమైన జ్ఞానం ఉదయిస్తుంది.

సత్యాసత్య విచక్షణ చేయడం మొదలవుతుంది!

ఏది నిజం, ఏది భ్రమ అన్న వివేకంతో వైరాగ్యం సిద్ధిస్తుంది!

భ్రమలు వీడి అసలు సత్యము గోచరిస్తుంది!

శుద్ధ బ్రహ్మ పరాత్పర పరమాత్మ దర్శనం లభిస్తుంది!

మనచుట్టూ వున్న జగత్తు ఎలప్పుడు మారుతూ వుంటుంది. అది జగత్తు యొక్క స్వభావం. అయితే ఇందులో నిత్యసత్యమైన పరమాత్మతత్వము అంతర్లీనంగా దాగివుంది. ఈ జగత్తంతా పరమాత్మ యొక్క విభూతి. ఇది అతని సొత్తు తప్పా ఏ ఒక్కరిది కాదు.

ఇటువంటి దృష్టితో జగత్తును వీక్షిస్తే అంతటా పరమాత్మతత్వమే గోచరిస్తుంది. నేను, నాది అన్న భావన ఉదయించదు. అప్పుడు జీవుడు ఆచరించే అన్ని కర్మలు సహజంగా నిష్కామంగా (ఫలితం ఆశించకుండా) మారిపోతాయి.

అందుకే జ్ఞానులు ఇటువంటి త్యాగబుద్ధితో కర్మలను ఆచరించి ఆత్మజ్ఞానం పొందేరని ఉపనిషత్తులు సూచిస్తున్నాయి.

ఆత్మజ్ఞానమే మోక్షమని శ్రీ ఆది శంకరుల సిద్ధాంతము.

అంటే "జ్ఞానికి సర్వకర్మలు సన్యాసమే" అన్నది ఇక్కడ అంతరార్ధము.

ఆత్మజ్ఞానము పొందకుండా కేవలం సకామంతో(ఫలితము ఆశించి) కర్మమార్గాన్ని అనుసరించువారు, వారివారి కర్మఫలితాన్ని బట్టి పునర్జన్మ తప్పదు అన్నది ఈ సిద్ధాంతంలోని అసలు రహస్యము.

పరమాత్మే పరమార్ధము. జీవుడు తెలుసుకోవలసిందల్లా దానినే. ఆత్మ లేని జీవము లేదు. జీవుని ఇంద్రియాలు ఆత్మను గ్రహించలేవు. మనస్సు కంటే ఆత్మ వేగవంతమైనది. ఆత్మే నిత్యసత్యము.

ఆత్మజ్ఞానము వెలుగువంటిది. అది లేకపోతే అంతా అగమ్యగోచరంగా కనిపిస్తుంది. అప్పుడు మాయ/ అవిద్య/ అజ్ఞానం ఆవహిస్తుంది. కంటికి కనిపిస్తున్నవన్నీ సత్యంగా గోచరిస్తుంది. వాటివెనుక పరిగెడుతూ నిత్యసత్యమైన ఆత్మను గుర్తించలేడు జీవుడు.

# అధ్యాయం - 17

## నేటి యువత - ఆధ్యాత్మిక చింతన

ఆధ్యాత్మిక చింతనని outdated (కాలం చెల్లిపోయింది) గా భావిస్తున్నారు కొంత శాతం యువత. ఇంతకీ దేనికి కాలం చెల్లిపోయింది? అని స్వచ్ఛంగా ఎవరికి వారు ఆలోచిస్తే, మన దృక్పదానికి మాత్రమే, అన్న సమాధానం వస్తుంది.

నిజమేనా? ఒక్కసారి అందరం లోతుగా ఆలోచించి చూద్దాం సమాధానం ఏమని వస్తుందో!

ఆధ్యాత్మికం అంటే ప్రతిరోజూ ప్రొద్దున్నే ఇంట్లో దేవునికి నమస్కరించి బయటకు రావడం కాదు లేదా రోజూ ఒక ప్రార్ధనాస్థలాన్ని దర్శించడంకాదు! ఆధ్యాత్మికం అంటే తన స్వస్వరూపాన్ని తాను తెలుసుకోవడమే! ఇది అన్ని మత విశ్వాసులకు వర్తిస్తుంది.

అసలు మనమెవరమో తెలుసుకోకుండా, భగవంతుణ్ణి తెలుసుకోవడం ఎలా సాధ్యం! ఒక్కసారి ఆలోచిద్దాము!

లోతుగా ఆలోచిస్తే ఈ భక్తి, విశ్వాసాలు భగవంతుని యెడ భయంతో చేస్తున్నామని లేదా అందరూ చేస్తున్నారు కాబట్టి మనం కూడా చేద్దామని లేదా మన పూర్వీకులు ఇలానే చేశారని లేదా ఇది మా ధర్మమని దాన్ని తప్పక పాటించాలని మన మనస్సాక్షి చెపుతుంది. అంతేగా! బాగానే వుంది. మరి అలా చేసుకుంటూ పోతే భగవంతుని దర్శనం మనకు లభించిందా మరి! అసలు ఆయనెవరో అర్ధమయ్యిందా మరి! అందుకే ఆయన్ని అర్ధంచేసుకోవాలంటే మనస్సు, బుద్ధితో పాటు జ్ఞానం కావాలన్నమాట! మనస్సు, బుద్ధి సహజంగా ఆ పరమాత్మ మనకందరికీ ప్రసాదించేడు. కానీ జ్ఞానం?

జ్ఞానం అంటే, ఏదైనా ఒక విషయముపై సంపూర్ణమైన అవగాహన కలిగివుండటం!

జ్ఞానం రెండు రకాలు – భౌతిక జ్ఞానం! ఆధ్యాత్మిక జ్ఞానం!

పదార్ధం యొక్క లక్షణాలు (physical properties) తెలిపేది భౌతిక జ్ఞానం!

పదార్ధము యొక్క చైతన్యాన్ని (Quintessence) తెలుసుకోవడం ఆధ్యాత్మిక జ్ఞానం!

అలాగే, జ్ఞానమనగా శాస్త్రజ్ఞానం. అంటే వేదాలు, ఉపనిషత్తులు, శాస్త్రాలు, పురాణాలు, ఇతిహాసాలు ఇత్యాది వాటిమీద జ్ఞానం వుండటం అన్నమాట!

విజ్ఞానమనగా అనుభవపూర్వకమైన జ్ఞానము (Practical Knowledge). ఆధ్యాత్మికవిద్యకు అనుభవజ్ఞానమే ప్రధానము!

ఆత్మను తెలుసుకొనుటకు జీవునికి జ్ఞానంతో పాటు విజ్ఞానం అవసరము! అనుభవమునకు రాని విద్యవలన ఉపయోగంలేదని, కేవలం శాస్త్రజ్ఞానంతో అసలు సత్యాన్ని గ్రహించలేము.

చాలా జాగ్రత్తగా ఆలోచించాల్సిన విషయం –

ఎలాగైతే మామిడిపూతంతా పండ్లుగా మారవో. ఆధ్యాత్మికసాధన చేసిన సాధకులందరూ పరమాత్మను తెలుసుకోలేరు. చాలామంది మధ్యలోనే రాలిపోతారు. కొంతమంది అజ్ఞానంతో పూతదశలోనే దూరమౌతారు, ఇంకొంతమంది జ్ఞానంతో ముందుకెళ్లి, విషయవాంఛలతో కాయదశలో పట్టుతప్పుతారు.

కారణం –

వారికి ఎంతో శాస్త్రజ్ఞానం వుంటుంది కానీ అనుభవజ్ఞానము వుండదు. కాబట్టి ఈ రెండింటిని జోడించి సత్యమును తెలుసుకోనే ప్రయత్నంచేయాలి. ఒక కార్యమును సాధించుటకు నిర్విరామంగా, పట్టుదలతో చేయు ప్రయత్నమే అభ్యాసము!

తాను గ్రహించిన జ్ఞానంతోనూ, పొందిన అనుభవంతోనూ ఈ అభ్యాసం సాగాలి! ఈ జన్మలో ఏర్పడిన వికారములు, గత జన్మలనుండి సంప్రాప్తించిన విషయవాసనలు జీవునిలో పూర్తిగా తొలగిపోవాలంటే నిరంతర అభ్యాసముద్వారా మనస్సుపై పట్టుసాధించాలి.

శాశ్వతము కానీ ఇంద్రియసుఖముల వెంట నిరంతరం పరిగెత్తు మనస్సుని శాశ్వతము, సత్యమగు పరమాత్మ వైపు మరల్చాలి! జ్ఞానము కలిగిన తరువాత వైరాగ్యముతో కూడిన అభ్యాసము చేయాలి! అనుభవపూర్వక జ్ఞానంతో అన్ని జీవులయందు సమదృష్టి కలిగియుండాలి! ధ్యానంతో ప్రాపంచిక విషయాలనుండి దృష్టి మరల్చాలి! ఆత్మవిచారణతో పరమాత్మను అర్థము చేసుకోవాలి.

భగవంతుడు అంటే ఎవరు? అతని స్వరూపము ఏమిటి?

అతనిని ఎలా చేరుకోవాలి?

యుగాల తరబడి మానవుణ్ణి వేధిస్తున్న ప్రశ్న ఇది!

ఎంత శాస్త్రజ్ఞానమును పొందినా, ఎన్ని అద్భుతాలు చేస్తున్నా, ఎంత సాంకేతికతను వినియోగిస్తున్నా ఈ ప్రశ్న అనాదిగా ఒక ప్రశ్నగానే మిగిలిపోయింది!

దానికి కారణము –

ఒకటీ భగవంతుణ్ని అనుభవ పూర్వకంగా తెలుసుకున్నవారు చాల అరుదుగా వుండటం!

రెండవది భగవంతుదంటే ఎవడో/ఏమిటో అస్సలు తెలియకుండా బోధించేవారు ఎక్కువుగా వుండటం!

మూడవది భగవంతుడిని పూర్తిగా తెలుసుకుందామన్న జిజ్ఞాసగల మనుజులు తక్కువుగా వుండటము!

మనదేశ యువత మెల్లగా ఆధ్యాత్మికతను మర్చిపోతున్నా, విదేశీ యువత మాత్రము దీనిని బాగా అధ్యయనం చేసి, ఎన్నో క్రొత్త విషయాలను తెలుసుకుంటూ ముందుకు పోతున్నారు.

మన యువత మాత్రం పురాణ ప్రవచనాలు దగ్గర ఆగిపోయేరు. పురాణ, ఇతిహాసాలే ఆధ్యాత్మికతకు ఆయువుపట్టుగా భావిస్తూ అసలు సత్యాన్ని విస్మరిస్తున్నారు. హేళన చేసే ప్రశ్నలకు సమాధానం చెప్పలేకా ఆగిపోయేరు. ఎంతో శాస్త్రీయంగా ప్రకటితమైన ధర్మాన్ని సత్యబద్ధంగా మానవాళికి అందించలేకపోతున్నారు.

ఆధ్యాత్మికతకు సత్యమే ఆయువుపట్టు!

సత్యాన్ని గ్రహించడానికి నిష్కామకర్మ, ఆత్మజ్ఞానమే ప్రధాన సాధనాలు!

సత్యమే పరమాత్మ. సత్యంతో కూడిన ధర్మమే ఆచరణీయము!

ఈ విషయాలనే నిర్మొహమాటంగా భోదిస్తుంది సనాతనధర్మము. వేద, ఉపనిషత్, బ్రహ్మసూత్ర, భగవద్గీత రూపంలో వీటిని యావత్ మానవాళికి అందించింది.

అయితే ఆ విషయాలను ధైరంగా చెప్పే ప్రవచనకారులు, ఆధ్యాత్మికవేత్తలు నేటికాలంలో చాలా అరుదు. ఆడంబర కర్మలతో, అనవసర ప్రసంగాలతో ఆధ్యాత్మికత యొక్క మనుగడ వుంటుదనీ నేడు చాలామంది భావిస్తున్నారు.

అది తప్పు. జ్ఞానం మాత్రమే ఈ ధర్మానికి ఆయువుపట్టన్న విషయం బహుశా ఎవ్వరూ చెప్పడంలేదు. అర్ధంలేని కర్మలతో దీన్ని మనమే మెల్లగా అధోగతి పాలుచేస్తున్నామన్న విషయాన్ని విస్మరిస్తున్నాము.

విగ్రహారాధన అనాగరిక చర్యయని ఎంతోమంది హేళన చెయ్యడానికి కారణం ఎవరు?

వివిధరకాలైన నూనెలు, ధూపాలు, మంత్రాలు పేరిట మూఢవిశ్వాసాలను ప్రచారం చేస్తున్నదెవరు?

గవ్వలు, పాచికలు, రంగురాళ్లు, పేరులో మార్పు, శక్తిపాతం పేరిట ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నదెవరు?

మనమే కదా!

పూర్వకాలంలో ఋషులు(ఈ కాలంలో శాస్త్రవేత్తలు) బ్రహ్మపదార్థాన్ని జ్ఞానంతో పరిశోధించి, అసలు సత్యాన్ని అవగతం చేసుకొని, లోకసంగ్రహణార్థమై (అందరి శ్రేయస్సును అభిలషించి) కొన్ని కర్మలను, ధర్మాలను ఉపదేశించుట జరిగింది.

అంటే, అసలు సత్యాన్ని గ్రహించడమే అంతిమ లక్ష్యంగా భావించి వీటిని వారు ఎంతో నేర్పుతో రూపొందించడం జరిగింది. వారికి ఇంకొ ఉద్దేశం వుండేది కాదు. వారికి కులాలు, మతాలు తెలియవు. వారికి తెలిసిందల్లా "సర్వేజనాః సుఖినో భవంతు" మాత్రమే.

అటువంటి మహత్తర ఆశయం తోనే ఆధ్యాత్మికత రూపకల్పన జరిగింది. కొన్ని వేలయేళ్ళ తరబడి జనులు ఎంతో విశ్వాసంతో దానినే నమ్మడం, ఆచరించడం జరిగింది. కారణం ఆధ్యాత్మికత వెనుక సత్యం వుంది కాబట్టీ. సత్యంతో పాటు జ్ఞానం, నిస్వార్ధము వున్నాయి కాబట్టీ.

కాలక్రమేణా ఆధ్యాత్మిక చింతనలో చాలా మార్పులు వచ్చేయి. సత్య, ధర్మ, శాంతి, ప్రేమలు మాయమై స్వార్ధప్రయోజనాలు చోటుచేసుకున్నాయి. ఎన్నో క్రొత్త ఆచారాలు, ఎన్నో క్రొత్త సాంప్రదాయాలు ఆవిర్భవించేయి. సులువుగా అర్ధమయ్యే ఆధ్యాత్మికత ఎంతో క్లిష్టంగా తయారైంది.

ఈ క్రొత్త సాంప్రదాయాల పట్ల నేటి యువతకు చాలా సంశయాలున్నాయి.

అయితే ఈ సమస్య నుండి ఎలా బయటపడాలి? దీనికి సమాధానం తెలుసుకుంటే తప్పా ఈ సమస్యకు పరిష్కారం దొరకదు. ఇలా ఎన్నేళ్లయినా గడిచిపోతాయి. వేలసంవత్సరాలు గడచిపోయేయి కూడా!

కాలానుగుణంగా ఇంత చిన్న సమస్య చాలా పెద్ద సమస్యగా తయారయ్యింది.

ఈ సమస్యను పరిష్కరించే మార్గం లేదా?

ఖచ్చితంగా వుంది!!

జీవుల మనుగడకు, అభ్యున్నతికి తోడ్పడే అనేక కర్మ, జ్ఞాన విషయాలను చాలా లోతుగా పరిశీలించి సకల మానవాళికి అందించింది సనాతనధర్మం. వాటిని ఎలా ఆచరించాలో అన్న పద్ధతిని కూడా, ఎన్నో శాస్త్ర, గ్రంథ, బోధన, గీత రూపాల్లో వ్యక్తంచేసింది.

ఎంతోమంది జ్ఞానధనులు మానవుల అభ్యుదయాన్ని ఆకాంక్షించి, తీవ్రమైన తపనతో ఏళ్ళకొలది తపస్సుచేసి, ఎన్నో విషయాలను పరిశీలించి, ఎంతో పరిశోధించి మనకు ఒక సాధనాక్రమాన్ని అందజేసేరు.

మనుజులకు సంబంధించి ఇందులో ప్రస్తావించని విషయంలేదు. రోజూవారీ వారు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇంద్రియలాలసత్వం, అరిషడ్వర్గాల(కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యము) విజృంభణ, ఈషణత్రయాలు(భార్య, సంతానం, ధనం యెడ మమకారము), గుణత్రయాలు, అసూయాద్వేషాలు, చిత్తచాపల్యం, వక్రబుద్ధి, అహంకారవికారాలు, కర్మఫలితాలు, జననమరణాలు, కర్మవాసనలు, పునర్జన్మ, ఆత్మజ్ఞానం, ఆత్మానుభూతి, జీవన్ముక్తి, ఇలా ఎన్నో ఎన్నెన్నో విషయాలను తెలియజేస్తుంది.

ఇది ఒక విజ్ఞాన గని. దానిని తవ్వుతున్న కొద్దీ క్రొత్త ఆలోచనలను రేకెత్తిస్తుంది, మనకు తెలియని విషయాలను తెలియజేస్తుంది. సాధనావిషయాలను బోధిస్తుంది. ఆయురారోగ్యఐశ్వర్యాలను కలుగ చేస్తుంది. హృదయాన్ని నిర్మల పరుస్తుంది. శాంతిని చేకూరుస్తుంది. బుద్ధిని వికసింపజేస్తుంది. మనోధైర్యాన్ని ప్రసాదిస్తుంది. జ్ఞానాన్ని అభివృద్ధి చేస్తుంది. తుదకు తానెవరో తెలియజేస్తుంది.

వాటిని కూలంకుషంగా అర్థం చేసుకొని, ఆచరించి, అంతిమ లక్ష్యాన్ని సాధించడం అన్నది జీవునిపై ఆధారపడి వుంది.

## అధ్యాయం - 18

## గురుప్రాముఖ్యత, గురుస్వరూపం

ఆత్మజ్ఞానాన్ని పొందేందుకు, అసలు సత్యాన్ని తెలుసుకొనేందుకు ఎంతోమంది మహానుభావులు ఎంతో శోధనచేశారు, ఎన్నో పరిశోధనలు జరిపేరు. ఈ క్రమంలో ఎన్నో ధర్మాలు, అభిమతాలు ఉద్భవించాయి. నేటి మనుషులు వాటికి వివిధరకాల పేర్లుపెట్టి, వివిధమతాలుగా నామకరణం చేశారు అన్ని మతాలలో సారాంశం ఒక్కటైనప్పటికీ, వివిధరకాలైన సాంప్రదాయాలను ప్రచారంలోకి తెచ్చారు.

జ్ఞానవంతులకు వీటివెనుక నున్న అసలు సత్యం అర్ధమైనప్పటికినీ, సామాన్యప్రజలకు మాత్రమూ ఇవన్నీ సంశయాన్ని కలిగించాయన్నది వాస్తవము! ఫలితంగా మనుష్యులు వివిధమతాల వారిగా విడిపోయారు!

అంతేకాకుండా ప్రతిమతంలో కొన్ని కొత్త పోకడలు మొదలయ్యి, విభిన్న వాదులుగా విడిపోయారు. ఫలితంగా, ఒకే సత్యం గురించి వందరకాల భిన్నాభిప్రాయాలు చోటుచేసుకున్నాయి.

అసలు సత్యం మరుగున పడిపోయింది. కులాలు, జాతులు ఏర్పడ్డాయి.

జ్ఞానవంతులు కూడా దీన్ని ఆధారం చేసుకొని, తమ స్వార్థం కోసం ఈ దురభిప్రాయాన్ని ప్రచారం చేసుకుంటూ వారి పబ్బం గడుపుకున్నారు. గురువులుగా ప్రచారం చేసుకున్నారు. కొంతమంది మానవీయతను పూర్తిగా మంటగలుపుతున్నారు.

ముముక్షువులు చెప్పిన విషయాలు మరుగునపడిపోయాయి. కొన్ని కొత్త సాంప్రదాయాలు మెల్లగా చోటుచేసుకుంటున్నాయి. గతరెండు శతాభ్దాలలో ఎంతోమంది మహానుభావులు అవతరించి ఈ ధోరణిని సరిచేద్దామని ప్రయత్నం చేయడం జరిగింది. కొంతమంది వారి బోధనలు గ్రహించి తమ ఒరవడిని మార్చుకున్నారు. కొంతమంది మాత్రం వారిని తప్పుపట్టి ఇంకా అజ్ఞానంలో మగ్గుతున్నారు.

మానవుడు కర్మజీవి. కర్మ చెయ్యకుండా మనుజుడు బ్రతకలేడు.

ఇది గ్రహించిన జ్ఞానులు కొన్ని విహిత కర్మలను మానవులకు ప్రతిపాదించేరు. ఈ విహిత కర్మలను ఆచరించడం ద్వారా మానవులకు చిత్తశుద్ధి కలిగి, తుదకు ఆత్మజ్ఞానం పొందుటకు ఆస్కారం ఏర్పడుతుందని వారి భావన. చాల మంచి ఉద్దేశము.

కానీ మానవుడు కాలక్రమేణా ఈ విహిత కర్మలను తన మనుగడకు అనుకూలంగా మార్చుకొని, వాటికి మార్పులుచేర్పులు చేసుకొని, ఆత్మజ్ఞానం పొందుటకు బదులు కొత్త సంశయాలకు పునాది వేస్తున్నాడు.

విహితకర్మల వెనుక ప్రతిపాదించ బడిన అసలు సత్యాన్ని విస్మరించి, లేనిపోని సమస్యలను ఆహ్వానిస్తున్నాడు.

పరమాత్మ ప్రసాదించిన జ్ఞానాన్ని ఈ రకంగా ఉపయోగిస్తున్నాడు. తద్వారా గందరగోళానికి తెర లేపుతున్నాడు. అజ్ఞానానికి పెద్ద పీటవేస్తున్నాడు. అశాంతికి లోనౌతున్నాడు. ఇదేనా ముముక్షువులు ఉపదేశించినది? వారి అకుంఠిత సాధనకు/శోధనకు పరమార్థం ఇదేనా?

జీవుని జీవితం ఇలా అజ్ఞానంతో ముగిసిపోవలసిందేనా?

సత్యదూరంగా జీవించవలసిందేనా?

పెద్దలు చెప్పిన మాటలు ఎందుకు రుచించడంలేదు?

ఆ దిశగా ఎందుకు ఆలోచించడంలేదు?

ఏరికోరి దుఃఖానికి ఎందుకు చేరువవుతున్నాడు?

ఎన్నో ప్రశ్నలు! ఆలోచించినా తీరని సంశయాలు! అంతుచిక్కని సమాధానాలు! శోధించే తాపత్రయం ఎక్కువైంది!

మంచిని ప్రభోదించే గురువులు దొరకడం లేదా?

సత్యాన్ని ప్రభోదించే గురువులు లేరా?

లేదా వారి కృపకు పాత్రులయ్యే అవకాశాన్ని మనం కోల్పోతున్నామా?

నాకు లభ్యమైన ఎంతోమంది సద్గురువుల జీవితచరిత్రలను చదవడం ప్రారంభించేను.

దేహత్యాగం చేసిన సద్గురువుల బోధనలను పుస్తకరూపంలో గానీ, ఇతరుల ద్వారా గానీ తెలుసుకొని ఆచరించడం చాలామంది చేస్తున్న పనే! సజీవంగా లేదా సాకారంగా దర్శన, స్పర్శ, సంభాషణ భాగ్యాన్ని అనుగ్రహించే గురువుని త్రికరణశుద్ధితో నమ్మి, ఆశ్రయించి, సేవించడం అంత సులభమైన ప్రక్రియ కాదు! దానికి ఎంతో ఆధ్యాత్మిక పరిపక్వత వుండాలి! సత్యశోధన తీవ్రతరమై వుండాలి! ఆత్మస్వరూప జ్ఞానం పూర్తిగా అవగతమై వుండాలి!

సద్గురువులు జీవించి వుండగా వారు తయారుచేసే శిష్యులు బహుకొద్దిమందే!

వారు దేహత్యాగం చేసేకా, వారే మా గురువు అని చెప్పుకునేవారు కోట్లమంది!

దురదృష్టవశాత్తు చాలామంది సద్గురువుల విషయంలో ఇదే జరుగుతోంది! చాలామంది ఇలానే చేస్తున్నారు! ఇది మనందరికీ తెలిసిన విషయమే!

కాస్త ఆలస్యంగా అర్ధమైన విషయం ఏంటంటే –

సద్గురువు దొరకడం అనేది మన తపన, మన ఆలోచన, సత్యమార్గంపై మనకున్న విశ్వాసం పై ఆధారపడివుంటుంది.

సద్గురువులు మన చుట్టూనే వుంటారు!

వారిని గుర్తించలేకపోవడానికి ముఖ్యకారణం మన అహంకారం!

ఒక్కసారి శిష్యునిగా స్వీకరించడం జరిగితే సద్గురువు చెయ్యలేనిదంటూ ఏదీలేదు!

గురువు ముందుగా శిష్యుని మనస్సును పవిత్రం చేస్తాడు! తన శక్తితో శిష్యుని బాహ్యదృష్టిని అంతర్ముఖం చేస్తాడు!

గురువు సూచించిన సాధనతో, ఆత్మే సత్యమన్న విషయాన్ని గ్రహిస్తాడు! ఆత్మానుభూతిని అనుభవిస్తాడు!

ఆత్మరూపంలో గురువు శిష్యునితోనే వుంటాడు! నిత్యం ప్రభోధిస్తూనే వుంటాడు!

ఆ స్థితిలో శిష్యునికి పరమాత్మ–గురువు–తన ఆత్మ ఒకటేనన్న విషయం అనుభవం లోనికి వస్తుంది!

గురువు శరీరత్యాగం చేసిన తరువాత కూడా,

ఈ బంధం ఇలానే కొనసాగుతుంది!

ఇదంతా ఒక పెద్ద ప్రక్రియ! శిష్యుడు ఎన్నో సంశయాలకు లోనవుతాడు!

గురువు కావాలనీ కొన్ని పరీక్షలు పెడతాడు! పరీక్షలకు నిలబడ్డవారిని మాత్రమే తన ప్రణాళికకు ఎన్నుకుంటాడు! వారికి ఆత్మజ్ఞానాన్ని ప్రసాదిస్తాడు! అన్ని విధాలుగా ఆదుకుంటాడు! తనంత వాడిగా చేస్తాడు! గురువు చేసే ప్రతిపని వెనుక ఒక ప్రణాళిక వుంటుంది! దానిని గ్రహించినవాడే అసలైన శిష్యుడు! ఏ సద్గురువుని ఆశ్రయించినా శిష్యుడు వీటన్నింటికీ సిద్ధపడివుండాలి!

ఎలాగైతే సాధకుడు ఎన్నో యేళ్లు సాధనచేసి –

ఒక సద్గురువుని ఆశ్రయిస్తాడో!

అలాగే ఒక సద్గురువు ఎన్నోయేళ్ల తపనతో –

కొంతమందిని తన శిష్యులుగా చేర్చుకుంటాడు!

వారి వారి ఆలోచనా విధానాన్ని బట్టీ,

ఒక సాధనా మార్గాన్ని ప్రసాదిస్తాడు సద్గురువు.

ఆ సాధనా మార్గం నచ్చకా కొంతమంది, ఎంతో జ్ఞానం పొందేనన్న భావంతో ఇంకొంతమంది మధ్యలోనే జారిపోతారు.

స్వంతంగా సాధనచేసి, కొత్త సందేహాలకు సమాధానం దొరక్క సంశయాలతోనే మరణిస్తారు చాలామంది! మళ్ళీ యధాతథంగా జననమరణాలు పొందుతారు!

అందుకే ప్రతి గురువుకి చివరకు మిగిలేది ఒకరిద్దరు మాత్రమే!

ఈ విషయం సద్గురువుకి బాగా తెలుసుకాబట్టి తన ప్రయత్నాన్ని కొనసాగిస్తూ వుంటాడు.

గురుశిష్యుల బంధం తప్పనిసరిగా ఆత్మబంధమై వుండాలి!

ఒకవేళ గురువుకి ఆ శక్తి లేకపోయినా,

శిష్యునికి ఆత్మానుభూతి కలగకపోయినా,

వారి బంధం కేవలం లౌకిక జ్ఞాన సముపార్జనకు మాత్రమే పరిమితమౌతుంది

తప్పా వారిమధ్య ఆత్మబంధం ఏర్పడదు!

గురువుకి తెలిసింది చెబుతాడు, శిష్యుడు ఎంత గ్రహించాలో అంతే గ్రహిస్తాడు! గురువు నచ్చకపోతే శిష్యుడు అతన్ని వదిలేస్తాడు! శిష్యుడు నచ్చకపోతే గురువు అతన్ని తరిమేస్తాడు! ఒకవేళ అలాంటిదేమీ జరగకపోయినా ఆత్మజ్ఞానం మాత్రం సిద్ధించదు.

సద్గురులెవ్వరూ తమ శిష్యులనుండి బౌతికంగా ఏమీ ఆశించరు!

పరమాత్మ తమకు అప్పజెప్పిన కార్యసాధనకు –

కొంతమందిని కార్యోన్ముఖులను చేస్తాడు!

సమాజ శ్రేయస్సు కోసం వారిద్వారా, గొప్ప సందేశాన్ని పదిమందికి చేరవేస్తాడు!

ఆ అర్హతను పొందడానికి శిష్యుడు గురువుకి సర్వస్యశరణాగతి చెందితీరాలి!

సద్గురువు అంతటా శుద్ధ జ్ఞానస్వరూపమైన పరమాత్మతత్వాన్నే దర్శిస్తాడు! ఎల్లప్పుడూ సత్యాన్ని, చైతన్యాన్ని, ఆనందాన్ని అనుభవిస్తూ వుంటాడు!

తాము దర్శించినది, అనుభూతి పొందినది మాత్రమే,

శిష్యులకు బోధిస్తాడు తప్పా అన్యవిషయాలను ప్రస్తావించడు!

అన్నీ చేయగల సామర్ధ్యం వున్నప్పటికీ వైరాగ్యంతో వుంటాడు!

గురుశిష్య పరంపరలో వేషభాషలకు ప్రాముఖ్యతలేదు! ఇదంతా మనం కల్పించుకున్నది మాత్రమే!

గురుశిష్యుల బంధం “పరమాత్మ–ఆత్మ” బంధము!

ఆత్మ నామ-రూప-గుణాలకు అతీతమైనప్పుడు, మధ్యలో ఈ వేషభాషలు ఎందుకు?

గు అంటే గుణాలకు అతీతుడు, రు అంటే రూపాలకు అతీతుడు!

ఇవి భగవంతుని లక్షణాలు కాబట్టీ, గురువంటే భగవంతుడు!

అందుకే గురువు అనగానే అందరూ చెప్పే మొట్టమొదటి శ్లోకం -

గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః

గురు స్సాక్షాత్పర బ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః

అనేక శాస్త్రాలు, సద్గురు ప్రాముఖ్యతను వివరిస్తూ -

బ్రహ్మ స్థానే కృతం పాపం విష్ణు స్థానే వినశ్యతి,

విష్ణు స్థానే కృతం పాపం శివ స్థానే వినశ్యతి,

శివ స్థానే కృతం పాపం గురు స్థానే వినశ్యతి,

గురుస్థానే కృతం పాపం నాస్తి స్థానే వినశ్యతి!

బ్రహ్మవద్ద చేసిన తప్పులు విష్ణువువద్ద చెప్పి దిద్దుకోవచ్చు, విష్ణువువద్ద చేసిన తప్పులు శివునివద్ద చెప్పి దిద్దుకోవచ్చు, శివునివద్ద చేసిన తప్పులు గురువువద్ద చెప్పి దిద్దుకోవచ్చు, గురువు వద్ద చేసిన తప్పులు వేరెవరూ సరిదిద్దలేరు! అని ఘంటాపథంగా తేల్చిచెప్పేసేయి.

## అధ్యాయం - 12

## కొంతమంది సద్గురువులు, వారి బోధ, నేను దర్శించిన కొన్ని గురుస్థానాలు

వివిధసమయాల్లో ఎంతోమంది మహానుభావులు ఈ ధరణిలో అవతరించి, తాము నమ్మిన మార్గాన్ని శ్రద్ధతో ఆచరించి, సత్యాన్ని గ్రహించి, నిస్వార్ధబుద్ధితో, లోకకల్యాణార్ధమై తోటిజనులకు క్రింది మార్గాలను బోధించారు. శ్రద్ధతో ఏ మార్గమును అవలంబించినా అసలు సత్యమును గ్రహించవచ్చు.

నీవు చేసే ప్రతికర్మ నిష్కామంతో ఆచరించు.
త్వరలోనే చిత్తశుద్ధికలిగి జ్ఞానముదయిస్తుంది.
జ్ఞానంతో కూడిన అభ్యాసంతో పరమాత్మని తెలుసుకోవడం ఎంతో సులభము.
తద్వారా ఈ జన్మలోనే జీవన్ముక్తిని పొందగలవు!

– జగద్గురువు శ్రీకృష్ణపరమాత్మ.

అష్టాంగమార్గ విధానంతో ధర్మాన్ని అనుసరిస్తూ, సంఘసేవద్వారా బుద్ధుడవై సత్యాన్ని గ్రహించు! – శ్రీ గౌతమ బుద్ధుడు.

అహింసయే ఉత్తమమైన ధర్మము. అంతకు మించిన ధర్మములేదు. అహింస ద్వారా భగవంతుని తెలుసుకోవడం చాల సులభము! – శ్రీ మహావీర జైన్.

ప్రేమతో కూడిన సమస్తజీవుల సేవద్వారా పరిశుద్ధాత్ముడవై నీ తండ్రిని చేరుకో! – శ్రీ జీసస్ క్రైస్ట్.

భక్తి, జ్ఞాన, వైరాగ్యాలతో ఆ పరమాత్మను అనుక్షణం సేవిస్తే, అతని దివ్యదర్శనము అతి సులభంగా లభిస్తుంది! – శ్రీ మధ్వాచార్యులు.

పరమాత్మను పొందటానికి అందరూ అర్హులే, ఎందుచేతనంటే అందరిని సృష్టించింది ఆయనే. ఆయన నామాన్ని ఆశ్రయించి ఎల్లవేళలా భక్తితో జపిస్తే అతని దివ్యసన్నిధికి అతి సునాయాసంగా చేరుకోవచ్చు!

– శ్రీ రామానుజాచార్యులు.

శాశ్వతం కాని సుఖసంతోషాల మానవులు వివిధకార్యములు చేయుదురు, కానీ "తత్త్వమసి" (ఆ పరమాత్మయే నీవు) అను శృతివాక్యమును మాత్రం నమ్మరు. సమగ్ర జ్ఞానవిచారణతో ఆ సత్యాన్ని సునాయాసంగా గ్రహించవచ్చు – శ్రీ అది శంకరాచార్యులు.

అన్ని జీవులయందు నెలకొనివున్న పరమాత్మ ఒక్కడే! దయ, దాక్షిణ్యాలతో ఆ సత్యాన్ని సులభంగా గ్రహించవచ్చు! – శ్రీ గురునానక్.

శాంతి, సౌభ్రాతృత్యముతో అందరినీ సేవించడం ద్వారా అల్లాహ్ ను దర్శించవచ్చు! – శ్రీ మహమ్మద్ ప్రవక్త (Peace be upon Him).

దారినపోయే దానయ్యను నమ్మెదము, కానీ భగవంతుణ్ణి మాత్రం విశ్వసించము. ఉత్తిష్ఠ! లేచి నిలబడు! అంతటా అతన్ని దర్శించే ప్రయత్నం ప్రారంభించు! – శ్రీ స్వామి వివేకానంద.

నేనే బ్రహ్మమును (అహం బ్రహ్మోస్మి, అయమాత్మా బ్రహ్మ) అని శ్రుతులు పదేపదే చెబుతున్నా జీవులకు నమ్మకం కుదరడంలేదు. కారణము మాయ, అజ్ఞానము. ఇవి పూర్తిగా తొలగితేతప్ప నీలో వున్న "నేను"ని దర్శించలేవు!
– శ్రీ రమణమహర్షి.

శ్రద్ధ, సబూరీలతో నిన్ను నీవు తెలుసుకో. అసలు ఇక్కడికి ఎందుకు వచ్చినట్లు, పిడకలు ఏరుకోడానికా! – సమర్ధ సద్గురువు శ్రీ సాయినాథుడు.

సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింస ద్వార మాత్రమే ఆత్మజ్ఞానము కలుగుతుంది. నీవు ఏ కార్యము చేసినా భగవంతునికి అర్పించు!
– కంచిపరమాచార్య శ్రీ చంద్రశేఖరేంద్ర మహాస్వామి.

ఈ మహాపురుషుల వాఖ్యాలు నా సత్యశోధనకు ఎంతో సహకరించాయి. నాకు లభించిన అవకాశం బట్టీ ఎన్నో "గురుస్థానము"లను దర్శించే అదృష్టం లభించింది.

కాలడి(అది శంకరులు), పిఠాపురం, కురుగడ్డ(శ్రీపాద శ్రీవల్లభులు), కరంజా, గాన్గాపూర్(నృసింహ సరస్వతి), కళ్యాణి, మాణిక్ నగర్(మాణిక్య ప్రభువు), అక్కల్కోట్(స్వామీ సమర్ధ), షేగామ్(గజానన్ మహారాజ్), నాగపూర్(తాజుద్దీన్ బాబా), అహ్మద్ నగర్/మెహెర్ నగర్(మెహెర్ బాబా), సాకోరి(ఉపాసని బాబా), షిరిడి(సద్గురు సాయినాధ్ మహారాజ్), గొలగమూడి(వెంకయ్య స్వామి), టెంబే(వాసుదేవానంద సరస్వతి), అరుణాచలం/తిరువన్నామలై(రమణ మహర్షి), బేలూర్ మఠ్(రామకృష్ణ పరమహంస, శారదా దేవి, స్వామి వివేకానంద),

సారనాథ్, బోధగయ(గౌతమ బుద్ధుడు), శ్రావణ బెళగోలే(దిగంబరుడు), హజరత్ నిజాముద్దీన్(బాబా నిజాముద్దీన్), హజరత్ కి బాల్(శ్రీనగర్, కాశ్మీర్), అమ్రిత్సర్(హర్ మందిర్ సాహిబ్), నాందేడ్(హుజూర్ సాహెబ్),

మంత్రాలయం(రాఘవేంద్ర స్వామి), నెల్లూరు(మస్తాన్ దర్గా),

ఒంగోలు(ఎక్కిరాల భరద్వాజ్), చివటం(చివటం అమ్మ), చీరాల(చీరాల అవధూత), అమ్మాజాన్(పూణే), శాంతినికేతన్(రబీంద్రనాథ్ ఠాకూర్) దర్శించడం జరిగింది.

అన్నిచోట్లా నేను అనుభూతి పొందింది ఒక్కటే –

భగవంతుడు సర్వవ్యాపకుడు! అన్నిచోట్లా, అందరిలో వున్నాడు!

అలా చూసే దృష్టిని మనం సాధన చెయ్యాలి!

ఇది అందరికీ తెలిసిన విషయమే, కానీ అలా జీవించడం కష్టం. ఇదే మానవుని ముందున్న సవాలు. దైవానికి సంబంధించి అన్ని కర్మలూ చేస్తాము, అతన్ని నమ్ముతాం, పూజిస్తాం కానీ అన్నింటా అతనిని చూడ్డం సాధ్యంకాదు అని చేతులెత్తేస్తున్నాడు మానవుడు.

ఎన్నో శాస్త్రాలను అభ్యసించేం, ఎంతో జ్ఞానసముపార్జన చేసాం, వేదాంతం అంతు చూసేం, ఎంతో దక్షతతో అన్ని కార్యాలు నిర్వహిస్తాం, కానీ అంతటా భగవంతుణ్ణి చూడలేము. ఇది అసలు సమస్య.

ఇటువంటి సత్యశోధనతో ముందుకు పోతున్న నాకు –
ఒక రోజు “గురు ప్రత్యక్ష సాక్షాత్కారము” లభించింది!
మనస్సు ఆనందంతో ఉప్పొంగిపోయింది!

# అధ్యాయం - ౨౦

# నా గురుదేవుల మొదటి దర్శనం

అది 2012వ సంవత్సరం జూన్ నెల. ఆఫీస్ పనిమీద ఒడిశా రాష్ట్రంలోని సంబల్పూర్ యూనివర్సిటీకి వెళ్లడం జరిగింది. నేను ఒక Educational Research% కంపెనీ లో జనరల్ మేనేజర్ గా ఉద్యోగం చేస్తున్నాను.

నా రిటర్న్ టికెట్ రెండు రోజుల తరువాత ఢిల్లీ – విశాఖపట్నం ట్రెయిన్ లో, తిట్లగఢ్ జంక్షన్ నుంచి విశాఖపట్నానికి తీసుకున్నాను.

పని అయిపోయిన తరువాత సంబల్పూర్ నుంచి ప్రొద్దునే బయల్దేరి పాసెంజర్ ట్రెయిన్ లో తొమ్మిదింటికల్లా తిట్లగఢ్ చేరుకున్నాను. ఎంక్వయిరీ కౌంటర్ లో ఎవ్వరూ లేరు. ఒక బ్లాక్ బోర్డుపై నా ట్రెయిన్, రైట్ టైములో వస్తుందని వ్రాసివుంది. ఇంకా ట్రయిన్ రావడానికి రెండు గంటల సమయం వుంది.

“ప్రస్థానత్రయం” పుస్తకం చదువుకుంటూ, ప్లాట్ఫారం చివర ఒక దిమ్మపై కూర్చున్నాను. సుమారు ఒక గంటకాలం గడచిపోయింది. ఇంతలో ఒక

వ్యక్తి నన్ను సమీపించి ప్రక్కనే నిల్చున్నాడు. నేను అతన్ని గమనించి పైకి చూసేను.

అతనికి ఇంచుమించు 40 ఏళ్ళు వుంటాయి. పంచ-లాల్చీ ధరించి, నున్నగా గీసిన గడ్డంతో, కొద్ది మీసంతో, మంచి దేహదారుడ్యంతో, మనోహరమైన ముఖవర్ఛస్సుతో, నిరాడంబరంగా వున్నాడు.

సబ్కుచ్ టీఖ్ హై? అని హిందీలో అతడు నన్ను పలకరించేడు.

నేను వెంటనే తేరుకొని, టీఖ్ హై! అని సమాధానం యిచ్చాను.

అతన్ని ఎక్కడ చూసేనా అని ఆలోచించేను. ఎప్పుడూ, ఎక్కడా చూడలేదని నిర్ధానించుకొని మౌనంగా కూర్చున్నాను.

వెంటనే అతడు తెలుగులో, ఏమిటి చదువుతున్నావు? అని అడిగేడు.

మన తెలుగువాడా! అనుకుంటూ, "ప్రస్థానత్రయం" అని బదులిచ్చాను.

ఏమిటి గ్రహించేవు? అని తిరిగి ప్రశ్నించేడు అతడు.

కొద్దిపాటి అసహనంతో, సత్యాన్ని తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నానని సమాధానం చెప్పేను.

చిరునవ్వుతో, ఎటువంటి సత్యం? అని ప్రశ్నించేడు అతడు.

అసలైన సత్యం! అని వ్యంగంగా బదులిచ్చేను.

ఏమిటా అసలైన సత్యం? సన్నని చిరునవ్వుతో తిరిగి ప్రశ్నించేడు అతడు.

కొద్దిపాటి కోపంతో అతనివైపు తీక్షణంగా చూసేను, అతడు కూడా అంతే తీక్షణతో నన్ను చూసేడు. ఆ వర్ఛస్సును తట్టుకోలేక నా కళ్ళు క్రిందకు దించుకున్నాను

నీ ట్రైను నిర్ణీతసమయం కన్నా ఒక గంటా పదిహేడు నిముషాలు ఆలస్యంగా నడుస్తోంది, అంటే అది రావడానికి ఇంకా రెండుగంటల పదినిమిషాల సమయం పడుతుంది. నాతో రా! అలా నడుస్తూ మాట్లాడుకుందాము! అని అతననడం నాకు వినిపించింది.

విస్తుపోయిన నేను వెటకారంగా, అక్కడ బోర్డులో నేను ఎక్కే ట్రెయిన్ రైట్ టైం అని వ్రాసుంది. ఇంకో గంటలో అది ప్లాటుఫారంపైకి వస్తుందని బదులిచ్చేను.

అలా జరిగితే సంతోషమే, కానీ నేను చెప్పింది మాత్రం నిజం! నవ్వుతూ అన్నాడు అతడు.

ఒక్క నిమషం! అని అతనితో చెప్పి, ఎంక్వయిరీ కౌంటర్ దగ్గరకు చేరుకున్నాను. అక్కడ ఎవ్వరూ లేరు. బోర్డుమీద మాత్రం నా ట్రెయిన్ రైట్ టైం అనే వ్రాసుంది. నా మొబైల్ ఇంటర్నెట్ లో KNOW YOUR TRAIN STATUS పరిశీలించేను. నా ట్రయిన్, సరిగ్గా ఒకగంటా పదిహేడు నిముషాలు ఆలస్యంగా నడుస్తున్నట్టు పేర్కొంది.

కాస్త ఆశ్చర్యంతో, అతని దగ్గరకు వచ్చి "మీ మొబైల్ ఒక్కసారి చూపించండి" అని నవ్వుతూ అడిగేను.

"నాకు మొబైల్ఫోన్ వాడవలసిన అవసరం ఇంతవరకు రాలేదు" అని నవ్వుతూ బదులిచ్చేడు అతడు.

అతని దగ్గర ఎటువంటి సామాను లేదు. కేవలం పొట్టి పంచ, లాల్చీ ధరించివున్నాడు. లాల్చీ జేబులో కూడా ఏమీ వున్నట్లు నాకు కనబడలేదు.

ఏమైతే అయ్యిందిలే! అని నిర్ధానించుకొని, అతనితో నడవడానికి అంగీకరించేను.

"నా మాటను మన్నించినందుకు సంతోషం" అని, నన్ను స్టేషనుకి ఆవలి వైపునున్న సన్నని మట్టిరోడ్డుతో వున్న పంట పొలాల్లోకి తీసుకుపోయేడు. నా బ్యాగ్ ని భుజాలకు తగిలించుకొని, నేను అతడ్ని వెంబడించేను.

"దేనిని  తెలుసుకుందామని ఈ పుస్తకాలను చదువుతున్నావు?" అని నన్ను ప్రశ్నించేడు అతడు.

"ఇందాక చెప్పేను కదా, సత్యాన్ని తెలుసుకుందామని" అని సమాధానమిచ్చేను నేను.

"పుస్తకాలు చదవడం వలన సత్యాన్ని తెలుసుకోవచ్చని భావిస్తున్నావా?" అని తిరుగు ప్రశ్న వేసాడు అతడు.

"నాకున్నది అదొక్కటే ఆధారం" అని బదులిచ్చేను నేను. "మంచిది, కానీ ఆ పుస్తకాలను నువ్వు ఖాళీ జ్ఞానంతో చదవాలి" అని బదులిచ్చేడు అతడు.

"ఖాళీ జ్ఞానం అంటే?" ఎదురు ప్రశ్న వేసేను నేను.

అంటే "పసి పిల్లలకు వుండే జ్ఞానం" బదులిచ్చేడు అతడు.

"అర్ధం కాలేదని" టక్కున సమాధానమిచ్చేను.

అందుకు అతడు చిరునవ్వుతో, పసిపిల్లలు అన్నింటినీ ఒకేలా చూస్తారు. వారికి, నిప్పు-నీరు, కోపం-తాపం, మిత్రుడు-శత్రువు, అన్నం-అశుద్ధం, ధైర్యం-భయం, దేవుడు-దెయ్యం, వెలుగు-చీకటి మొదలగు వాటి మధ్య తేడాతెలీదు.

అవును! అయితే? బదులిచ్చేను నేను.

అతను చెప్పడం కొనసాగించేడు

ప్రతి వ్యక్తి ఎదుగుతున్నప్పుడు, పరమాత్మ ప్రసాదించిన తెలివి ఆధారంగా, తన ఇంట్లో ఆచరిస్తున్న సాంప్రదాయాన్ని అనుసరించి, ఎందరో చెప్పగా గ్రహించిన విషయాలను బట్టీ, తనకు ఎదురైన సంఘటనల ఆధారంగా, తాను చదివిన పుస్తక పరిజ్ఞానంతో, తనకు తోచిన విధంగా, దేవునిపై ఒక నిర్దిష్టమైన అభిప్రాయాన్ని ఏర్పరచుకొని, దాన్నే అనుసరిస్తూ, ఆచరిస్తూ ముందుకు సాగిపోతుంటాడు. అన్నీ బాగున్నప్పుడు, నా మార్గం సరైనదని ఆనందిస్తూ, ఇతరులకు కూడా దాన్నే భోదిస్తుంటాడు!

ఎప్పుడైతే పరిస్థితి తారుమారౌతుందో, తాను నమ్మిన మార్గానికి స్వస్తిపలికి, ఇంకో మార్గాన్ని వెతకడం ప్రారంభిస్తాడు!

ఇతరులద్వారా క్రొత్తమార్గాన్ని తెలుసుకొని, దాన్ని అనుసరిస్తూ ముందుకు సాగిపోతుంటాడు! ఇది మానవుల సహజ లక్షణం. ఇది నిజమని అంగీకరిస్తావా?

అని నా వైపు నిశితంగా చూస్తూ ప్రశ్నించేడు అతడు. అతడు చెప్పింది నిజమనిపించింది. ఒప్పుకుంటున్నానని బదులిచ్చేను.

తన సంభాషణ కొనసాగించేడు –

అంతేగానీ పరమాత్మ ప్రసాదించిన జ్ఞానంతో, పరమాత్మను పూర్తిగా తెలుసుకునే ప్రయత్నం మాత్రం చెయ్యడు, బహుకొద్ది మంది తప్పా!

తనలో వున్న ఆత్మను విస్మరించి, పరమాత్మను వెతకడం ప్రారంభిస్తాడు. కొన్ని ప్రదేశాలలో, కొన్ని వస్తువులలో మాత్రమే వున్నాడన్న నిశ్చయానికి వచ్చి, ఒక రకమైన బాహ్యానందానికి లోనై వాటినే నమ్ముకుంటూ, వాటినే ఆరాధిస్తూ జీవితాన్ని గడిపేస్తాడు! అవునా?

నా విషయంలో మాత్రం అలా కాదండీ! కొంచం కోపంతో సమాధానమిచ్చేను. నాకు తెలుసు! అంటూ అతడు నావైపు తిరిగి చిరునవ్వుతో నా కళ్ళల్లోకి ప్రేమగా చూసేడు.

ఏదో తెలియని ఆనందం నన్ను ఆవహించింది. అతని శిరస్సు వెనుక ఒక చిన్న వెలుగు ప్రారంభమై, మెలమెల్లగా వ్యాపించి ఒక చక్రరూపం దాల్చింది. అతని ముఖం దేదీప్యమానంగా వెలిగిపోతోంది!

ఒకపక్క భయంతో మరోపక్క ఆనందంతో నా ఒళ్ళంతా కంపించింది. స్పష్టమైన స్వరంతో –

“నాయనా ఆత్రేయా! అసలు సత్యాన్ని తెలుసుకోవాలన్న నీ తాపత్రయం నాకు ఎంతో ఆనందాన్ని కలిగించింది. పరమాత్మ అనుగ్రహంతో, నీ ఆత్మబోధ ప్రకారం, నువ్వు నీ మనస్సుకి నచ్చిన “జ్ఞానమార్గాన్ని” ఎంచుకోవడం శుభపరిణామము.

మంచి మనస్సుతో చేసే ఏ కార్యమైనా భగవంతునికి ఎంతో ప్రీతికరమైనది. విచారణాత్మక శోధనతో, దృఢమైన సంకల్పంతో, అన్నింటా పరమాత్మను దర్శించే దృక్పథంతో సాధనచేస్తే అసలు సత్యాన్ని గ్రహించగలవు. ఆ పరమాత్మ ఆశీస్సులు నీపై మెండుగా వున్నాయి”

అన్న అతని సందేశం నాకు వినిపించింది.

“మీ ఆశీర్వాదము గురుదేవా!” అని కంపిత స్వరంతో సమాధానమిచ్చేను. అతడు చిరునవ్వుతో, “వెళ్ళు నీ ట్రయిన్ ఇంకో ఇరవైఐదు నిమిషాల్లో స్టేషన్ చేరుకుంటుంది. శుభం భూయాత్! నేను వెళ్ళొస్తాను!”

అని పలికి ఒక మోటార్ సైకిల్ పుంజుకున్న వేగంతో, అతడు ఆ సన్నని దారివెంట ముందుకు సాగిపోయేడు. కొన్ని సెకన్లపాటు ఆ వెలుగు నాకు కనిపించి తరువాత అదృశ్యమైపోయింది.

నేను తేరుకోడానికి రెండు నిమిషాలు పట్టింది. వెనక్కి తిరిగిచూస్తే చాల దూరంలో స్టేషన్ కనబడుతోంది. కొన్ని అడుగుల దూరంలో నా కుడివైపు ఒక చిన్న మందిరం కనిపించింది. వచ్చేటప్పుడు నేను ఆ గుడిని గమనించలేదు. తడబడుతున్న అడుగులతో మెల్లగానడుస్తూ ఆ గుడిని చేరుకున్నాను.

మూడున్నర అడుగుల అమ్మవారి విగ్రహం ఎంతో మనోహరంగా దర్శనమిచ్చింది. అమ్మవారి దర్శనంతో నాలో కొత్తశక్తి ప్రవేశించినట్టు అనుభూతి కలిగింది. అమ్మవారికి నమస్కరించి, ఆమె కాళ్ళపై నున్న కుంకుమను బొట్టుపెట్టుకొని స్టేషన్ వైపు పరిగెత్తేను.

స్టేషన్ చేరేసరికి నా ట్రయిన్ వస్తున్నట్టు ఎనౌన్సుమెంట్ జరుగుతోంది. నాలుగునిమిషాల్లో ట్రయిన్, ప్లాట్ఫారం మీద ఆగింది.

ఎన్నో ఆలోచనలనడుమ, నేను ట్రైన్ఎక్కి నాసీట్లో కూర్చున్నాను. నాది అప్పర్ బెర్త్. ఇంజిన్ చేంజ్ కోసం 20 నిమిషాలాగి 14.35కి తిట్లగఢ్ నుండీ బయలుదేరింది ట్రయిన్.

ఆకలి గుర్తుకొచ్చింది. అంతసేపు ఆగినప్పటికీ తినడానికి ఏదో తీసుకుందామన్న ఆలోచనరాలేదు. కొంతసేపు విశ్రమించి రాయగడ స్టేషన్లో తిందామని నిశ్చయించుకొని, నా బెర్త్ పై నడుంవాల్చేను.

ఆతను నన్ను "ఆత్రేయ" అని, నేను అతన్ని "గురుదేవ" అని సంబోధించడం గుర్తొచ్చింది. ఎందుకు అలా జరిగింది?

బహుశా నాది ఆత్రేయస గోత్రమని అతను అలా అనుంటారు. కానీ నా గోత్రం అతనికెలా తెలుసు? నాకు తెలియకుండానే, నేను అతన్ని గురుదేవ అని ఎందుకు సంబోధించేను?

సమయం వచ్చినప్పుడు గురువు తనంతటతానే తన శిష్యుని వద్దకు వస్తాడన్న నాన్నగారి మాటలు గుర్తొచ్చేయి.

ఇంకా ఎన్నో అర్ధంలేని ప్రశ్నలు నను చుట్టముట్టేయి. కొంతసేపటికి నాకే సిగ్గనిపించింది. నా అజ్ఞానము బయటపడింది. అతనిలో అంత జ్ఞానాన్ని, వర్చస్సుని, తేజస్సుని మనస్ఫూర్తిగా ఆస్వాదించిన పిమ్మట కూడా నాకు ఇలాంటి పనికిరాని అనుమానాలు వచ్చేయంటే అది మాయా ప్రభావమే!

దాన్ని అధిగమిస్తే కానీ సత్యం అవగతమవ్వదన్న గురుదేవుల సందేశం గుర్తుకొచ్చింది.

# అధ్యాయం - 21

# నా పేరులో మార్పు, అన్నప్రసాదం, గురుదేవుల పేరు

"ఆత్రేయ" అన్న గురుదేవుల పిలుపు నన్ను ఆకట్టుకుంది. దాన్ని ఒక ఆశీర్వాదంగా భావించి, నా తల్లితండ్రుల నాకు పెట్టిన "శ్రీనివాస శాస్త్రి" అన్న పేరులో "శాస్త్రి"ని "ఆత్రేయ"తో జోడించి, నన్ను నేను "శాస్త్రి ఆత్రేయ" గా నామకరణం చేసుకున్నాను.

అప్పటినుంచి నా రచనల్లో, సోషల్ మీడియా పోస్టింగ్స్ లో "శాస్త్రి ఆత్రేయ" అని వ్రాసుకోవడం ప్రారంభించేను. ఏదో తెలియని ఆనందంతో మా మధ్య జరిగిన సంభాషణను నెమరు వేసుకుంటూ కళ్లు మూసుకున్నాను.

పెద్ద కుదుపుతో ట్రయిన్ ఆగడంతో ఒక్కసారిగా మెళుకువ వచ్చింది. వాఁచీ చూస్తే సాయంత్రం 07.10గా సూచించింది. ఏ స్టేషనో చూద్దామని క్రిందకుదిగి, ప్లాట్ఫారం పైకి వచ్చేను. "బొబ్బిలి" అని ఎదురుగా బోర్డు కనిపించింది. అంటే సుమారు నాలుగున్నర గంటలు నిద్రపోయేను.

వెంటనే తేరుకొని, ఏమైనా తినడానికి కొనుక్కుందామని దూరంగా నున్న స్టాల్ వైపు పరిగెత్తేను. కానీ Long Horn చేస్తూ ట్రయిన్ ముందుగు కదిలింది. చేసేదిలేక ట్రయిన్ యెక్కి డోర్ దగ్గర నుంచున్నాను.

ఇంతలో, ఆత్రేయా! అంటూ కేకలేస్తూ ఒక వ్యక్తి, నా వైపు పరిగెత్తుకుంటూ రావడం గమనించేను. ట్రయిన్ వేగం పుంజుకొని ప్లాటుఫామ్ దాటేలోపు, ఆ వ్యక్తి పరిగెత్తుకుంటూ నన్ను సమీపించి, ఒక పాలిథీన్ కేరీబ్యాగ్ నాకు అందించేడు.

దాన్ని తీసుకొని "ఏంటిది" అని అడిగేను. ఆవ్యక్తి నన్ను ఆశీర్వదిస్తున్నట్టు చెయ్యిపైకెత్తి నవ్వుతూ నిల్చున్నాడు.

అతడు సన్నగా, చేమంచాయ రంగులో, కొద్దిగా మాసిన గడ్డంతో, తెల్లటి లాల్చీ, పైజామా వేసుకున్నాడు. ట్రైన్ ముందుకు సాగిపోతోంది. నేను కూడా చెయ్యిపైకెత్తి టాటా చెబుతూ, ఆ వ్యక్తి నాకు కనిపించేంతవరకు డోర్ దగ్గర నుంచున్నాను.

వెనక్కి జరిగి ఆ బ్యాగులో ఏముందో అని విప్పి చూసేను. పప్పు, సాంబారు, కూర, పెరుగు ప్యాకెట్లతో పాటూ, విస్తరాకులో కట్టిన అన్నం ఒక పేపర్తో చుట్టబడి వుంది. నా ఆశ్చర్యానికి అంతులేదు. తినడానికి కుదరలేని నాకు, ఆ వ్యక్తి ఆఖరినిమిషంలో ఈ మీల్స్ ప్యాకెట్ ఇవ్వడమేంటి! ఆ వ్యక్తి ఎవరు? బహుశా నా గురుదేవులే ఆ వ్యక్తి రూపంలో వచ్చేరా? ప్యాకెట్ ఇచ్చి ఆశీర్వదిస్తున్నట్టు చెయ్యి కూడా పైకెత్తేరు.

ఎన్నో ఆలోచనలతో నా బెర్త్ మీద కూర్చొని, అన్నం పొట్లం విప్పి పప్పు కలుపుకొని తినడం ప్రారంభించేను. అన్ని పదార్థాలు వేడిగా, రుచిగా వున్నాయి. చాలా సంతృప్తిగా అన్నీ తినేసాను. నా బ్యాగ్ లో నున్న మంచినీళ్ల బాటిల్ తీసి నీళ్లు త్రాగేను.

ఒక్కసారి ప్రాణం లేచొచ్చినట్టయింది. మనస్ఫూర్తిగా నా గురుదేవులను తలచుకొని కృతజ్ఞతతో ప్రణామాలు అర్పించేను. కళ్ళుమూసుకొని గురుదేవులను ధ్యానిస్తూ బెర్త్ మీద కూర్చున్నాను. రాత్రి 09.25 గంటలకు ట్రైన్ వైజాగ్ చేరుకుంది.

ట్రైన్లో ఎక్కువసేపు నిద్రపోవడం వలన, ఆ రాత్రి సరిగా నిద్రపట్టలేదు. ఆలోచిస్తూ గడిపేను. ఒక్కసారిగా అనిపించింది, ఇంతకీ గురుదేవుల పేరేంటి? నేను ఎందుకు అడగలేదు? ఎలా మర్చిపోయేను? తప్పు చేసేనా? ఎవరైనా నీ గురువుగారి పేరేంటి, అని అడిగితే ఏంచెప్పాలి? ఇలా ఎన్నో ఆలోచనలు నన్ను చుట్టముట్టేయి.

కొంతసేపటికి మనసు కుదుటపడి, గురుదేవులు గురుదేవులే! పేరుతో పనేముంది!

పేరు తెలిసినప్పటికీ, నేను ఆయన్ని పేరుపెట్టి పిలవలేనుగా! అన్న ఆలోచనవచ్చి మనసు కుదుటపడింది. కానీ గురువుగారి పేరు ఏమైవుంటుందబ్బా? అన్న సంశయం మాత్రం వెంటాడసాగింది.

ఎప్పుడు నిద్రపట్టిందో తెలియదు, ఉదయం ఏడు గంటలకు మెలుకువ వచ్చింది. పదిన్నర గంటలకు గాజువాకలో ఒక ఎపోయింట్మెంట్ వుంది. స్నానంచేసి రెడీ అయ్యాను. అన్ని విషయాలు నా శ్రీమతికి చెబుదామనుకున్నాను, కానీ టైం లేకపోవడంవలన, విపులంగా సాయంత్రం చెబుదామని నిశ్చయించుకొని, బైక్ మీద బయలుదేరెను.

NAD జంక్షన్లో Red సిగ్నల్ పడడంవలన బండి ఆపేను. ఆగిన ఒక నిమిషానికి ఒక ముసలాయన నా దగ్గరకువచ్చి నవ్వుతూ – నీ గురువుగారిని మేమంతా “బాబాజీ” అని పిలుస్తాము, నేను అతని శిష్యుడిని, అని నన్ను దాటుకుంటూ వెనక్కి వెళ్ళిపోయేడు.

నేను బైక్ స్టాండ్ వేసి వెనక్కి తిరిగేలోపే, Green సిగ్నల్ పడి నా వెనకాల వున్నవాళ్లు Horn కొట్టండం మొదలుపెట్టేరు. చేసేదిలేక బైక్ స్టార్ట్ చేసి సిగ్నల్ క్రాస్ చేసి, ఒక కిలోమీటర్ ముందుకుపోయి యూటర్న్ తీసుకొని అతన్ని కలుద్దామని వెనక్కివచ్చేను.

Opposite రోడ్డులో బైక్ పార్కుచేసి, అతని గురించి చాలసేపు వెతికేను, కానీ ఎక్కడా కనిపించలేదు. ఎన్నోసార్లు NAD దగ్గర ఆగేనుకానీ అతన్ని ఎప్పుడూ చూడలేదు. టైం లేకపోవడం వలన మళ్ళీ యూటర్న్ తీసుకొని గాజువాకకి బయలుదేరేను.

గురుదేవుల పేరు "బాబాజీ" అని తెలిసినందుకు ఎంతో సంతోషించేను. నా సంశయం తీర్చడానికి తన శిష్యుణ్ణి పంపినందుకు, గురుదేవులకు నా ప్రణామములు అర్పించేను. రోజులు గడుస్తున్నాయి. నాలో ఆధ్యాత్మిక చింతన పెరుగుతోంది. స్వర్గస్తులైన నా తండ్రిగారి నుండీ గ్రహించిన భక్తి, జ్ఞానమార్గాల విశిష్టత, నన్ను ఎంతో ప్రభావితం చేసిన శ్రీ శంకర భగవత్పాదుల జ్ఞానసిద్ధాంతము, ఇప్పుడు నా ఆలోచనా సరళిని గ్రహించి, నన్ను జ్ఞానమార్గాన్ని అవలంబించమన్న గురుదేవుల ఆదేశం, నాలో ఆధ్యాత్మిక చింతనకు పునాది వేసింది.

"అన్నింటా, అన్ని జీవులలో పరమాత్మ ఉనికిని గుర్తించి, మంచి మనస్సుతో, నిస్వార్థంగా చేసే ప్రతీ ప్రయత్నం జ్ఞాన–విజ్ఞాన యోగములే" అన్న చాల సరళమైన గురుదేవుల సందేశం నన్ను ఎంతో ఆకట్టుకుంది.

ప్రపంచంలో నున్న అన్ని విశ్వాసాలు, అన్ని ఆధ్యాత్మిక గ్రంథముల సారాంశమిదే! దీనిని గ్రహించడానికి ఎటువంటి శాస్త్రపరిజ్ఞానం అవసరంలేదు. ఈ జ్ఞానబీజాన్ని ప్రతి వ్యతిలోను ఒక ప్రసాదంగా ప్రతిష్టించేడు ఆ పరమాత్మ. విచారణాత్మక శోధనతో, ధృఢమైన సంకల్పంతో "అసలు సత్యాన్ని" గ్రహించడమే మానవుడు చేయాల్సిన పని. అదే మానవ కర్తవ్యం.

అందుకు అడ్డుపడే మాయ/తమస్సుని, జ్ఞానము అనే ఆయుధంతో జయించాలి. అప్పుడు సత్యము అవగతమౌతుంది. అనుభవపూర్వకమైన జ్ఞానమే, విజ్ఞానయోగమని హెచ్చరించేరు గురుదేవులు!

ఇక వారి ఆదేశాన్ని త్రికరణశుద్ధిగా సాధనచేయడము శిష్యునిగా నా కర్తవ్యము. గురువు యొక్క విశిష్టతను సమూలంగా తెలుసుకుంటే గాని గురుదర్శనం లభించదని ఎంతోమంది పెద్దలు చెప్పగా విన్నాను.

ఎంతో మంది గురువులు, అనేక సమయాల్లో ఈ లోకంలో అవతరించి, ఎంతోమంది సత్యాన్వేషకులను ఉద్ధరించడం జరిగింది. అంతేకాక ఎంతోమందిని సత్యమార్గం వైపు నడిపించడం జరిగింది.

ఇదివరకటిలా కాకుండా, ఇప్పటి కాలంలో – మంచి–చెడు, ప్రేమ–ద్వేషం, దైవత్వం–దానవత్వం, స్నేహం–శత్రుత్వం, కృతజ్ఞత–కృతఘ్నత అనే భావాలు ఒకే వ్యక్తిలో, సమయసందర్భాలబట్టీ వ్యక్తమవుతుంటాయి.

చెడ్డవారిని చంపి, మంచివారిని రక్షించడం కుదరదు. ఎందుకంటే అందరూ కొన్ని విషయాల్లో మంచివారే, అలానే అందరూ కొన్ని సందర్భాలలో చెడ్డవారే.

భగవంతుడు అవతరించి చెడ్డవారిని చంపడం మొదలుపెడితే, ఒక్క మంచివాడు మిగలడు. కావునా అందరిని సన్మార్గం వైపు నడిపించడమే తక్షణ కర్తవ్యం.

ఆపని చేయగలిగిన సమర్థుడు గురువు మాత్రమే! అందుకే ఇది సద్గురువుల యుగం. ఈ మాయా కాలంలో నేరుగా పరమాత్మను గ్రహించడం చాల కష్టం! అందుకు ఓ మార్గదర్శి కావాలి!

ఆ మార్గదర్శే సద్గురువు. ఎంతోమంది కపటగురువులున్న ఈ కాలంలో, ఒక సద్గురువు లభించడం చాలా కష్టం! నాకు తెలిసినంతవరకు, సద్గురు పరంపరలో – దక్షిణామూర్తి, హయగ్రీవుడు, దత్తాత్రేయులు వంటి అవతార గురువులు!

బృహస్పతి, శుక్రాచార్యుల వంటి దైవాసుర గురువులు!

వసిష్ఠ, విశ్వామిత్ర, సాందీపని ఇత్యాది దేవగురువులు!

శ్రీ బాబాజీ, శ్రీ మధ్వాచార్య, శ్రీ శంకరాచార్య, శ్రీ రామానుజాచార్య వంటి జ్ఞానగురువులు!

శ్రీపాద శ్రీవల్లభ, గురునానక్, శ్రీ నృసింహసరస్వతి వంటి పరమగురువులు!

లాహిరి మహాశయులు, యుక్తేశ్వర గిరి, ప్రభు చైతన్య, రామకృష్ణ పరమహంస, శారదా దేవి, వివేకానంద, మళయాళ స్వామి, రామానంద, దయానంద, యోగానంద, అమృతానంద మాయి, రమణ మహర్షి, చిన్మయానంద, భక్తి వేదాంత ప్రభుపాద, శివానంద, రబింద్రా నాథ్, అరోబిందో, నిత్యానంద, మాణిక్య ప్రభు, స్వామి సమర్ధ, గజానన్ మహారాజ్, గొండా మహారాజ్, ధునీవాలా దాదా, వాసుదేవానంద, శిరిడీ సాయినాథుడు, తాజుద్దీన్ బాబా, ఉపాసని బాబా, మెహెర్ బాబా వంటి సద్గురువులు! ఈ ధరణిలో అవతరించి, సమయానుకూలంగా గురుబోధ చేస్తూ, నమ్మినవారిని సత్యమార్గం వైపు నడిపించేరు.

కాబట్టీ ఈ గురు తత్త్వం అనాదిగా, అభిమతాలకు అతీతంగా వస్తున్నది. దాన్ని మనుజులు తమ జ్ఞాన సంపత్తిని బట్టీ విభిన్న సంప్రదాయాలుగా అభివర్ణించేరు. వీరందరి చరిత్రలను దొరికినంత మట్టుకు అధ్యయనం చేయడం ప్రారంభించేను.

కాలము ముందుకు సాగిపోతోంది. గురుదేవుల సందేశాన్ని, సాధన చెయ్యడం మొదలుపెట్టేను. సాధన చేస్తున్నకొద్దీ కొత్త సందేహాలు రావడం, ఎదో ఒక రూపంలో వాటికి సమాధానాలు దొరకడం జరుగుతుండేది.

ఇదంతా గురుదేవుల ఆశీర్వాదంగా భావిస్తూ ముందుకు సాగిపోయేను.

మరొక్కసారి గురుదేవులను ప్రత్యక్షంగా దర్శించి సంభాషించాలన్న కోరిక నాలో బలంగా నాటుకుంది. ఆ అవకాశం ఎప్పుడు దొరుకుతుందా! అని ఆశగా ఎదురుచూసేవాణ్ని.

# అధ్యాయం - 22

# దత్తక్షేత్రాలలో గురుదేవుల పరోక్ష సందేశం

2012 నవంబర్ నెలలో ఆఫీస్ పనిమీద నేను గుల్బర్గా వెళ్లడం జరిగింది. ఆంధ్రా–కర్ణాటక బోర్డర్లో, హైద్రాబాద్ నుండి సుమారు 210 Kms దూరంలో వుంది గుల్బర్గా. దీన్నే "కాలాబురగి" అని కూడా అంటారు. గుల్బర్గా యూనివర్సిటీలో నాపని ఒక్కరోజులో అయిపోయింది. వచ్చే రెండురోజులు శని, ఆది వారాలు కావడం వలన మరొక్కసారి దగ్గరలో నున్న గాణ్గాపూర్ గురుస్థానాన్ని (దత్తావతార శ్రీ నృసింహ సరస్వతి స్వామి వారి పాదుకా క్షేత్రం) దర్శించాలని అనిపించింది.

శ్రీ నృసింహ సరస్వతి స్వామివారు (శ్రీ గురుడు అని కూడా పిలుస్తారు) కలియుగంలో రెండవ దత్తావతారంగా పరిగణించబడ్డారు. ఇతను కరంజా గ్రామం, మహారాష్ట్ర లో అవతరించి ఆంధ్రప్రదేశ్ శ్రీశైలం పుణ్యక్షేత్రంలో (శ్రీ మల్లిఖార్జున జ్యోతిర్లింగం మరియు శ్రీ భ్రమరాంబ శక్తిపీఠము) కృష్ణానదిలో అంతర్హితులయ్యేరు.

మొదటి దత్త అవతారం శ్రీపాద శ్రీ వల్లభులు! ఇతను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గల పిఠాపురం గ్రామంలో అవతరించి కురుగడ్డ లేదా కురువపురంలో (కర్ణాటక రాష్ట్రం) దేహత్యాగం చేసేరు.

ఆ మఱునాడు ఉదయం 07.30కి గుల్బర్గ నుండి బస్సులో ప్రయాణించి 09.00కి గాణ్గాపూర్ చేరుకున్నాను.

ఆటోఎక్కి సంగమానికి (భీమా–అమరజా నదుల సంగమ స్థానం) చేరుకున్నాను. శ్రీగురుడు ప్రతిరోజూ తన అనుష్టానమంతా అక్కడే చేసి, ఆపై క్షేత్రానికి వెళ్లేవారు.

శ్రీ గురుడు పేరుమీద ఈ క్షేత్రాన్ని "శ్రీ క్షేత్రము" అని కూడా అంటారు. శ్రీ గురువు ఇక్కడ ఎన్నో లీలలు ప్రదర్శించి, ఎంతోమందికి ఇహపరసుఖములు ప్రసాదించి, వారిని సత్యమార్గంలో నడిపించేరు. అన్ని అభిమతాలు వారు అతనికి శిష్యరికం చేసి ధన్యతగాంచేరు.

మరాఠీ లో శ్రీ గంగాధర సరస్వతి రచించిన "శ్రీ గురుచరిత్ర" గ్రంధంలో, శ్రీ గురుని అత్యద్భుతలీలలను మనము గ్రహించవచ్చు.

భక్తులు శ్రీ గురుని ప్రత్యక్ష పాదుకలను దర్శించేముందు, భీమా–అమరజా నదీ సంగమంలో స్నానమాచరించి, గురుదేవుల కాలంనుండి వున్న పెద్ద రావిచెట్టు క్రింద "శ్రీ గురుచరిత్ర" పారాయణ చెయ్యడం, ఇక్కడ అనాదిగా వస్తున్న సాంప్రదాయము.

నేను కూడా ఆ పవిత్ర సంగమంలో స్నానమాచరించి, ఆ అశ్వద్ధవృక్షం నీడన ధ్యానంలో కూర్చున్నాను. కొంతసేపటికి ఇదివరకెన్నడూ పొందని, ఓ బ్రహ్మానంద స్థితిలోకి నన్ను తీసుకుపోయింది నా అంతరాత్మ. ఎవరో గట్టిగా కుదిపిలేపినట్లు అనిపించి కళ్లుతెరిచేను. ఎదురుగా డబ్భైయేళ్లు పై బడిన ఒకాయన సన్యాసి వస్త్రధారణలో దర్శనమిచ్చేడు.

నేను కళ్ళుతెరవడం చూసి, హిందీభాషలో

"నీ ధ్యానం భగ్నం చేసినందుకు నన్ను క్షమించు! ఇది గుర్వాజ్ఞ! తప్పదు మరి! కొద్దిసేపట్లో నివేదన నిమిత్తం మందిరం ఒక గంటసేపు మూసివేస్తారు! భక్తులు చాలామంది వున్నారు! గురుపాదుకలను దర్శించినపిమ్మట నీ తదుపరి కార్యక్రమం గురుదేవులు నిర్ణయిస్తారు!" అని చెప్పి సంగమం వైపు వడివడిగా నడుచుకుంటూ వెళ్ళిపోయేడు.

నేను అతన్ని ఆపుదామని అనుకున్నాను గాని ఎందుకో విరమించి, రోడ్డుపైకొచ్చి ఒక ఆటోని మాట్లాడుకొని మందిరం చేరేను. చాలామంది భక్తులు క్యూలో వున్నారు. నేను కూడా క్యూలో నిలబడ్డాను.

సుమారు ఒక ఐదునిమిషాల తర్వాత ఒక వ్యక్తి (మందిర పూజారిలా పంచకట్టీ, పైన కండువా వేసుకున్నాడు) నన్ను సమీపించి "నాతో రండి, శ్రీగురుని దివ్య పాదుకలను దర్శించుకుందురు" అని కన్నడ యాసలో తెలుగులో చెప్పేడు.

ఒకింత ఆశ్చర్యానికి గురై, మారుమాట్లాడక అతన్ని వెంబడించేను. అతను దగ్గరుండి గురుపాదుకులను తనివితీరా దర్శింపజేసి, నాతోపాటు బయటకు వచ్చేడు.

కొంత కారాబాత్ (కొద్దిగా కారంగా వున్న అన్నప్రసాదము) పొట్లం నా చేతిలోపెడుతూ "నేను ఈ క్షేత్రంలో ఒక పూజారిని, మీరు తక్షణమే అక్కల్కోట వెళ్లి , స్వామి సమర్థ మందిరాన్ని దర్శించండి, అంతా మంచే జరుగుతుంది" అని పలికి, నన్ను సాగనంపి, మందిరంలోకి వెళ్ళిపోయేడు.

అప్పటికి టైం మధ్యాహ్నాం ఒంటిగంటయింది. నేను అతని మాటలను మననంచేసుకుంటూ, మెయిన్రోడ్డు చేరుకున్నాను. "అక్కల్కోట్, అక్కల్కోట్" అని ఒక టెంపో ట్రావలర్ డ్రైవర్ అరుస్తున్నాడు. ఇంకేమి ఆలోచించకుండా

వ్యాన్లో కెక్కి ఒక సీట్లో కూర్చున్నాను. ఐదారు సీట్లు తప్పా అన్నింట్లో పాసెంజర్స్ కూర్చున్నారు. ఇంకో ఇద్దరిని ఎక్కించుకొని వ్యాన్

బయల్దేరింది. మధ్యలో నాలుగైదు చోట్ల ఇంకొందరిని ఎక్కించుకొని సాయంత్రం 04.25 గంటలకు అక్కోల్కోట్ మందిరం దగ్గరలో వ్యాన్ ఆగింది.

స్వామి సమర్థ సద్గురువుని "అక్కల్కోట్ మహారాజ్" అని కూడా పిలుస్తారు. వీరి చరిత్ర నేను చదివేను. చాలా అద్భుత లీలలు ప్రదర్శించేరు. కలియుగంలో వీరు నాల్గవ దత్తావతారంగా కీర్తింపబడ్డారు. మూడవ దత్తావతారంగా శ్రీ మాణిక్య ప్రభువులు, ఐదవ దత్తావతారంగా శ్రీ శిరిడి సాయిబాబా వారు కీర్తింపబడ్డారు.

అక్కల్కోట్ రావడం ఇదే మొదటిసారి. ఒక్కసారి తేలికబడి స్వామి సమర్థ మందిరాన్ని దర్శిద్దామని రూమ్ కోసం వాకబు చేసేను. మందిరానికి ఎదురుగా పాత వసతిగృహం, కొద్ది దూరంలోనే చాలపెద్ద కొత్త వసతిగృహం ఉన్నాయని తెలిసింది. అక్కడే వచ్చిన భక్తులకు ఉచిత భోజనసౌకర్యము యేర్పాటు చేయడం జరిగిందని ఆలయ సిబ్బంది ద్వారా తెలుసుకున్నాను. మందిరానికి దగ్గరగా వుంటుందని ఎదురుగా నున్న పాత వసతిగృహంలో ఒక రూమ్ తీసుకున్నాను.

స్నానంచేసి మందిరంలోకి ప్రవేశించేను. జనానికి ఎంతో సౌకర్యంగా దర్శన ఏర్పాట్లు చేసేరు. స్వామి సమర్థ గురుదేవుల విగ్రహం ఎంతో అందంగా పూలతో అలంకరించబడివుంది. తనివితీరా దర్శనం చేసుకొని, ఒకమూల ధ్యానంచేసుకుందామని కూర్చున్నాను. ఒక గంటసేపు ధ్యానం చేసుకొని, కొత్త వసతిగృహానికి భోజననిమిత్తమై బయలుదేరేను.

అక్కల్కోట్ ఒక చిన్న పట్టణం. పూర్వం రాజపరిపాలనలో వుండేది. దానికి చిహ్నంగా ఒక కోట కూడా వుంది. నడుచుకుంటూ కొత్త వసతిగృహానికి

చేరుకున్నాను. పెద్ద బిల్డింగు మంచి ప్లానుతో కట్టేరు. వేరుగా నిత్య అన్న సంతర్పణకు పెద్ద హాల్ నిర్మించేరు. భోంచెయ్యడానికి టేబుల్స్, కుర్చీలు అమర్చేరు.

రోజుకి కనీసం పదివేలమంది ఈ ఉచిత భోజనం చేస్తారని, భోజనం చాల బాగుంటుందని భక్తులద్వారా తెలుసుకున్నాను. ఒక మూల నా బూట్లు, సాక్స్ వదిలి భోజనం క్యూలో నించున్నాను. ఒక్క విడతన కనీసం మూడువందలమందిని భోజనానికి వదులుతున్నారు. రెండో రౌండ్లో నేను భోజనానికి కూర్చున్నాను. చపాతీలు, కూర, అన్నం, పప్పు, మజ్జిగ కావలసినంత వడ్డించేరు. ఇవి రాత్రి ఐటమ్స్. ఉదయం వీటితోపాటు ఒక స్వీట్, సాంబారు అదనం అని తెలుసుకున్నాను. తృప్తిగా భోంచేసి, బూట్లు వదిలిన చోటుకి వచ్చేను. అక్కడ బూట్లు కనిపించలేదు. కొద్ది అసహనానికి లోనయ్యేను.

ఇంతలో నాలాగే ప్యాంటు, షర్ట్ వేసుకున్న ఒక యువకుడు, చిరునవ్వుతో హిందీభాషలో చాలా స్పష్టంగా, అన్నగారూ! కొద్ది సేపటినుంచి నేను మీకోసమే ఎదురుచూస్తున్నానంటూ నా బూట్లు చూపెడుతూ –

“గురుదేవులు బాబాజీ మహాశయులు మిమ్మల్ని వచ్చే జనవరి నెలలో అలహాబాద్ లో జరుగు మహాకుంభమేళాలో కలుస్తారు. అందుకు తగిన ఏర్పాట్లుచేసుకోండి. ఈ విషయాన్ని మీకు తెలియజెయ్యమని గురుదేవుల ఆజ్ఞ! శుభం భూయాత్!”

అని పలికి వేగంగా నడుచుకుంటూ బిల్డింగ్ లోనికి వెళ్ళిపోయేడు. ఆశ్చర్యంతో నేను అతను కనుమరుగయ్యేంత వరకు చూస్తూ నించున్నాను.

## అధ్యాయం - 23
## క్షేత్రదర్శనం, కుంభమేళాలు, మహాకుంభమేళాలు, విశిష్టత

అతని మాటలు నా మదిలో స్పష్టంగా నాటుకుపోయేయి. గురుదేవులను కలుసుకోవాలన్న నా కోరికను మన్నించి, ఈ శిష్యునిద్వారా నాకు సందేశాన్ని పంపిన నా పూజ్య గురుదేవులు బాబాజీ మహాశయుల్ని మానస స్మరించుకొని, కృత్జ్ఞతలు సమర్పించుకొని, బూట్లు వేసుకొని, ఆనందం నిండిన హృదయంతో, నడుచుకుంటూ నా వసతికి చేరుకున్నాను.

రూమ్ కి చేరుకునేసరికి రాత్రి 09.45 అయ్యింది. మనస్సంతా ఉల్లాసంగా వుంది. జనవరిలో గురుదేవుల దర్శనం లభిస్తుందని తెలియడంతో ఒళ్ళంతా పులకరించింది. గురుధ్యానం చేద్దామని నేలమీద దుప్పటి పరిచి పద్మాసనంలో కూర్చున్నాను. ఒక అరగంటసేపు ధ్యానం చేసుకున్నాను.

రాణీఖేత్, హృషీకేశ్, వారణాసి, ప్రయాగ, పూరీ, పిఠాపురం, కురుగడ్డ, కరంజా, గిర్నాడ్, మాహెూర్, గాణ్గాపూర్, హుమ్నాబాద్, షేగామ్, గరుడేశ్వర్, గణేశపురి,

ఖాండ్వా, నాగ్పూర్, అక్కల్కోట్, శిరిడి, సాకోరి, మెహెర్ నగర్, దక్షిణేశ్వర్, అరుణాచలం వంటి పవిత్ర గురుస్థానములలో చేసే ధ్యానం వెంటనే ఫలితాన్నిస్తుంది.

మరునాడు ఆదివారం. సుమారు 40KMs దూరంలో వున్న షోలాపూర్ చేరుకుంటే, అక్కడనుండి హైదరాబాద్ కి ఎన్నో ట్రైన్స్ వున్నాయి కాబట్టీ, IRCTC మొబైల్ App లో ఆదివారం రాత్రి పదింటి ట్రైన్ కి తత్కాల్ లో బెర్త్ రిజర్వు చేసుకున్నాను.

ఆదివారం రాత్రి దాకా సమయం వుందిగాబట్టి, షోలాపూర్ కి సుమారు 50 KMs దూరంలో నున్న తుల్జాపూర్ పట్టణంలో, ఎంతో శక్తివంతమైన క్షేత్రంగా ప్రసిద్ధిగాంచిన "తుల్జా భవాని" అమ్మవారిని దర్శించుకోవాలని నిర్ణయించుకొని నిద్రకుపక్రమించేను.

ప్రొద్దున్న ఐదింటికి మెళుకువవచ్చింది. రెడీ అయ్యి, రూమ్ చెక్అవుట్ చేసి, మరొక్కసారి గురు సమర్ధులను దర్శనం చేసుకొని, బస్సు స్టాండుకి చేరుకున్నాను. ప్రతి పావుగంటకి షోలాపూరుకి బస్సు సౌకర్యం వుంది. ఒక బస్సులో బయల్దేరి షోలాపూర్ చేరుకున్నాను. అల్పాహారం తీసుకొని తుల్జాపూర్ వెళ్లే బస్సులో కూర్చున్నాను.

ఉదయం 11.15కి తుల్జాపూర్ చేరుకున్నాను. ఇదివరకు ఒకసారి నేను అమ్మవారిని దర్శించడం జరిగింది. ఛత్రపతి శివాజీ తుల్జాపూర్ భవానీమాత విశేష భక్తుడు. అమ్మవారు శివాజీకి ఒక ఖడ్గాన్ని బహూకరించిందని, విదేశీ ఆక్రమణల నుండీ భారతదేశాన్ని రక్షిండానికి శివాజీ మహారాజ్ ఆ ఖడ్గంతోనే యుద్ధం చేసి శత్రువులను తుదిముట్టించాడని చరిత్ర చెబుతోంది.

రాళ్లతో కట్టిన చాల పటిష్ఠమైన మందిరం అది. అమ్మవారిది ఏక మరకతమణితో చేసిన విగ్రహం. సుమారు మూడున్నర అడుగుల

ఎత్తువుంటుది. ఎత్తైన పీఠంపై ఎంతోతేజస్సుతో వెలిగిపోతూ వుంటారు భవానిమాత.

తుల్జా భవాని అమ్మవారిని శ్రద్ధాభక్తులతో దర్శనం చేసుకొని షోలాపూర్ కి ప్రయాణమయ్యేను. సాయంత్రం 04.30కి సోలాపూర్ రైల్వే స్టేషన్ చేరుకున్నాను.

నా హైదరాబాద్ ట్రైన్ రాత్రి పదింటికి కాబట్టీ చాల టైంవుంది. సోలాపూర్ వూళ్ళోనే ఎంతో ప్రసిద్ధిగాంచిన సిద్దేశ్వర్ ఆలయం వుంది. ఒక సరస్సులో అత్యంత అందంగా నిర్మించ బడ్డ మందిరం. శివ-విష్ణు రూపంలో బేధంలేదంటూ, మన శ్రీశైలం నుంచి ఇక్కడకు వచ్చిన సిద్ధరామేశ్వర్ అనే యోగి దీనిని నిర్మించేరని చరిత్రచెబుతుంది.

షోలాపూర్ రైల్వే స్టేషన్ కి ఈ అందమైన మందిరం కేవలం 3 KMs దూరంలోనే వుంది.

ఈ మందిరం వలనే షోలాపూర్ ఎంతో అభివృద్ధి గాంచిందని ఇక్కడ ప్రజల విశ్వాసము. పత్తి పంటకు, చేనేత పరిశ్రమకు షోలాపూర్ పెట్టింది పేరు. షోలాపూర్ దుప్పట్లు అందరి ఇళ్లలో వుండేవే.

ఆటోలో సిద్దేశ్వర మందిరానికి చేరుకున్నాను. చాల పెద్దగుడి. ఆలయప్రాంగణంలో ఎన్నో ఉపాలయాలు కూడా వున్నాయి. సిద్దేశ్వరుని దర్శించుకొని, వినాయకుడు, విఠోబా-రుక్మిణి మందిరాలను, శ్రీ సిద్దరామేశ్వర్ యోగి సమాధిని దర్శించి, అక్కడ కొంతసేపు ధ్యానం చేసుకొని, ప్రసాదం స్వీకరించి తొమ్మిదింటికల్లా స్టేషన్ చేరుకున్నాను.

నా ట్రైన్ రైట్ టైంలోనే నడుస్తోంది. పదిన్నరకు బయల్దేరి ఉదయం ఆరున్నర గంటలకు హైదరాబాద్ చేరుకున్నాను. ఉద్యోగ బాధ్యతతో మళ్ళీ రొటీన్ లైఫ్ ఆరంభమైంది.

నా ఉద్యోగరీత్యా దేశంలో నున్న అనేక విశ్వవిద్యాలయాలకు నేను పనిమీద వెళ్ళిరావాల్సిన కారణంగా, ఎన్నో ప్రముఖ ఆలయాలు, ప్రార్థనా మందిరాలు, గురుస్థానాలు దర్శించడం జరిగింది. ఇది నా గురుదేవులు నాకు ప్రసాదించిన వరం. నా సత్యశోధనకు ఈ ప్రయాణాలు ఎంతగానో తోడ్పడ్డాయి.

అలాహాబాద్లో జరగబోయే 2013 మహాకుంభమేళాకి చేయవలసిన ఏర్పాట్లన్నీ ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం భారీఎత్తున సిద్దంచేస్తున్నట్లు వార్తా పత్రికలు, ఛానెళు ్ల ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నాను.

ఈ మహా కుంభమేళాకి ఒక ప్రత్యేకత వుంది –

ప్రతి 12 యేళ్ళకొకసారి ప్రయాగలో జరిగే కుంభమేళ,

12 సార్లు జరుపుకొని (12 Rounds పూర్తి చేసుకొని)

ఇప్పుడు 12 X 12 = 144 సంవత్సరాల తరువాత మళ్ళీ వచ్చింది కాబట్టీ, దీనిని “మహా కుంభమేళా” గా భారీయెత్తున నిర్వహిస్తున్నారని తెలుసుకున్నాను.

జ్యోతిశాస్త్ర ప్రకారము గురు, సూర్యుల సంచారాన్ని బట్టీ ఈ కుంభమేళాలు నిర్వహిస్తారు. రవి (సూర్యుడు) ఒక్కొక్క రాశిలో సుమారు నెలరోజులు సంచారం చేస్తూ, 12 నెలలలో 12 రాసుల సంచారాన్ని పూర్తిచేస్తాడు. బృహస్పతి (గురుడు) ఒక్కో రాశిలో సుమారు ఒక యేడాదిపాటు సంచారంచేస్తూ 12 సంవత్సరాలలో 12 రాసుల సంచారాన్ని పూర్తిచేస్తాడు. మిగతా ఏడు గ్రహాలూ కూడా సూర్యునిచుట్టూ ఒక నిర్ణీత కక్షలో పరిభ్రమిస్తుండడంవలన ఈ కాలచక్రము ఏర్పడుతోంది.

ప్రతి 12 యేళ్ళకొకసారి గురుగ్రహం (బృహస్పతి) మేషరాశిలో సంచారం చేస్తున్నప్పుడు, సూర్యచంద్రులిరువురు కలిసి మకరరాశిలో వున్నప్పుడు (లేదా) బృహస్పతి వృషభరాశిలో సంచారం చేస్తున్నప్పుడు, సూర్యుడు మకరరాశిలో

వున్నప్పుడు, మాఘ మాసంలో త్రివేణిసంగమమైన (గంగ, యమున, సరస్వతి నదుల సంగమం) ప్రయాగలో కుంభమేళా నిర్వహిస్తారు.

అలాగే గురుడు కుంభరాశిలో వుండగా రవి/సూర్యుడు మేషంలో వున్నప్పుడు, చైత్ర మాసంలో 12 యేళ్ళ కొకసారి గంగానది వున్న హరిద్వార్ లో కుంభమేళా జరుగుతుంది.

అలాగే గురుడు సింహరాశిలో వుండగా రవిచంద్రులు వృచ్ఛికరాశిలో వున్నప్పుడు (లేదా) ఈ ముగ్గురూ కలిసి తులారాశిలో వున్నప్పుడు, వైశాఖ మాసంలో 12 యేళ్ళ కొకసారి షిప్రా నది వున్న ఉజ్జయిని లో కుంభమేళా జరుగుతుంది.

అలాగే గురుడు, రవి కలిసి సింహరాశిలో నున్నప్పుడు, భాద్రపద మాసంలో 12 యేళ్ళ కొకసారి గోదావరి నది ఆవిర్భవించిన త్రయంబకేశ్వర్(నాసిక్)లో కుంభమేళా జరుగుతుంది.

ఈ నాలుగింటినే కుంభమేళాలుగా అభివర్ణిస్తారు. పరమాత్ముని అనుగ్రహంతో ఈ నాలుగు కుంభమేళాలుకి నేను వెళ్లడం జరిగింది.

## అధ్యాయం - 24

## మేళాకి ప్రయాణం, మహనీయుల దర్శనం, గురుదేవుల తియ్యని పిలుపు

2013 జనవరి నెల రానేవచ్చింది. మహాకుంభమేళాకి చాలామంది జనం వస్తున్న కారణంగా నా శ్రీమతి బయపడి తాను రానని చెప్పింది. నేను బయల్దేరి 15th జనవరి ఉదయానికి ఢిల్లీలో వుంటున్న మా అన్నయ్య ఇంటికి చేరుకున్నాను. గత కొద్దిరోజులుగా అన్నయ్యకు ఒంట్లో బాగుండటంలేదు. అన్నయ్య, పిల్లలతో ఆ రోజంతా సరదాగా గడిచిపోయింది.

రాత్రి పదింటి ట్రైన్లో బయల్దేరి 16th ఉదయానికి అలహాబాద్ చేరుకున్నాను. నదికి దగ్గరలోనే ఓ హెూటల్లో రూమ్ తీసుకున్నాను.

స్నానంచేసి పడవలో గంగా, యమున, అంతర్వాహినిగా ప్రవహిస్తున్న సరస్వతి నదుల సంగమానికి (త్రివేణి సంగమం) చేరుకొని, పితృదేవతలకు తర్పణాలు అర్పించి, పదకొండు గంటలకల్లా కుంభమేళా ప్రదేశానికి చేరుకున్నాను.

85వేల ఎకరాల్లో, 2400 కోట్లరూపాయల బడ్జెట్టుతో, ఈ మహాకుంభ మేళా ఏర్పాట్లన్నీ భారీఎత్తున ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఎన్నో కోలనీస్ మాదిరి గుడారాలు ఏర్పాటుచేసి, వాటన్నింటిని రోడ్లతో అనుసంధానం చేసేరు.

ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం నిర్వహించే గంగా హారతిని, మేళాకి వచ్చినవారందరూ వీక్షించే విధంగా నదిమధ్యలో భారీ మండపాన్ని ఏర్పాటుచేసేరు.

అందరూ నదిలో స్నానాలు చేసేందుకు వీలుగా ఘాట్లు నిర్మించేరు. పగలు మాదిరిగా, రాత్రిపూట మొత్తము మేళా ప్రదేశమంతా వెలిగిపోయేలా విద్యుత్ దీపాలు ఏర్పాటుచేసేరు. కొద్దిసేపట్లోనే నా గురుదేవుల దర్శనం ఈ మహాకుంభమేళాలో లభిస్తుందని జ్ఞప్తికి వచ్చి, నా మనసంతా ఆనందంతో నిండిపోయింది.

విభిన్న సాంప్రదాయాలకు చెందిన ఎంతోమంది యోగులు, సాధువులు, పరమ గురువులు, గురువులు, నాగ సాధువులు, దిగంబరులు, హిమాలయా యోగులు, విదేశీ గురువులు, పరమహంసలు, అవధూతలు, పీఠాధిపతులు, మహా మండలేశ్వరులు, మండలేశ్వరులు ముందుగానే చేరుకున్నారు. అందరికి పెద్ద పెద్ద గుడారాలు కేటాయించడం జరిగింది.

వీరుకాక శాస్త్రవేత్తలు, పండితులు, పరిశోధకులు, సత్యశోధకులు, గురు అన్వేషకులు, సిద్ధాంతులు, హేతువాదులు ఇలా ఎంతోమంది ఈ మహాకుంభమేళాకి రావడం జరిగింది. తినడానికి ఎన్నో తినుభండార స్టాల్స్ ఏర్పాటుచేసేరు.

దేశంలో నున్న ఎన్నో నిస్వార్థ సేవాసంస్థలు, ఆశ్రమాలు, సంస్థానాలు, దేవస్థానాలు నిర్విరామంగా కావాల్సినవారికి వారికి భోజనం, మంచినీరు, మజ్జిగా ఉచితంగా సేవలందించారు.

మేళా ప్రదేశమంతా ఆధ్యాత్మిక వాతావరణంతో ఎంతో కోలాహలంగా వుంది. నేను నడకసాగించేను. అన్ని గుడారాలు సందర్శిద్దామని నిశ్చయించుకున్నాను. చాలా గుడారాలకు వెళ్లి ఎంతోమందితో మాట్లాడటం ప్రారంభించేను.

దిగంబరులు, నాగాబాబాలను ఎంతో మందిని కలిసి –
వారి ఆచార, సాంప్రదాయాలను అడిగి తెలుసుకున్నాను!
ఎంతోమంది హిమాలయ యోగులను కలుసుకొని –
వారికి ప్రణమిల్లి ఆశీర్వాదము తీసుకున్నాను!

పీఠాధిపతులు, మండలేశ్వరుల గుడారాలను దర్శించేను. కొందరితో సంభాషించేను!

మధ్యాన్నం రెండుగంటలకు శ్రీ సత్యసాయి సేవ సంస్థ వారు ఏర్పాటుచేసిన ఉచిత భోజన శిబిరంలో తృప్తిగా భోంచేసేను.

భోజనానికి, మంచినీళ్ళకి ఎవరూ ఎటువంటి ఇబ్బంది పడనవసరంలేదు.

నా గురుదేవుల దర్శనం ఎప్పుడు, ఎలా లభిస్తుందా!

అన్న ఆత్రుతతో మేళాప్రదేశమంతా తిరగడం మొదలుపెట్టేను.

సాయంత్రం గంగాహారతి చాల వైభవంగా జరిగింది. లెక్కకు మించిన ప్రజలు ఈ హారతిని తిలకించారు. అన్ని గుడారాలనుంచి అందరు సాధువులు గంగా హారతిలో పాల్గొన్నారు. వేలమంది నాగా బాబాలు రకరకాల విన్యాసాలు చేస్తూ హారతిలో పాల్గొన్నారు.

ఈ కుంభమేళా జరిగినన్నాళ్లు ఈ హిమాలయా యోగులకు, నాగా బాబాలకు కావలసిన పూజాసామాగ్రి, మంచినీళ్లు, రెండుపూట్ల భోజనసదుపాయం మేళాలో పాల్గొన్న పీఠాధిపతులు, మండలేశ్వరులు, సంస్థానాలు ఏర్పాటుచేస్తాయి.

కారణం వారు ఎటువంటి వస్తువులు తమవెంట తెచ్చుకోరు. హిమాలయాలకు చెందిన వివిధ ప్రాంతాలనుండి కాలినడకన కుంభమేళాకు చేరుకుంటారు.

వీరు అన్ని బాహ్య వస్తువులను త్యజించి, సమాజ వాతావరణానికి దూరంగా జీవిస్తుంటారు.

రాత్రి పదిన్నర వరకు సుమారు అరవై పైనే గుడారాలు సందర్శించి, వివిధ రకాల సాంప్రదాయాల గురించి నేను తెలుసుకోవడం జరిగింది. నాకు తెలియని విషయాలు, విశేషాలు ఎన్నో తెలుసుకున్నాను.

ఒక్క విషయం నాకు స్పష్టమైంది, అదేంటంటే ఈ సాధనాలన్నీ “అసలు సత్యాన్ని” తెలుకునేందుకు చేస్తున్న ప్రయత్నమే అని.

వేదాలు, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, గ్రంధాలు, శాస్త్రాలు, పురాణాలు, కావ్యాలు, ఇతిహాసాలు భగవంతుని విభూతిని ఎన్నోరకాలుగా వర్ణించేయి. ఆ విభూతిని అంతటా, అన్నింటిలో, అన్నివేళల్లో మనసారా దర్శిస్తూ, మనలోనే అంతర్యామిగా నున్న పరమాత్మను అనుభూతి పొందడమే అసలైన ఆధ్యాత్మిక సాధనని తేల్చిచెప్పేయి.

ఎందుకంటే, అన్ని జడజీవ పదార్ధాలలో నిఘాఢంగా నిర్లిప్తమై, వర్ణింపశక్యంగాని శక్తితో వెలుగొందే వస్తువే భగవంతుడు.

దానినే బ్రహ్మమని, పరమాత్మయని, పరంజ్యోతియని, పరాత్పరుడని, సత్యమని, శివమని, సుందరమని, మూలపురుషుడని, సార్వభౌముడని, సృష్టికర్తయని, అందరి తల్లితండ్రులు అతడేననీ, ఇలా ఎన్నో వేలకొద్ది పేర్లతో మనుజులు తమ మేధస్సుతో వర్ణించడం జరిగింది.

చిట్టచివర్లో ఆ విభూతిని అనుభవించాలే తప్పా వర్ణింపశక్యం కాదని తేల్చిచెప్పేరు.

ఇంతకీ ఆ విభూతిని ఎలా అనుభూతి పొందాలి?

అందుకు సులువైన మార్గం ఏంటి?

అన్నదే ప్రతి సాధకుని ముందున్న ప్రశ్న! ఆ మార్గాన్ని చూపించేవాడే గురువు.

సమయం రాత్రి 10.45 అయ్యింది. ఇన్ని గుడారాలు తిరిగినా గురుదేవులను కలుసుకోలేకపోయేను. ఇంకా 500పైనే గుడారాలు వున్నాయి. గురువుగారు ఇచ్చిన మాట తప్పరు కాబట్టి ఎలాగైనా నాకు దర్శనం ప్రసాదిస్తారు. ఈరోజు కాకపొతే రేపు. కానీ రేపురాత్రి నేను నా తిరుగుప్రయాణానికి టిక్కెట్ రిజర్వు చేసుకున్నానే! ఇలా ఎన్నో ఆలోచనలు నన్ను చుట్టముట్టేయి. ఇంక రూముకి వెళ్లిపోదామని నిశయించుకున్నాను.

అంతలో ఎవరో నా వెనకనుండి “ఇక్కడ వున్నావా?” అని అనడము వినిపించింది. వెనక్కితిరిగి చూసేను, ఆశ్చర్యం, అలా పిలిచింది సాక్షాత్తు నా గురుదేవులు!

ఒళ్ళు ఒక్కసారిగా ఆనందంతో పులకరించిపోయింది.

వెంటనే గురువుగారి పాదపద్మాలకు సాష్టాంగప్రణామాలు అర్పించేను.

నన్ను పట్టుకొని పైకిలేపుతూ “నాతో రా” అని నడక సాగించేరు.

అప్రయత్నంగా నేను అతన్ని వెంబడించేను.

## అధ్యాయం - 25

## గురుదేవుల ప్రేమ, సవికల్పసమాధి స్థితి ప్రాప్తి, నిర్వికల్పసమాధి స్థితికి నాంది

పెద్ద గుడారాలను దాటుకుంటూ, ఈ కోలాహానికి దూరంగా నడక సాగించేరు గురుదేవులు. సుమారు ఓ పదినిముషాల నడిచి ఓ చిన్న గుడిసెలోనికి ప్రవేశించేరు. నేనుకూడా అతనితో పాటు లోనికి వెళ్ళేను. ఒక లాంతరు వెలిగించివుంది.

ఆ ప్రక్కనే ఇద్దరు కూర్చోడానికి సరిపడే ఒక నారగొంగళి పరిచివుంది. గురువుగారు గొంగళిపై పద్మాసనంలో కూర్చొని ఎదురుగా నన్ను కూర్చోమని సైగచేసేరు. నేను కూడా కూర్చున్నాను.

గురుదేవులు ప్రేమతో కూడిన కంఠంతో –

"ఆత్రేయా! నువ్వు మధ్యాహ్నం నుంచి ఏమి తిన్నట్టు లేదు, నీ కిష్టమైన పదార్థాలు చెప్పు, శాకాహారమైన లేదా మాంసాహారమైన పరవాలేదు" అన్నారు.

ఆ ప్రేమకి నా కళ్ళు చెమ్మగిల్లేయి. వెంటనే తేరుకొని, “గురుదేవా! ఆధ్యాత్మిక సాధనలో మాంసాహారం నిషిద్ధం కదా?” అని ప్రశ్నించేను.

గురుదేవులు చిన్నగా నవ్వుతూ,

“ఆధ్యాత్మికసాధనకి, ఆహారపు అలవాట్లకు ఎటువంటి సంబంధం లేదు. ఆధ్యాత్మిక పురోగవృద్ధి ఆ వ్యక్తియొక్క మనస్సు, బుద్ధి, విషయపరిజ్ఞానం, సాధనపై ఆధారపడి వుంటుంది. కాబట్టీ నీకు ఇష్టమైంది చెప్పు!” అని అన్నారు. ఆకలితో వున్న నేను, శాఖాహార పదార్థాలు ఏమైనా తింటానని సమాధానమిచ్చేను.

గురుదేవులు నవ్వుతూ, చిన్నగా చప్పట్లు కొట్టేరు. పొడుగ్గా, సన్నగా, చిరుగడ్డంతో నున్న ఒక వ్యక్తి, ఒక చేతిలో పళ్లెం ఇంకోచేతిలో గ్లాసు పట్టుకొని గుడిసెలోనికి వచ్చి, నా వైపుచూసి చిన్నగానవ్వి, వాటిని నా ముందుపెట్టి బయటకు వెళ్ళిపోయేడు.

ఆ పళ్లెంలో నాలుగు ఇడ్లీలు, కాస్త పొంగలి, మూడు చిన్నకప్పుల్లో కొబ్బరి చట్నీ, పల్చటి పప్పు, పెరుగు వున్నాయి. గ్లాసులో మంచినీళ్లు వున్నాయి. అన్నీ వేడిగా వున్నాయి. ఒక్కసారిగా నాకు బొబ్బిలి స్టేషన్లో కదులుతున్న ట్రైన్లో ఒక వ్యక్తి పరిగెత్తుకుంటూ వచ్చి, నా చేతికి అందించిన ఆహారపొట్లం సంఘటన గుర్తుకు వచ్చింది.

తల పైకెత్తి ప్రేమతో గురుదేవుల వంక చూసేను. గురుదేవులు కళ్ళుమూసుకొని ధ్యానంలో వున్నారు.

మారుమాట్లాడక ఆత్రంగా అన్ని పదార్థాలు తినేసాను. తిన్నవెంటనే ఆ వ్యక్తి లోపలకివచ్చి, చెయ్యి పళ్లెంలో కడుక్కోమని సైగచేసేడు. అలానే చేసెను. పళ్లెం, కప్పులు, గ్లాసు తీసుకొని ఆ వ్యక్తి బయటకు వెళ్ళిపోయేడు.

గురుదేవులు ఇంకా ధ్యానంలోనే వున్నారు. అతని మొహం ఒక పల్చటి నీలివర్ణ కాంతితో వెలిగిపోతోంది. నేను కూడా పద్మాసనంలో కూర్చున్నాను.

నాకు తెలియకుండానే నా కళ్ళు మూతలుపడ్డాయి. కొద్దిసేపటికే ఒకరకమైన సమాధిస్థితి నన్ను ఆవహించింది.

ఒక్కసారిగా మెళుకువ వచ్చింది. కళ్ళు నులుపుకొని చేతి గడియారం చూసేను. 04.10 am అని సూచించింది. అంటే సుమారు నాలుగు గంటలపాటు నేను ఎదో తెలియని స్థితిలో వున్నానన్నమాట.

కానీ ఆశ్చర్యం ఏమిటంటే నా చుట్టుపక్కల జరుగుతున్న సంఘటనలన్నీ, నేను ఇక్కడ ఈ స్థితిలో వుండీ చూడ్డం జరిగింది.

అన్నింటినీ నేను స్పష్టంగా చూడగలిగేను. నా ఎదురుగా ధ్యానంలో నున్న గురుదేవులు, మా ప్రక్కనే వెలుగుతున్న లాంతరు, గుడిసె బయిట ధ్యానం చేసుకుంటున్న నాకు భోజనం పెట్టిన వ్యక్తి, ఎంతో దూరంలో నున్న మెయిన్ రోడ్డుపై ఆటోలు, బస్సుల రాకపోకలు, జనాలు మేళాకి చేరుకోవడం!

గుడారాల్లో నాగాబాబాలు పాటలు పాడుకుంటూ చేస్తున్న దిగంబర నృత్యాలు, మునిసిపాలిటీ పనివారు మేళాప్రదేశాన్ని శుభ్రం చేస్తుండడం, పోలీస్ వాహనాల హడావుడి, వివిధ సేవాసంస్థల వాలంటీర్లు మరుచటిరోజు భోజనానికి కూరలు తరుగుతుండడం!

నదిఒడ్డున కొందరు బాబాలు చిలిమి పీలుస్తుండటం, కొంతమంది సాధువులు ధ్యానంలో వుండటం, కొంతమంది నదిలో స్నానం చేస్తుండటం, దూరంగా దిబ్బమీద నున్న శివాలయంలో జరుగుతున్న భజన కార్యక్రమము నాకు ఎంతో స్పష్టంగా గోచరించేయి.

ఇలాంటి ఆలోచనలతో మునిగివున్న నాకు,

"అంతా బాగుంది కదా!" అన్న గురుదేవుల మాటలు వినిపించేయి. వెంటనే గురుదేవుల వంక చూసేను. అతని శరీరమంతా స్వచ్ఛమైన నీలిరంగు కాంతితో మెరిసిపోతోంది. ఆ కాంతి గదంతా వ్యాపించింది. నేను ఇప్పుడు గురువుగారిని స్పష్టంగా చూడగలుగుతున్నాను.

విస్మయంతో పాటు ఆనందం నిండిన హృదయంతో గురుదేవులు అడిగిన ప్రశ్నకు "చాల బాగుంది గురుదేవ" అని సమాధానం యిచ్చేను. వెంటనే గురుదేవులు చిరునవ్వుతో, మంచిది,

దీనినే "సవికల్ప సమాధి" అని అంటారు. ఈ సమాధిస్థితిలో వుండీ, నీ చుట్టూ జరుగుతున్నవన్నీ నువ్వు చూడగలవు. ఇది మొదటి మెట్టు. అసలు సత్యాన్ని తెలుసుకోవాలన్న నీ జిజ్ఞాసకు మెచ్చి, ఆ పరమాత్మ ఆజ్ఞతో, నీకు ఈ మొదటి అనుభవాన్ని ప్రసాదించుట జరిగింది.

దీనికన్నా మెరుగైన స్థితి

ఇంకొకటి వుందా? గురుదేవా! ప్రశ్నించేను నేను.

వుంది! దానిని "నిర్వికల్ప సమాధి" అని అంటారు. ఈ స్థితిలో సాధకునికి విశ్వమంతా గోచరిస్తుంది.

అంటే ఎప్పుడూ చూడనివి, ఊహకందని పరమాత్మ విలాసంలో భాగమైన పాలపుంతలు, నక్షత్రమండలాలు, అణుపరమాణు వ్యవస్థ, పంచభూతాలు, జీవపదార్ధ మూలము, జీవ ఆవిర్భావము, గర్భస్థశిశు కదలిక, విత్తు మొలకెత్తుట, కీటకం సీతాకోకచిలుకగా మారుట, అన్ని జీవపదార్ధాలలో నెలకొన్న ప్రాణము, అన్ని జడవస్తువులలో నెలకొన్న చైతన్యము, శక్తి మార్పిడి, జడజీవపదార్ధాల పరస్పర సంబంధము, జీవుల మనోగతం ఇత్యాది ఈ విశ్వంలో జరిగే ప్రతీది సాధకునికి అవగతమౌతుంది.

అంటే ఈ సృష్టికి మూలమైన పరమాత్మలో, ఆ వ్యక్తిని ఆవహించియున్న ఆత్మ విలీనమౌతుంది. నీవు ఎక్కడినుంచి వచ్చావో అక్కడికే చేరుకున్నావన్నమాట.

సత్యాన్ని గ్రహించడమంటే ఇదే! ఇదే "బ్రహ్మైక్యము", ఇదే "అయమాత్మా బ్రహ్మ", ఇదే "అహం బ్రహ్మోస్మి" స్థితి అని గురుదేవులు తమ ఉపదేశాన్ని ముగించేరు.

వెంటనే నేను, గురుదేవా! ఆ నిర్వికల్ప స్థితిని పొందడం ఎలా? అని ప్రశ్నించేను.

అందుకు నువ్వు ఖాళీ జ్ఞానంతో సాధన ప్రారంభించాలి!! తక్కున సమాధానమిచ్చేరు గురుదేవులు.

నాకు అర్ధంకాలేదు. అంటే ఏమిటి గురుదేవా! అని ప్రశ్నించేను.

అంటే ఇప్పటివరకు నువ్వు ఆర్జించేనని అనుకుంటున్న నీ జ్ఞానమంతా ప్రక్కనపెట్టి, ఎటువంటి సంశయాలకు తావివ్వకుండా, పరమాత్మ నీతోపాటూ సర్వత్రా వున్నాడని దృఢనిశ్చయానికి వచ్చి, నువ్వు చేయవలసిన అన్ని కర్మలు నిస్వార్ధంగా, నిష్కామంగా (భగవదర్పిత బుద్ధితో) ఆచరిస్తూ, రాగద్వేష రహితుడై, అకుంఠిత దీక్షతో, అభ్యాసపూర్వక సాధన చేసినట్లయితే, ఈ నిర్వికల్ప సమాధి స్థితి సిద్ధిస్తుంది అని గురుదేవులు నవ్వుతూ సమాధానమిచ్చేరు.

నిర్వికల్ప సమాధి స్థితిని పొందడానికి, మీరు సూచించిన మార్గాలు ఆచరించడం సామాన్య మానవునికి నిజంగా సాధ్యమా? గురుదేవా! అని ప్రశ్నించేను.

ఎందుకు సాధ్యం కాదు?

ఈ ప్రాపంచిక వస్తువులు ఎన్ని సంపాదించినా అవేవీ తనతో రావని తెలిసికూడా మానవుడు ఎందుకు అంత తాపత్రయ పడుతున్నాడు? అంతా పరమాత్మదే అని తెలిసికూడా ఇదంతా నాదేనని ఎందుకు భ్రమపడుతున్నాడు?

మరణించేలోపు అసలు సత్యాన్ని తెలుసుకోడానికి ఎందుకు ప్రయత్నం చెయ్యడంలేదు?

మందిరంలో వున్న దేవుణ్ణి ఎన్నోరకాలుగా ఆరాధిస్తున్న జీవుడు పరమాత్మ అన్నింటా, అందరిలో, అన్నిచోట్లా వున్నాడన్న సత్యాన్ని ఎందుకు విస్మరిస్తున్నాడు?

ఈ లోకంలో తన పుట్టుకకు కారణమైన తల్లితండ్రులను ఎందుకు విస్మరిస్తున్నాడు?

పరమాత్మను నానారకాలుగా వర్ణిస్తూ, ఆ పరమాత్మే తనలో ఆత్మస్వరూపంతో నెలకొని వుందని, ఇదే ఆత్మ అన్ని జీవాలలో కూడా వుందని, ఎందుకు తెలుసుకోలేకపోతున్నాడు?

మహనీయులు ఎంతో అనుభవంతో, నిస్వార్ధంగా బోధించిన సత్యమార్గాలను, ధర్మసూత్రాలను ఎందుకు వక్రీకరిస్తున్నాడు?

దీనికి కారణం మానవుని జ్ఞానమా? లేక అజ్ఞానమా?

ఈ సృష్టిలో ఒక్క మానవులకు మాత్రమే అత్యంత శక్తిసామర్ధ్యాలను, ప్రజ్ఞాపాటవాలను ప్రసాదించేడు పరమాత్మ. జ్ఞానంతో కూడిన సాధనతో తనలో వున్న ఆత్మస్వరూపాన్ని తెలుసుకున్న వ్యక్తికి,

"సవికల్ప సమాధి స్థితి" పిమ్మట మెల్లగా "నిర్వికల్ప సమాధి స్థితి" తప్పక సిద్ధిస్తాయని తెలియజేసేరు గురుదేవులు.

ఇంకా ఎన్నో విషయాలను నాతో ముచ్చటించేరు గురుదేవులు.

## అధ్యాయం - 26

## నిరాశ, ధైర్యం, గురుదేవుల అభయం, తేలికబడ్డ మనస్సు, భిన్నత్వంలో ఏకత్వం

కొంతసేపు మౌనంగా వున్న గురుదేవులు,

ఇంకో విషయం ఆత్రేయా!

ఇప్పుడు నా సమక్షంలో నువ్వు పొందిన "సవికల్ప సమాధి" స్థితిని,

నేను ప్రత్యక్షంగా నీముందు లేనప్పుడు పొందలేవు! అని నవ్వుతూ సెలవిచ్చేరు.

అదివిన్న నేను ఒక్కసారిగా నిరాశకు గురయ్యేను.

నా బాధను అర్ధంచేసుకున్న గురుదేవులు,

ఆత్రేయా! అధైర్యపడవలసిన అవసరంలేదు. అకుంఠిత సాధనతో నీ "ఆత్మస్వరూపాన్ని" నువ్వు తెలుసుకున్న రోజు ఈ రెండు స్థితులు వాటంతట

అవే నీకు సిద్ధిస్తాయి, అంటూ ప్రేమతో నా భుజం తట్టేరు.

గురుదేవుల పవిత్రమైన స్పర్శ నాలో మళ్ళీ ధైర్యాన్ని నింపింది.

కొంతసేపు ధ్యానంలోకి వెళ్లిన గురుదేవులు, మెల్లగా కళ్ళుతెరిచి,

నాయనా ఆత్రేయా! పరమాత్మ ఆజ్ఞతో ఇక్కడనుండి నేను వెళ్ళవలసిన సమయం ఆసన్నమైంది. త్వరలోనే నిన్ను మళ్ళీ కలుస్తాను. అంతవరకూ నేను చెప్పినవిషయాలు మనస్ఫూర్తిగా సాధనచెయ్యి! శుభం భూయాత్!

అంటూ నా తలమీద చెయ్యిపెట్టి దీవించేరు.

చెమ్మగిల్లిన కళ్ళతో గురుదేవులను అలానే చూస్తూ వుండిపోయేను. గురుదేవుల చుట్టూ ఆవహించివున్న నీలకాంతి మెల్లగా తగ్గుతూ అదృశ్యమైపోయింది. లాంతరు వెలుగులో చూస్తే గురుదేవులు అక్కడలేరు.

అతను పద్మాసనంలో కూర్చున్న ఆ ప్రదేశాన్ని రెండు చేతులతో తాకి కళ్ళకద్దుకున్నాను. మెల్లగాలేచి తలుపులు తెరిచేను. పల్చటి సూర్యకాంతి గదిలో ప్రవేశించింది.

వాచీ చూస్తే ఉదయం 05.43 అయ్యింది. లాంతరు ఆర్పి బయటకు వచ్చేను. నాకు భోజనం పెట్టిన వ్యక్తి అక్కడ కనపడలేదు. తెలియని ఆనందంతో, నూతనోత్సాహంతో కుంభమేళావైపు నడసాగించేను. మనస్సు ఎంతో తేలికబడింది.

నదీతీరం వెంట నడవసాగేను. ఇదివరకటిలా కాకుండా ఇప్పుడు నాకు బయట వాతావరణమంతా కొత్తగా కనిపిస్తోంది. ఆ పరమాత్మ ఉనికి అన్నిచోట్లా గోచరిస్తోంది.

మేళాలో ఎవరికి నచ్చిన పద్ధతిలో వారు భగవంతుణ్ణి ఆరాధిస్తున్నారు. కొందరు నదిలో స్నానం చేస్తున్నారు, కొందరు సూర్యనమస్కారాలు చేస్తున్నారు, కొందరు పితృదేవతలకు తర్పణాలు వదులుతున్నారు, కొందరు ధ్యానినిమఘ్నులై పద్మాసనంలో కూర్చున్నారు, నాగాబాబాలు దిగంబరంగా ఎన్నో భంగిమలతో

ఆసనాలు వేస్తున్నారు. పీఠాధిపతులు, మండలేశ్వరులు తమ శిష్యబృందంతో మేళతాళాలతో వూరేగుతున్నారు.

విదేశీభక్తులు తమ గురువులతో కలిసి భజన చేసుకుంటూ మేళా అంతా తిరుగుతున్నారు. స్వచ్ఛంద సేవాసంస్థల సభ్యులు వంటావార్పులో నిమఘ్నమైవున్నారు. కొందరు భక్తులు మేళాలో తాత్కాలికంగా ఏర్పాటుచేసిన దేవాలయాలను సందర్శిస్తున్నారు.

గుడిగంటలు మ్రోగుతున్నాయి. నిర్వాహకులు, వాలంటీర్లు ప్రజలను గైడ్ చేస్తున్నారు. పోలీసువారు మైకులో హెచ్చరికలు చేస్తున్నారు. కొన్ని గుడారాల్లో యజ్ఞాలు చేస్తున్నారు. నేతివాసనతో కూడిన పల్చటి పొగ మేళా అంతా వ్యాపిస్తోంది. వేదమంత్రాలు మైకులో వినబడుతున్నాయి.

కొన్ని గుడారాలనుండి భక్తిపాటలు వినిపిస్తున్నాయి. విలేకర్లు, శాస్త్రవేత్తాలు కెమేరాలతో తమకు కావలసినవి ఫోటోలు తీసుకుంటున్నారు. టీవీఛానెల్స్ వారి వాహనాలు ప్రత్యక్ష ప్రసారాలు అందజేస్తున్నాయి.

గురుదేవుల మాటలు గుర్తుకువచ్చేయి!

భిన్నత్వంలో ఏకత్వం అంటే ఇదే! ఏ పద్ధతిలో సాధనచేసినా గమ్యం ఒక్కటే, సత్యాన్ని గ్రహించడం!

స్వచ్ఛంగా ఎక్కడనుంచి వచ్చామో మళ్ళీ స్వచ్ఛంగా అక్కడికే చేరుకోవడం!

శాశ్వతమైన ఆత్మస్వరూపాన్ని అనుభూతిపొందడమే!.

ఈ మధ్యలో జరిగేవన్నీ తాత్కాలికములే!

ఎమీ తెచ్చింది లేదు, ఏమీ తీసుకుపోయేది లేదు!

ఇదంతా నాది, నా వాళ్ళది అన్న తాపత్రయం మాత్రమే!

ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి, అహంకార వికారాల వలన ఏర్పడే తమస్సుని, స్వతహాగా మానవులకు లభించిన జ్ఞానమనే ఆయుధంతో జయించి ఆ పరంజ్యోతిని ఆస్వాదించడమే జీవుల ముందున్న లక్ష్యము.

అలాకాదు, కూడదు, ఇదే బాగుందని భావిస్తే, కష్టం–సుఖం, లాభం–నష్టం, కలిమి–లేమి, జననం–మరణం ద్వందాలను అనుభవించితీరాల్సిందే.

గురుదేవులు తమ బోధనలో, రెండు విషయాల పట్ల శ్రద్ధ వహించమని నన్ను హెచ్చరించేరు. ఒకటి "భావము" (లోలోపున), ఇంకొకటి "బాహ్యము" (బయటకు కనిపిస్తున్న).

ఆధ్యాత్మిక సాధనలో, బాహ్యము కంటే భావమునకు ఎంతో ప్రాముఖ్యత ఇవ్వబడింది. అంటే ఈ రెండింటిలో ఎక్కువ "స్వచ్ఛత" పాటించ వలసింది భావములో. బాహ్యానికి ప్రాధాన్యత ఇస్తున్న మానవులు, భావానికి అంత విలువ ఇవ్వడంలేదని తమ ఆవేదన వ్యక్తం చేసేరు. అందులో నేను కూడా ఒక భాగస్వామినే అన్న ఆవేదన నాకు కలిగింది.

బాహ్య రూపాన్ని బట్టీ వ్యక్తులకు విలువనిచ్చే కాలం నడుస్తోంది. బాహ్యంగా వ్యవహరిస్తున్న తీరును బట్టీ ఎంతోమంది తమ గురువులను ఎంచుకుంటున్నారు. బాహ్యానికి ఎంతో విలువిస్తున్న సామాన్య ప్రజల బలహీనతను గుర్తించి, వారిని ఎన్నోరకాలుగా ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు ఎంతోమంది మేధావులు.

అన్ని విశ్వాసాల్లో ఈ అనైతిక చర్య జరుగుతూనేవుంది!

ఈ అనైతిక చర్యలకు ఎన్నో పేర్లు పెట్టి, అసత్యాన్ని ప్రచారం చేస్తూ, చాలామంది గురువులుగా పరిగణింపబడుతున్నారు! కొందరు నమ్మకాలు పేరిట, కొందరు స్వస్థత పేరిట, కొందరు పేరులో మార్పు పేరిట, కొందరు అదృష్టసంఖ్య పేరిట, కొందరు బాబాల పేరిట, కొందరు శక్తిపాతం పేరిట, కొందరు టీవీ ఛానెల్స్ లో ప్రాయోజిత కార్యక్రమాల పేరిట, కొందరు కులమతవార్గాల

పేరిట, కొందరు జంతుబలి పేరిట, కొందరు క్షుద్రపూజల పేరిట, కొందరు నరబలి పేరిట, కొందరు విశ్వాసాలను రెచ్చగొట్టే పేరిట, కొందరు హేతువాదం పేరిట, కొందరు మానవ హక్కుల పేరిట, కొందరు అనాధ మఱియు వృద్ధుల ఆశ్రమాల పేరిట, కొందరు రాజకీయ గురువుల పేరిట, కొందరు మూఢాచారాలను రెచ్చకొట్టే పేరిట, కొందరు ఒకే పరమాత్మను ఎన్నో రకాలుగా విభజించి విద్వేషాలను రెచ్చగొట్టే పేరిట, కొందరు పరమాత్మకు కూడా కుల, మత, వర్ణాలను అంటగట్టే పేరిట, కొందరు మహనీయుల బోధనలను వక్రీకరించే పేరిట, కొందరు మా విశ్వాసమే గొప్పదంటూ ప్రచారం పేరిట ప్రజలను తప్పుద్రోవ పట్టిస్తున్నారు.

అభిమతాలు వేరైనా సత్యమొక్కటే అన్న సూత్రానికి పూర్తిగా తిలోదకాలు ఇచ్చారు.

ఈ భూప్రపంచంలో భగవంతుని సంతానమైన మానవులందరినీ, కర్మ-జ్ఞాన మార్గాలతో, ఒకే తాటిపై తీసుకురావాలన్నదే సద్గురువుల ఆశయమన్న గురుదేవుల మాటలు గుర్తొచ్చాయి!

గురుదేవులు నాతో ముచ్చటించిన ఎన్నో విషయాలను తలచుకుంటూ రోజంతా గడిపేసాను. సాయంత్రం మాధవేశ్వరి శక్తిపీఠాన్ని దర్శించుకున్నాను. రాత్రి ట్రయిన్ లో బయలుదేరి భువనేశ్వర్ మీదుగా వైజాగ్ చేరుకున్నాను.

రోజులు గడుస్తున్నాయి. కుంభమేళా విశేషాలను ప్రతిరోజూ Live లో ప్రసారం చేస్తున్నాయి ఎన్నో ఛానెళ్లు.

తొలి 30రోజుల్లో 12 కోట్లమంది జనం దేశం నలుమూలలనుంచి వచ్చేరని, విదేశీయులు సుమారు 32లక్షలమంది వచ్చేరని BBC, CNN వార్తా ఛానళ్ళు పేర్కొన్నాయి.

గురుదేవుల దర్శనభాగ్యం ఎప్పుడు లభిస్తుందా? అని ఎదురుచూడ్డం మొదలుపెట్టేను.

## అధ్యాయం - 27
## తాజుద్దీన్ బాబా దర్గాలో
## గురుదేవుల సహాయం

అదేసంవత్సరం (2013) మార్చి 8వ తేదీన, మా అన్నయ్య నాగపూరులో స్వర్గస్తులైనట్టు తెలిసింది. నేను, నా శ్రీమతి వెంటనే బయలుదేరి నాగపూర్ చేరుకున్నాము. అన్నయ్య ముగ్గురుకొడుకులు ఉత్తరక్రియలను నిర్వహించేరు.

నాగపూరుకి సుమారు 128kms దూరంలో, సాత్పురా పర్వత శ్రేణి ప్రాంతంలో, ముల్తాయ్ (బేతుల్ జిల్లా, మధ్యప్రదేశ్) వద్ద తపతి నది ఉద్భవించిన ప్రదేశంలో, అస్తిక నిమజ్జనం చేయడం జరిగింది.

తపతి (తాపి, అని కూడా అంటారు) నదిని సూర్యుని కుమార్తెగా మన పురాణాలలో అభివర్ణించేరు. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలలో ప్రవహించి అరేబియా మహాసముద్రంలో కలుస్తుంది తపతీ నది.

నాగపూరుకి సుమారు 15kms దూరంలో నున్న, హజరత్ తాజుద్దీన్ బాబా వారి దర్గాని (సమాధి మందిరము) దర్శిద్దామని ఇంతకుముందు ఆఫీసుపనిమీద నాగపూర్ వచ్చినప్పుడు అనుకున్నాను.

అప్పుడు కుదరలేదు. ఇప్పుడు వెళదామన్నా, అశుచితో వెళ్లకూడదని భావించి వూరుకున్నాను. ఎందుకో కానీ మనసులో ఆరాటం తగ్గలేదు. "వెళ్ళు! వెళ్ళు! వెళ్లి దర్శించుకో! సద్గురువు వద్ద సంశయాలకు తావులేదు" అని అంతరాత్మ పదేపదే సూచించడం మొదలుపెట్టింది.

ఇంక ఆపుకోలేకా అన్నయ్య పరమపదించిన ఏడోరోజు సాయంత్రం, అన్నయ్య రెండోకొడుకు శ్రీధరుతో కలిసి బండిమీద సద్గురు తాజుద్దీన్ బాబా దర్గాకి చేరుకున్నాను. మైల కారణంగా బయటవుంటానని శ్రీధర్ అన్నాడు. నాకు కూడా మైల వర్తిస్తుంది. దర్శనం చేసుకోవాలన్న కుతూహలాన్ని ఆపుకోలేకా, సంశయిస్తూనే దర్గా ప్రాంగణంలోకి ప్రవేశించేను.

ఎంతో మంది భక్తులతో ప్రాంగణమంతా కిటకిటలాడుతోంది. అన్ని విశ్వాసాల భక్తులు తలకు గుడ్డ కట్టుకొని, ముఖమల్ చద్దరుతో మఱియు పూలదండలతో కప్పబడివున్న సద్గురు తాజుద్దీన్ బాబావారి సమాధిని చేతులతో తాకి కళ్ళకద్దుకొంటున్నారు. కొంతమంది సమాధి మందిరంలో ఒక మూల కూర్చొని ధ్యానం చేసుకొంటున్నారు.

సమాధి మందిరానికి కొద్దిదూరంలో నుంచొని, తాజుద్దీన్ బాబావారికి నా ప్రణామాలు అర్పిస్తూ కళ్ళుమూసుకొని ప్రార్థించడం ప్రారంభించేను.

ఇంతలో ఎవరో నా భుజం తట్టినట్టనిపించి కళ్లుతెరిచేను. ఎదురుగా ఓ ముస్లిం సోదరుడు నవ్వుతూ హిందీలో "రండి, లోపలికి వచ్చి సమాధిని తాకండి" అని నా చెయ్యి పట్టుకొని ముందుకు కదిలేడు.

నేను తేరుకొని, ఏంచెప్పాలో తెలియక, "అదికాదు అన్నగారూ, నా దగ్గర తలగుడ్డ లేదు అందుకే ఇక్కడనుంచి దర్శనం చేసుకుంటున్నాను" అని హిందీలో చెప్పేను. వెంటనే అతడు తన లాల్చీ జేబులోంచి, ఒక ఆకుపచ్చరంగు గుడ్డని తీసి నా తలకు కట్టి, నా చెయ్యి పట్టుకొని లోపల సమాధి వద్దకు తీసుకెళ్ళేడు.

ఇక మారుమాట్లాడక, అది గుర్వాజ్ఞగా భావించి, సద్గురు తాజుద్దీన్ బాబావారి సమాధిని తాకి కళ్ళకద్దుకున్నాను. ఒక్కసారిగా ఒళ్ళంతా పులకరించింది. హాజీ నా తలపై నెమలిపింఛం గుత్తిని వుంచి అరబ్బీభాషలో దీవించి, మూడు ఎండు ద్రాక్షపళ్ళను ప్రసాదంగా ఇచ్చేరు.

నన్ను లోపలకు తీసుకువచ్చిన వ్యక్తి, నన్ను ఒక మూల కూర్చోబెట్టి ధ్యానం చేసుకోమని సూచించేడు. నేను పదినిమిషాలు ప్రశాంతగా ధ్యానం చేసుకున్నాను. మనసు ఎంతో తేలికబడింది.

కళ్ళుతెరిచి నాకు తలగుడ్డను ఇచ్చి, నన్ను సమాధి వద్దకు తీసుకువచ్చిన వ్యక్తి కోసం చూసేను. అతడు కనబడలేదు. హాజీ వద్దకు వెళ్ళి ఆ వ్యక్తి గురించి వాకబు చేసెను. అతను ఎవరో తెలియదని చెప్పేరు. బయటకు వచ్చి దర్గా ప్రాంగణమంతా గాలించేను. ఎక్కడా కనబడలేదు. తలగుడ్డను విప్పి, ఒక పావుగంట సేపు, అతను నన్ను కలిసిన చోట నుంచున్నాను. అతను రాలేదు.

తలగుడ్డను ఎంచేద్దామా అన్న ఆలోచన వచ్చింది. ఎవరికైనా ఇద్దామా అనిచూస్తే అందరి దగ్గరా వున్నాయి.

దానిని ఒకచోట వదిలి పెట్టడానికి మనసొప్పకా, ప్యాంటు జేబులో పెట్టుకొని, బయటకు వచ్చేను. ఈ సంఘటనలు ముచ్చటించుకుంటూ నేను, శ్రీధర్ బండిమీద ఇంటికి చేరుకున్నాము.

ఇంటికొచ్చేసరికి నా శ్రీమతి, కోడళ్ళతో కలిసి వంట కార్యక్రమంలో బిజీగా వుంది. నా శ్రీమతికి మడి, ఆచారాల పట్టింపు వుంది. ఎక్కువుగా కర్మమార్గాన్ని అనుసరిస్తుంది. నేను ఎక్కువుగా జ్ఞానమార్గాన్ని అనుసరిస్తాను. ఒకరి ఆలోచనలను ఇంకొకరు గౌరవించుకుంటాము.

ఇలాంటి విషయాల్లో నాకు పెద్దగా నమ్మకం లేకపోయినా, నా అర్ధాంగి తృప్తికోసం నేను వీటిని ఇంటివరకు పాటిస్తాను. మా పెళ్ళైన తరువాత, నా తల్లితండ్రులు తనకు సూచించిన పూజ, పునస్కార మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటిస్తోంది. ఇటు మెట్టినింటి, అటు పుట్టినింటి గౌరవ మర్యాదలను కాపాడుకుంటూ ఎంతో చాకచక్యంగా తన భాద్యతలను నిర్వర్తిస్తూ, ఎన్ని కష్టాలు ఎదురైనా, ధైర్యం కోల్పోకుండా ఒక ఇల్లాలుగా తన కర్తవ్యాన్ని భుజానవేసుకుంది. తను లేకుండా నా జీవితం శూన్యమన్నది నిజం.

మేము దర్గాకి వెళ్లినట్లుగాని, జరిగిన సంఘటనలుగాని, ఆ సమయంలో ఆమెతో చెప్పకుండా, ఆ ఆకుపచ్చ తలగుడ్డని నా పెట్టెలో, బట్టల క్రింద దాచి పెట్టేసాను. అందరంకలిసి ఎనిమిదవ రోజు మధ్యాహ్నము నాగపూరులో బయలుదేరి తొమ్మిదో రోజు తెల్లవారుఝామున రాజమండ్రి చేరుకున్నాము. తొమ్మిది, పది, పదకొండు, పన్నెండవ రోజుల కార్యక్రమాలన్నీ గోదావరి నది వద్ద నిర్వహించి, ఎవరి వూళ్ళకు వారు ప్రయాణమయ్యేము.

వైజాగ్ చేరుకున్న వెంటనే నా శ్రీమతి, మా ఇరువురి సూట్కేసులలో వున్న బట్టలన్నీ, బాత్రూములోకి తీసుకెళ్లి, నీళ్ల బక్కెట్ లో నానబెట్టి, స్నానంచేసి బయటకు వచ్చింది. నేనుకూడా ఇంకో బాత్రూములో స్నానంచేసి బయటకు వచ్చేను.

ఇల్లంతా విభూతి సువాసనతో నిండిపోయింది. ఆ సువాసన ఎక్కడనుంచి వస్తున్నదో తెలీకా, ఇద్దరం ఇల్లంతా వెతకసాగేము. చివరికి ఆ విభూతి వాసన నేను దర్గాలో తలకి కట్టుకున్న ఆకుపచ్చ గుడ్డనుంచి వస్తున్నట్టు గ్రహించాము.

ఆ గుడ్డ ఎక్కడిదని ప్రశ్నించిన మా శ్రీమతికి జరిగిందంతా చెప్పేను. ఇద్దరం ఆశ్చర్యానికి గురయ్యేము. దానిని బయటకు తీసి వేరుగా ఆరబెట్టేము. అది రెట్టింపు విభూతి వాసన వెదజల్లింది.

ఇది నా పూజ్య గురుదేవుల అనుగ్రహం, సద్గురు తాజుద్దీన్ బాబా వారి ఆశీర్వాదంగా భావించి, దానిని మా బీరువాలో భద్రంగా దాచుకున్నాము. ఆశ్చర్యమేమంటే, నేటికీ ఆ తలగుడ్డ ఆ సువాసనను వెదజల్లుతూనే వుంది!

అఖండమండలాకారం వ్యాప్తం యేన చరాచరం ।
తత్పదం దర్శితం యేన తస్మై శ్రీగురవే నమః ॥

## అధ్యాయం - 28

## గజానన్ మహారాజ్ మందిరంలో గురుదేవుల దర్శనం, సంశయ నివృత్తి

కొన్ని నెలలపాటు గురుదేవులు నాకు ప్రత్యక్ష దర్శనభాగ్యం ప్రసాదించకపోయినా పరోక్షంగా బోధనారూపంలో నన్ను ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూ నా సత్యశోధనలో నాకు తోడ్పడుతూనే వున్నారు. నన్ను పరోక్షంగా హెచ్చరించిన విషయాలలో కొన్ని ......... తాను చేసే కర్మల వల్ల తాను పదిమందిలో కీర్తింపబడుతున్నాడన్న విషయం ఇంచుమించు ప్రతి మానవుడికి ఎరుకే! అందుకే జ్ఞానం కన్నా కర్మలకే ఎక్కువ విలువిస్తాడు జీవుడు.

కేవలం తమ స్వార్ధంకోసమే ఎన్నో కర్మలు ఆచరిస్తూ తన అంతరాత్మకు విరుద్ధంగా, తన ఉన్నతి కోసం ఎన్నో ప్రయోగాలు చేస్తాడు మానవుడు. వాటి ఫలితం అనుభవించుట తప్పదన్న విషయం మానవులకు తెలుసు. అయినాసరే ఎటువంటి భీతిలేక దాన్నే అనుసరిస్తాడు.

అసలు సత్యాన్ని విస్మరించి తన ప్రజ్ఞాపాటవాలను ప్రదర్శిస్తాడు మానవుడు కానీ భగవంతుని ప్రతిభంతా అక్కడే ప్రకటితమౌతుందన్న విషయాన్ని పూర్తిగా విస్మరిస్తున్నాడు మానవుడు.

కొందరిముందు తలవాల్చి తన అభిప్రాయాన్ని మనస్ఫూర్తిగా వ్యక్తపరచడానికి కూడా భయపడతాడు. ప్రతి చర్య తనకు అనుకూలంగా వాడుకుంటాడు మానవుడు.

ఇలాంటి సందిగ్ధంలో అసలు సత్యం ఎలా అవగతమౌతుంది? ఈ విషయాలలో సాధకుడు చాలా అప్రమత్తంగా వుండాలి. ఎప్పటికప్పుడు తనను తాను ప్రశ్నించుకుంటూ వుండాలని పరోక్షంగా హెచ్చరించేవారు.

అకస్మాత్తుగా గురుదేవుల దర్శనభాగ్యం నాకు “షెగామ్”లో సంభవించింది.

2014లో ఆఫీస్ పనిమీద మహారాష్ట్రలో “అకోలా” పట్టణంలో నున్న వ్యవసాయ విశ్వవిద్యాలయానికి వెళ్లడం జరిగింది. అక్కడ పనిపూర్తయిన తరువాత సుమారు 46 కి.మి. దూరంలో “షెగామ్” వూళ్ళో మహాయోగి, సద్గురు శ్రీ గజానన్ మహారాజ్ వారి సమాధి మందిరాన్ని దర్శిద్దామని వెళ్ళేను.

సద్గురువులు షిరిడి సాయి, గజానన్ మహారాజ్, తాజుద్దీన్ బాబా, వాసుదేవానంద(టెంబే స్వామి), ధునీవాలా దాదా సమకాలికులు. వీరందరూ శ్రీ గురుదేవ దత్తాత్రేయుల వారి అవతారంగా, సద్గురువులుగా కీర్తింపబడ్డారు.

షిరిడి సాయి 1918లో షిరిడీలో,

గజానన్ మహారాజ్ 1911లో షెగాంలో,

తాజుద్దీన్ బాబా 1925లో నాగపూర్లో,

టెంబే స్వామి 1914లో గరుడేశ్వరు (గుజరాత్)లో,

ధునీవాలా దాదా 1930లో ఖాండ్వా (మధ్య ప్రదేశ్)లో సమాధి చెందేరు.

వీరందరూ ఒకరినొకరు కలుసుకోకపోయినా తమ భక్తులతో ఒకరిగురించి ఇంకొకరు ప్రస్తావించుట జరిగింది. పైన రామమందిరం, దానిక్రింద శ్రీ గజానన్ మహారాజ్ వారి సమాధి మందిరం ఎంతో చక్కగా, చలువరాతితో నిర్మించబడ్డాయి.

సమాధి వెనుక అతని విగ్రహాన్ని ప్రతిష్టించేరు. మందిరానికి కొద్దిదూరంలో "ఆనంద విహార్" అను పేరున, పెద్ద ఉద్యానవనంతో పాటు, భక్తులు ఉండటానికి కాటేజీలు నిర్మించబడ్డాయి. షెగామ్ లో రైల్వేస్టేషన్ వుంది.

సద్గురు గజానన్ వారిని దర్శనం చేసుకొని భోజనశాలకు వెళ్తున్నప్పుడు - ఆత్రేయా! అని ఎవరో పిలవడంతో అటువైపు చూసేను. ఆశ్చర్యం, నా గురుదేవులు ఒక దిమ్మపై కూర్చున్నారు.

ఎంతో ఆనందంతో పరుగున వెళ్లి గురుదేవుల పాదపద్మములకు సాష్టాంగనమస్కారం చేసుకున్నాను. నన్ను పైకిలేపి ప్రక్కనే కూర్చోబెట్టుకున్నారు.

ఎలా నడుస్తోంది, తత్వసాధనకై నీ సత్యశోధన? అని నవ్వుతూ ప్రశ్నించేరు.

గురుదేవా! తమ అనుగ్రహం వలన బాగానే నడుస్తోంది. కానీ సాధనలో ఎన్నో సంశయాలు కలుగుతున్నాయి. తమ సూచనలు ఎప్పటికప్పుడు అందుతున్నాయి. గతకొన్ని నెలలుగా మిమ్మల్ని కలవాలన్న నా కోరిక ఈ రోజు తీరింది.

నా సంశయాలకు సరైన సమాధానాలు ఈనాడు మీ ద్వారా లభిస్తాయని ఆశిస్తున్నానని జవాబిచ్చేను. గురుదేవులు చిన్నగా నవ్వుతూ, నీ పరిస్థితి నాకు అర్థమైంది. అందుకే కొద్ది సమయం నీతో గడపాలని భావించేను అంటూ చెప్పడం మొదలుపెట్టేరు.

ఆత్రేయా! అసలు సత్యాన్ని గ్రహించాలంటే ముందుగా నిన్ను నీవు పూర్తిగా విశ్లేషించుకోవాలి. నీ ఆలోచనసరళిని, నీ నిజస్వభావాన్ని, నీ అంతర్మధనాన్ని, నీలో నిత్యం సంభవిస్తున్న మార్పులని, ఎదురయ్యే సంఘటనల పట్ల నువ్వు వ్యవహరిస్తున్న తీరుని ఎప్పటికప్పుడు విశ్లేషించుకోవాలి.

ఆత్మవిశ్లేషణ లేకుండా బహిర్విశ్లేషణ చేయడంవలన, మనోదౌర్బల్యం యేర్పడి బుద్ధి వికసించదు. తత్కారణంగా నీ చేతిలో నువ్వే ఓడిపోతూ, ఇతరులను ఆశ్రయిస్తూ, పరమాత్మకి/సత్యానికి ఎంతో దూరమౌతావు.

ఈ ఆత్మవిశ్లేషణకి ధ్యానం ఎంతో సహకరిస్తుంది. కేవలం ఒక వస్తువుమీద లేక శ్వాసమీద గురిపెట్టి ఒక మంత్రాన్ని జపిస్తూ ధ్యానంచేస్తే సరిపోదు. నీకు భగవంతుడు ప్రసాదించిన జ్ఞానంతో ప్రతికార్యము వెనుకనున్న కారణాన్ని శోధిస్తూ ధ్యానంలో నిమగ్నమవ్వాలి. అప్పుడు అసలు సత్యం బోధపడి పరమానందాన్ని అనుభవించగలవు.

కొన్నాళ్ళకు బ్రహ్మానందస్థితి సిద్ధించి, మెల్లగా సవికల్ప సమాధిస్థితి తదుపరి నిర్వికల్ప సమాధిస్థితిని పొందుతావు. దీంతో ఆత్మానుభూతి కలిగి సత్యం అవగతమౌతుంది. పరమాత్మతో విలీనం సిద్ధిస్తుంది.

అక్కడితో నీ సాధన పూర్తవుతుంది. ఇక సాధించవలసినది ఏమివుండదు.

ఆత్రేయా! ఆధ్యాత్మికము అంటే ఆత్మగురించి అధ్యయనం చేయడమే! మిగతా సాధనాలన్నీ వ్యావహారికములే! అలాంటి నీ ఆత్మసాధనకు నా అనుగ్రహం ఎల్లప్పుడూ వుంటుంది! పరమాత్మ దర్శనం కూడా నీకు తప్పక లభిస్తుంది! అని గురుదేవులు తమ సంభాషణని ముగించేరు.

తాను బయలుదేరే సమయం ఆసన్నమైందని పలికి, నా తలపై చెయ్యిపెట్టి ఆశీర్వదించి, నన్ను భోజనశాలకు వెళ్ళమని ఆదేశించి, వడివడిగా నడుచుకుంటూ మందిరములోనికి వెళ్ళిపోయేరు గురుదేవులు. కనుమరుగయ్యేంత వరకు అతనినే చూస్తూ నిలబడిపోయేను నేను.

కొంతసేపటికి తేరుకొని భోజనశాలకు నడకసాగించేను. గురుదేవుల బోధన నాలో కొత్త ధైర్యాన్ని నింపింది. సంశయాలకు దారితీసే ఆలోచనలను, విశ్లేషణలను, వాదనలను ప్రక్కన పెట్టాలని గట్టిగా నిశ్చయించుకున్నాను. గురుదేవులు చెప్పిన విషయాలను ఆచరణలో పెట్టాలని దృఢ నిశ్చయానికి వచ్చేను.

ఈ సృష్టి అంతా వైరుధ్యంతో (నానా రకాలుగా) నిండివుంటుంది. ఒక్కొక్కరూ ఒక్కోరకమైన భావనతో వుంటారు. అందరికీ సమాధానం చెప్పడం ఎవ్వరి తరం కాదు.

ఎంతోమంది మహనీయులు ఈ వైరుధ్యాన్ని తొలగించడానికి, వున్నది "ఒక్కటే సత్యమని" ఎంత బోధ చేసినా, సృష్టిధర్మమైన ఈ వైరుధ్యం కొనసాగుతూనే వుంటుంది.

అయినాసరే అసలు సత్యాన్ని ప్రతిష్టించే పనిగా పెట్టుకొని, ఆత్మానుభూతి పొందిన సద్గురువులు అన్ని సమయాలలో ఈ లోకంలో సంచరిస్తూ, సత్యశోధకులకు సరైన మార్గం చూపుతుంటారు. తద్వారా సమాజంలో కొంత మార్పును తీసుకువస్తారు. వారు సూచించిన కర్మ-జ్ఞాన మార్గాలను అనుసరిస్తూ, ఎవరికి వారు వ్యక్తిగతంగా ఈ మాయనుండి బయటపడాలి. సత్యశోధనతో భిన్నత్వంలో ఏకత్వాన్ని దర్శించి ఆత్మానుభూతి పొందాలి.

## అధ్యాయం - ౭౨

### ఆత్మానుభూతి దిశగా ప్రయాణం

సత్యాన్ని గ్రహించాలంటే సాధకుడు కర్మ–జ్ఞానాలను సమతుల్యంగా పరిగణించాలి. కర్మలో అకర్మను, అకర్మలో కర్మను సాధనచేస్తూ ముందుకు పోవాలి. పరమాత్మ ప్రసాదించిన జ్ఞానాన్ని శాయశక్తులా వాడుకోవాలి.

మానవ మనుగడకు, మానవుని జ్ఞానసంపత్తికి, మానవుని శాంతిసౌభాగ్యాలకు, మానవుని ఆధ్యాత్మికచింతనకు, మానవుని ఎదుగుదలకు, మానవుని శక్తిసామర్థ్యాలకు, మానవుని మనోనిగ్రహానికి అద్దంపట్టేవే, మన ముందుతరాల వారు మనకు అందించిన "కర్మ మరియు జ్ఞాన" సిద్ధాంతాలు.

యావత్తు మానవజాతిని పరిగణలోకి తీసుకొని, అసలు సత్యానికి దగ్గరగా, మానవ ధర్మమే లక్ష్యంగా పెట్టుకొని, ఈ రెండు సిద్ధాంతాలను ప్రభోధించడం జరిగింది. వాటిని ఎంతో శాస్త్రీయంగా విశ్లేషించి మనందరికి అందజేయడం జరిగింది. వీటిలో కులమత ప్రస్తావనకు తావులేదు.

సిద్ధి పొందిన ఏ సద్గురువైనా, ప్రాథమిక భోధనగా తమ శిష్యులకు ఈ రెండింటి విశిష్టతను క్లుప్తంగా బోధిస్తారు. ఈ కర్మ, జ్ఞాన సిద్ధాంతాలను ఒకే కోణంలో పరిశీలించి, వాటి వెనుక నున్న అసలు సత్యాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకొని, అనుభవపూర్వకంగా ఆచరించమని హెచ్చరిస్తారు.

ఈ హెచ్చరిక దేనికంటే, వీటిని సాధన చేస్తున్నప్పుడు, అన్ని వేళలా సాధకుని "అహం" (నేను/నాది) అడ్డుతగులుతూ వుంటుంది. ఈ "అహం" వైపు తనకు తెలియకుండానే ఆకర్షితుడై, సాధకుడు తన సాధనను మధ్యలో వదిలిపెట్టి, మళ్ళీ ఎక్కడనుంచి మొదలుపెట్టేడో అక్కడకే చేరుకుంటాడు. అహాన్ని పూర్తిగా త్యజించడానికి ఈ రెండు యోగాలు ఎంతో సహకరిస్తాయి.

మనస్సు, బుద్ధి, అహంకారముల వికారం వలన విభిన్న ఆలోచనలకు, తీవ్ర అశాంతికి లోనౌతున్నాడు మానవుడు. దీనికి కారణం మానవుడే తప్పా, భగవంతుడు కాదన్న విషయాన్ని మనం మనస్ఫూర్తిగా ఒప్పుకోవాలి.

ఎదో ఒక సాంప్రదాయాన్ని ఎంచుకొని, దానినే ఆచరిస్తూ, దానిని మాత్రమే పరమ సత్యమని నమ్మి, ఇతర విశ్వాసాలను విమర్శిస్తూ, తనకు తెలియకుండానే అజ్ఞానానికి లోనౌతున్నాడు జీవుడు. తాను విశ్వసించిన సాంప్రదాయాన్ని అనుసరించి, తాను సత్యాన్ని గ్రహించకబోగా ఇతరులను సంశయానికి గురిచేస్తున్నాడు నేటి మానవుడు.

లౌకికమైన తెలివితేటలకు, లౌకికమైన విషయపరిజ్ఞానానికి, అసలు సత్యంతో ఎటువంటి సంబంధం లేదన్నది నిజం. దీన్నే "మాయ" అని చాల సరళంగా చెప్పేరు మహనీయులు. ఈ "మాయే" మానవుని మనస్సుని, బుద్ధిని ఎంతగానో ప్రభావితం చేస్తుంది! మహాజ్ఞానవంతులను సైతం అజ్ఞానానికి, అహంకారానికి గురిచేస్తూవుంటుంది. దీనినుండి పూర్తిగా ముక్తి పొందాలంటే "సత్యాన్ని" అన్వేషించాలి.

జీవులందరి దేహాలలో ఆత్మరూపంలో నెలకొనివున్న పరమాత్మ, జీవునికి ఎంతో చైతన్యాన్ని ప్రసాదించి, జీవుడు చేస్తున్న నానావిధ కర్మలకు ఎటువంటి బాధ్యత తీసుకోకుండా, కేవలం ఓ సాక్షీభూతంగా మాత్రమే వ్యవహరిస్తాడు.

దీనిని అర్థంచేసుకోకుండా, మానవుడు తాను చేసే ప్రతికర్మ, తన ప్రతిభతో తానే స్వయంగా చేస్తున్నాడని భావిస్తూ, తనలోనే నెలకొనియున్న పరమాత్మను విస్మరిస్తున్నాడు.

మంచి జరిగితే భగవంతుడిని ఏంతగానో పొగుడుతాడు!

చెడు జరిగితే అంతకన్నా నిష్టూరంగా పరమాత్మను విమర్శిస్తాడు! అన్నీ బాగుంటే, ఇదంతా తన ప్రతిభని గర్విస్తాడు!

ఇలాంటి మాయలో వున్న మానవుడు, తనలోనే నెలకొనియున్న వున్న ఆ పరమాత్మను ఎలా గ్రహించగలడు? ఎలా అనుభూతి పొందగలడు?

అందుకు తీవ్ర సాధన కావాలి! ఆత్మతత్వం పూర్తిగా అవగతం కావాలి!

అందుకు సద్గురువు యొక్క పూర్తి కృపాకటాక్షాలు కావాలి!

ఈ సత్యశోధనలో వేదాలద్వారా, ఉపనిషత్తులద్వారా, ఎన్నో గ్రంథాలద్వారా, కావ్యాలద్వారా, ఈ సృష్టిలో అంతర్లీనంగా గోచరిస్తున్న దివ్య పరమాత్మ విభూతిద్వారా, ఎంతోమంది సద్గురువుల జీవితచరిత్రలద్వారా, సత్పురుషుల సాంగత్యంద్వారా, మదిలో నిత్యం కలిగే ఆలోచనలద్వారా, అంతర్మథనం ద్వారా, గురుదేవుల ప్రత్యక్ష బోధద్వారా “ఆత్మతత్వాన్ని” గ్రహించే ప్రయత్నం మొదలుపెట్టేను!

నాకు ప్రత్యక్షదర్శనం ప్రసాదించినప్పుడల్లా, ఎక్కువగా “ఆత్మతత్యము” గురించే బోధించేవారు గురుదేవులు.

ఎందుకంటే, ఆత్మకు జననమరణములు వుండవు. అలాగే భూత, భవిష్యత్, వర్తమానాలు వుండవు. అది శాశ్వతము, సనాతనము.

అది అంతటా వ్యాపించియున్నది. అన్ని జీవులయందు వున్నది. ఆత్మను ఆయుధములు ఏమీ చేయలేవు, అగ్ని కాల్చలేదు, నీరు తడపలేదు, గాలి ఆరబెట్టలేదు. అంటే ప్రపంచాన్ని శాసించే పంచభూతములు సైతం ఆత్మను ఏమి చేయలేవు. దానిని తెలుసుకోవడమే అసలైన సాధన. దానిగురించే యోగుల తపన. ఆత్మను చాలామంది చాలారకాలుగా వర్ణిస్తారు. దానిని వర్ణించేకన్నా తీవ్ర తపనతో, జ్ఞాన సాధన ద్వారా అనుభూతి పొందడం ఉత్తమం.

తనను తాను పూర్తిగా తెలుసుకొని, తద్వార "ఆత్మానుభూతి" పొందడమే అసలైన సాధనని గురుదేవులు ఎన్నోసార్లు పేర్కొన్నారు.

జీవితంలో మానవుడు ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలబారినుండి బయటపడాలన్నా, ఉన్నతస్థితినొంది పరమానందాన్ని ఆస్వాదించాలన్నా, పరమాత్మకు ప్రతిరూపమైన తనను తానూ తెలుసుకోవాలన్నా, ఈ జననమరణ చక్రం నుండి పూర్తిగా విడిపడాలన్నా, తన నిజ స్థానానికి తిరిగిచేరుకోవాలన్నా "ఆత్మజ్ఞానం" పొంది తీరాల్సిందే.

కర్మబంధం నుండి ముక్తిపొందితే "ఆత్మజ్ఞానం" సిద్ధిస్తుంది. నిరంతరం ఆత్మధ్యానంలో వుండు. అతిత్వరలోనే తప్పకుండా నువ్వు సత్యాన్ని గ్రహిస్తావు. శుభం భూయాత్! అని పూజ్య గురుదేవులు తమ అభయాన్ని ప్రసాదించేరు.

## అధ్యాయం - ౩౦

## పరావిద్య - అపరావిద్య

ఒక సంవత్సర కాలం పాటూ గురుదేవులు నాకు ప్రత్యక్ష దర్శనభాగ్యం ప్రసాదించకపోయినా పరోక్షంగా నా సంశయాలను ఎప్పటికప్పుడు తీరుస్తూనే వున్నారు. ఈ సంవత్సర కాలం నేను పూర్తిగా విచారణ, విశ్లేషణ తోనే గడపాలన్నది గురుదేవుల ఇచ్ఛ అయివుండవచ్చు.

ఒకపక్క కుటుంబ, ఉద్యోగ బాధ్యతలను ఒక కర్తవ్యంగా నిర్వహిస్తూ, ప్రయాణ సమయాల్లో ఎక్కువుగా ఆత్మచింతనతో గడిపేవాణ్ణి. దీంతో ఎన్నో ఆధ్యాత్మిక విషయాల్లో చాలా Clarity వచ్చింది, అలాగే ఎన్నో క్రొత్త సంశయాలు కూడా నా మదిలో చోటుచేసుకున్నాయి. వాటిని ఒక చిన్న పుస్తకంలో వ్రాసుకున్నాను.

ఆత్మవిచారణలో నేను గ్రహించిన కొన్ని విషయాలు –

ఈ ప్రపంచాన్ని పూర్తిగా తెలుసుకోవాలంటే ముందుగా, పరావిద్య మఱియు అపరావిద్య అనే రెండు విద్యలను అవగతం చేసుకోవాలని బ్రహ్మవిదులు పేర్కొన్నారు.

అపరావిద్యలో నాలుగు వేదాలుతో పాటు వేదాంగములైన శిక్షా, కల్పము, వ్యాకరణము, నిరుక్తము, చందస్సు, జ్యోతిషము వస్తాయి.

ఈ నాలుగు వేదముల సంవిధానమును బట్టీ అనేకానేక కర్మల ఆచరణ జరుగుతుంది. ఈ నాలుగు వేదములు, దేవతలను స్తుతించు ఋక్కులను (ఋగ్వేదము), యజ్ఞయాగాది కర్మలను (యజుర్వేదము), ఋగ్వేదంలోని ఋక్కులను సుస్వరంతో గానం చేయడం (సామవేదము), యజ్ఞ పద్ధతులు, ఆయురారోగ్య పద్ధతులు, అస్త్రశస్త్ర విషయములు (అథర్వవేదము) పేర్కొంటాయి. ఇవన్నీ కూడా అపరావిద్యను భోదిస్తాయి.

శాశ్వతమూ, అమరమూ అయిన తత్వాన్ని అందించేదే పరావిద్య. ఇది సనాతనమైన ఆత్మను గురించి తెలియజేస్తుంది. వేదాంతములైన (వేదముల చివరి భాగములు) అన్ని ఉపనిషత్తులు పరావిద్యను బోధిస్తాయి. దీనినే "ఉపనిషద్విద్య" అని కూడా అంటారు.

కళ్ళు మొదలైన జ్ఞానేంద్రియాలకు అందనిది, చేతులూ మొదలైన కర్మేంద్రియాలకు దొరకనిది, రంగు లేనిది, అవయములు లేనిది, చావుపుట్టుకలు లేనిది, శాశ్వతమైనదీ, అంతటా వున్నది, అత్యంత సూక్ష్మమైనది, అయినటువంటి "అక్షరపరబహ్మము" ఈ విశ్వమంతటికి మూలంగా భావించి, జ్ఞానులైన మహర్షులు దీనిని అంతటా దర్శిస్తారు.

అటువంటి పరమాత్మను మనస్సుతో గ్రహించవచ్చు. ఆత్మానుభూతికి మనస్సే ప్రధానము. ప్రతిజీవి హృదయంలో పరమాత్మ సూక్ష్మరూపంలో వున్నాడు. ఉపాధులు వేరైనప్పటికీ ఆత్మ వస్తువు ఒకటే. నదులు వేరైనప్పటికీ నీరు ఒక్కటే కదా! అనేక నదులు సముద్రంలో కలిసినప్పుడు అవి తమ ఉనికిని కోల్పోతున్నాయి కదా!.

ప్రతిజీవుడు సచ్చిదానంద శివస్వరూపుడే! ఆ సత్యాన్ని గ్రహించాలంటే ఆత్మభావంతో సాధనచెయ్యాలి.

ఎవరైతే అన్ని జీవులను ఆత్మలోనూ, ఆత్మను అన్ని జీవులలోనూ చూస్తారో వారికి యెవ్వరియందు ద్వేషభావం వుండదు. ఆత్మే అన్ని జీవరాసులుగా వున్నదని గ్రహించిన వ్యక్తికి మోహం, శోకం ఎలా వుంటాయి?

ఆత్మానుభూతి పొందిన వ్యక్తి, విశ్వమంతటిని ఆత్మస్వరూపంగా చూస్తాడు. అతనికి ఆత్మ తప్ప ప్రపంచములో వేరేది కనిపించదు. ఏదైనా రెండవ వస్తువు ఉన్నప్పుడు మాత్రమే కదా మనకు దానిపైన మనసుపోయేది. అంతా ఒకటే అయినప్పుడు మనసు ఎక్కడకు పోగలదు. ఒక్కచోటే వుంటుంది. అందువలన బాధగాని, మోహంగాని, ద్వేషంగాని కలగవు.

ఆత్మానుభూతి, ఆత్మసాక్షాత్కారం మొదలగునవి ఆంతరంగిక అనుభవాలు. బయటి ప్రపంచం ఎప్పటిలానే ఉంటుంది. చూసేవాడి మనసును బట్టీ, వ్యక్తివ్యక్తికీ ప్రపంచస్వభావం వేరేలా ఉంటుంది.

ఒక యువకుడికి ఏదైనా సాధించగలననే విశ్వాసం ఉంటుంది. అదే ఒక ముసలివ్యక్తికి అంతా అయిపోయిందనే భావన ఉంటుంది.

ప్రపంచం ఏమీ మారలేదు. మార్పంతా చూసేవాడిని బట్టే వుంటుంది. అందుకే ఆత్మసాక్షాత్కారం పొందిన వ్యక్తియొక్క మనసు విశాలమై విశ్వమంతటితోనూ ఏకం అవుతుంది. అతడు అన్నింటి అంతరార్థాన్నీ గ్రహిస్తాడు. అందున్న జ్ఞానాన్ని తెలుసుకుంటాడు. అతడు మాత్రమే నిజమైన మనీషి.

మనీషి అంటే మనసును వశం చేసుకొన్నవాడు అని అర్థం. మనసు చెప్పినట్లు అతడు ఆడడు, అతడు చెప్పినట్లు మనసు ఆడుతుంది. ఆత్మానుభూతి పొందినవాడికి తెలుసుకోవలసింది ఏమీ లేకపోవడం వలన అతడు నిత్యతృప్తుడై

ఉంటాడు. అతడు కేవలం ఆత్మ / పరమాత్మనే విశ్వసిస్తాడు. వస్తువుల నిజమైన తత్వాన్ని తెలుసుకొన్నవాడు కాబట్టి దేనికీ లొంగడు.

ఆత్మ స్థిరమైనదని, మనస్సు కంటే వేగవంతమైనదని, ఇంద్రియాలు దాన్ని పొందలేవు. అంటే విశ్వమంతా వ్యాపించియున్న ఆత్మ ఎక్కడకు కదలగలదు!

కాబట్టీ ఈ మనసు, శరీరం అన్నీ అందులో భాగమే కదా! అంటే మనసు ఒక వస్తువును చేరకముందే, ఆత్మ అక్కడ ప్రత్యక్షమౌతుంది, అంటే ఆత్మ స్థిరముగా ఉంటూనే మనసు కన్నా వేగవంతమైంది.

ఇంద్రియాలు ఆత్మను గ్రహించలేవు కారణం చెవి, చర్మము, నాలుక, కన్ను, ముక్కు ఇత్యాది జ్ఞానేంద్రియాలు బయటి ప్రపంచాన్ని తెలుసుకోవడానికే సృష్టింపబడ్డాయి. ఇవి పనిచేయాలంటే కదలని వస్తువు ఒకటి ఆధారముగా వుండాలి.

ఒక వాహనం కదలాలంటే కదలని రోడ్డు, ఒక చలనచిత్రం చూడాలంటే ఒక కదలని తెర వుండాలికదా! అంటే ప్రాణం అనేది ఆత్మను ఆధారముగా చేసుకొని ఇంద్రియాలు పనిచేసేటట్టు చేస్తుంది.

ప్రతి ఒక్కరిలో ఆత్మ ఉంది కాబట్టీ, అది అందరికీ చాలా దగ్గరగా ఉందన్నమాట, కాని ఈ విషయాన్ని అనుభవపూర్వకముగా తెలుసుకోలేనప్పుడు అది మనకు దూరంగా వుంటుందని అర్థం.

ఆత్మగా అది మనలో వుండి, పరమాత్మగా మన బయట ఉందన్న విషయాన్ని ఇక్కడ స్పష్టంగా చెప్పడం జరిగింది. సత్యమే పరమాత్మ! జీవుని అసలు స్వరూపం కూడా పరమాత్మే అన్నది సత్యం! సాధనతో ఆ సత్యమైన పదార్థం "నేనే" అన్న ఎరుక పొందడమే ఆత్మజ్ఞానం! దాని ఫలితమే ఆత్మానుభూతి! ఇదే అత్యున్నత స్థితి! బ్రహ్మైక్య స్థితి!

ఎప్పటికైనా ఈ శరీరం కాలి బూడిద అయిపోతుంది. ఈ ప్రాణం మరణంలేని ఆత్మతో కలిసిపోతుంది కాబట్టీ, ఓ మనసా! విచారణ చెయ్యి, సాధనతో లక్ష్యాన్ని సాధించు, ఆ "నేను"ని తెలుసుకో, అని ఒక "స్వయం ప్రేరణ" చేసుకోవాలి సాధకుడు.

ఓ పరమాత్మా! నేను చేసిన అన్ని పనులూ నీకు తెలుసు. ఇంతవరకు చేసిన పనుల ఫలితాలను మాత్రం అనుభవించేటట్లు చేసి, ఇకమీదట చేయబోయే పనుల ఫలితం నాకు అంటకుండా వాటిని నిష్కామంగా చేసేట్టు చేయి అని ప్రార్థించాలి సాధకుడు.

సాధనలో, ఎవరిచేత ప్రేరేపింపబడి మనస్సు వస్తుప్రపంచము వైపు ఆకర్షింపబడుతున్నది? ఎవరి ఆజ్ఞకు లోబడి ప్రాణము నిలుస్తున్నది? ఎవరి వలన వాక్కు ప్రకటితమౌతున్నది? ఏ జ్ఞానము కళ్ళను, చెవులను ప్రేరేపిస్తున్నది? అన్న ప్రశ్నలకు సమాధానం అన్వేషించాలి.

## అధ్యాయం - 31

## ప్రాణవిభూతి, ఆత్మవిభూతి

ఆత్మ / బ్రహ్మము శాశ్వతమైనది, చైతన్యవంతమైనది, సర్వవ్యాపకమైనది, సాక్షీభూతమైనది, అన్ని జీవులలో నెలకొనివుంటుంది కాబట్టీ జ్ఞానంతో దాన్ని తెలుసుకోవచ్చు. జీవుని జ్ఞానానికి ఆధారంగా, సాక్షిగా ఈ ఆత్మచైతన్యస్ఫూర్తి ఎల్లప్పుడూ వెన్నంటివుంటుంది. అది సత్యము.

ప్రతివిషయాన్ని సూక్ష్మబుద్ధితో/జ్ఞానంతో ఎవడు దర్శిస్తాడో అతడు అమృతత్వమును పొందుతాడు. ఆత్మద్వారానే జీవుడు వీర్యవంతుడవుతాడు. జ్ఞానము ద్వారానే జీవుడు అమరుడవుతాడు.

జీవుడు దీనిని ఈ జన్మలోనే గనుక తెలుసుకుంటే, సత్యము అవగతమౌతుంది. తెలుసుకోలేకపోతే లోకంతో బంధం ఏర్పడుతుంది. మరల ఈ లోకంలో జన్మించవలసి వస్తుంది. కావునా జ్ఞానవంతులు సర్వభూతములలో ఒకే ఆత్మను దర్శించి, బంధరహితులై, లోకంనుండి పూర్తిగా విముక్తిని పొంది జీవన్ముక్తులవుతున్నారు.

ఆత్మజ్ఞానంతో ఆత్మానుభూతి పొందాలంటే, జీవునికి తన దేహనిర్మాణం గురించి కొంత అవగాహన వుండాలి. ఈ విషయం ఓ కథారూపంలో ప్రశ్నోపనిషత్తులో ప్రస్తావించ బడింది.

ఒకప్పుడు జీవుని శరీరంలో నున్న పంచభూతములు, ఇంద్రియములు కలిసి, "ఈ శరీరం ఇంత చైతన్యంగా, ప్రకాశవంతంగా వుండటానికి కారణం మేమే! కనుక మేమే దేవతులమని భావించేయి.

ఇది గ్రహించిన "ప్రాణం" వాటినుద్దేశించి, అసలు ఈ శరీరం నా వలనే నిలిచివుంది, నేనే ప్రాణాపాన రూపంలో దీనిని చైతన్యవంతంగా వుంచుతున్నాను, ఇదిగో చూడండని చెప్పి, శరీరాన్ని విడిచిపెట్టే ప్రయత్నంచేసింది. వెంటనే శరీరంలో పంచభూతాలు, ఇంద్రియాలు నిర్వీర్యమై ప్రాణంతో పాటూ పైకి పోవలసి వచ్చింది.

వెంటనే అవి తేరుకొని ప్రాణముంటేనే తాము వుండగలమని తెలుసుకొని, ప్రాణాన్ని వుండమని బ్రతిమాలి, ప్రాణాన్ని ఈ విధంగా స్తుతించడం ప్రారంభించేయి –

ఓ ప్రాణమా! నీవే జీవశక్తివి, నీవే ఈ శరీరంలో అగ్నిగా దహిస్తున్నావు, సూర్యుడిలా ప్రకాశిస్తున్నావు, వాయువు నీవే, పదార్థం నీవే, స్థూలసూక్ష్మాలు నీవే, అమృతం నీవే, వేదాలు నీవే, జ్ఞానం నీవే, ధర్మాలు నీవే, నీవే గర్భంలోనుండి జన్మిస్తావు, నీవే ప్రజాపతివి, మమ్మల్ని ధరించేది నీవే, దేవతలకు ఆహుతులను అందించేది నువ్వే, పితృదేవతలకు పిండమును అందించేది నువ్వే, నీవే ఋషులయొక్క సదాచారము.

ఓ ప్రాణమా! నీవే ఇంద్రుడవు, రుద్రుడవు, అందరిని సంరక్షించేది కూడా నువ్వే, అన్ని వెలుగులకు మూలమైన వెలుగువి నువ్వే, జీవుల జ్ఞానేంద్రియములు నువ్వే, మనస్సు నువ్వే, నీ స్వరూపాన్ని మా యందు వుంచు! దయచేసి మమ్ము వీడి వెళ్ళవద్దు! మాకు ఐశ్వర్యమును, బుద్ధిని ప్రసాదింపుము అని స్తుతించేయి.

అయితే ఈ ప్రాణం ఎలా పుట్టింది? శరీరంలో ఎట్లు ప్రవేశిస్తుంది? ఇంద్రియాలు, మనస్సును ఎట్లు ధరిస్తున్నది? ఎట్లు శరీరాన్ని విడచి బయటకు పోతున్నది? అన్న సందేహం మనకు కలుగుతుంది. దీనికి సమాధానం మనకు ఉపనిషత్తులలో లభిస్తుంది.

ఆత్మ ద్వారా ప్రాణం ఏర్పడుతుంది, అది మనస్సు ద్వారా జీవుని శరీరంలోకి ప్రవేశిస్తుంది. శరీరం యొక్క నీడవలే ప్రాణం, ఆత్మను అంటిపెట్టుకొని వుంటుంది. ఎలాగైతే దేశాన్ని ఏలే చక్రవర్తి, కొన్ని ప్రాంతాలను పాలించడానికి కొంతమంది అధికారులను నియమించి, తాను మాత్రం సర్వాధికారిగా వుంటాడో అలాగే ప్రాణం కూడా శరీరంలో కొన్ని విభాగాలను ఏర్పరచి, తానే అన్నింటికీ సర్వాధికారిగా వుంటుంది.

ఈ ప్రాణం ఐదు రకాల వాయువుల రూపంలో శరీరమంతా నెలకొనివుంటుంది. శరీర మలమూత్ర ద్వారాలలో అపానవాయువుగా, జ్ఞానేంద్రియములలో ప్రాణవాయువుగా, ప్రాణ, అపాన వాయువుల నడుమ సమానవాయువుగా వుంటుంది.

ఈ సమానవాయువు, దేహంలోనున్న అన్ని భాగాలకు అన్నసారాన్ని (శక్తిని) అందిస్తుంది. అన్నసారా శక్తితో ఆయా అవయములు చైతన్యమును పొంది, వాటి పనులను అవి నిర్వర్తిస్తుంటాయి.

ఇక ఆత్మ జీవుని హృదయంలో నెలకొనివుంటుంది. ఈ హృదయంలో 101 నాడులుంటాయి, ప్రతి నాడిలో మళ్ళీ 100 లఘునాడులుంటాయి. ప్రతీ లఘునాడిలో మళ్ళీ 72000 ఉపనాడులుంటాయి. వీటన్నింటిలో సంచరించే వాయువును వ్యాన మంటారు.

ఈ నాడులలో ఎంతో ముఖ్యమైనది సుషుమ్నునాడి. అక్కడ ఉదానవాయువు వుంటుంది. ఈ వాయవే జీవుని యొక్క కర్మననుసరించి

ఊర్ధ్వ, అధో, మనుష్య లోకాలకు తీసుకొనిపోతుంది. నిద్రించే సమయంలో జీవుని ఇంద్రియాలన్నీ అతని మనస్సులో విలీనమౌతాయి, మెలుకువ వచ్చినప్పుడు మరల వికసిస్తాయి.

ఈ నిద్రావస్థలో జీవుని ఇంద్రియములు తాత్కాలికంగా అచేతనములైనప్పటికీ, శరీరంలో ప్రాణములనే అగ్నులు మాత్రం మేలుకొనేవుంటాయి. ఈ స్థితిలో మనస్సు తన సంస్కారాలను అనుభవిస్తుంది. దీనినే స్వప్నావస్థ అని అంటారు. జాగ్రదావస్థలో మనస్సు ఏయే విషయాలను గ్రహిస్తుందో, వాటితో ఒక కొత్త ప్రపంచాన్ని సృష్టించుకొని, దానిని స్వప్నావస్థలో అనుభవిస్తుంది మనస్సు.

ఆపిదప మనస్సు ఒక తేజస్సుచే ఆవహింపబడి, స్వప్నావస్థను దాటి అనిర్వచనీయమైన ఆనందాన్ని అనుభవిస్తుంది. దీనినే సుషుప్తి స్థితి (గాఢనిద్ర) అంటాము. అంటే ఎటువంటి విషయాల జోలికి పోకుండా మనస్సు తానే స్వయంగా ప్రకాశిస్తూ వుంటుంది. ఈ స్థితిలో ఇంద్రియాలు, మనస్సు జీవాత్మలో ఏకమౌతాయి.

ఇక్కడ ప్రాణప్రక్రియను యజ్ఞముగా చెప్తూ, మనస్సును యజ్ఞకర్తగా (యజమానిగా) పేర్కొంటూ, ప్రతిరోజూ ఈ యజ్ఞమే, యజమానిని పరమాత్మ (సుషుప్తి) వద్దకు తీసుకొని పోతుందని ఎంతో శాస్త్రీయంగా చెప్పడం జరిగింది.

ఈ మహోన్నత స్థితిలో ఒక్క "జీవచైతన్యం" మాత్రమే మిగిలివుంటుంది. మిగతావేవీ అనుభవంలోకి రావు. ఆ అవస్థలో జీవాత్మ పరమాత్మలో ప్రతిష్టింపబడతాడు.

ఇదే "అద్వైత" స్థితి, "అయమాత్మాబ్రహ్మ" స్థితి, "సర్వం ఖల్విదం బ్రహ్మ" స్థితి. ఈ స్థితిని పొందడానికి "ఓంకార" మంత్రాన్ని అందించేరు ఋషులు.

ఇక ఈ ప్రపంచానికి సంబంధించి సూర్యుడు ప్రాణము, భూమి అపానవాయువు, ఈ రెండింటి మధ్యనున్న ఆకాశము సమానవాయువు, భూమిని ఆక్రమించియున్న వాయువే వ్యానము.

అగ్నియే (జఠరాగ్ని) ఉదానము, ఈ అగ్ని ఆరిపోయినప్పుడు జీవుని శరీరంలోయున్న అన్ని ఇంద్రియాలు ప్రాణంలోను, ప్రాణము మనస్సులోను కలసిపోవును. ఈ స్థితిలో మనస్సులో కలిగే సంకల్పమును అనుసరించి జీవునికి పునర్జన్మ సంభవిస్తుంది.

ఆత్మకు నీడలా ప్రాణం వుంటుంది కాబట్టీ,

ప్రాణవిభూతే ఆత్మవిభూతి, అదే పరమాత్మ విభూతి.

## అధ్యాయం - 32

# హిమాలయాల్లో గురుదేవుల గుహలకు ప్రయాణం

హిమాలయాల్లో పూజ్య గురుదేవులు ఎక్కువసేపు గడిపే గుహను (దీన్నే మహావతార్ బాబాజీ గుహ అని అంటారు) దర్శిద్దామన్న కోరిక 2015 అక్టోబర్ లో నాకు కలిగింది.

ఎందుకంటే చాలా మంది శ్రీ బాబాజీ గారి భక్తులు, ఆ గుహను దర్శించేమని,

ఆ గుహలో శ్రీ బాబాజీ మహాశయులు నిత్యం ధ్యాననిముగ్నులై వుంటారని, కొంతమందికి తమ దర్శనం కూడా ప్రసాదించేరని చెప్పగా విన్నాను.

ఎంతోమంది శిష్యులు గురుదేవుల దర్శన భాగ్యాన్ని తాము పొందేమన్న విషయం నేను విన్నప్పుడల్లా నా మనస్సు ఆనందంతో ఉప్పొంగిపోయేది. కారణం ఆ మధురానుభూతిని నేను చాలాసార్లు అనుభవించేను కాబట్టీ.

మనలో ఆత్మజ్ఞాన జిజ్ఞాస కలిగినప్పుడు, ఆ జిజ్ఞాసతో సత్యాన్వేషణ

చేపట్టినప్పుడు పూజ్య గురుదేవులు తమంత తాము ఎక్కడైనా, ఎప్పుడైనా తమ దర్శన, స్పర్శన, సంభాషణా భాగ్యాన్ని ప్రసాదిస్తారు అన్న దానికి నేను ఒక ప్రత్యక్ష సాక్షిని. ఆ సత్యం నాలో స్ఫురించి నప్పుడల్లా నా మది పులకరించిపోయేది. ఆ ఘట్టాలను నెమరు వేసుకునేవాణ్ణి.

నాకు కూడా గురుదేవులు ప్రత్యక్ష దర్శనాన్ని ప్రసాదించి చాలా కాలం అయ్యింది కాబట్టీ, ఒక్కసారి ఆ గుహలను దర్శించి వద్దామన్న కోరిక కలిగింది.

బాబాజీ గుహగా ప్రసిద్ధి గాంచిన ఈ ప్రదేశం హిమాలయ పర్వతశ్రేణి పాదభాగంలో, ఉత్తరాఖండ్ రాష్ట్రంలో వున్న రాణీకేత్ పట్టణానికి సుమారు 60Kms దూరంలో వుందన్న విషయం ఇదివరకే నేను వినియున్నాను.

ఎంతో సమయం, ఎంతో ఖర్చుతో కూడుకున్న ప్రయాణం ఇది. విశాఖపట్నం నుండి ఢిల్లీ కి రానూపోనూ flight లో వెళితే చాలా సమయం కలిసివస్తుంది. అప్పటికప్పుడు విమానం అంటే టికెట్ ధర చాలా ఎక్కువ వుంటుంది.

అంతే కాకుండా, ఇదివరకట్లా గురుదేవులు నన్ను రమ్మని సందేశం పంపలేదు! నా ఈ ప్రయాణానికి గురుదేవుల ఆజ్ఞ లభించలేదు! తీరా వెళ్లిన తరువాత గురుదేవుల దర్శనం లభిస్తుందో లేదో? ఈ ఆలోచనలతో ప్రయాణం వాయిదా వేసుకున్నాను.

ఇలా ఒక వారం రోజులు గడిచిపోయేయి. ఒకరోజు మా కంపెనీ %జజూా% ఫోన్ చేసి, వేరే పనులు వాయిదా వేసుకొని నన్ను అర్జెంటు గా న్యూ ఢిల్లీ లో వున్న Indira Gandhi National Open University (IGNOU) Registrar గారిని కలవమని చెప్పేరు. Flight Tickets, Hotel Stay, Conveyance అన్నీ నన్నే చూసుకోమని అడ్వాన్స్ మనీ transfer చేసేరు.

ఆరునెలల నుండి University యొక్క Vice Chancellor, Registrar మరియు ప్రముఖ వ్యక్తులతో నేను సంప్రదింపులు జరుపుతూనే వున్నాను. రెండుసార్లు ఢిల్లీ వెళ్ళీ అందరిని personal గా కలిసేను కూడా. ఇప్పటికి

మా కంపెనీ తరపున మేము ఇచ్చిన ఒక పెద్ద ప్రోగ్రాం యొక్క tender quotation అనేది discussion కి వచ్చింది. చాలా సంతోషం కలిగింది.

IGNOU అనేది మన భారతదేశంలో అతి పెద్ద Public Distance Learning University. అక్కడ అంత తొందరగా పనులు జరగవు. చాలా ప్రొసీజర్ వుంటుంది. రిజిస్ట్రార్ గారికి ఫోన్ చేసేను. రేపు సాయంత్రం నాలుగు గంటలకు Appointment ఇచ్చేరు.

నా ప్రయాణానికి ఇదే అతని ఆజ్ఞగా భావించి అన్ని ఏర్పాట్లు చేసుకున్నాను. Return ఎప్పుడో తెలియదు కాబట్టీ ఢిల్లీ వెళ్లడానికి మాత్రమే టికెట్ బుక్ చేసుకున్నాను. మర్నాడు వుదయం ఎనిమిది గంటల Flight కి బయలుదేరి పదిన్నర గంటలకు ఢిల్లీ చేరుకున్నాను. హెూటల్ రూమ్ తీసుకున్నాను.

ఢిల్లీ నుండి శ్రీ బాబాజీ మహాశయుల గుహ ప్రాంతానికి, Kathgodam వరకు ట్రైన్ లో వెళ్లి అక్కడనుంచి టాక్సీ బుక్ చేసుకొని రాణిఖేత్, ద్వారాహట్ మీదుగా కుకుచినా చేరుకొని, అక్కడనుంచి సుమారు నాలుగు కిలోమీటర్లు నడకసాగించి గుహకు చేరుకోవచ్చు.

ఆ రూట్లో Kathgodam వూరు ఆఖరి రైల్వే స్టేషన్. టూరిస్టులు ఎక్కువుగా వస్తారు కాబట్టీ, హెూటల్స్ మరియు టాక్సీ లకు కొదవలేదు. Kathgodam నుండి రాణిఖేత్ వెళ్ళే మెయిన్ రోడ్డు దారిలో ఒక తొమ్మిది కిలోమీటర్ల లూప్ రోడ్డు లో నైనిటాల్ కి కూడా వెళ్ళవచ్చు.

నైనిటాల్ అనేది పెద్ద మంచినీటి సరస్సుతో కూడిన అందమైన టూరిస్ట్ ప్లేస్ మరియు నైనాదేవి అమ్మవారు వెలసిన దివ్య క్షేత్రం. ఇంకో నైనాదేవి క్షేత్రం హిమాచల్ ప్రదేశ్ లోని బిలాస్పూర్ జిల్లాలో వుంది.

ఢిల్లీ నుండి Kathgodam కి మూడు ట్రైన్స్ వున్నాయి. నా పని పూర్తవ్వడం బట్టీ నా తదుపరి ప్రయాణం వుంటుంది కాబట్టి ఒక ప్రణాళికను తయారుచేసి పెట్టుకున్నాను.

భోజనం చేసి యూనివర్సిటీ చేరుకున్నాను. ఆరోజు, ఆ మరునాడు మధ్యాహ్నం దాకా కూడా యూనివర్సిటీ పనితో బిజీగా గడిచిపోయింది. వచ్చిన పని పూర్తయింది. ఆరోజు రాత్రి ఎనిమిదిన్నర ట్రైన్ కి తత్కాల్ లో థర్డ్ ఏసీ లో బెర్త్ దొరికింది. హొటల్ రూమ్ కి చేరుకొని, యూనివర్సిటీ తో తదుపరి జరపవలసిన లావాదేవీలు వగైరా మా హెడ్ ఆఫీస్ స్టాఫ్ తో మాట్లాడి ఐదింటికల్లా ఫ్రీ అయిపోయేను.

రాత్రి ట్రైన్ లో ప్రయాణించి , మరునాడు తెల్లవారుఝామున ఐదింటికి Kathgodam చేరుకున్నాను. చుట్టూ కొండల నడుమ మంచి అందమైన స్టేషన్. చాలా నీట్ గా వుంది. Paid Ac వెయిటింగ్ హాల్ లోకి వెళ్ళేను. బాత్రూమ్స్ చాలా నీటుగా వున్నాయి. ఆరింటికల్లా Ready అయిపోయి స్టేషన్ బయటకు వచ్చేను.

నా ప్లాన్ ఏంటంటే, ఇక్కడ నుంచి శ్రీ బాబాజీ గుహలకు రానూపోనూ (సుమారు 260 Kms) కూడా టాక్సీ మాట్లాడుకొని మధ్యలో ముఖ్యమైన క్షేత్రాలు దర్శిస్తూ, రాత్రికి రాణిఖేత్ లేదా ద్వారాహట్ లో బస చేసి, రేపు శ్రీ బాబాజీ మహాశయుల గుహ మరియు పూజ్య గురుదేవుల ప్రత్యక్ష దర్శనార్ధం ఆ పరిసర ప్రాంతాలలో గడిపి రాత్రికి తిరిగి Kathgodam చేరుకోవచ్చు అన్నది నా ఆలోచన.

చాలా టాక్సీలు వున్నాయి బయట. ఇక్కడనుంచి నైనిటాల్ కి గాని లేదా రాణిఖేత్ గాని వెళ్లాలంటే ఎక్కువ మంది Taxi Cabs లోనే వెళతారు. Shared టాక్సీ ఫెసిలిటీ కూడా వుంది. ప్రభుత్వ బస్సులు వున్నాయి గానీ frequency తక్కువ. ఘాట్ సెక్షన్ కాబట్టీ బస్సు ప్రయాణం బడాలికతో కూడుకున్నది. ఎక్కువమంది స్వంతంగా Taxi మాట్లాడుకుంటారు లేదా shared టాక్సీ లో వెళతారు. టాక్సీ వాళ్ళు police outpost లో రిజిస్టర్ చేసుకొని మనకు రసీదు కూడా ఇస్తారు. టాక్సీ వాళ్ళు మంచి నమ్మకస్తులుగా పేరుతెచ్చుకున్నారు.

బయటకు రాగానే ఒక నలుగురు టాక్సీవాళ్ళు నా దగ్గరకు వచ్చేరు. బాబాజీ గుహ దాకా రెండుప్రక్కల ప్రయాణం, రాత్రి బస, రేపు రిటర్న్ అన్న నా plan వారికి చెప్పి, అన్ని విషయాలు చర్చించిన పిమ్మట, స్వంతంగా ఒక టాక్సీ కి ఐదువేల రూపాయలకు బేరం కుదుర్చుకున్నాను. టిఫిన్ చేసి 06.30కిబయలుదేరాం. మధ్యలో నీమ్ కరోలి బాబా గారు కట్టించిన కొన్ని హనుమాన్ మందిరాలు దర్శించుకున్నాను.

ఈ చుట్టుపక్కల ఇంచుమించు అన్ని ప్రాంతాల్లో 108 హనుమాన్ మందిరాలను కట్టించేరు బాబా శ్రీ నీబ్ కరోరీ మహారాజ్ లేదా నీమ్ కరోలి బాబా. అతణ్ణి ఈ ప్రాంతం వారు హనుమంతుని అవతారంగా కొలుస్తారు. అతడు పుట్టిన తేదీ తెలీదు కానీ, 1973 లో బృదావన్ (ఉత్తర్ ప్రదేశ్) లో శరీరత్యాగం చేసేరు.

నైనిటాలు ఒక సుందరమైన టూరిస్ట్ ప్లేస్. ఆ సౌందర్యాన్ని తిలకిస్తూ, నైనాదేవి అమ్మవారి మందిరానికి 09.00 కి చేరుకున్నాము. పెద్ద సరోవరానికి ఆనుకొని అమ్మవారి మందిరం వుంది. భక్తులు చాలామంది వున్నారు. స్పెషల్ దర్శనం టికెట్ తీసుకున్నాను. ఒక గంటలో అమ్మవారిని దర్శించుకున్నాను. ఇక్కడ అమ్మవారు రెండు ముఖాలతో దర్శనమిస్తారు.

మరలా 10.30 కి ప్రయాణం కొనసాగించేము. పన్నెండు గంటలకు “కైంచి ధామ్” చేరుకున్నాము. ఇక్కడ శ్రీ నీమ్ కరోలి బాబా గారు చాలాకాలం వుండి, ఒక ఆశ్రమాన్ని స్థాపించేరు. దానినే “కైంచి ధామ్” అని పిలుస్తారు భక్తులు. ఆశ్రమంలో ఎన్నో దేవతా మందిరాలు వున్నాయి. అందులో ముఖ్యమైనవి శ్రీరామ, శ్రీ హనుమ మందిరాలు. అన్ని మందిరాలు దర్శించి బయటకు వచ్చేను.

ఒంటిగంటకు అక్కడనుంచి బయలుదేరి, మధ్యలో ఒక హొటల్ లో గోధుమ రొట్టెలు, పప్పు, కూరతో *%ాబఅష్ట్ర%* చేసి మూడున్నరకి రాణిఖేత్ చేరుకున్నాము.

## అధ్యాయం - 33

## మనోహరమైన గుహ, గురుదేవుల దర్శనం

రాణిఖేత్ హిమాలయ పర్వత పాదప్రాంతంలో వున్న సుందరమైన హిల్ స్టేషన్. ఎన్నో అందమైన ఆలయాలను ఇక్కడ దర్శించవచ్చు. ఇక్కడ నుంచి హిమాలయాల సౌందర్యాన్ని చక్కగా తిలకించవచ్చు. ఇది సముద్రమట్టానికి 1830 మీటర్ల ఎత్తులో వుంది. దీన్నే Queen Meadow 'రాణిగారి గడ్డి మైదానం' అని కూడా అంటారు.

ఈ ప్రాంతం భారతదేశ మిలటరీ కి సంబంధించి రెండు ప్రముఖ రెజిమెంట్లకు హెడ్క్వార్టర్స్. ఒకటి కుమాన్ రెజిమెంట్, ఇంకొకటి నాగా రెజిమెంట్. అన్ని సదుపాయాలతో కూడిన పెద్ద మిలిటరి హాస్పిటల్ ఇక్కడ వుంది.

డిసెంబర్ నుండి ఫిబ్రవరి వరకు ఉష్ణోగ్రతలు జీరో to మూడు డిగ్రీలు వుంటుంది. మంచు కురుస్తూ వుంటుంది. ఇది అక్టోబర్ నెల కాబట్టి ఉష్ణోగ్రత 10 నుండి 21 డిగ్రీల మధ్యలో వుంది. వాతావరణం ఆహ్లాదకరంగా వుంది.

రెండుగంటల సేపు రాణిఖేత్ వూరంతా తెరిగేము. చూడవలసినవి అన్ని చూపించేడు డ్రైవర్.

సార్, ఇక్కడ బస చేద్దామా లేదా ద్వారాహట్ వెళదామా? అని అడిగేడు డ్రైవర్. ఎక్కడ బావుంటుంది? అడిగేను నేను.

ద్వారాహట్ లో యోగదా సత్సంగ్ వారి ఆశ్రమం వుంది. ఈ రోజుకి అక్కడ రూమ్ దొరుకుతుందో లేదో చెప్పలేను. ఇక్కడైతే మంచి హెూటల్స్ వున్నాయి. మీ ఇష్టం! అన్నాడు.

ఇక్కడ నుండి బాబాజీ గుహలు చేరడానికి ఎంత టైం పడుతుంది? అని అడిగేను.

సార్, ఇక్కడనుంచి ద్వారాహట్ మీదుగా కుకుచినా కి 55 కిలోమీటర్లు, రెండుగంటల ప్రయాణం వుంటుంది! అన్నాడు డ్రైవర్.

ఘాట్ రోడ్డు ప్రయాణం వలన ఇద్దరం కాస్త అలసిపోయేము కాబట్టి, ఆ రాత్రికి రాణిఖేత్ లో బస చేద్దామని నిర్ణయించుకొని, ఒక మంచి హెూటల్ కి తీసుకెళ్లామని డ్రైవర్ కి చెప్పేను.

సెంటర్ లో వున్న హెూటల్ నందాదేవి కి తీసుకొచ్చేడు డ్రైవర్. హెూటల్ నీటుగా వుంది. రూమ్స్ కూడా చూసేను నీట్ గా వున్నాయి. తారీఫ్ రెండు వేలు, ఓకే అని చెప్పి రూమ్ తీసుకున్నాను. డ్రైవరుకి డబ్బులిచ్చి బయట డిన్నర్ చేసెయ్యమన్నాను. రేపు ఉదయం 06.00 కల్లా రెడీగా వుంటానన్నాడు డ్రైవర్. ఓకే అని చెప్పి రూమ్ లో ప్రవేశించేను.

స్నానం చేసి, డిన్నర్ ఆర్డర్ చేసెను. ఒక పావుగంటలో వేడి వేడిగా రెండు ఆలూపరోటాలు, అచార్, పెరుగు తీసుకొచ్చేడు. తినేసి, బెడ్ మీద నడుం వాల్చేను.

ఈ ప్రయాణానికి గురుదేవుల సహాయం లభించింది, అలాగే గురుదేవుల దర్శనం కూడా లభిస్తే నా ఆనందానికి అవధులు వుండవు. దర్శనం ప్రసాదించమని గురుదేవులను మనస్ఫూర్తిగా వేడుకొని నిద్రకు ఉపక్రమించేను. ఉదయం 4.00 కి మెలుకువ వచ్చింది. బెడ్ మీద కూర్చొని ఒక గంటసేపు ధ్యానం (ఆత్మవిచారణ) చేసుకున్నాను.

రెడీ అయ్యి, బ్యాగ్ సద్దుకొని 05.45 కి క్రిందకి వచ్చేను. రిసెప్షన్ లో బిల్ సెటిల్ చేసి, క్యాబ్ వద్దకు వచ్చేను. డ్రైవర్ రెడీ గా వున్నాడు. కార్ శుభ్రం చేసినట్టున్నాడు, బయలోపల నీట్ గా వుంది. ఒక గంట తరువాత టిఫిన్ చేద్దామని నిశ్చయించుకొని బయలుదేరేము.

ఆహ్లాదకరమైన వాతావరణంలో, హిమాలయాల సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ మా ప్రయాణం సాగింది. ద్వారాహట్ లో టిఫిన్ చేసి కుకుచినా వైపు ప్రయాణం కొనసాగింది. పైకి వెళుతున్నకొద్దీ క్రొత్త అందాలతో హిమాలయాలు శోభిస్తున్నాయి. ఇంకో రెండునెలల తరువాత ఈ ప్రాంతమంతా మంచుతో కప్పబడి పోతుంది.

07.15 కి ద్వారాహట్ మార్కెట్ సెంటర్ లో టిఫిన్ తిన్నాము. Stay చెయ్యడానికి ఎక్కడ కొన్ని హెూటల్స్ వున్నాయి. కొద్దిదూరంలో YSS Ashram (Yogada Satsang Sakha Ashram) వుంది. అక్కడ కూడా బస చెయ్యవచ్చు. అలాగే కుకుచినా లో Joshi Guest House లో కొందరు stay చేస్తారు. రూమ్స్ ఖాళీగా వుంటే ఇస్తారు.

అక్కడనుంచి బయలుదేరి 08.20 కి కుకుచినా ట్రెక్కింగ్ ప్లేస్ వద్దకు చేరుకున్నాము. కొన్ని షేరింగ్ టాక్సీ జీపులు అక్కడ ఆగి వున్నాయి. ఇంకో రెండు జీపుల నుండి పదిమంది దాకా దిగేరు. ఎదురుగా మట్టిదారి గుండా నడక సాగించేరు.

సార్, మీరు బాబాజీ గుహకి చేరుకోవాలి అంటే, ఇదిగో వాళ్ళు వెళుతున్నారు కదా, ఆ మార్గంలో ఒక గంటసేపు నడవాలి. దారి బాగానేవుంటుంది, హాయిగా అంతా చూసుకొని రండి, నేను ఇక్కడే వెయిట్ చేస్తూ వుంటాను! అన్నాడు డ్రైవర్.

అలాగే! అని చెప్పి నడక సాగించేను. కొంచెం ఎత్తుపల్లాలతో మట్టి దారి బాగానే వుంది. ప్రకృతి అందాలు తిలకిస్తూ అందరితో పాటు నడక సాగించేను.

సుమారు నలభై నిమిషాల పాటు పైకి నడక సాగించిన పిమ్మట 09.00 కి శ్రీ బాబాజీ మహాశయుల గుహకి చేరుకున్నాను.

గుహ తాలూకు ముఖద్వారం రాళ్లతో ఒక దళసరి గోడలా కట్టీ, ఒక ఇనుప గేట్ బిగించేరు. గేటుకి పైన గోడమీద –

Yogada Satsanga Society of India Cave of Mahavatar Babaji అని ఇంగ్లీష్ మఱియు హిందీలో వ్రాసిన బోర్డు ఒకటి వ్రేలాడదీసివుంది. బూట్లు విప్పి గుహలోకి ప్రవేశించేను. మరీ అంత చిన్నది కాదు, అలాగని పెద్దదీ కాదు. లోపల ఇటికల గోడతో గుహయొక్క సన్నని భాగాన్ని మూసివేసినట్టు వుంది. క్రింద చాపలు పరిచి, శుభ్రంగా వుంచేరు గుహని.

కొంతమంది క్రియాయోగులు ధ్యానం చేసుకుంటున్నారు. నేను కూడా ఒక మూల కూర్చొని పూజ్య గురుదేవులను ధ్యానించడం మొదలుపెట్టేను.

ఆశ్చర్యం ఒక్క ఐదు నిమిషాల్లోనే మనస్సులో ప్రశాంతత ఏర్పడి “ఆత్మ అనుభవంలోకి” వచ్చింది.

యావత్ విశ్వం నా శరీరంలో గోచరింప సాగింది. నా శరీరం లోపల ఎన్నో అతిచిన్న గోళాలు తమలో తాము తిరుగుతూ అన్ని చోట్లకు పయనిస్తున్నాయి. ఆవగింజ పరిమాణంలో ఒక నీలిరంగు కాంతి, మిణుక్ మిణుక్ మంటూ నా గుండె క్రిందిభాగాన మెరిసిపోతూ అద్భుత వెలుగును వెదజల్లుతోంది.

ఆ దివ్యకాంతిలో నా శరీరంలో జరుగుతున్న వాయుసంచారాన్ని, అసంఖ్యాక నాడులలో సన్నని బంగారు తీగలా ప్రసరిస్తున్న జ్ఞానతరంగాలని, రక్తనాళాల్లో బిళ్లలవలే ప్రవహిస్తున్న అన్నసారాన్ని స్పష్టంగా చూడగలుగుతున్నాను.

శరీరమంతా దూదిలా గాలిలో తేలిపోతున్నట్లు అనిపిస్తోంది. నాకు తెలియకుండానే నా రెండు కళ్లూ తెరుచుకున్నాయి. చుట్టూవున్న ప్రకృతి అనేక రంగులతో వెలిగిపోతోంది! పగటి వెలుతురులో కూడా ఆకాశంలో పాలపుంతలు, నక్షత్ర మండలాలు, పంచభూతాలు, చెట్లలో ప్రసరిస్తున్న జీవశక్తి, జీవులలో నెలకొన్న ప్రాణశక్తి, జడపదార్థాలలో ఇమిడియున్న చైతన్యం ఇలా విశ్వంలో జరిగే ప్రతీదీ నాకు గోచరిస్తోంది.

ఎదురుగా ఒక పెద్ద భవనం బంగారు రంగుతో మెరిసిపోతోంది! ఆ భవంతిలోకి వెళదామని నించునే ప్రయత్నం చేసేను! ఎదో శక్తి నన్ను ఆపే ప్రయత్నం చేస్తోంది. ఇంతలో –

ఆత్రేయా! నేను నిన్ను కలుద్దామని ఈ గుహకి రెండువందల అడుగుల పైన ఒక రాయిపై కూర్చొని వున్నాను! అక్కడికి త్వరగా చేరుకో! అన్న గురుదేవుల మాటలు వినిపించి మెళుకువ వచ్చింది!

నేను చాపమీద పద్మాసనంలో కూర్చునే వున్నాను! నా శరీరం ఎదో ఒక అద్భుతశక్తి

## అధ్యాయం - 34

## తురీయ సమాధి స్థితి ప్రసాదం, నారాయణోపనిషత్ మాధుర్యం

ప్రశాంతమైన గురుదేవుల ముఖాన్ని చూస్తూ, గురుదేవా! మీ గుహని దర్శిద్దామన్న కోరిక కలగగానే నా ప్రయాణానికి మీ సహకారం లభించినందుకు మీకు నా హృదయపూర్వక ప్రణామాలు! నా కోరిక మన్నించి నాకు దర్శన భాగ్యం ప్రసాదించిన మీకు నా సహస్ర పాదాభివందనాలు! అని మోకాళ్ళమీద వంగి గురుదేవుల మొకాళ్ళను తాకి ప్రణామాలు అర్పించేను.

సంతోషం! శుభం భూయాత్! అని తమ కుడిచెయ్యి నా తలపై పెట్టి దీవించేరు గురుదేవులు. ఎదురుగా మఠం వేసుకొని కూర్చున్నాను.

ఆత్రేయా! ఎలా అనిపించింది గుహలో నీ అనుభవం? అన్నింటినీ స్పష్టంగా చూడగలిగేవా? అని చిరునవ్వుతో నన్ను ప్రశ్నించేరు.

ఈ సృష్టిలో నిత్యం జరుగుతున్నవి, నా దేహంలో కూడా జరుగుతున్నాయన్న వాస్తవాన్ని చాలా స్పష్టంగా చూసేను గురుదేవా! మీ దయతో, ఎప్పుడూ పొందని అద్భుతమైన ఆత్మానందాన్ని అనుభూతి పొందేను గురుదేవా! అని చేతులు జోడించి నా కృతజ్ఞతలు తెలుపుకున్నాను.

ఆత్రేయా! ఈ సృష్టికి మూలమైన పరమాత్మలో, నీ ఆత్మ విలీనమయ్యింది. ఇదే నిర్వికల్ప సమాధి! ఇదే "బ్రహ్మైక్యము"! ఇదే "అయమాత్మా బ్రహ్మ"! ఇదే "అహం బ్రహ్మాస్మి"! స్థితి అని గురుదేవులు ఆర్ద్రతతో నా వైపు చూస్తూ, ఈ స్థితిని నీకు త్వరలోనే ప్రసాదిస్తానన్న నా మాటను ఇప్పుడు నిలబెట్టుకున్నాను! అని నవ్వుతూ అన్నారు.

అవును, అన్ని ఇస్తారు కానీ "ఆత్రేయా! నా సమక్షంలో మాత్రమే నీకు ఈ అనుభూతి కలుగుతుంది" అని వెంటనే అంటారు కూడా! అని కాస్త దిగులుగా మొహం పెట్టి, గురుదేవుల వంక చూస్తూ అన్నాను.

మరి గుహలో జరిగిందేమిటి? అప్పుడు నేను నీ ఎదురుగా లేనుగా? అని గురుదేవులు నన్ను ప్రశ్నించి, పెద్దగా నవ్వుతూ –

ఆత్రేయా! నేను నీ ఎదుట ప్రత్యక్షంగా లేకపోయినప్పటికీ, అవసరమైనప్పుడు ఈ రెండు సమాధి స్థితులు తమంతట తామే నీకు కలుగుతాయి! శుభం భూయాత్! అని దీవించేరు.

ఆనందం పట్టలేక, చెమ్మగిల్లిన కళ్ళతో గురుదేవులకు సాష్టాంగ నమస్కారాలు అర్పించేను!

శుభం! నీ అకుంఠిత సాధనకు, గురువు పట్ల నీకున్న అపారమైన విశ్వాసానికి, సహనానికి, నీ సర్వస్య శరణాగతికి మెచ్చి నీకు ఈ బహుమతిని ప్రసాదిస్తున్నాను.

ఆత్రేయ! వచ్చే రెండు సంవత్సరాలు నీ ధైర్యానికి, నీ విశ్వాసానికి, నీ సహనానికి ఒక పరీక్షా సమయం. ఆనందవిషాదాలు వెంటవెంటనే వచ్చిపడుతూ వుంటాయి. ఇటు సుఖాలు అటు కష్టాలు చవిచూడవలసి వస్తుంది.

నీకు నేను ఇప్పుడు ప్రసాదించిన అద్భుత శక్తితో, అమోఘ జ్ఞానంతో వాటిని ఒక మానవ కర్తవ్యంగా ఎదుర్కొని బయటపడిన నాడు, నువ్వే మాధవుడిగా విరాజిల్లుతావు.

ఆ స్థితికి నిన్ను తీసుకెళ్లడానికే, ఈ రోజు ఎక్కువ సమయం నీతో గడపాలని నిశ్చయించు కున్నాను. ఈ పరీక్షా కాలంలో నిన్ను పరోక్షంగా కార్యోన్ముఖుణ్ణి చేస్తాను గానీ ప్రత్యక్షంగా నా దర్శనం నీకు లభించదు.

నారాయణోపనిషత్తు / నారాయణసూక్తం / మంత్రపుష్పం లో చెప్పిన విధంగా, జీవునిలో నెలకున్న ఆ మహత్తర శక్తి గురించి నీకు కొన్ని సత్యాలు చెప్పక తప్పదు. శ్రద్ధతో ఆలకించు!

యచ్చ కించిత్ జగత్సర్వం దృశ్యతే శ్రూయతే పి వా

అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణః స్థితః

పరమాత్మ నుండి వేరుగా ఏదీ లేదు కనక, మనకి ప్రపంచంలో కనబడే, వినిపించే సర్వమూ కూడా ఆ శక్తి తప్ప మరొకటి కాదు.

అంటే మనం తెలుసుకోవాలనుకుంటున్న శక్తి మన లోపలా, మన బయటా ఉన్నట్టే! ఏ ఆలోచన వల్ల ఈ శక్తిని తెలుసుకోవాలని అనుకుంటున్నామో, ఆ ఆలోచన రావడానికి కారణం కూడా ఆ శక్తి తప్ప మరొకటి కాదు!

అంటే ఏ శక్తిని తెలుసుకోవాలని మనం అనుకుంటున్నామో ఆ శక్తి మనలోనే అంతర్గతంగా దాగి ఉంది!

అయితే ఇప్పుడు మనకొచ్చే ప్రశ్న - ఏ శక్తి వలన మనం అనుక్షణం

బతుకుతున్నామో, ఆ శక్తి మనలో ఎక్కడుంది?

అనంతమవ్యయం కవిగ్ం సముద్రేంతం విశ్వశంభువమ్
పద్మ కోశ ప్రతీకాశం హృదయం చాప్యధోముఖమ్
అధో నిష్ట్యా వితస్త్యాంతే నాభ్యాముపరి తిష్ఠతి
జ్వాలమాలాకులం భాతీ విశ్వస్యాయతనం మహత్

అనంతం, అవ్యయం, సర్వజ్ఞత, సంసార సముద్రానికి ఆవల వున్నది, విశ్వసంభవానికి కారణమైన ఈ అద్భుత శక్తి, మన శరీరంలోనే హృదయానికి అధోముఖంగా, నాభి పై భాగాన, కాడ పైకి – పువ్వు క్రిందకి వుండే తామరపువ్వులో వుంది. ఇదే హృదయకమలం.

సంతతగ్ం శిలాభిస్తు లంబత్యా కోశసన్నిభమ్
తస్యాంతే సుషిరగ్ం సూక్ష్మం తస్మిన్ సర్వం ప్రతిష్ఠితమ్
తస్య మధ్యే మహానగ్నిర్విశ్వార్చిర్విశ్వతో ముఖః
సోఽగ్రభుగ్విభజంతిష్ఠన్నాహారమజరః కవిః
తిర్యగూర్ధ్వమధశ్శాయీ రశ్మయః తస్య సంతతా

జ్వలజ్వలాయమానమైన నాడీసమూహంతో ఉండే ఈ హృదయకమలం మీద సూక్ష్మమైన రంధ్రం ఒకటి ఉంది. అందులో ఉన్న మహాగ్ని అనంతమైన జ్వాలలతో ప్రజ్వరిల్లుతోంది.

ఇదే వైశ్వానరుడుగా భగవద్గీతలోని “అహం వైశ్వానరోభూత్వా ప్రాణినాం దేహమాశ్రితః, ప్రాణాపానసమాయుక్తం పచామ్యన్నం చతుర్విధం” అనే శ్లోకం తో ఉదహరించబడినది.

ఈ మహాగ్ని వల్లే మనం తినేవి జీర్ణం అవుతున్నాయి. ఈమహాగ్నిజ్వాలలు జీవ శరీరంలో పైకి కిందకి వెలుగులు చిమ్ముతుంటాయి.

సంతాపయతి స్వం దేహమాపాదతలమస్తకః

తస్య మధ్యే వహ్నిశిఖా అణీయోర్ధ్వా వ్యవస్థితః

నీలతో–యదమధ్యస్థా–ద్విధ్యుల్లేఖేవ భాస్వరా

నీవారశూకవత్తన్వీ పీతా భాస్వత్యణూపమా

అయితే ఈ మహాగ్ని అలా నిరంతరం ప్రజ్వరిల్లడానికి కారణమేమిటి?

ఇలా దేహంలో ఉన్న ప్రతీదాన్నీ జీర్ణించుకునే శక్తిగల మహాగ్నికి కారణం, అందులో ఊర్ధ్వంగా వెలుగుతున్న మరో విశిష్టాగ్ని. నీలిరంగు మేఘాలలో విద్యుల్లతలా ప్రకాశించే ఈ అగ్ని ధాన్యం ములుకు అంత చిన్న రూపంలో బంగారు రంగులో వెలుగుతూ వుంటుంది.

తస్యాః శిఖాయా మధ్యే పరమాత్మా వ్యవస్థితః ?

స బ్రహ్మ స శివః స హరిః సేంద్రః సో?క్షరః పరమః స్వరాట్ ?

ఆ ధాన్యపు గింజ అగ్రభాగంలో పరమాత్మ ప్రతిష్టతమై ఉన్నాడు. అంతర్ దృష్టితో మనం గ్రహింపవలసిన భగవంతుడు. బ్రహ్మ, శివ, హరి, ఇంద్రాదులుగా కొలిచే ఏ దేవుడైనాసరే.

కాబట్టీ, భగవంతుణ్ణి తెలుసుకోవడానికి మనం ఎక్కడకీ పోనక్కరలేదు. మన హృదయంలో ఉన్న చైతన్యమే ఆ భగవంతుడు. ఇప్పుడే ఇక్కడే అతణ్ణి అనుభూతి పొందవచ్చు.

మొత్తానికి మనకి అర్థం అయ్యేది ఏమిటంటే, మానవుల ఆయుర్దాయం తక్కువ. బ్రహ్మం తెలుసుకోవాలనే గమ్యం ఉంది కానీ వెళ్ళే దారి తెలీదు. ఆత్మానుభూతి పొందిన సద్గురు అనుగ్రహంతో సత్యాన్ని గ్రహించి ఆ గమ్యాన్ని అత్యంత సులభంగా చేరవచ్చు.

అప్పుడు మనమే పరమాత్మగా విరాజిల్లుతాం. అప్పుడు బ్రహ్మర్షులు చెప్పిన ప్రకారం ఇక జననమరణాలు అనేవి వుండవు. పూర్తి శాంతి లభిస్తుంది. ఒక కార్యార్థమై

అవసరమైనప్పుడు ఒక ఆకారంతో ఈ లోకానికి వచ్చుట, పోవుట జరుగుతుంది.

ఎలాగైతే, సాలె పురుగు తన గూడును తన నోటినుండే వెలికితీసి తిరిగి తనలోకే తీసుకుంటుందో, భూమినుండి మొలకలు ఎలా ఉద్భవిస్తాయో, మానవుని తలమీదా, శరీరంపైన అప్రయత్నంగా వెంట్రుకలు ఎలా మొలుస్తాయో, అలాగే అక్షర పరబ్రహ్మము నుండి అప్రయత్నంగా ఈ విశ్వము ఉత్పన్నమవుతుంది.

అంటే ఈ విశ్వం యొక్క ఆదికి, అంతానికి బ్రహ్మమే ఆధారమని, జగత్తుకు బ్రహ్మమే ఆశ్రయమని, బ్రహ్మము యొక్క నిజస్వరూపం చైతన్యమని, ఆ చైతన్యంనుండే అప్రయత్నంగా, ఎంతో సహజంగా ఈ విశ్వం వ్యక్తమౌతుందని బోధపడుతుంది.

అని గురుదేవులు ఈ సృష్టి రహస్యాన్ని సూక్ష్మంగా తెలియజేసేరు.

## అధ్యాయం - 35

## నాలుగు మహావాక్యాలు, ధ్యానంతో ఆత్మవికాసం

ఆత్రేయా! వేదములు, వేదాంతముల రూపంలో మానవాళికి అపూర్వ జ్ఞానాన్ని అందించేరు మహర్షులు.

ఎంతోమంది మహర్షులు అకుంఠిత దీక్షతో, తపశ్శక్తితో, దివ్యదృష్టితో, తీవ్ర పరిశోధనతో, ఎంతో దూరదృష్టితో సర్వమానవ అభ్యుదయం కోసం ఈ అనంతవిశ్వము నుండి గ్రహించిన ఎన్నో అపురూప నిత్యసత్యాల సమాహారమే మన వేదములు, వేదాంతములు.

మానవులకు నాగరికతను, జీవన విధానమును నేర్పిన మొట్టమొదటి విజ్ఞానశాస్త్రమే ఈ వేదములు. మానవులకు తమ కర్తవ్యంతోపాటు, మానవధర్మాన్ని కూడా ఎంతో విస్తృతంగా బోధించాయి వేదములు. పరమాత్మ ప్రసాదించిన జ్ఞానంతో ధర్మాన్ని ఆచరిస్తూ, అసలు సత్యాన్ని గ్రహించి, తద్వారా జీవన్ముక్తుని పొందే మార్గాన్ని ఎంతో శాస్త్రీయంగా తెలియజేసాయి వేదములు.

అనేక జన్మలనుండి వెంటాడుతున్న పాపములను పరిహారంచేసుకొనే మార్గాన్ని కర్మయోగము ద్వారా మనకు బోధించేయి వేదములు. జ్ఞానయోగము ద్వారా ఆత్మజ్ఞానమును మానవాళికి పరిచయం చేసాయి వేదములు.

పరబ్రహ్మమే శుద్ధచైతన్య పదార్థమని దానినుండే ఈ విశ్వమంతా ఆవిర్భవించిందన్న విజ్ఞానాన్ని మానవాళికి అందించేయి వేదములు. ఈ శుద్ధచైతన్య పదార్థము శాశ్వతమైనదని, సనాతనమైనదని, నిత్యసత్యమైనదని, కాలానికి అతీతమైనది నిర్ధారించి మనకు జ్ఞానబోధ చేసాయి వేదాంతములు.

ప్రతి వేదము తన జ్ఞాన సారాంశాన్ని, చివరగా (వేదాంతములుగా) "ఉపనిషత్తులు" రూపంలో మనకు అందించాయి. ఇవి ఆత్మజ్ఞానాన్ని తెలియజేస్తాయి. ఈ ఉపనిషత్తుల సారాంశాన్ని జిజ్ఞాసువులు, ముముక్షులు సులభంగా గ్రహించడానికి కేవలం నాలుగు మహావాక్యములుగా రూపకల్పనజేసి మనకు అందించాయి.

**ఆ మహావాక్యాలు :**

ప్రజ్ఞానం బ్రహ్మ (Supreme Knowledge is Brahma)

అహం బ్రహ్మాస్మి (I am Brahma)

తత్ త్వం అసి (That thou art)

అయం ఆత్మా బ్రహ్మ (This Atman is Brahma)

ప్రజ్ఞానం బ్రహ్మ :

ఋగ్వేద మహావాక్యముగా 'ప్రజ్ఞానం బ్రహ్మ'.

అతి ప్రాచీనమైన ఋగ్వేదములో సృష్టిమూలమును తెలియజేస్తూ ఈ బ్రహ్మాండము పరబ్రహ్మము నుండి జనించినదని, ఈ చరాచర సృష్టికి శుద్ధ చైతన్యము బ్రహ్మమేనని తీర్మానించినది. బ్రహ్మమే సర్వజ్ఞతను కలిగియున్నది.

ఎనుబది నాలుగు లక్షల జీవరాశులను నడిపించే చైతన్యము బ్రహ్మము. ప్రత్యక్ష భగవానుడైన సూర్యుడు తన పరిధిలోని గ్రహములను తన చుట్టూ భ్రమింపచేసుకొనే శక్తియే ఈ శుద్ధ చైతన్యము.

ఆద్యంతములు కానరాని ఈ అనంత సూర్యమండలములను వ్యక్తావ్యక్తమైన ఈ ఆకాశములో పయనింపచేసే శక్తి కూడా ఈ బ్రహ్మయొక్కశుద్ధ చైతన్యమేనని వివరించినది.

సృష్టికి ముందు, ఆ తరువాత కూడా వుండేది ఆత్మ ఒక్కటేనని తెలియజేసింది.

**అహంబ్రహ్మాస్మి :**

యజుర్వేద మహావాక్యముగా 'అహంబ్రహ్మాస్మి'.

అనగా నేనే పరబ్రహ్మమని జీవుడు భావించడం!

అనేక జన్మలలో జీవుడు పరిభ్రమిస్తున్నాడు. కాని అన్ని జన్మలలోను ఆ పరమాత్మే తనలో ఆత్మగా వెలుగొందుతున్నాడు. దేహంతో పాటూ తనకు లభించిన జ్ఞానంతో విచారణ సలిపి 'నేనే పరమాత్మను" అనే సత్యాన్ని దర్శించవచ్చుని, ఈ యజుర్వేద మహావాక్యము బోధిస్తోంది.

మానవులు ఆత్మశోధన, ధర్మాచరణతో ఆ స్థితిని తప్పక సాధించగలరని తెలియజేసింది. ధర్మబద్ధమైన కోరికలతో జీవించి తాను తరించి సమస్త ప్రకృతిని తరింపజేయాలని నొక్కి చెప్పింది.

**తత్త్వమసి :**

సామవేద మహావాక్యముగా 'తత్త్వమసి'.

చరాచరమంతా వ్యాపించియున్న శుద్ధచైతన్యము ఎక్కడో లేదు, నీవైయున్నదని ఈ సామవేద వాక్యం నిర్వచించడం జరిగింది. శంకర భగవత్పాదులు చాటి చెప్పిన అద్వైతము, ఈ మహావాక్యమునుండే ఆవిర్భవించింది.

'ఏక మేవ అద్వితీయం', ఉన్నది ఒక్కటే! అదే పరబ్రహ్మము. అది నీలోన, అంతటా వ్యాపించి ఉన్నదనే ఒక గొప్ప సత్యాన్ని అద్వైతము ఆవిష్కరించిది.

ఆత్మ, పరమాణు ప్రమాణమైనది. అటువంటి పరమాణువునుండే ఈ బ్రహ్మాండమంతా ఆవిర్భవించింది. కావున ఈ బ్రహ్మాండములో భాగమైన నీవే "ఆత్మవు" అని వర్ణించింది.

**అయమాత్మాబ్రహ్మ :**

నాల్గవ వేదమైన అథర్వణ మహావాక్యముగా 'అయమాత్మాబ్రహ్మ'.

ఈ వాక్యము కూడా ఆత్మయే బ్రహ్మమని తెలియజేస్తోంది. జీవాత్మ పరమాత్మలు ఒక్కటేనని విచారించింది. ఈ వేదములోనే ప్రణవ సంకేతమైన ఓంకారాన్ని మానవాళికి అందించింది.

లౌకిక వస్తుసమదాయాన్ని వివిధ నామములతో సూచించినట్లే, ఈ అనంత విశ్వమును ఓంకారమనే శబ్ద సంకేతముతో సూచించింది. గ్రహముల భ్రమణ శబ్దము ఓంకారమేనని ఇటీవల విజ్ఞానశాస్త్ర ప్రయోగాలు ధ్రువపరిచాయి.

ఆత్రేయా! జీవులన్నింటిలో అత్యంత జ్ఞానసంపన్నుడిగా, తన పూర్ణ ప్రతిరూపంగా, పూర్తి మేధస్సుతో మానవుణ్ణి సృష్టించేడు పరమాత్మ.

తనలాగే మానవుడు కూడా ఈ సృష్టిని, అందున్న ప్రతి జడజీవాన్ని జాగ్రత్తగా కాపాడుతూ, ఈ సృష్టి నిర్వాహణలో తనకు ఎంతో చేదోడువాదోడుగా వుంటాడని భావించేడు పరమాత్మ.

మానవుడు కూడా తన అపరిమిత జ్ఞానంతో కొన్ని ప్రత్యేక శక్తులను తన స్వంతం చేసుకొని, సృష్టిలో వున్న అన్ని జడజీవాలపై తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ, అపర పరమాత్మగా తన స్థానాన్ని పదిలం చేసుకున్నాడు.

మిగతా జీవాలతో పోలిస్తే ఆత్మజ్ఞానం పొందుట మానవులకు మాత్రమే సాధ్యము.అయితే మానవులు మాయకులోబడి తమ అసలు స్వరూపాన్ని గ్రహించలేకపోతున్నారు. జీవునిలో వున్న ఇంద్రియాలు, మనస్సు ఈ మాయకు దోహదపడుతున్నాయి. వీటికి లోబడి మానవులు వివిధ నైజాలతో జీవిస్తున్నాడు.

ఆత్మజ్ఞాన విషయానికొస్తే మానవుల నైజము మూడురకాలుగా ఉంటుంది. కొందరు భక్తిరసభావంతో, కొందరు క్రియాశీలంతో, కొందరు విచారణాత్మకముతో నుంటారు. ఈ మూడింటినే భక్తిమార్గమని, కర్మమార్గమని, జ్ఞానమార్గమని అనుకోవచ్చు.

వీటి మోతాదు ఒక్కొక్కరిలో ఒక్కోలాగా ఉంటుంది. ఈ మూడు ఒకదానితో ఇంకొకటి పెనవేసుకొని వుంటాయి. ఆత్మజ్ఞానము పొందుటకు ఈ మూడు అవసరమే. ఈ మూడింటి విశిష్ఠతను అర్ధము చేసుకొని తదనుగుణంగా సాధనచేయువాడు ఆత్మజ్ఞానమును పొందగలడు.

సులువుగా చెప్పాలంటే మనుజులు ఆత్మజ్ఞానం పొందుటకు మధ్వాచార్యులంత భక్తిభావం, రామానుజాచార్యులంత నిష్కామకర్మభావం, శంకరాచార్యులంత జ్ఞానభావం కలిగుండాలి.

గీతలో శ్రీకృష్ణపరమాత్మ, ఓ పార్ధా! ఎవరు నాకు ఇష్టమైన కర్మలు నిష్కామముతో చేయుదురో (కర్మయోగము), నిత్యము నన్నే ధ్యానించుదురో (ధ్యానయోగము), నాయందు అనన్యమైన భక్తి కలిగియుండెదరో (భక్తియోగము), దృశ్య వస్తువులందు బంధము పెంచుకొనక జ్ఞానవంతులై వుండెదరో (జ్ఞానయోగము) అట్టివారు నన్ను పొందెదరు.

అంతేకాదు, ఎవరైతే మూర్తత్వముతో కర్మేంద్రియాలను బంధించి, ఇంద్రియ విషయాలను మనస్సుతో ఆలోచిస్తారో వారు మిధ్యాచారులు. వారు స్వయంగా నష్టపోవడమే గాక, ఇతరులకు ఏ మాత్రమూ వుపయోగపడరు. వారు నన్ను పొందడము సాధ్యం కాదు. ఇది యదార్ధమని వివిధ సందర్భాల్లో తెలియజేశాడు.

ఇచ్చట కర్మ చేయడంగాని, చేయకపోవడంగాని ముఖ్యంకాదు. మనస్సునందు మాలిన్యము అంతరించడమే ప్రధానము.

వాటిని మనసా, వాచా, కర్మణా తొలగించకుండా ఒంటరిగా జనసంద్రమునకు దూరంగా పోయి తపమాచరించుట వలన ఉపయోగముండదు.

అలాగే ఈ వాసనల నుండీ ముక్తుడైనవాడు జనసంద్రమున నున్నప్పటికీ కూడా మోక్షమును పొందగలడని బోధించేడు.

ఇదంత సులభం కాదు. మొదటి మెట్టుగా మానవులు దుష్కర్మనుండి (చెడ్డ పనులు) సత్కర్మకు (మంచి పనులు) మారాలి, పిమ్మట సత్కర్మనుండి నిష్కామకర్మకు (ఎటువంటి ఫలితం ఆశించకుండా చేసే సుకర్మలు) మారే ప్రయత్నము చేయాలి. దీనివలన చిత్తశుద్ధి కలిగి అతి త్వరలోనే జ్ఞానం ఉదయిస్తుంది. జ్ఞానంతో వైరాగ్యం లభిస్తుంది.

మనోనిగ్రహానికి, వైరాగ్యంతో కూడిన అభ్యాసముండాలి. వైరాగ్యముండి అభ్యాసము లేకపోయినా, అభ్యాసము మాత్రమేనుండి వైరాగ్యము లేకపోయినా మనస్సు లొంగదు.

అంటే శాశ్వతము కానీ ఇంద్రియసుఖముల వెంట నిరంతరం పరిగెత్తు మనస్సుని ధ్యానము ద్వారా శాశ్వతము, సత్యమగు పరమాత్మ వైపు మరల్చాలి.

ఈ కాలంలో అనేక ధ్యానపద్ధతులు అమల్లోవున్నాయి. ఏ పద్ధతైనా సరే, మనస్సును ఏకాగ్రపరచి దైవచింతన చేయడమే ముఖ్యము. ఆరంభదశలో మనస్సు పరిపరివిధముల పరిగెత్తినా, మెల్లగా ఆత్మయందు స్థాపితము చేయాలి.

సులభంగా చెప్పాలంటే ధ్యానమును కొత్తగా నేర్చుకొనవలసిన అవసరంలేదు. అందరూ నిత్యమూ చేస్తున్నదే. అయితే ఇన్నాళ్లు జీవుడు ధ్యానిస్తున్నది కేవలము

ఈ ప్రాపంచిక విషయములు లేదా భోగవిలాసములైతే, ఇప్పుడు ఆ ధ్యానమును పరమాత్మవస్తువుపై మళ్లించడం అంతే.

ప్రతిరోజు ఓ నిర్ణీత సమయమందు ధ్యానము చేస్తూ, మెల్లమెల్లగా ధ్యాననిడివి పెంచుకుంటూ పోతే మనస్సు అధీనంలోకి తప్పక వస్తుంది.

మనస్సు, బుద్ధి ఏకమైనప్పుడు సత్యం తెలుస్తుంది! "ఆత్మ" వికసిస్తుంది! "అద్వైతం" వరిస్తుంది! "బ్రహ్మైక్యం" సిద్ధిస్తుంది. ఇదే ధ్యానం యొక్క పరాకాష్ఠ.

ఇన్నాళ్లూ బయట హడావుడి చేసిన "నేను"ని, అంతరంగంలో గ్రహించడమే అసలైన ధ్యానసాధన. అది "ఎవరో" తెలుసుకుంటే, ఇక తెలుసుకోవలసింది ఏమీ వుండదు!!

ధ్యానంలో మనస్సుని బలవంతంగా బంధిస్తే ఆత్మజ్ఞానం కలగదు! కారణం ఇంద్రియాలు వాటి పనిని ఆపవు కాబట్టీ! యోగమంటే మనస్సు ఆత్మలో లయం కావాలి!

జననమరణ చక్రం నుండి బయటపడడమే అసలైన సాధన. దేనిని తెలుసుకుంటే ఈ చక్రములో తిరిగి ప్రవేసించడో, ఏది తెలుసుకుంటే ఆత్మానందమును పొందునో, ఏది తెలుసుకుంటే ఈ చరాచర జగత్తును సమదృష్టితో చూడగలడో, ఏది తెలుసుకుంటే అసలు సత్యము అవగతమగునో, దానిని ఈ ధ్యానము ద్వారా పొందవలెను.

నారాయణుని ధ్యానించి నరుని దూషిస్తే ప్రయోజనంలేదు. మాధవుని పూజించి మానవధర్మమును విస్మరిస్తే మనుగడలేదు. సత్యమును మరచి సదాశివుని స్మరిస్తే లాభములేదు. ఈ తత్వము నెఱింగి చేయు సాధనే ధ్యానము.

## అధ్యాయం - 36

## కలిమిలేములు, కష్టసుఖాలు

సుమారు రెండుగంటల పాటు పూజ్య గురుదేవులు ఎన్నో ఆత్మజ్ఞాన విషయాలు నాతో ముచ్చటించేరు. గురు దేవులు ప్రసాదించిన అద్భుత అనుభూతులు, అమోఘ జ్ఞానం నాలో క్రొత్త ఉత్సాహాన్ని, శక్తిని నింపింది. ఆ బోధలో గురుదేవులు నాపై కురిపించిన ప్రేమ, వాత్సల్యం నన్ను ఎంతగానో ప్రభావితం చేసింది.

ఆత్రేయా! నేను వెళ్ళవలసిన సమయం ఆసన్నమైంది. వచ్చే రెండేళ్ల పరీక్షా సమయంలో ఎన్నో క్రొత్త విషయాలు నీకు తెలుస్తాయి.

సానపెట్టిన వజ్రంలా నీ ప్రజ్ఞానం వెల్లివిరుస్తుంది. రాబోయే కాలంలో ఈ ప్రజ్ఞానం ఎంతోమంది జిజ్ఞాసువులకు ఆత్మజ్ఞానం ప్రసాదిస్తుంది.

ఇక దేనికి కలత చెందవద్దు. అన్ని పరీక్షలలో నువ్వు విజయం సాధిస్తావని నాకు ప్రగాఢమైన నమ్మకం. ఈ పరీక్షా కాలంలో నీలో స్వచ్ఛమైన వైరాగ్యం చోటుచేసు కుంటుంది.

వెళ్ళి రా! శుభం భూయాత్! అని తమ రెండుచేతులు కొన్ని సెకండ్ల పాటు నా శిరస్సుపై వుంచి, సంపూర్ణంగా దీవించేరు.

అన్నింటికీ నేను సిద్ధమే గురుదేవా! అని గద్గదస్వరంతో గురుదేవులకు హామీ ఇచ్చేను.

చిరునవ్వు చిందిస్తూ, నా కళ్ళల్లోకి చూస్తూ గురుదేవులు మెల్లగా అదృశ్యమయ్యేరు.

చెమ్మగిల్లిన కళ్ళతో గురుదేవులు కూర్చున్న ప్రదేశాన్ని కళ్ళకద్దుకొని, మెల్లగా లేచి నించున్నాను.

చుట్టూవున్న వాతావరణం చాలా ప్రశాంతంగా వుంది. నడక ప్రారంభించి గురుదేవులు నన్ను ముందుగా కలసిన బండరాయి వద్దకు చేరుకున్నాను.

కొంతమంది యాత్రికులు పైకి, ఇంకొంతమంది క్రిందకి నడుస్తున్నారు. ఒక యాత్రికుణ్ణి ప్రశ్నిస్తే, పాండవులు తమ అజ్ఞాతవాసంలో కొంతకాలం కొండపైన నివసించేరని, ఆ ప్రదేశాన్ని "పాండవఖోలి" అంటారని, అక్కడ పాండవుల మందిరం కూడా వుందని చెప్పేడు.

వాచీ చూసేను, టైం 12.15 అయ్యింది. ఇక పైకి వెళ్లకుండా క్రింద టాక్సీ వద్దకు మెల్లగా నడక ప్రారంభించేను. సరిగ్గా 01.00 కి కుకుచినా లో పార్క్ చేసిన టాక్సీ వద్దకు చేరుకున్నాను.

డ్రైవర్ క్యాబ్ లో నిద్రపోతున్నాడు. లేపేను.

సార్! వచ్చేసారా! బయలుదేరదామా? అని ప్రశ్నించేడు. టీ త్రాగి బయలుదేరదామని చెప్పేను.

అలాగే సార్! అని చెప్పి, ఎదురుగా వున్న దుకాణంలో రెండు చాయ్ ఆర్డర్ చెప్పేడు. ఇద్దరం మొహం కడుక్కొని, టీ త్రాగేము. 01.15 కి రాణిఖేత్ వైపు బండి పోనిచ్చేడు.

ద్వారాహాట్ లో లంచ్ చేసి, బయలుదేరేము. రాత్రి 07.00 కల్లా Kathgodam చేరుకుంటామని డ్రైవర్ చెప్పేడు.

అలానే చేరుకుంటే, రాత్రి 08.25 కి ఢిల్లీ కి Trai వుంది. ప్రొద్దున్న ఆరింటికి ఢిల్లీ చేరుకోవచ్చు. ఢిల్లీలో ఉదయం 11.30 కి వైజాగ్ Flight వుంది. అది ఎక్కితే మధ్యాహ్నం 02.00 కి వైజాగ్ చేరుకోవచ్చు.

రాణిఖేత్ లో నెట్ దొరికింది. Online లో చూసేను. ట్రైన్లో తత్కాల్ టికెట్స్ available వున్నాయి. రేపటి Flight కి కాస్త ఎక్కువ ధరకి టికెట్స్ వున్నాయి. రెండింటినీ బుక్ చేసేను. మనస్సు తేలికబడింది.

డ్రైవర్ చెప్పినట్లే 07.15 కల్లా Kathgodam స్టేషన్ లో దింపేడు. బ్యాలెన్స్ అమౌంట్ Pay చేసి. Light గా డిన్నర్ చేసి ట్రైన్ లో నా బెర్త్ పై నడుం వాల్చేను. మరునాడు ఢిల్లీ లో Flight ఎక్కి అనుకున్నట్లు గానే వైజాగ్ చేరుకున్నాను.

పరోక్షంగా నా ఆధ్యాత్మిక సాధనలో ఎంతో తోడ్పడుతున్నప్పటికీ, పూజ్యగురుదేవులు చెప్పినట్లు తమ ప్రత్యక్ష దర్శన, స్పర్శన, సంభాషణా భాగ్యం నాకు లభించలేదు.

ఈ దీర్ఘ విరామసమయంలో, గురుదేవులు మా ఇంట ఎన్నో శుభకార్యాలు జరిపించినప్పటికీ, మాచే ఎన్నో తీర్థయాత్రలు చేయించినప్పటికీ, ఎన్నో కఠిన పరీక్షలకు కూడా గురిచేసేరు. ఇటు ఆర్థికంగా, అటు కుటుంబపరంగా, ఉద్యోగపరంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కున్నాను. ఎన్నో విషయాలలో మనస్తాపానికి గురయ్యేను.

పూజ్య గురుదేవులు అన్ని సందర్భాలలో నాకు ఎంతో మనోధైర్యాన్ని, సహనాన్ని, అద్భుత జ్ఞానాన్ని ప్రసాదిస్తూనే వున్నారు. వారి సూచనలను పాటిస్తూ రెట్టింపు ఉత్సాహంతో నా కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ మెల్లమెల్లగా అన్ని సమస్యల నుండీ బయటపడ్డాను.

ఒక్కో సమస్య నుండీ బయట పడుతున్నప్పుడల్లా, గురుదేవులకి నా మనో సాష్టాంగ ప్రణామాలు అర్పిస్తూ వుండేవాణ్ణి.

అంతా గురుకృపాహి కేవలం!

2018 ఆరంభం నుండీ మళ్ళీ మంచిరోజులు మొదలయ్యేయి. సమస్యల నుండీ పూర్తిగా బయటపడిన తరువాత నాలో ఇటు శారీరకంగా, అటు మానసికంగా ఒక మొండి ధైర్యం చోటుచేసుకుంది.

గురుకృపతో ఏదైనా సాధించగలను అన్న గాఢవిశ్వాసం నాలో నెలకుంది. ఆత్మానుభూతిని సంపూర్ణంగా గ్రోలడానికి ఈ మూడు లక్షణాలు (ధైర్యం, విశ్వాసం, సహనం) సాధకునికి తప్పక వుండాలన్న సత్యం అవగతమైంది.

## అధ్యాయం - 37

# గురు దత్తాత్రేయుడే నా గురుదేవులు

పూజ్య గురుదేవుల అనుగ్రహంతో నా నిరీక్షణకు తెరపడింది. అది 2018 May నెల. ఆఫీస్ పనిమీద మహారాష్ట్రలో వున్న నాందేడ్ పట్టణానికి వెళ్లడం జరిగింది. నాందేడ్ పట్టణం గోదావరి నదిని ఆనుకొని వుంటుంది. ఈ పట్టణం నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు సరిహద్దు.

సిక్కుల ఐదవ గురువైన గురు గోబింద్ సింగ్ ఇక్కడ దేహత్యాగం చేసేరు. వారి అవశేషాలపై వారి జ్ఞాపకార్థం “హుజూర్ సాహేబ్” మందిరం నిర్మించడం జరిగింది. చాలా పెద్ద మందిరం అత్యంత సుందరంగా నిర్మించడం జరిగింది.

సిక్కులకు అత్యంత పవిత్రమైన ఐదు పుణ్యక్షేత్రాలలో ఈ నాందేడ్ నగరం ఒకటి. మొదటిది హర్ మందిర్ సాహెబ్, అమ్రిత్ సర్, పంజాబ్ రాష్ట్రం.

ఇది సిక్కుల మొదటి గురువు శ్రీ గురు నానక్ వారి జ్ఞాపకార్థం నిర్మించడం జరిగింది. దీనినే Golden Temple అని పిలుస్తారు. ఒక సరోవరం మధ్యలో నిర్మించిన ఈ మందిరం, పూర్తిగా బంగారు రేకుతో తాపడం చెయ్యబడింది.

ఈ మందిరాన్ని నేను లోగడ దర్శించడం జరిగింది.

నాందేడ్ రైల్వేస్టేషన్ ని Huzur Sahed Nanded అని కూడా పిలుస్తారు. రైల్వేస్టేషన్ Front Elevation కూడా సిక్కుల మందిరం ఆకారంలో నిర్మించడం జరిగింది.

నాందేడులో Swamy Ramanand Teerth Marathwada University మరియు Shri Guru Gobind Singhji Institute of Engineering and Technology విద్యాసంస్థలలో నా పని రెండురోజుల్లో పూర్తి అయిపోయింది.

రెండవరోజు సాయంత్రం "హుజూర్ సాహెబ్" మందిరంలో "లంగర్" (అన్నప్రసాద వితరణ) కి భోజనం చేద్దామని వచ్చేను.

ఇక్కడ ఈ "లంగర్" కార్యక్రమం కూడా అమ్రిత్ సర్ హర్ మందిర్ సాహెబ్ లో జరిగేటట్టు, 24 గంటలు జరుగుతూనే వుంటుంది.

లంగర్ లో తినగల్గినంత రొట్టెలు, పప్పు, కూర, ఖీర్ లేదా హల్వా, మజ్జిగా పెడతారు. చాలా వేడిగా, రుచిగా వుంటాయి అన్ని పదార్ధాలు. భోజనశాల అత్యంత శుభ్రంగా వుంది.

నేను భోజనం చేసి నించున్నప్పుడు, ఒక సిక్కు కుర్రవాడు నా చేతిలో వున్న ఖాళీ గ్లాస్ లో మంచినీళ్లు పోస్తూ ...

"మీ పేరు శాస్త్రి ఆత్రేయ! అవునా?" అని హిందీలో అడిగేడు.

"అవును" అని హిందీలో సమాధానం చెప్పేను.

"మంచిది. గురుదేవులు ఇక్కడికి 125 కిలోమీటర్ల దూరంలో వున్న "మాహుర్" ఏకవీరిక శక్తి పీఠానికి వేంచేసివున్నారు. గురుదేవులను మీరు రేపు అక్కడ కలుసుకోవచ్చు. మీ రాకకై ఎదురు చూస్తూ వుంటానని మీతో చెప్పమన్నారు!"

అని చెప్పి నన్ను బయట Wash Room వద్దకు తీసుకొచ్చేడు.

నేను మిగతా వారితో పాటు Wash Room లోపలికి వెళ్ళి చేతులు కడుక్కొని బయటకు వచ్చేసరికి అతడు కనబడలేదు. విషయం అర్ధమైంది కాబట్టీ, ఇక ఎవ్వరితో అతని గురించి వాకబు చెయ్యకుండా, ఆటోలో నా హెూటల్ రూం కి చేరుకున్నాను.

ఈ మాహుర్ అనేది ఒక చిన్న పట్టణం. సహ్యాద్రి పర్వతశ్రేణి లో వుంది.

సుమారు మూడేళ్ళ క్రితం నేను మాహుర్ ఏకవీరిక (మాత రేణుకా దేవి) శక్తిపీఠాన్ని, అనసూయా మాత మఱియు శ్రీ గురుదేవ దత్త మందిరాలను దర్శించుకోవడం జరిగింది. కొండలపై వున్న ఈ మందిరాలు మాహుర్ పట్టణానికి సుమారు 7 Kms దూరంలో వుంటాయి.

మాహుర్ (మాహుర్ గడ్ అని కూడా అంటారు) శ్రీ గురు దత్తాత్రేయులు వారి జన్మస్థలంగా కూడా ప్రసిద్ధి గాంచింది. ఇక్కడే అత్రి మహాముని, అనసూయా మాత పుణ్యదంపతులకు త్రిమూర్తులు (బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు) తమను తాము వారి పుత్రునిగా దత్తత ఇచ్చుకొని మూడు శిరస్సులతో దత్తాత్రేయునిగా వ్యక్తమయ్యేరన్ని అనేక పురాణాలలో చెప్పబడింది.

అలాగే పరశురాముడు తన తల్లి రేణుకా దేవి తో పాటు ఇక్కడే స్థిరపడి, శ్రీ దత్తాత్రేయుల వారి కృపకు పాత్రుడై అతనికి శిష్యరికం చేసేడని దత్తచరిత్ర పేర్కొనబడింది.

రేణుకా దేవి మాతనే, “ఏకవీరిక” అన్న పేరుతో శక్తిపీఠంగా వెలిసింది. ఈ రేణుకా దేవిని తెలంగాణా ప్రాంత వాసులు “రేణుకా ఎల్లమ్మ” గా కొలుస్తారు. దసరా ఉత్సవాలు, దత్తజయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు ఈ దివ్యక్షేత్రంలో.

ఈ ప్రదేశంలో మూడు కొండలు వుంటాయి. ఒక కొండపై ఏకవీరికా మాత శక్తిపీఠంగా వున్న మందిరం, ఇంకొక కొండపై అత్రి, అనసూయల మందిరం, ఇంకొక కొండపై దత్తమందిరం వుంటాయి. మిగతా కొండల కన్నా ఈ దత్తశిఖరం ఎత్తుగా వుంటుంది. ఈ దివ్య క్షేత్రానికి కొద్దిదూరంలో పెనుగంగ నది ప్రవహిస్తూ వుంటుంది. మాహుర్ గడ్ ఎంతో ప్రసిద్ధిగాంచిన దత్తక్షేత్రం మఱియు శక్తిపీఠం.

శ్రీ దత్తుడు ఈ పరిసర ప్రాంతాలలోనే విహరిస్తూ వుంటారని, చాలామంది దత్తభక్తులకు, ఆత్మజ్ఞాన సాధకులకు వివిధ రూపాల్లో తన దర్శనం ప్రసాదించి వారిని అనుగ్రహించి ఆత్మానుభూతి కలుగజేస్తారని ప్రసిద్ధి.

నన్ను ఇబ్బంది పెట్టడం ఇష్టం లేకా నేను నాందేడ్ వచ్చినప్పుడే, గురుదేవులు తమ దర్శన భాగ్యాన్ని ఈ దివ్య క్షేత్రంలో ప్రసాదించడానికి నన్ను రమ్మని కబురు పంపించి వుండవచ్చు, అన్న భావన నాకు ఎంతో సంతృప్తిని కలిగించింది.

బస్సులో ప్రయాణించి ఈ క్షేత్రాన్ని పూర్తిగా దర్శించడం కష్టం, కొన్ని కిలోమీటర్లు Ghat Road కూడా, అలగే పూజ్య గురుదేవులు తమ దర్శన భాగ్యాన్ని ఎక్కడ ప్రసాదిస్తారో తెలియదు కాబట్టి, Hotel ఖాళీ చేసి రెండుప్రక్కల Taxi మాట్లాడుకొని వుదయాన్నే బయలుదేరి వెళదామని, అవసరం అయితే రాత్రి మాహుర్ లో బస చేద్దామని నిశ్చయించుకున్నాను.

Hotel Reception లో Taxi గురించి అడగ్గా తమ హొటల్ కార్ ని పంపిస్తామని, అన్నీ కలిపి Rs. 4000/- అవుతుందని చెప్పేరు. అలాగే అని, మంచి కార్ పంపమని చెప్పి, అడ్వాన్స్ ఇచ్చి Room కి వచ్చేసాను. కొంతసేపు గురుధ్యానం చేసుకొని నిద్రకు ఉపక్రమించేను.

ఉదయాన్నే లేచి, స్నానం ముగించి 07.30 కల్లా Taxi లో మాహూర్ కి ప్రయాణం సాగించేను. మధ్యలో డ్రైవర్, నేను అల్పాహారం సేవించి, ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ ప్రయాణాన్ని పదకొండు గంటలకు ఏకవీరికా అమ్మవారి శక్తిపీఠ మందిర దిగువ ప్రాంతానికి చేరుకున్నాము.

సుమారు 150 మెట్లు ఎక్కి అమ్మవారిని దర్శించుకోవాలి. Taxi ని పార్కింగ్ లో పెడతానని చెప్పేడు డ్రైవర్. నేను మెట్లు ఎక్కి అమ్మవారి మందిరానికి చేరుకున్నాను.

ఒక పెద్ద శిరస్సుతో అమ్మవారి విగ్రహం ఎంతో ఆకట్టుకుంటుంది. తీర్చిదిద్దిన పెద్ద కళ్ళు, ముక్కు, నోరుతో అ గుండ్రటి పెద్ద మొహం వెలిగిపోతూ వుంటుంది. తలపై బంగారు కిరీటం ధరించివుంటుంది.

పెద్ద శిరస్సు తప్ప అమ్మవారికి మొండెం (మిగతా శరీరభాగం) వుండదు. అమ్మవారి (రేణుకా దేవి / ఏకవీరిక) తనయుడైన పరశురాముడు, తండ్రి జమదగ్ని మహాముని ఆజ్ఞని పాటిస్తూ తల్లి శిరస్సును ఖండించి, పిదప తండ్రిగారిని ప్రార్థించి, అతణ్ణి ప్రసన్న పరిచి, తండ్రిగారి శక్తితో తిరిగి తన తల్లిని బ్రతికించు కున్నాడని పురాణాలు చెబుతున్నాయి.

ఆ పతివ్రతా శిరోమణి శిరస్సునే ఏకవీరికా మాతగా శక్తిపీఠ రూపంలో భక్తులు కొలుస్తారు.

ప్రక్కనే వున్న దేవస్థానం కౌంటర్ లో అమ్మవారికి చీర, రవిక, గాజులు, పువ్వులు, పసుపు, కుంకుమ కొని అమ్మవారికి సమర్పించి, తనివితీరా అమ్మవారిని దర్శించుకొని, అమ్మవారి ప్రసాదం (కిళ్ళీ లేదా పాన్) స్వీకరించి, బయటకు వచ్చి కొంతసేపు కూర్చున్నాను.

గురుదేవులు ఎక్కడా కనబడలేదు. మిగతా రెండు మందిరాలలో ఎక్కడో ఒకచోట దర్శనం ఇస్తారని భావించి మెట్లు దిగి Taxi వద్దకు చేరుకున్నాను.

Time చూస్తే పావుతక్కువ రెండు. ఇంకా రెండు కొండలపై వున్న రెండు మందిరాలు దర్శించాలి కాబట్టీ, రెండువందలు డ్రైవర్ చేతిలో పెట్టి ఎదురుగా వున్న పంజాబీ హెూటల్ లో భోజనం చేసిరమ్మన్నాను. కడుపు తేలిగ్గా వుంటుందని నేను కొన్ని మిల్క్ బిస్కట్లు, రెండు అరటి పళ్ళు ఆహారంగా తీసుకున్నాను.

డ్రైవర్ భోజనం చేసి వచ్చేకా, రెండున్నర గంటలకు ఇంకో కొండపై నెలకొన్న అత్రి, అనసూయ మందిరం వైపు ప్రయాణం సాగించేం. మందిరానికి కొద్ది దూరంలో కారు పార్క్ చేసుకున్నాడు డ్రైవర్. కొంత మంది భక్తులు మాత్రమే వున్నారు. లైన్లో వెళ్లి ఆ ఋషిదంపతుల విగ్రహాలను దర్శనం చేసుకున్నాను. కొంతసేపు మందిరంలో కూర్చున్నాను. అక్కడ కూడా గురుదేవుల దర్శనం నాకు లభించలేదు.

మూడో కొండ "దత్తశిఖరం" వైపు ప్రయాణమయ్యేము. నాలుగు గంటలకు దత్త మందిరానికి కాస్త దూరంలో కారు ఆపేడు! కారు దిగి చుట్టూ ఒకసారి చూసేను. చాలా ఎత్తైన కొండ.

చాలా ప్రశాతంగా, ఆహ్లాదంగా వుంది వాతావరణం. ఒక నలుగురు తప్పొ వేరే భక్తులు నాకు కనబడలేదు. అప్పటికే దర్శనం ముగించుకొని క్రిందకి వెళ్ళిపోయి నట్టున్నారు.

ఇంతలో ఆ నలుగురు భక్తులు డ్రైవర్ దగ్గరకు వచ్చి, మాహుర్ బస్టాండ్ కి వెళ్ళాలి, వస్తావా? అని అడిగేరు. Driver నా వైపు చూసేడు.

గురుదేవులు నన్ను ఇక్కడ తప్పకుండా కలుస్తారు అన్న ఆశతో నేను వెంటనే, వెళ్ళు! మందిరంలో నేను ఒక గంటసేపు ధ్యానం చేసుకుంటాను! అని చెప్పేను. అయితే వీరిని దింపి నేను కాస్త టీ తాగి ఐదున్నర గంటలకల్లా వస్తానన్నాడు డ్రైవర్!

అలాగే అని చెప్పి నేను మందిరంలోకి ప్రవేశించేను.

ఒక ఎత్తైన ఆసనం పై నాలుగు అడుగుల దత్తవిగ్రహం. విగ్రహం ముందు దత్తుని వైపు తిరిగి పూజారి కూర్చొని వున్నారు. దత్తునికి నమస్కరిస్తూ నాకు తెలిసిన కొన్ని దత్త శ్లోకాలను బయటకు చదివి దత్తతీర్థం యిమ్మని పూజారిని అడిగేను. తీర్థపాత్రను చేత్తో పట్టుకొని నించొని నా వైపు తిరిగేరు పూజారి.

ఆశ్చర్యం! అతను నా గురుదేవులు శ్రీ బాబాజీ మహాశయులు!

ఒక తెలియని ఆనందంతో కళ్ళమ్మట నీళ్లు తిరిగేయి! వెంటనే గురుదేవుల పాదపద్మాలకు సాష్టాంగ నమస్కారం చేసుకున్నాను.

నా తలపై రెండు చేతులు పెట్టి "ఆత్మానుభూతి సిద్ధిరస్తు" అని దీవించేరు!

అంతే ఏదో తెలియని చైతన్యం నా శరీరమంతా వ్యాపించింది! ఒక అలౌకిక ఆనందం అనుభవంలోకి వచ్చింది! తన రెండు చేతులతో నా భుజాలను పట్టుకొని నన్ను పైకి లేపేరు!

గురుదేవుల వంక చూసేను! మూడు మందహాస శిరస్సులతో, శ్రీదత్తరూపంలో, దేదీప్యమైన వర్ఛస్సుతో గురుదేవుల మొహం వెలిగిపోతోంది!

"గురుదేవ శ్రీ బాబాజీ దత్త" అన్న మాటలు అప్రయత్నంగా నా నోటి నుండి వెలుబడ్డాయి! గురుదేవులపై నా శరీరం వాలిపోయింది!

ఆత్రేయా! మెలుకువ తెచ్చుకో అన్న గురుదేవుల పిలుపుతో కళ్ళుతెరిచి నించున్నాను. గురుదేవుల రెండుచేతులూ ఇంకా నా భుజాలపై వున్నాయి.

ఆనంద పారవశ్యంలో తేలిపోతూ వున్న నన్ను, ఉద్దేశించి గురుదేవులు –

ఆత్రేయా! ఈ శుభ తరుణంలో, ఈ దివ్యక్షేత్రంలో, నీకు ఇష్టమైన దత్తస్వరూపంతో ఇంతవరకు నువ్వు ఎప్పుడూ పొందని "శాశ్వత ఆత్మానంద స్థితిని" నీకు ప్రసాదించేను!

నేటినుండీ నువ్వు ప్రత్యేకంగా ఎటువంటి సాధనాలు చెయ్యాల్సిన అవసరం లేదు! కర్మలో అకర్మని, అకర్మలో కర్మని అనుభూతి పొందుతూ, నిత్యతృప్తుడవై

వుంటావు! శుభం భూయాత్! అని నా శిరస్సుపై తన కుడిచేతిని పెట్టి దీవించేరు.

ఒక్కసారి మామూలు స్థితికి వచ్చింది నా శరీరం, గురుదేవుల మొహం వంక చూసేను. ప్రశాంతమైన చిరుమందహాసంతో నన్ను ఆలింగనం చేసుకున్నారు! నా మనస్సులో ఒక తెలియని ఆనంద స్థితి శాశ్వతంగా నెలకొందన్న అనుభూతి కలిగింది.

తెచ్చిపెట్టుకున్న చిరునవ్వుతో,

ఆత్రేయా! నేను ఎవ్వరో తెలియకపోయినా, స్నానం చేసి ఇప్పుడే వస్తానని చెప్పి మందిర పూజారి నాకు ఈ అర్చకత్వ బాధ్యతను అప్పజెప్పేడు. అదిగో అతను వస్తున్నాడు, పద మనం బయట కూర్చొని మాట్లాడుకుందాము అని మెల్లగా నా చెవిలో చెప్పేరు.

నాకు ఒక్కసారిగా నవ్వు వచ్చింది. నవ్వొద్దని నా చేతిని మెల్లగా గిల్లి తీర్ధపాత్రను పట్టుకొని దత్తవిగ్రహం దగ్గర నించున్నారు గురుదేవులు.

పూజారి గారు లోపలికి వచ్చి గురుదేవులను ఉద్దేశించి, అయ్యా! మిమ్మల్ని ఇబ్బంది పెట్టేను, మీ సహాయానికి చాలా ధన్యవాదాలు అని హిందీలో చెప్పేడు. గురుదేవులు నవ్వుతూ అయ్యో, ఎటువంటి ఇబ్బంది లేదు అని చేతిలో వున్న తీర్ధపాత్రను అతనికి అందించేరు.

మీరు తీర్ధం తీసుకున్నారా? అని నన్ను ప్రశ్నించేరు పూజారి గారు.

హిందీలో, లేదండీ! అని చెప్పి అతని దగ్గరకు వెళ్ళి తీర్ధం తీసుకున్నాను.

చొక్కా జేబు నుంచి వంద రూపాయలు తీసి క్రింద పువ్వులతో వున్న పళ్లెంలో దక్షిణగా సమర్పించి, గురుదేవులతో పాటు బయటకు వచ్చేసాను.

## అధ్యాయం - 38

## సంశయ నివృత్తి, పరిప్రశ్న - గురుబోధ

కొండ చివర, కొన్ని పూలమొక్కలు వున్న ప్రదేశానికి తీసుకువెళ్లేరు గురుదేవులు. చిన్న చిన్న పచ్చని పూలతో నిండిన పొలాల మధ్య చిన్న చిన్న గుడిసెలతో కొండ దిగువ ప్రాంతం అందంగా గోచరిస్తోంది. దూరంగా మాహుర్ పట్టణం కనబడుతోంది.

గురుదేవులు ఒక నున్నని రాయిపై మఠం వేసుకొని కూర్చున్నారు. నేను వెళ్లి ఆ ప్రక్కనే పద్మాసనంలో కూర్చున్నాను. గురుదేవులు నా వైపు చూసి నవ్వుతూ,

ఆత్రేయా! ఇకమీదట నీకు ఎటువంటి సంశయాలు కలుగవు! త్వరలోనే నువ్వు కొన్ని ఆత్మజ్ఞాన రచనలు చెయ్యవలసి వస్తుంది! కొంతమంది జిజ్ఞాసపరులు నీకు పరిచయం అవుతారు! వారిని ఆత్మజ్ఞాన దిశగా ప్రయాణింపజేసి, వారికి "శాశ్వత ఆనంద స్థితిని" ప్రసాదించడం నీ బాధ్యత! అందుకు నా సహకారం ఎప్పుడూ వుంటుంది! ఇదే నువ్వు నాకు ఇచ్చే గురుదక్షిణ! అని చిరునవ్వుతో చెప్పేరు.

తప్పకుండా గురుదేవా! ఇది మీ ఆజ్ఞగా శిరసావహిస్తూ, జిజ్ఞాస కలిగిన వారందరి చేత ఆత్మజ్ఞాన సాధన చేయించి, వారికి మీ అనుగ్రహంతో "శాశ్వత ఆనంద స్థితి" కలుగజేసేందుకు నా శాయశక్తులా కృషిచేస్తాను! అని గురుదేవులకు మాటిచ్చేను.

శుభం భూయాత్! అని గురుదేవులు తమ చేతిని పైకెత్తి నన్ను ఆశీర్వదించేరు.

అలాగే, నీ రచనలలో గాని, నీవు చేసే సత్సంగ ప్రసంగాలలో గానీ నీ నోటి నుండి సత్యదూరమైన మాటలు రాకూడదు అన్నది నా అభిమతం!

కాబట్టీ సంశయాలను తీర్చుకో, ప్రశ్నలు అడుగు అని సైగ చేసేరు.

నేను ఆ చిన్న పుస్తకం తెరచి, గురుదేవా....

పరమాత్మ ఎవరు?

అందుకు గురుదేవులు ఠక్కున, "పరమాత్మ అంటే అంతటా, అన్నింటా అన్నికాలాల్లో విరాజిల్లే సద్వస్తువు!" అని సమాధానం చెప్పేరు.

నేను వరసగా అడిగిన కొన్ని ప్రశ్నలు, గురుదేవులు యిచ్చిన సమాధానాలు క్రింద ప్రశ్నోత్తర రూపంలో పొందుపరుస్తాను –

ప. జీవుడు, పరమాత్మ ఒక్కటేనా?

గు. ఇరువురికి ఉపాధిలో తేడావున్నా, చైతన్యాంశ మాత్రం ఒక్కటే!

ప. జీవుని దేహంలో పరమాత్మ నిజంగా వున్నాడా?

గు. దేవాలయమనే జీవుని దేహంలో, "ఆత్మస్వరూపంగా" వుంటాడు పరమాత్మ!

ప. ఆత్మను ఎలా గ్రహించగలం?

గు. నేనున్నాను! అని నీ చేత అనిపిస్తున్నది నీ ఆత్మే!

ప. ఆత్మే భగవంతుడా?

గు. అవును, ఆత్మే భగవంతుడు! ఆత్మ కంటే భిన్నంగా వుంటే అతడు "పరమాత్మ" కాలేడు!

ప. భగవంతునికి ఆకారం లేదా?

గు. పరిమళానికి ఆకారం లేదుగానీ, పువ్వుకి వుందికదా! అవ్యక్తమైన నిరాకారం, సాకారంగా వ్యక్తమౌతోంది! అదే జీవుడు!

ప. ఆత్మజ్ఞానం లేకుండా భగవంతుణ్ణి తెలుసుకోలేమా?

గు. అసలు తానెవడో తనకు తెలియకుండా, భగవంతుణ్ణి తెలుసుకోవడం అసాధ్యం! భగవంతుణ్ణి తెలుసుకోవాలంటే ముందుగా తన్నుతాను తెలుసుకోవాలి!

ప. జీవుడంటే ఎవడు?

గు. సహజంగా తాను చైతన్యస్వరూపుడు అయినప్పటికీ, ఒక దేహాన్ని ధరించి, దేహభ్రాంతికి లోనైనవాడే జీవుడు!

ప. మరి జీవుని స్వరూపం ఎలాంటిది?

గు. జీవుడు చైతన్యమైన ఆత్మకాదుబీ అలాగని జడమైన దేహం కాదుబీ ఈ రెండింటి యొక్క మిశ్రమ స్వరూపము! జీవునికి ప్రత్యేకంగా రూపం లేకపోయినా తాను ధరించిన దేహాన్ని తన స్వరూపంగా భావిస్తాడు!

ప. జీవుని స్వభావం ఎలాంటిది?

గు. దేహము నందు మమకారంతో, ఇంద్రియములకు లొంగి, కామమోహాదులకు వశుడై, సత్యాసత్య వివేకము కోల్పోయి, అహమనే భావంతో జీవించుట అతని స్వభావము.

ప. బ్రహ్మము అంటే ఏమిటి?

గు . ఈ సమస్త సృష్టి దేనినుండి పుట్టి, దేనివలన పెరిగి, దేనిలో లయిస్తుందో అదే బ్రహ్మము!

ప. మరి భ్రమ అంటే ఏమిటి?

గు. కంటికి కనిపించేది, చెవులకు వినిపించేది, మనస్సును మైమరపించేది "భ్రమ"!

ప. అలాంటప్పుడు ఏది బ్రహ్మ? ఏది భ్రమ?

గు. అందరి జీవులయందు వున్న ఆత్మే నీలో వుంది! రూపములు వేరైనప్పటికీ ఆత్మవస్తువు ఒక్కటే! అనేకత్వంలో ఏకత్వాన్ని గుర్తించడమే బ్రహ్మ! ఏకత్వమును అనేకత్వముగా భావించడమే భ్రమ!

ప. జీవాత్మకు, పరమాత్మకు బేధం ఏమిటి?

గు. జీవుడు మాయాధీనుడు, దేవుడు మాయాధీశుడు! భావించడం జీవలక్షణం, చెయ్యడం దైవలక్షణం! జాగృత్, స్వప్న, సుషుప్తి అనేవి జీవుని అవస్థలు, సృష్టి, స్థితి, లయలు అనేవి పరమాత్మ అవస్థలు!

ప. జీవుడు దేవుడు అవ్వగలడా?

గు . తప్పకుండా అవ్వగలడు! జీవునికి, దేవునికి ఉపాధి బేధం తప్పా ఇంకో బేధంలేదు! దేహభ్రాంతిని త్యజిస్తే జీవుడు దేవుడు కాగలడు!

ప. నేను, నాది అసలు అర్థం ఏమిటి?

గు. జీవునికి సంబంధించి, నేను అంటే అహంకారం! నాది అంటే మమకారం! దైవానికి సంబంధించి నేను అంటే ఆత్మ, నాది అంటే చైతన్యం!

ప. అహం అంటే ఏమి? అహంకారం అంటే ఏమి?

గు. అహం అనేది శుద్ధ చైతన్యం! దానికి రూపం లేదు!

అది ఒక శరీరాన్ని ఆవహించినప్పుడు అహంకారంగా మారుతుంది!

నేను అనేది అహం! నేను ఇది, నేను అది అనేది అహంకారం!

అహం అనేది ఎప్పుడూ వుండేది, ఎప్పటికీ మారనిది!

అహంకారం అనేది శరీరంతో పాటూ వచ్చేది, శరీరంతో పాటూ పోయేది!

అహంకారం లేకుండా అహం వుండగలదు గానీ అహం లేకుండా అహంకారం వుండలేదు!

సంకల్ప, వికల్ప వికారాలతో కూడినది అహంకారం, ఎటువంటి వికారాలు లేనిది అహం!

అహంకారం అసత్యమైనది, అహం సత్యమైనది!

ప. అహంకారంతో ఆత్మసాక్షాత్కారం పొందగలమా?

గు. జ్ఞానంగా అగుపిస్తూ అజ్ఞానంలోకి నెట్టివేస్తుంది అహంకారం!

అజ్ఞానమైన అహంకారంతో సత్యమైన ఆత్మసాక్షాత్కారం పొందలేము!

ప. అహంకారం నుండి ఎలా బయటపడేది?

గు. అహంకారముయొక్క నిజస్థితిని గుర్తిస్తే, అది "అహం"గా మారిపోతుంది!

అంటే అహంకారం లేని అహం బయటపడుతుంది!

ఆత్మ "అహం, అహం" అంటూ అనుభవం లోకి వస్తుంది! అదే ఆత్మానుభూతి!

ప. సచ్చిదానందము అంటే ఏమిటి?

గు. జ్ఞానము యొక్క స్వరూపమే సచ్చిదానందము (సత్ ం చిత్ ం ఆనందము).

"సత్" అంటే నాశనము లేనిది, జాగృత్, స్వప్న, సుషుప్తి అవస్థలలో మార్పు చెందనిది!

"చిత్" అంటే జ్ఞానవంతమైనది, జాగృత్, స్వప్న, సుషుప్తి అవస్థలలో సర్వము గ్రహించేది!

"ఆనందం" అంటే దేనియందు ఆశలేని స్థితి, జాగృత్, స్వప్న, సుషుప్తి అవస్థలలో కూడా అనుభవించేది!

ప. జీవుడు సచ్చిదానంద స్వరూపుడేనా?

గు. అవును! నూటికి నూరు పాళ్ళు సచ్చిదానంద స్వరూపుడే!

ప. జీవుడు ఈ సత్యాన్ని ఎందుకు గ్రహించడంలేదు?

గు. అజ్ఞానవశుడై దేహమే నేనన్న భ్రాంతితో తన నిజస్వరూపమైన సచ్చిదానందాన్ని మర్చిపోతున్నాడు!

ప. ఈ భ్రాంతి నుండి ఎలా బయటపడాలి?

గు. భ్రాంతి ఉన్నంతసేపూ బ్రహ్మము కనిపించదు!

భ్రాంతితో కర్తృత్వాన్ని తన నెత్తిన వేసుకుంటున్నాడు!

దేహం నేనుకాదు అన్న సత్యాన్ని గ్రహించినప్పుడు ఈ భ్రాంతి దానంతటదే తొలగిపోతుంది!

ప. వేదము అంటే ఏమిటి?

గు. వేదము అంటే జ్ఞానము! అంతటా, అన్నింటా వుండి ఈ సృష్టిని ఎంతో క్రమబద్ధంగా నడిపిస్తున్న అద్భుత సత్యాన్ని మానవులు గ్రహించేందుకు వీలుగా ఎన్నో కర్మ, జ్ఞాన విషయాలను సూచించింది వేదము.

ప. వేదముల యొక్క ఆశయము ఏమిటి?

గు. ఎన్నో నామరూపాలతో వ్యక్తమయ్యే పరమాత్మ ఒక్కటే! రెండోది లేదు! ఈ భిన్నత్వంలో ఇమిడివున్న ఏకత్వాన్ని నిరూపించడమే వేదముల యొక్క ఆశయము!

ప. వేదాంతములు అంటే ఏమిటి?

గు. నాలుగు వేదముల యొక్క అంతములే (చివరి భాగములే) వేదాంతములు! ఇవి జ్ఞానాన్ని బోధిస్తాయి! మొదటి మూడుభాగాల్లో విభిన్న కర్మకాండ విషయాలను సూచించిన వేదములు ఈ నాల్గొవ (చివరి) భాగంలో ఏకత్వాన్ని బోధిస్తాయి! అంటే ద్వైతమైన కర్మకాండలు చివరికి అద్వైతమైన జ్ఞానంతో ముగుస్తాయి! మనుజులు భిన్నత్వాన్ని త్యజించి కట్టకడపటికి ఏకత్వాన్ని పొందాలన్నది వీటి బోధ!

అంటే ఎన్నోరకాలుగా వ్యక్తమైన పరమాత్మ విభూతిలో అంతర్లీనంగా వున్న ఏకత్వాన్ని నిరూపించడమే వేదముల ముఖ్యోద్దేశము!

ప. వీటినుండి జీవులు అంతిమంగా గ్రహించి, ఆచరించాల్సింది ఏమిటి?

గు. ఏది శాశ్వతమో దానియందు విశ్వాసమే "భక్తి"!

ఏది సత్యమో దానిని తెలుసుకోవడమే "జ్ఞానము"!

ఏది మార్పు చెందుతుందో దానిని విడిచిపెట్టడమే "వైరాగ్యము"!

అన్న సత్యాన్ని గ్రహించి తదనుగుణంగా జీవిస్తూ తనలోనే వున్న పరమాత్మను అనుభూతి పొందాలి!

ప. జ్ఞానము అంటే ఏమిటి?

గు. అద్వైతమును (అంతటా ఏకత్వము) దర్శించడమే జ్ఞానము.

ప. జ్ఞానాన్ని ఎలా పొందాలి!

గు. జ్ఞానం బయట లభించే వస్తువు కాదు! ఆత్మవిచారణతో అజ్ఞానాన్ని విడిచిపెడితే, జ్ఞానం తానంతటదే లభిస్తుంది!

ప. జ్ఞానం వలన ప్రయోజనం ఏమిటి?

గు. మానవుణ్ణి దుఃఖము లేని స్థితికి తీసుకెళ్లేది జ్ఞానం మాత్రమే! జ్ఞానం వలన తానెవరో తెలుస్తుంది! సత్యం అవగతమౌతుంది! బ్రహ్మానందం కలుగుతుంది!

ప. జ్ఞానాన్ని వ్యక్తపరచడం ఎలా?

గు. ఆత్మ యొక్క స్వరూపమే జ్ఞానం! నేను ఆత్మననే విజ్ఞానం వికసించినప్పుడు జీవుని ప్రజ్ఞానం వ్యక్తమౌతుంది!

ప. మనస్సు, ఆత్మ వీటి బేధం ఏంటి?

గు. మనస్సంటే సంకల్పాల మూట! ఆత్మ అంటే యజమాని! అంటే అసలైన "నేను"!

ప . ఆత్మజ్ఞానానికి మనస్సు సహకరిస్తుందా?

గు. మనస్సు సహకరించపోతే ఆత్మజ్ఞానం సిద్ధించదు! అందుకే ముందుగా దాన్ని శుద్ధి పరచాలి! స్వచ్ఛమైన ఆలోచనలే ఆత్మజ్ఞానానికి పునాది!

ప. ఆత్మకి సరైన నిర్వచనం ఏంటి?

గు. కనపడే ప్రపంచమంతా ప్రతీక్షణం మారిపోతూనే వుంటుంది కదా! మారే ప్రపంచానికి, మూలాధారమైన మారని శాశ్వతమైన సద్వస్తువే ఆత్మ!

ప. ఆత్మసాక్షాత్కారం అంటే ఏమిటి?

గు. మనలో చిదానందరూపంగా వెలుగొందుతున్న ఆత్మను అనుభూతి పొందడం.

ప. ఆత్మసాక్షాత్కారానికి అడ్డంకులేమిటి?

గు. చంచలమైన మనస్సు, అర్థంలేని సాధనలు.

ప. ఆత్మసాక్షాత్కార అనుభూతి పొందేది మనస్సే కదా?

గు. అవును! చపలత్వము నుండి విముక్తి పొందిన మనస్సు ఆత్మానుభూతి పొందుతుంది.

ప. అర్థంలేని సాధనలు అంటే?

గు. చపలమైన మనస్సులో పుట్టే కోర్కెలను నెరవేర్చుకోడానికి చేసే సాధనలు.

ప. ఆత్మసాక్షాత్కారం ఎలా సిద్ధిస్తుంది?

గు. పరమాత్మకు శరణాగతి చెందుట వలన.

ప. శరణాగతి అంటే?

గు. సమస్త కార్యములు చేసేది పరమాత్మే అన్న విశ్వాసంతో, అహంకార మమకారాలన్నీ అతనికి బేషరతుగా సమర్పించడం.

ప. ఆధ్యాత్మికము అంటే పూజలు, జపాలు, ధ్యానాలు చెయ్యడమే కదా?

గు. కానేకాదు! ఆత్మ గురించి అధ్యయనం చెయ్యడమే ఆధ్యాత్మికము! ప్రతిజీవి ఆత్మస్వరూపమే అన్న సత్యాన్ని గుర్తించి వర్తించడం!

## అధ్యాయం - 31

## నాతోనే, నాలోనే పూజ్యగురుదేవులు

నేను అడిగిన అన్ని ప్రశ్నలకు గురుదేవులు ఎంతో ఓపిగ్గా సమాధానాలు చెప్పేరు. నాలో కలిగిన అన్ని ఆధ్యాత్మిక సంశయాలు ఒక్కొక్కటిగా తీరిపోయేయి. ఎంతో భారం తగ్గి శరీరం తేలికైనట్లు అనిపించింది.

మనస్సు అలౌకిక ఆనందంతో నాలో నెలకొన్న ఆత్మను అనుభూతి పొందుతోంది!

నా శరీరమంతా నీలిరంగు తేజస్సుతో నిండిపోయినట్లు స్పష్టంగా తెలుస్తోంది!

ఆ పరమానంద స్థితిని అనుభవిస్తూ, కళ్ళమ్మట ఆనందబాష్పాలు జాలువార గురుదేవుల వంక చూసేను.

గురుదేవులు ధ్యానముద్రలో వున్నారు. శరీరమంతా నీలిరంగు వర్చస్సుతో దేదీప్యమానంగా వెలిగిపోతోంది!

గురుదేవులు మెల్లగా కళ్ళుతెరచి, ప్రేమపూరిత నేత్రాలతో నన్ను చూస్తూ –

ఆత్రేయా! ఇంకో సంవత్సరంలో నువ్వు నీ ఉద్యోగ భాధ్యతల నుండి స్వచ్ఛందంగా తప్పుకుంటావు! ఇంకొన్ని ముఖ్య ప్రదేశాల్లో నీ పర్యటన వుంటుంది! అన్ని ప్రదేశాల్లో, వివిధ రకాలుగా వ్యక్తమయ్యే భిన్నత్వంలో, ఏకత్వాన్ని దర్శించే ప్రయత్నం చెయ్యి!

ఈ సాధన జీవితాంతం చెయ్యాల్సిన ప్రక్రియ అన్న సత్యాన్ని మరవద్దు! అహంకారాన్ని పూర్తిగా తొలగించుకో! అన్నింటినీ జ్ఞానంతో విశ్లేషించు!

తద్వారా కలిగే ప్రజ్ఞానంతో నువ్వు ఎల్లవేళలా "ఆత్మానందస్థితి" ని అనుభూతి పొందుతూ వుంటావు!

ఆత్రేయా! నీతోనే, నీలోనే వుంటూ నీకు కలిగే అన్ని సంశయాలను నేను ఎప్పటికప్పుడు తీరుస్తూ వుంటాను! కాబట్టీ, ఇకమీదట నా ప్రత్యక్షదర్శనం కోసం నువ్వు ఆరాటపడాల్సిన అవసరం లేదు!

నీ చుట్టూ నేను వున్నానన్న సత్యాన్ని నువ్వు అనుభూతి పొందుతూ వుంటావు! వెళ్ళు, నీ Taxi ఇప్పుడే చేరుకుంది! శుభం భూయాత్!

అని తమ సంభాషణ ముగించేరు పూజ్య గురుదేవులు.

గురుదేవుల చుట్టూ వ్యాపించియున్న నీలిరంగు వెలుగు తగ్గుతూ, పూర్తిగా అంతర్హితమైంది! గురుదేవులు అక్కడ లేరు!

గురుదేవులు కూర్చున్న ఆ ప్రదేశాన్ని రెండు చేతులతో తాకి కళ్ళకు అద్దుకున్నాను.

జేబులో సెల్ ఫోన్ మ్రోగింది. ఆన్సర్ బటన్ నొక్కేను, సార్! వచ్చేసాను సార్, పార్కింగ్ దగ్గర వున్నాను! డ్రైవర్ నుండి ఫోన్, ఇదిగో వస్తున్నాను!

అని Reply ఇచ్చి పరిపూర్ణ ఆనందంతో వాహన పార్కింగ్ వైపు నడక సాగించేను.

సార్! Time పావుతక్కువ ఆరు కావొస్తోంది, రాత్రికి ఇక్కడే బస చేద్దామా లేదా నాందేడ్ వెళ్లిపోదామా? అని హిందీలో అడిగేడు డ్రైవర్.

నేను వచ్చిన పని అయిపోయింది, సర్వదేవతా దర్శనం కూడా గురుదేవుల అనుగ్రహంతో అయిపోయింది కదా, అని మనస్సులో తలచి –

నాందేడ్ వెళ్లిపోదాము! అని రిప్లై ఇచ్చేను.

OK సార్! అని బండిని ముందుకు పోనిచ్చేడు డ్రైవర్.

ఎన్నో ఆలోచనలు నన్ను చుట్టుముట్టేయి!

అవతారపురుషులు, సద్గురువులు ఇంత నిస్వార్థంగా వుంటారా?

తాము శిష్యులుగా స్వీకరించిన వారికి, వారు కోరకముందే అన్నీ ఇచ్చేస్తారా?

సమాజ శ్రేయస్సు కొరకు ఇంత తపన పడతారా?

అందుకోసమే నేమో, దత్తస్వరూపులైన గురుదేవులు సూక్ష్మశరీరంతో ఈ ధరణిలో శాశ్వతంగా వుండిపోయేరేమో?

నాలాంటి వాళ్ళను ఎంతమందిని గురుదేవులు అనుగ్రహించి వుండవచ్చు? వారెవరో నాకు ఎలా తెలుస్తుంది? వారిని నేను కలుసుకోగలనా?

ఇలా ఎన్నో ప్రశ్నలు నాలో వుదయించడం మొదలైంది!

సమయం వచ్చినప్పుడు నాతోనే, నాలోనే వున్న గురుదేవులు నాకు సమాధానం చెబుతారు!

ప్రస్తుతానికి నాకు ఆజ్ఞాపించిన కర్తవ్యాన్ని నేను సక్రమంగా నిర్వర్తిస్తే చాలు! అన్న ఆలోచనకు వచ్చేకా నా మనస్సు కుదుటపడింది.

ఏం ఆలోచిస్తున్నారు సార్! టీ తాగుతారా? వచ్చే గ్రామంలో టీ చాలా బావుంటుంది సార్! అన్న డ్రైవర్ మాటలతో ఈ లోకంలోకి వచ్చేను.

అలాగే త్రాగుదాం! అక్కడ బండి ఆపు! అని సమాధానం చెప్పేను.

ఇద్దరం టీ తో పాటు తలో రెండు వడాపావ్ లు సేవించి, కార్ దగ్గరకు వచ్చేము. సార్, మీరు కొంతసేపు రెస్ట్ తీసుకోవాలని భావిస్తే, వెనక సీట్లో హాయిగా కూర్చోండి. నేను జాగ్రత్తగా కారు నడుపుతాను. భయపడొద్దు. ఇరవై ఏళ్ల అనుభవం ఇక్కడ! %ద్ఘుఎని ఎశీశీతీ% తెరిచి నవ్వుతూ అన్నాడు డ్రైవర్.

అలాగే! జాగ్రత్తగా నడుపు! అని %ద్ఘుఎని రామ్ఫ్% లో కూర్చున్నాను. చిన్నగా పాత హిందీ పాటలు పెట్టుకొని నాందేడ్ వైపు బండి పోనిచ్చేడు డ్రైవర్.

మళ్ళీ నా ఆలోచనలు ముందుకు సాగేయి –

ఎన్నో ధోరణులు, అభిమతాలతో సతమతమవుతున్న ప్రజలను ఉద్ధరించేందుకు, ఆయాకాలాలలో ఎంతోమంది జ్ఞానులు ఈ జగతిన అవతరించి, త్యాగబుద్ధితో తమ జ్ఞానాన్నంతా ధారబోసి ప్రజలను సత్యమార్గంలో నడిపించేరు.

అభిమతమేదైనా సత్యమొకటేనని చాటిచెప్పేరు. సత్యంతో కూడిన ధర్మాన్ని తెలియజేసారు. ప్రజలను మళ్ళీ చైతన్యవంతులను చేసేరు.

ఎన్నో విభిన్న ఆలోచనలు, సాంప్రదాయాలు, ఆచారాలతో కూడిన సనాతనధర్మాన్ని –

ద్వైత, అద్వైత, విశిష్టాద్వైత సిద్ధాంతాల ద్వారా ఏకతాటిన తీసుకువచ్చారు మధ్వాచార్యులు, ఆదిశంకరాచార్యులు, రామానుజాచార్యులు. తమ ప్రజ్ఞాపాటవాల ద్వారా వేదాలలో, వేదాంతములలో ప్రతిపాదించిన అసలు సత్యాన్ని చాలా సరళంగా, అర్ధవంతంగా వివరించడం జరిగింది.

పరమాత్మతత్వాన్ని అర్ధంచేసుకోవడానికి ఇవి ఎంతో దోహదపడతాయి. ఆత్మ-పరమాత్మల సంబంధాన్ని ఎంతో చక్కగా వివరించారు ఆ మహాయోగులు.

సత్యం పట్ల, దైవం పట్ల, ధర్మం పట్ల మానవులలో నేలకొన్న విభిన్న ఆలోచనాసరళిని అవగతంచేసుకొని, వాటిని క్రోడీకరించి ఒక సరళమైన, ఆచరణ యోగ్యమైన పంథాను ప్రతిపాదించారు.

మూఢనమ్మకాలను, అర్ధంలేని విశ్వాసాలను, అజ్ఞానంతో కూడిన కర్మలపట్ల నిరసన వ్యక్తపరచి ప్రజలను చైతన్యవంతులను చేసేరు.

అలాగే ఈ భూప్రపంచంలో, వివిధ ప్రదేశాలలో ఎంతోమంది యోగులు అవతరించి, అక్కడున్న పరిస్థితుల ఆధారంగా, ప్రజలలో నెలకొన్న ఆలోచనాసరళికి అనుగుణంగా, ఆచరణయోగ్యమైన సత్య, ధర్మ మార్గాలను ప్రభోదించేరు.

అన్ని మార్గాలు అసలు సత్యాన్ని, మానవ ధర్మాన్ని ప్రభోదించేవే తప్ప ఇంకో ఉద్దేశంతో ఏర్పడినవి కావు. వాటివెనుకనున్న అంతరార్ధాన్ని అర్ధంచేసుకుని పరమాత్మ తత్వాన్ని అవగాహన చేసుకొని, సాధన చెయ్యాల్సిన బాధ్యత మనుజులపై వుంది.

స్వప్రయోజనాల కోసం వాటిని వక్రమార్గంలో ప్రభోదించి, ప్రజలచే వాటిని ఆచరింపజేస్తే యావత్తు మానవ మనుగడకే ముప్పన్న విషయాన్ని అందరూ గ్రహించాలి.

## అధ్యాయం - 40
## "పాపోహం పాపాత్మా" బదులు "చిదానందరూపః శివోహం!"

ఈ సృష్టిలో పరమాత్మ కానిది ఏదీలేదు. అన్నింటికీ అదే మూలకారణము. ఇందు గలడు అందు లేడని సందేహం వద్దు, ఎక్కడ వెదికినా అక్కడే గలడు. సర్వము పరమాత్మ విభూతిగా భావించి ఆరాధించువాడే జ్ఞాని. భావము లేని ఆరాధన వ్యర్థమైనది.

భగవంతుని ఆరాధనలో పరిమాణము (Quantity) కన్నా నిర్మలత్వము (Quality) ముఖ్యము. ఎంత పాపచిత్తము కలవాడైననూ, ఏకాగ్రచిత్తముతో భగవంతుని సేవిస్తే, అతడి దుష్టస్వభావము క్రమక్రమముగా నశించి సాధుశీలుడవుతాడు.

నిజంగా చెప్పాలంటే భగవంతుని సృష్టిలో పాపాత్ముడు అనేవాడు లేడు. కారణం ప్రతిజీవి హృదయమందు పరమపావనమైన ఆత్మ నెలకొనివుంది. మాయకు లోబడి జీవుడు పాపకార్యములు చేస్తాడు. కావునా ఎవరినీ అల్పుడుగా భావించకూడదు.

అంతేకాదు ఎవరూ తనను తాను పాపిగా భావించకూడదు.

కాబట్టీ "పాపోహం పాపకర్మాహం పాపాత్మా పాపసంభవః" అని అనుకునే బదులు,

"చిదానందరూపః శివోహమ్ శివోహమ్ శివోహమ్" అని నిరంతరము అనుకొని తదనుగుణంగా జీవించడం ఉత్తమము.

దీనినే "అనుకూల చింతన" (Positive thought) అంటారు. ఆత్మజ్ఞానానికి ఇటువంటి భావన ఎంతో తోడ్పడి క్రమక్రమముగా నరుడు నారాయణుడుగా మార్పుచెందుతాడు.

మొదట్లో, భగవంతుడు కేవలము ఆలయములలో, ప్రార్థనా మందిరములలో వున్నాడని భావించినాక్రమంగా, జీవుడు మరణించేలోపు, పరమాత్మను అన్నిచోట్లా, అన్నింటా, అణువణువునా దర్శించే స్థితికి చేరుకోవాలి.

అంటే పువ్వునుండి కాయగా, కాయనుండి పండుగా మారే ప్రయత్నం చేయాలి. అందుకు కావలసిన జ్ఞానాన్ని పరమాత్మ ప్రసాదిస్తాడు.

అలాగే ఆత్మసాక్షాత్కారము అయ్యేవరకు, అందుకుతగిన జ్ఞానవిచారణ సలిపే బుద్ధిని సద్గురువు ప్రతి సాధకునికి ప్రసాదిస్తాడు. ఇది అతని వాగ్దానము. ఇందులో ఎటువంటి సంశయంలేదు.

నా శోధనలో నేను పరిశీలించిన ఒక విషయం ఏంటంటే – సహజంగా మానవులకు రెండు ధోరణులు సతమతం చేస్తాయి.

ఒకటి "అస్తి", రెండవది "నాస్తి".

అందరికి తెలుసు – అస్తి అంటే వుంది, నాస్తి అంటే లేదు.

ఇంతకీ ఆ ఉన్నదని భావించేది, లేదని వాదించేది ఏది?

సత్యశోధనకు ఈ రెండు మార్గాలు ఎంతో దోహదం చేస్తాయి. నిజంగా చెప్పాలంటే ఈ రెండు మార్గాలు ఆచరించే ఎంతోమంది మహానుభావులు సత్యాన్ని గ్రహించడం జరిగింది.

అస్తిని పూర్తిగా విశ్వసించే ఆస్థికుడు ఏదివుందో తెలుసుకోగలగాలి,

అలాగే నాస్తిని పూర్తిగా విశ్వసించే నాస్తికుడు ఏదిలేదో తెలుసుకోగలగాలి.

ఇక్కడ మెచ్చుకోవలసిన విషయం ఏంటంటే, మానవుడు అలా నిరూపణ చేసాడు కూడా!

ఈ మీమాంశలో తేలిందేమిటంటే –

ఆస్థికుడు పరమాత్మశక్తి వుందని నిరూపించేడు!

నాస్తికుడు ఆత్మశక్తి వుందని నిరూపించేడు!

అయితే జ్ఞానులు ఈ రెండూ ఒక్కటేనని నిరూపణచేసేరు!

మనలో నెలకొనివున్న ఆత్మే, పరమాత్మగా గ్రహించేరు.

"అహం బ్రహ్మాస్మి", "అయమాత్మా బ్రహ్మ" అని అభివర్ణించారు.

నాస్తి (న ంఅస్తి) లోనే అస్తి ఉంది కదా!

కేవలం దేవుని యెడ భయంతో నేను ఆస్తికుడినని చెప్పుకోవడం సరికాదు. సంపూర్ణ విశ్వాసంతో, ఎంతో ఓరిమితో, అకుంఠిత సాధనతో ఆ అస్తిత్వాన్ని అనుభవించాలి.

నిత్యసత్యమైన పరమాత్మను తెలుసుకోవాలి, ఆత్మానుభూతి పొందాలి, బ్రహ్మానందమును ఆస్వాదించాలి. అదితప్పా మిగతావన్నీ అశాశ్వతములని గ్రహించాలి. సత్యాన్ని గ్రహించడమే జీవుని అంతిమలక్ష్యం కావాలి.

జీవుడు ఈ జగత్తులోకి ఏ అద్వైతస్థితితో ( ఉన్నది ఒక్కటే / అన్నింటినీ ఒకేలా చూసే స్థితి) వచ్చాడో, తిరిగి వెళ్లిపోయేటప్పుడు అదే అద్వైతస్థితితో వెళ్లిపోవడం జీవుని కనీసధర్మము.

అందుకే ప్రతి భక్తుడు పరమాత్మని వేడుకోవలసింది –

“అసతోమా సద్గమయా” (అసత్తు నుండి నన్ను సత్యానికి గొనిపొమ్ము),

“తమసోమా జ్యోతిర్గమయా” (అజ్ఞానం నుండి నన్ను జ్ఞానానికి గొనిపొమ్ము),

“మృత్యోర్మా అమృతంగమయా” (మృత్యువు నుండి నన్ను అమృతతత్వానికి గొనిపొమ్ము)

ఎందుకంటే ఇది అన్ని కాలమానపరిస్తితులకు వర్తిస్తుంది కాబట్టీ!

ఎంత ఎఱుకను పొందినా అసత్తు, అజ్ఞానం, మృత్యువు మనుజుని వెంబడిస్తుంది కాబట్టీ!

వీటినుండీ అంత తేలికగా తప్పించుకోలేడు కాబట్టీ!

ఎక్కువ కాలము వీటికి లోబడి జీవిస్తున్నాడు కాబట్టీ!

మాయకు అతి సులభంగా ఆకర్షితుడు అవుతున్నాడు కాబట్టీ!

బయటపడే ప్రయత్నం చేయడంలేదు కాబట్టీ!

ఇదే జీవిత పరమార్ధం అనుకుంటున్నాడు కాబట్టీ!

ప్రతి విషయం స్వార్ధంగా ఆలోచిస్తున్నాడు కాబట్టీ!

భగవంతునితో సమానంగా చదరంగం ఆడుతున్నాడు కాబట్టీ!

భయంతో పరమాత్మను సేవిస్తున్నాడు కాబట్టీ!

మాయనే సత్యంగా భావిస్తున్నాడు కాబట్టీ!

ఫలితాలను ఆసిస్తూ అన్ని కర్మలూ చేస్తున్నాడు కాబట్టీ!

బాహ్యకర్మలకు, భావమునకు తేడావుంది కాబట్టీ!

అసలు సత్యాన్ని తప్పుగా అర్థం చేసుకున్నాడు కాబట్టీ!

సత్యదూరమైన ధర్మాన్ని ఆచరిస్తున్నాడు కాబట్టీ!

కేవలం తన పరివారంపైన మాత్రమే ఎనలేని ప్రేమను చూపిస్తున్నాడు కాబట్టీ!

కాలాన్ని, కాలగమనాన్ని తానే నిర్దేశిస్తున్నాడనీ అనుకుంటున్నాడు కాబట్టీ!

కాలాతీతుడ్ని విస్మరిస్తున్నాడు కాబట్టీ!

శాస్త్రాలను, పురాణాలను తన మేధస్సుకు అనుగుణంగా వ్యక్తపరుస్తున్నాడు కాబట్టీ!

జీవాత్మ-పరమాత్మల సంబంధాన్ని తెలుసుకోలేకపోతున్నాడు కాబట్టీ!

జీవాత్మను విస్మరించి పరమాత్మను బయట వెతుక్కుంటున్నాడు కాబట్టీ!

అందుకు తొలిమెట్లుగా ప్రతి సాధకుడు ఆచరించాల్సిన ధర్మాలు -

1. ప్రతి జీవి కర్మ చేయాల్సిందే.

2. ఏ కర్మ చేయకుండా మనుజులు ఒక్క క్షణం వుండలేరు.

3. ప్రతికర్మ నిష్కామంతో (ప్రతిఫలం ఆశించకుండా) చెయ్యాలి! అదే కర్మయోగము.

4. కర్మయోగికైనా, జ్ఞానయోగికైనా ఈ నిష్కామకర్మాచరణ తప్పదు.

5. కర్మయోగంతో చిత్తశుద్ధికలిగి జ్ఞానము ఉదయిస్తుంది.

6. జ్ఞానము కలిగిన తరువాత వైరాగ్యముతో కూడిన అభ్యాసము చేయాలి.

7. అన్ని జీవులయందు సమదృష్టి కలిగియుండాలి.

8. ధ్యానంతో ప్రాపంచిక విషయాలనుండి దృష్టి మరల్చాలి.

9. ఆత్మవిచారణతో పరమాత్మను అర్ధము చేసుకోవాలి.

10. తనలో నిగూఢంగా వున్న ఆత్మను దర్శించాలి.

11. ఆత్మానుభూతితో ఇక తెలుసుకోవలసింది ఏమీ వుండదు.

12. దీనితో మానవుడు అన్ని బంధాలనుండి విడిపడి జీవన్ముక్తుడవుతాడు.

13. జీవాత్మ పరమాత్మ ఒకటిగా భాసిస్తుంది.

అంతటితో ఈ జననమరణ చక్రము నుండి విముక్తి పొంది, అవసరాన్ని బట్టి, ఆత్మ తన ఇచ్ఛానుసారం లోకంలో అవతరించుట, లోకము వీడి వెళ్ళుట జరుగుతుంది.

వారే సత్పురుషులు లేదా సద్గురువులు!

అంటే జీవుడు తన నిజస్వరూపాన్ని అనుభూతి పొందేదన్నమాట!

ఇది గ్రహించక జీవుడు అనేక కామ్యకర్మలను ఆచరిస్తూ, అశాశ్వతములగు ప్రాపంచిక వస్తువులపై బంధము పెంచుకుంటూ, ఇంద్రియముల వశుడై సుఖదుఃఖములను చవిచూస్తూ, మిగిలిన కర్మఫలితములు అనుభవించుటకు జననమరణములు పొందుతూ, ఆత్మవస్తువును విస్మరిస్తూ, సత్యమును తెలుసుకొనక పరమాత్మకు దూరం అవుతున్నాడు. తాను వచ్చిన చోటుకి చేరుకోలేక పోతున్నాడు.

## అధ్యాయం - 41
## జీవితం - చదరంగం,
## ఎత్తు - పైఎత్తు, ఎంపిక - సవాలు

పూజ్య గురుదేవుల అనుగ్రహంతో, వారు సూచించినట్లుగా 2016 సంవత్సరమంతా ఇంటిలో శుభకార్యాలు, ఇతర కుటుంబ బాధ్యతలు నిర్వర్తించడంలో చాలా బిజీగా గడిచిపోయింది. గురుదేవులు బోధించినట్లు నేను నా సాధన మానలేదు.

నాకు లభించిన సమయంలో ఎక్కువ సేపు నేను ఆత్మవిచారణ, విశ్లేషణతో గడిపేవాడిని. కొన్ని సమయాల్లో కొంతమంది పండితులను అనుకోకుండా కలవడం జరిగింది. గురుదేవుల సూచన మేరకు, నేనైతే ఎవ్వరితో ఏ విధమైన చర్చ చెయ్యలేదు.

మౌనంగానే వారు ఇతరులకు చెప్పే విషయాలను శ్రద్ధగా వినేవాణ్ణి. కొంతమంది మాటల్లో నాకు సత్యం, జ్ఞానం కానవచ్చేయి. కానీ చాలామంది మాటల్లో అజ్ఞానం, డాంబికం స్పష్టంగా గోచరించేయి. వారు నమ్మిన సిద్ధాంతాన్ని ఇతరులపై బలవంతంగా రుద్దే ప్రయత్నం చేసేవారు.

ఇలాంటి సందర్భాలలో, ఎంతో జటిలమైన ప్రశ్నలకు పూజ్య గురుదేవులు నవ్వుతూ ఎంతో సరళంగా సమాధానాలు చెప్పే సన్నివేశాలు గుర్తుకువచ్చి, మనసా వారికి నా సాష్టాంగ ప్రణామాలు అర్పిస్తూ వుండేవాణ్ణి.

శ్రద్ధతో పరిశీలిస్తే, సనాతనధర్మంలో అజ్ఞానానికి చోటులేదు!

ఎంతోమంది మహర్షులు, ఎంతో తపనతో, తమ జ్ఞానానికి అందినంత మేర ఈ జగత్తుని, దానికి మూలమైన చైతన్యాన్ని పరిశోధించి, పరిశీలన చేసి, అనుభవ పూర్వకంగా ఎంతో విశ్లేషణ చేసి, అనుభూతి పొంది, ఆ మహత్తర జ్ఞానాన్ని అందరూ ఆచరించేందుకు వీలుగా కర్మ, జ్ఞాన సూత్రాలతో కూడిన వేద, వేదాంగ, దర్శన, శాస్త్ర, పురాణ, ఇతిహాస రూపంలో దానిని సకల మానవాళికి అందించి, మానవధర్మాన్ని పటిష్టం చేసారు.

ఈ ధరణిలో జన్మించిన ప్రతి వ్యక్తి కొన్ని కర్మలు ఆచరించక తప్పదు కాబట్టీ, జ్ఞానంతో కూడిన కొన్ని విహిత కర్మలను వీటిలో సూచించడం జరిగింది.

తమ జీవన మనుగడకై మానవులు రోజూవారీ చేసే కర్మలతో పాటు ఈ విహితకర్మలను కూడా ఆచరిస్తే ఆయురారోగ్యఐశ్వర్యాలతో పాటు మనశ్శాంతి లభించి, తద్వారా చిత్తశుద్ధి కలిగి పరమాత్మ విభూతిని మనసారా అనుభవించి మరణించేలోపు ఆత్మానుభూతి పొంది తన జన్మను సుసంపన్నం చేసుకోవచ్చు.

ఇటువంటి మహత్తర మానవధర్మము యుగాలపాటూ కొనసాగింది. ఈ ధర్మాన్ని తేలికగా తీసుకున్న అధర్ములను కీర్తిహీనులను చెయ్యడం కూడా జరిగింది.

రానురాను మనుజుల మనస్తత్వం మారింది. గత కొన్ని యేళ్లుగా అజ్ఞానం పెంపొంది జ్ఞానం కాస్త మరుగున పడింది.

ఇంచుమించు ప్రతి మానవునిలో అరిషడ్వార్గాలు (కామ, క్రోధ, లోభ, మోహా, మద, మాత్సర్యాలు), ఈషణత్రయాలు (భార్యేషణ, పుత్రేషణ, ధనేషణ), ఈర్ష్య, అసూయ, ద్వేషాలు తీవ్రంగా విజ్రంభించాయి.

ఈ విపత్కర సమయంలో ఎంతోమంది మహనీయులు గురురూపంలో అనేక ప్రదేశాల్లో అవతరించి ఎప్పటికప్పుడు మానవధర్మాన్ని పరిరక్షించే ప్రయత్నం చేసేరు, ఇంకా చేస్తూనే వున్నారు.

కొంతమంది అసలు సత్యాన్ని గుర్తించి దారిన పడ్డారు, చాలామంది ఇంకా అ్జానాన్నే నమ్ముకుంటున్నారు.

వేద, వేదాంతములలో పేర్కొన్న జ్ఞానాన్ని అప్పటి పరిస్థితులకు అనుగుణంగా వివిధరూపాల్లో పునః నిర్వచించడం జరిగింది.

ప్రస్తుతంలో పాశ్చాత్యశాస్త్రవేత్తలు వాటిని తమ పరిశోధనాంశంగా తీసుకొని, వాటిని క్షుణ్ణంగా పరిశోధించి –

అవి నిత్యసత్యమైనవని, సహేతుకమైనవని, శాస్త్రబద్ధమైనవని గ్రహించి, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఆ జ్ఞానాన్ని అభివృద్ధిచేసుకుంటూ, పదిమందికీ పంచుతూ, అచట సమాజాన్ని జ్ఞానవంతంగా తీర్చిదిద్దుతూ చేస్తూ, ఎంతో లబ్ది పొందుతున్నారు. ఇది మనం గ్రహించని నిజం!

అంతటి మహత్తర జ్ఞానం మనదైనప్పటికినీ, మనం మాత్రం అందు లోటుపాట్లను పరిశోధిస్తూ, వాటిని విమర్శిస్తూ, ఎంతో అ్జానాన్ని మూటగట్టుకుంటున్నాము.

కొంతమంది మేధావులు తమ లబ్దికోసం, స్వార్ధబుద్ధితో ఈ మహత్తర జ్ఞానానికి మసిపూసి, కొత్తరంగు పులిమి, మూఢాచారాలుగా తీర్చిదిద్ది సమాజంలో అజ్ఞానాన్ని విస్తరిస్తున్నారు. ఇది మన దౌర్భాగ్యము.

లోతుగా పరిశీలిస్తే,

ధర్మం వేరు! మతం వేరు!

ధర్మం సత్యంపైన ఆధారపడివుంటుంది!

మతం అభిమతంపైన (వ్యక్తుల ఆలోచనాసరళి) ఆధారపడివుంటుంది!

సత్యం నుండి ధర్మం పుట్టింది! ధర్మంనుండి శాంతి, ప్రేమ, అహింసలు పుట్టేయి!

అందుకే మన పూర్వీకులు సూచించిన ''మానవధర్మంలో'' వీటిని వరుసక్రమంలో –

"సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింస"లుగా పేర్కొన్నాయి!

సత్యం లేని ధర్మానికి మనుగడలేదు! అవి కొంతకాలం విజృభించి పిమ్మట మరుగున పడిపోతాయి!

ధర్మం లేని శాంతి, అశాంతికి దారితీస్తుంది! ధర్మం లేని ప్రేమ, కపటాన్ని ఆశిస్తుంది! ధర్మం లేని అహింస, హింసను కోరుతుంది!

అందుకే సత్యమే శాశ్వతమైనది, సనాతనమైనది, అదే పరమావధి! అదే పరమాత్మ!

అందుకే ఉపనిషత్తులు "సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ" అని చాటిచెప్పేయి. అంటే అన్నింటా వ్యాపించియున్న పరమాత్మ స్వరూపము "సత్యమైనది, జ్ఞానవంతమైనది, అనంతమైనది" అన్నమాట!

అంటే దానిని గ్రహిస్తే, ఇక గ్రహించవలసినది ఏమీ వుండదని భావము!

పెద్దలు శోధించి ప్రతిపాదించిన అన్ని ధర్మాలు అసలు సత్యాన్ని తెలియపరిచేవే.

అన్ని ఆధ్యాత్మిక గ్రంధాలలో అంతర్లీనంగా వున్న విషయమిదే.

అన్ని విశ్వాసాలు ఆ పరాత్పరుని తెలుసుకోవడానికే కదా!

మనకు కనిపించని ఆ అఖండశక్తిని కృతజ్ఞతాభావంతో ఆరాధించుటకే కదా!

ఆ విశ్వాసాలకే మానవుడు ఒక్కో పేరు పెట్టుకున్నాడు.

దేశప్రాంతకాలమానపరిస్థితులు అనుగుణంగా అన్ని విశ్వాసాలలో ఎన్నో ధర్మాలు, సాంప్రదాయాలు వెలిసేయి. వాటిలో కొన్ని ధర్మాలు, సాంప్రదాయాలు యధాతధంగా కొనసాగుతున్నాయి, మరికొన్ని కాలానుగుణంగా మారుతున్నాయి.

సత్యాన్ని ఆధారంగా చేసుకొని ప్రతిపాదించబడిన వాటికి మార్పు వుండదు, మానవుడు ఏదో ఒక ఉద్దేశంతో కల్పించుకున్న వాటికి మార్పు సహజం.

జీవితం అనేది మనం దేవునితో ఆడే చదరంగం లాంటిది!

మనం ఒక ఎత్తు వేస్తాము, దేవుడు ఇంకో ఎత్తు వేస్తాడు!

మనం వేసే ఎత్తులో ఒక "ఎంపిక" వుంటుంది! దేవుడు వేసే ఎత్తులో ఒక "సవాలు" వుంటుంది!

ఎంపికలో స్వార్ధం కనపరచినా, నిస్వార్ధం వ్యక్తపరచినా, భగవంతుని సవాలు అందుకు అనుగుణంగానే వుంటుంది!

జీవుని పరీక్షించుటకే ఈ సవాలు!

ఆ సవాలును ఎదుర్కోనడమే సాధన!

నిస్వార్ధ సాధనలో సత్యము అవగతమౌతుంది!

స్వార్ధ సాధనలో మాయ ఆవహిస్తుంది.

## అధ్యాయం - 42

## మహిమాన్విత కామాఖ్య మందిరం, అకస్మాత్తుగా గురుదేవుల దర్శనం

గురుదేవులు చెప్పినట్లు నా 56వ ఏట, అంటే 2019 మార్చ్ నెలాఖరుకి నేను నా ఉద్యోగానికి Resign చేసేను. ఉద్యోగరీత్యా గడిచిన సంవత్సర కాలంలో ఎన్నో ప్రదేశాలు పర్యటించేను.

గురుదేవులు సూచించినట్లు అన్ని ప్రదేశాల్లో కూడా భిన్నత్వంలో, ఏకత్వాన్ని దర్శించే ప్రయత్నం చేసేను. అన్నింటినీ జ్ఞానంతో విశ్లేషించే ప్రయత్నం చేసేను. ఆ ప్రయత్నం చేస్తున్నప్పుడల్లా నా మనస్సు నాలో నెలకున్న ఆత్మను అనుభూతి పొందుతూ వుండేది.

నా ఉద్యోగంలో భాగంగా 2019 మార్చి నెలలో నేను వెళ్లిన చివరి క్యాంపు అస్సాం రాష్ట్రంలో గువహటి. దీన్నే గౌహతి అని కూడా పిలుస్తారు. ఇది పెద్ద పట్టణం. ఈ పెద్ద పట్టణంలో డిస్పూర్ అనే ప్రాంతం అస్సాం రాష్ట్ర రాజధాని.

గౌహాతిలో వున్న Assam Science and Technology University లో నా పని. అస్సాం రాష్ట్రంలోని అన్ని ఇంజనీరింగ్ కాలేజీలు ఈ యూనివర్సిటీతో అనుసంధానింపబడి వుంటాయి. రెండు రోజుల్లో నా పని అయిపోయింది.

ఆ సాయంత్రం గౌహాతి నగరంలోనే ఎంతో ప్రసిద్ధిగాంచిన శ్రీ కామాఖ్య అమ్మవారి మందిరాన్ని దర్శిద్దామని ఆటోలో బయలుదేరేను. కొండపై దాకా వాహనాలు వెళతాయి. గుడికి కొద్ది దూరంలో ఆటోని ఆపేడు డ్రైవర్. ఆటోని పంపించేసి గుడివైపు నడక సాగించేను. ఇదివరకు ఈ మందిరాన్ని నా శ్రీమతి తో పాటు దర్శించుకోవడం జరిగింది.

గౌహాతి పట్టణ పశ్చిమభాగంలో నీలాచల్ కొండల్లో కామాఖ్య దేవాలయం వుంది. ఈ కొండ బ్రహ్మపుత్ర నదిని ఆనుకొని వుంటుంది. చాలా పురాతనమైన దేవాలయం. 18 శక్తిపీఠాల్లో ఒకటి. ఇక్కడ అమ్మవారిని కామరూపిణి లేదా కామాఖ్య దేవిగా భక్తులు ఆరాధిస్తారు.

ఈ ఆలయంలో వున్న పది ఉపాలయాలు – కాళీ, తార, శోదషి, భువనేశ్వరి, భైరవి, చిన్నమస్తా, ధూమవతి, బగళాముఖీ, మాతంగి, కమల అనే పది మహావిద్యలకు తార్కాణం.

పురాణాల ప్రకారం, పరమశివునికి సతీదేవి తన సొగసును అర్పించిన రహస్య ప్రదేశం ఈ ఆలయప్రాంతం. దక్షయజ్ఞ ధ్వంసం తరువాత శివుడు ఒక విరాగిలా సతీదేవి శవంతో నృత్యం చేస్తున్నప్పుడు, అతణ్ణి తిరిగి తన నిజస్థితికి తీసుకు వచ్చేందుకు, విష్ణుమూర్తి తన సుదర్శన చక్రంతో సతీదేవి శరీరాన్ని అనేక భాగాలుగా ఖండించినప్పుడు, ఆమె యోని భాగం పడిన స్థలం ఈ ఆలయ ప్రాంతం.

ఆరవ శతాబ్దం నుండే ఈ ఆలయానికి చరిత్ర వుంది. ప్రస్తుతం వున్న ఆలయం 16వ శతాబ్దంలో నిర్మింపబడిందని కథనం. ఈ పెద్ద ఆలయానికి మూడు

మండపాలు వున్నాయి. మధ్య మండపము గుహరూపంలో వుండే ఒక పవిత్రస్థలానికి (గర్భగుడి) దారి తీస్తుంది.

అక్కడ ఏవిధమైన రూపము ఉండదు. సహజంగా భూగర్భంలో ఏర్పడిన నీటిబుగ్గలో నీరు "యోని ఆకారం" గల గండశిల పగులులోంచి ప్రవహిస్తూ ఉంటుంది.

ప్రతి వేసవికాలంలో అమ్మవారు రజస్వల అవుతుంది. ఆ సందర్భంగా అమ్మవారికి "అంబువాసి" అన్న పేరుతో ఐదు రోజులపాటు రసజ్వల ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ సమయంలో గర్భగుడిలో ప్రవహించే నీరు ఎర్రగా రుతుస్రావము వలే కనబడుతుంది.

ఈ ఉత్సవాలకు దేశం నలుమూలల నుండి భక్తులు వస్తారు. ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. సంతానం లేని దంపతులు ఆ సమయంలో అమ్మవారిని దర్శించుకుంటే సంతానం కలుగుతుందని విశ్వాసం.

ఈ గుడిలో ఇంకా జంతు బలులను ఇచ్చే సాంప్రదాయం కొనసాగుతోంది. అమ్మవారి ఉపాసకులు ప్రతి ఉదయము అమ్మవారికి అర్పించటానికి మేకలను వెంటపెట్టుకొని వస్తారు. ప్రాచీన కాళికా పురాణం కామాఖ్య దేవిని కోరికలను తీర్చే అమ్మగా, శివుని చిన్నభార్యగా, ముక్తిని ప్రసాదించే ఆదిశక్తిగా వర్ణించింది. ఆ శక్తియే కామరూపిణిగా, కామాఖ్యగా పిలవబడుతోంది.

భక్తులు ఎక్కువగానే వున్నారు. స్పెషల్ దర్శనం టికెట్ తీసుకొని గర్భాలయం గుహలో యోని రూపంలో వున్న అమ్మవారిని దర్శించుకున్నాను. ఆ శిలపై సన్నగా ప్రవహిస్తున్న నీటిని నా తలపై జల్లెడు ఆలయ అర్చకుడు.

మందిరం నుండి బయటకు వచ్చి, కొండచివరి భాగానికి చేరుకొని కొండ క్రింది ప్రవహిస్తున్న బ్రహ్మపుత్రా నది అందాలను తిలకిస్తున్నాను.

ఇంతలో ఆత్రేయా! అన్న పిలుపు వినబడి, వెనక్కి తిరిగి చూసేను. ఎదురుగా గురుదేవులు! ఆనందంతో మాటలు రాలేదు! ఇలా అకస్మాత్తుగా గురుదేవుల దర్శనం లభిస్తుందని అస్సలు వూహించలేదు! మోకాళ్లపై వంగి గురుదేవుల పాదాలను తాకి నా ప్రణామాలు అర్పించేను.

శుభం భూయాత్! అంటూ నా భుజాలు పట్టుకొని పైకి లేపుతూ, అట్టే సమయంలేదు ఆత్రేయా! త్వరగా వెళ్ళిపోవాలి! అంటూ నడక సాగించేరు గురుదేవులు. అతని ప్రక్కనే నేను కూడా నడవడం మొదలుపెట్టేను!

ఆత్రేయా! జాగ్రత్తగా విను అంటూ చెప్పసాగేరు!

ఆత్రేయా! నీతోనే, నీలోనే వుంటూ నీకు కలిగే సంశయాలను నేను ఎప్పటికప్పుడు తీరుస్తూ వుంటాను! ఆ సంశయ నివృత్తిలో కొన్ని మహావాక్యాలు నీ మనస్సులో ఉత్పన్నమౌతాయి. వాటిని జాగ్రత్తగా ఒకచోట నిక్షిప్తపరుచుకో.

నీకు లభించిన జ్ఞానంతో త్వరలోనే ఉపనిషత్తులు, భగవద్గీత, విష్ణు సహస్రనామ స్తోత్రము ఇత్యాది వాటికి జ్ఞానవంతమైన విశ్లేషణతో కూడిన రచనలు మరియు ఎన్నో అనుభవాలతో కూడిన నీ ఆత్మకథ నువ్వు వ్రాయడం జరుగుతుంది.

జ్ఞాన జిజ్ఞాసువులు ఈ పుస్తకాలను ముద్రిస్తారు. ఎన్నో సత్సంగాలు నిర్వహిస్తూ ఎంతో మందికి ఆత్మజ్ఞానాన్ని, ఆత్మానుభూతిని నువ్వు ప్రసాదించడం జరుగుతుంది. సత్సంగ మిత్రులు నిష్కామభావంతో ఎన్నో ప్రదేశాల్లో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది.

ఇకమీదట నా ప్రత్యక్షదర్శనం కోసం నువ్వు ఆరాటపడాల్సిన అవసరం లేదు. సందర్భాన్ని బట్టి నేను నిన్ను తరచుగా కలుస్తూ వుంటాను. అని పలికి నా వైపు తిరిగి, నా శిరస్సుపై తమ కుడిచేతిని పెట్టి,

ఆత్రేయా! అంతా మంచే జరుగుతుంది, శుభం భూయాత్! నేను వెళుతున్నాను! అని వడివడిగా కొండదిగువకు నడక సాగించేరు. గురుదేవులు కనుమరుగయ్యేంత వరకు అటే చూస్తూ, పెద్దగా గాలి పీల్చుకొని, ఆటో స్టాండ్ పైపు నడక సాగించేను.

ఈ దర్శనంలో ఇలా కొన్ని అభయాలను నాకు ప్రసాదించేరు పూజ్య గురుదేవులు.

గురుదేవులు తమ మొదటి మాటగా, “ఆత్రేయా! కొన్ని మహావాక్యాలు నీ మనస్సులో ఉత్పన్నమౌతాయి! వాటిని జాగ్రత్తగా ఒకచోట నిక్షిప్తపరుచుకో” అన్న సందేశం జ్ఞాపకం వచ్చింది.

ఆ సందేశం వెనకనున్న అంతరార్ధం ఏమిటి? పిమ్మట కొన్ని జ్ఞానవంతమైన రచనలు చేస్తావని కూడా అన్నారు! నా మనస్సులో ఉత్పన్నమయ్యే మహావాక్యాలకు అనుగుణంగా నా రచనలు వుండగలవు అన్నది గురుదేవుల ఉద్దేశ్యం కావొచ్చు. ఈ రకమైన ఆలోచనలతో ఆటోస్టాండుకు చేరుకొని, ఆటో మాట్లాడుకొని రాత్రి 08.30కి హొటల్ రూముకి చేరుకున్నాను.

రేపు మధ్యాహ్నం గౌహతి నుండి కలకత్తాకు నా Flight. అక్కడనుండి సాయంత్రం Flight లో వైజాగ్ కి చేరుకునేలా ముందుగానే టికెట్స్ బుక్ చేసుకున్నాను.

హొటల్ రెస్టారెంట్లో డిన్నర్ చేసి తిరిగి రూంకి చేరుకున్నాను. Laptop ఓపెన్ చేసి, Google docs లో “గురుదేవుల మహావాక్యాలు” అని టైపు చేసి, ఒక File Create చేసేను.

## అధ్యాయం - 43

## రచనలకు శ్రీకారం,

## గురుదేవుల మహావాక్యాలు

ఏం వ్రాద్దామా అనుకుంటూ, వివిధ సందర్భాలలో గురుదేవులు నాతో ముచ్చటించిన విషయాలను జ్ఞప్తికి తెచ్చుకునే ప్రయత్నం చెయ్యసాగేను. ఒక్కొక్కటిగా కొన్ని వాక్యాలు నా మదిలో మెదలసాగేయి. టైపు చెయ్యడం మొదలుపెట్టేను –

1. ఆత్రేయా! ఆత్మానుభూతి చెందాలంటే వైరాగ్యం తప్పనిసరి, వైరాగ్యం రావాలంటే జ్ఞానం తప్పనిసరి, జ్ఞానం పొందాలంటే చిత్తశుద్ధి తప్పనిసరి, చిత్తశుద్ధి జరగాలంటే భక్తి తప్పనిసరి, భక్తి పండాలంటే నిష్కామకర్మలు తప్పనిసరి!

2. ఆత్రేయా! ఏది శాశ్వతమో దానియందు విశ్వాసమే "భక్తి", ఏది సత్యమో దానిని తెలుసుకోవడమే "జ్ఞానము", ఏది మార్పు చెందుతుందో దానిని విడిచిపెట్టడమే "వైరాగ్యము".

3. ఆత్రేయా! జీవుడు ఈ ప్రపంచాన్ని కళ్ళతో చూస్తాడు, కళ్ళు మూసినప్పుడు బుద్ధితో చూస్తాడు, మరి బుద్ధిని చూసేది? – “ఆత్మ”!! అందుకే సత్యశోధన చెయ్యి, ఆత్మను గ్రహించు, ఆత్మానుభూతిని పొందు!!

4. ఆత్రేయా! జీవునిలో స్థూల, సూక్ష్మ, కారణ దేహాలుంటాయి, కారణదేహంలో అనేక జన్మార్జిత పాపపుణ్య వాసనలు బీజరూపంలో వుంటాయి, జీవునిపై వాటి ప్రభావం వుంటుంది, అవి పోవాలంటే సూక్షదేహంలో మార్పురావాలి, అందుకు స్థూలదేహంతో అభ్యాసం చెయ్యాలి!!

5. ఆత్రేయా! పాలలో నెయ్యి వున్నట్లు, గింజలో నూనె వున్నట్లు, కట్టెలో నిప్పు వున్నట్లు, ఈ సృష్టిలోని ప్రతి వస్తువులో చైతన్యం వుంటుంది. ఆ చైతన్యమే పరమాత్మ! దానిని వర్ణించడం అసాధ్యం! అనుభూతి ద్వార మాత్రమే గ్రహించగలము!!

6. ఆత్రేయా! సత్యాన్ని గ్రహించడమంటే మన అసలు స్వరూపాన్ని తెలుసుకోవడమే, దీనినే %వావశ్రీట–=ఖుశ్రీఱయ్‌ఱశీఅ% అంటారు! దీంతో మనం వచ్చిన చోటుకి చేరుకుంటాము, దీనినే %=వబఅఱశీఅ% అంటారు! అందుకు అన్ని బంధాలనుండి విముక్తిపొందాలి, దీన్నే %వాఱఎవతీఫ్‌ఱశీఅ% అంటారు!

7. ఆత్రేయా! ఎంతోకాలంగా భక్తితో కర్మలు చేస్తున్న కూడా ఆత్మజ్ఞానం కలగలేదంటే సద్గురు ఆశ్రయానికి సమయం ఆసన్నమైందని అర్థం. అహాన్ని వదిలి గురువు కోసం తపిస్తే, గురువే తన దర్శనభాగ్యం కలుగజేసి, తగు మార్గాన్ని సూచిస్తాడు!

8. ఆత్రేయా! ఈ కలియుగంలో మంచి, చెడు ఒకే జీవునిలో నెలకొనివుంటాయి! కావునా భగవంతుడు అవతరించి దుష్టులను వధించుట జరుగదు. అందుకే సద్గురు రూపంలో ప్రకటితమై జీవులతోనే వుంటూ వారిని సన్మార్గంలో నడిపే ప్రయత్నం చేస్తాడు!

9. ఆత్రేయా! నేను వచ్చింది మీ కోసమే! నా ఖజానా నిండివుంది! ఎవరికి ఏమి కావాలో నిర్భయంగా పొందవచ్చు! కానీ పొందినదంతా తిరిగి పరమాత్మకు ఇచ్చేయాలి! అలా చేస్తే మీ ఖజానా కూడా ఎప్పుడూ నిండుగా వుంటుంది!

10. ఆత్రేయా! గురు అనుగ్రహం అమోఘమైనది! శిష్యునికి ఏది ప్రసాదించాలో గురువుకి బాగా తెలుసు! పూర్తి విశ్వాసంతో అతణ్ణి సేవించడం శిష్యుని కర్తవ్యం! గురుసేవతో ఆత్మజ్ఞానం పొందడం అత్యంత సులువు! తాను పదిమందికి బోధించాల్సిన జ్ఞానాన్ని తన శిష్యుని ద్వారా చెప్పిస్తాడు సద్గురువు!

11. ఆత్రేయా! ధనం, పరపతితో బయట వస్తువులను కొనగలము! కానీ ఆత్మవస్తువును కొనలేము! అది కేవలం ఆత్మజ్ఞానంతోనే సాధ్యపడుతుంది!

12. ఆత్రేయా! జీవుడు కష్టాల్లో వున్నప్పుడు ఆధ్యాత్మికం, సుఖాల్లో వున్నప్పుడు అహంకారాన్ని ఆశ్రయిస్తాడు! అదే మాయ! దీనికి విరుగుడే ఆత్మశోధన!

13. ఆత్రేయా! ప్రాపంచిక విషయములపై నీకు వైరాగ్యం పెరుగుతున్నకొద్దీ నీ ఆత్మ నీకు దగ్గరవుతూ వుంటుంది! వైరాగ్యమే అసలైన రాజయోగం! క్షణికమైనవి కోల్పోతావు! శాశ్వతమైనవి పొందుతావు!

14. ఆత్రేయ! ఏకాగ్రతే ధ్యానం! నేడు ఎన్నో ధ్యానపద్ధతులు అమల్లో వున్నాయి! నిజమేంటంటే ప్రతి మనిషి ప్రతినిత్యం ధ్యానం చేస్తూనేవున్నాడు! ఇన్నాళ్లు ధ్యానిస్తున్నది ప్రాపంచిక వస్తువులైతే, ఇప్పుడు ఆ ధ్యానమును ఆత్మ వస్తువుపై మళ్లించడమే!

15. అత్రేయా! ఆత్మానుభూతి పొందడానికి వేషభాషలు, కులమతవర్ణాలు, పాండిత్యము, ఆడంబరత, విశేష శాస్త్రపరిజ్ఞానంతో పనిలేదు! పరమాత్మ ప్రసాదించిన సహజజ్ఞానం సరిపోతుంది! కావలసిందల్లా విశ్వాసంతో కూడిన సాధన!!

16. ఆత్రేయా! పరమాత్మ స్వరూపం సత్యం, శివం, సుందరం. అందుకే, సత్యమును తెలుసుకొనుటకు భక్తి, శివమును గ్రహించుటకు జ్ఞానము, సుందరమును అనుభవించుటకు వైరాగ్యము అవసరం!

17. ఆత్రేయా! ప్రజాకర్షణ బట్టి గురువుని ఎంచుకోకూడదు. ఆత్మాకర్షణ బట్టీ గురువుని చేరుకోవాలి. అప్పుడే గురుశిష్యుల ఆత్మ ఏకరూపం దాల్చి ఆత్మస్వరూపం అవగతమౌతుంది. అదే గురుశిష్యుల ఆత్మసంబంధం!

18. ఆత్రేయా! ఆత్మానుభూతి పొందాలంటే, మధ్వాచార్యులంత భక్తిభావం! రామానుజాచార్యులంత నిష్కామకర్మభావం! శంకరాచార్యులంత జ్ఞానభావం పొందాలి! సాధనతో ప్రతివ్యక్తికి ఇవి సాధ్యమే!

19. ఆత్రేయా! స్వప్న(నిద్ర), సుషుప్తి(గాఢనిద్ర) అవస్థలలో ఏ చైతన్యం మన వెన్నంటివుండి, మఱల మనలను జాగృత్(మెలుకువ) అవస్థలోకి గొనివస్తుందో, అదే "ఆత్మ". ప్రతిరోజూ, ప్రతిజీవుడు తనకు తెలియకుండానే సుషుప్తిలో ఆత్మానందాన్ని పొందుతూ వుంటాడు!

20. ఆత్రేయా! ఎలాగైతే నీరు ఒక వస్తువులో ప్రవేశించి అదే రూపం దాలుస్తుందో, ఎలాగైతే సూర్యకాంతి ఒక వస్తువుపై పడి దాన్ని ప్రకాశింపజేస్తుందో, అలానే ఆత్మ ఒక ఉపాధిలో ప్రవేశించినప్పుడు, ఆ రూపాన్ని పొంది, దాన్ని చైతన్యపరుస్తుంది!

21. ఆత్రేయా! అన్ని ధర్మాలు సత్యాన్ని తెలియపరిచేవే! అన్ని విశ్వాసాలు పరమాత్ముని తెలుసుకోడానికే! వాటికే మానవుడు ఒక్కోపేరు పెట్టుకున్నాడు! వాటిలోనే ఎన్నో సాంప్రదాయాలు, నియమాలు కల్పించుకున్నాడు! సత్యం ఆధారంగా వున్నవి నిలుస్తాయి! స్వార్థం ఆధారంగా వున్నవి నశిస్తాయి!!

22. ఆత్రేయా! అదితిగా ఆరాధింపబడుతున్నది, ప్రాణశక్తిగా విరాజిల్లుతున్నది, అన్ని భూతములందు నెలకొనియున్నది, ఆ పరమాత్మే! ఈ ఏకత్వాన్ని జీవించియుండగా అనుభూతిపొందినవాడే జ్ఞాని! అతడే యోగి!!

23. ఆత్రేయా! స్వప్న, జాగ్రదావస్థలో కూడా ఏది విశ్వంతో ముడిపడి వుంటుందో అదే పరమాత్మ! అన్ని జీవులలో అది జీవాత్మగా ప్రకాశిస్తుంది! జీవభావాన్ని పొందినవాడు, జీవభావాన్ని కలిగించువాడు కూడా పరమాత్మే!

24. ఆత్రేయా! సందర్భాన్ని బట్టీ, విశ్వాసాన్ని బట్టీ, సాంప్రదాయాన్ని బట్టీ, ఆచారాన్ని బట్టీ "సత్యం" మారదు. సత్యం శాశ్వతం, సనాతనం! దాని వెంట మనం పరిగెత్తాలిగాని, సత్యం మన వెంటరాదు!!

25. ఆత్రేయా! సద్గురువు జ్ఞానోపదేశం చేస్తాడు, సత్యమార్గాన్ని చూపుతాడు కానీ ఎట్టి పరిస్థితుల్లో "ఆత్మానుభూతిని" ప్రసాదించడు! దాన్ని సాధించడం మాత్రం శిష్యునికే వదిలేస్తాడు!!

26. ఆత్రేయా! చెవికి చెవిగా, మాటకు మాటగా, కన్నుకు కన్నుగా, మనస్సుకు మనస్సుగా, ప్రాణానికి ప్రాణంగా వుండే వస్తువుని గ్రహించినవాడు అన్నింటినుండి విముక్తనొంది అమృతత్వమును పొందుతాడు!

27. ఆత్రేయా! మానవులకు రూపగుణాలు వున్నాయి కాబట్టి, మన జ్ఞానం వీటికి అతీతంగా ఆలోచించడం కష్టం! భగవంతుడిని నిరాకారంగా ఆరాదించడంలో తలెత్తే సమస్య ఇదే! దాన్ని అధిగమిస్తే గానీ "పరమాత్మతత్త్వం" అవగతం కాదు!

28. ఆత్రేయా! జీవితమనేది మనం దేవునితో ఆడే చదరంగం లాంటిది! మనం ఒక ఎత్తు వేస్తే, దేవుడు ఇంకో ఎత్తు వేస్తాడు! మన ఎత్తులో ఒక "ఎంపిక" వుంటుంది, దేవుని ఎత్తులో ఒక "సవాలు" వుంటుంది! ఆ సవాలును ఎదుర్కోవడమే సాధన! నిస్వార్థసాధనతో సత్యం అవగతమౌతుంది! స్వార్థ సాధనతో మాయ ఆవహిస్తుంది!!

29. ఆత్రేయా! నదులు వేరైనప్పటికీ నీరు ఒక్కటే! ఉపాధులు(శరీరాలు) వేరైనప్పటికీ ఆత్మవస్తువు ఒక్కటే! ఒకే చైతన్యం నానా రూపాలలో వ్యక్తమౌతోంది! దీన్ని అనుభూతి పొందినవాడే జ్ఞాని! అతడే యోగి!!

30. ఆత్రేయా! భగవంతుని ఆరాధన విషయంలో కర్మలవలన ఒక ఫలితం, జ్ఞానంవలన ఒక ఫలితం లభిస్తాయి! అయితే కర్మజ్ఞానములు రెండింటినీ సమన్వయ పరుచుకొని భగవత్తత్వాన్ని తెలుసుకున్నవాడు ముక్తిని పొందగలడు!!

31. ఆత్రేయా! అహంకారమును విడచుటయే కర్మయోగికి ఆఖరిపాఠము, జ్ఞానయోగికి మొదటిపాఠము! అహంకారంతో చేసే కర్మలన్నీ ప్రతిబంధకములే!

32. ఆత్రేయా! కొందరు కర్మలతో, కొందరు జ్ఞానంతో, కొందరు ధ్యానంతో, కొందరు వైరాగ్యంతో "ఆత్మానందాన్ని" పొందుతారు! మార్గమేదైనా చిత్తశుద్ధి తప్పనిసరి!

33. ఆత్రేయా! కర్మయనే ధనుస్సులో, జ్ఞానమనే బాణమును ఎక్కుపెట్టి, తదేకదృష్టితో లాగి, ఆత్మయనే లక్ష్యాన్ని చేరుకోవాలి!

34. ఆత్రేయా! రామకృష్ణ పరమహంస అనన్యభక్తితో, స్వామి వివేకానంద అమోఘ జ్ఞానంతో, రమణ మహర్షి ఆత్మశోధనతో, వేదాంత ప్రభుపాదులు నామజపంతో, పరమహంస యోగానంద క్రియాయోగంతో, దయానంద సరస్వతి సంఘసేవతో "బ్రహ్మమును" పొందేరు! వారి దారులు వేరైనా "గమ్యం" ఒక్కటే!!

35. ఆత్రేయా! కర్మ, జ్ఞానాలే జీవుని అభ్యుదయానికి సోపానాలు. కర్మ ప్రస్తుతానికి, జ్ఞానం ప్రస్తుతంతో పాటు భవిష్యత్తుకి సోపానం! వీటిని సమన్వయం చేసుకోవడమే సాధన! అదే జీవుని కర్తవ్యం!!

36. ఆత్రేయా! పరమాత్మ మాయకి, మాటకి, మంత్రానికి, మర్మానికి లొంగడు! కేవలం సత్యానికి మాత్రమే లొంగుతాడు!!

37. ఆత్రేయా! ఆత్మసాధనలో –

మొదటి దశ – నేను పరమాత్మ వేరు!

రెండవ దశ – అంతా పరమాత్మే!

మూడవ దశ – పరమాత్మ నాలోనే వున్నాడు!

నాల్గొవ దశ – నేనే పరమాత్మ!

38. ఆత్రేయా! జీవుడు శుద్ధత్వంతో జన్మిస్తాడు కాబట్టి శుద్ధత్వంతో శరీరత్యాగం చెయ్యాలి! అందుకు తగిన జ్ఞానం జీవునికి పరమాత్మ ప్రసాదించేడు!!

39. ఆత్రేయా! భగవత్భక్తికి అందరూ అర్హులే!

రాక్షసులైన ప్రహ్లాదుడు, బలి, విభీషణుడు భక్తులే కదా!

జంతువులైన గజేంద్రుడు, జాంబవంతుడు, హనుమంతుడు భక్తులే కదా!

పక్షులైన సంపాతి, జటాయువు భక్తులే కదా!

పరమాత్మ సృష్టిలో అందరూ పాత్రధారులే కదా!!

40. ఆత్రేయా! జ్ఞానంలేని కర్మాచరణ, ఆచరణలేని జ్ఞానం వలన ఉపయోగం లేదు! సన్యాసానికి కూడా ఇదే పునాది!!

41. ఆత్రేయా! మానవుల్లో ఆలోచన ప్రక్రియ నానా రకాలుగా వుంటుంది! ఎక్కొక్కరూ ఒక్కో ఆలోచనను అనుసరిస్తారు! ఆలోచనలు వేరైనా సత్యమొక్కటే! సత్యమే పరమాత్మ! అదే సత్యం! ఎన్ని కోణాలలో విశ్లేషించినా సత్యం మారదు!

42. ఆత్రేయా! సాధనలో అంతిమ లక్ష్యం సత్యమై వుండాలి! సత్యంకానిది పరమాత్మను చేరలేదు! మిగతా వ్యవహారములన్నీ బాహ్యప్రకటనలే! అవే బంధానికి మూలకారణం! బాహ్యాన్ని త్యజిస్తే అంతా అంతర్ముఖమే! అదే సత్యం!

43. ఆత్రేయా! ప్రతివ్యక్తి కర్మలనే ఇష్టపడతాడు, కారణం తన ప్రాబల్యాన్ని చాటేవి అవే కాబట్టీ! ప్రాబల్యం పెంచుకుంటూ తన జ్ఞానస్వరూపాన్ని విస్మరిస్తాడు మనుజుడు! కర్మలన్నీ బంధహేతుకమన్న సత్యాన్ని గ్రహించడు! ఫలితం, జననమరణ చట్రంలో ఇరుక్కుంటాడు!

44. ఆత్రేయా! జీవులు ఆచరించే కర్మల యొక్క ఫలితాలను వూహించడం అసాధ్యం! భగవంతుని Technonology లో అదో పెద్ద IoT (Internet of Things) and BD (Big Data)! ఎన్నో Codes తో ఏర్పడిన Software అది! 18 Layer Security తో Save చెయ్యబడుతుంది! తప్పించుకోడం అసాధ్యం!

45. ఆత్రేయా! కర్మలు ఆచరించే అధికారం మనకు వుంది, కానీ ఆ కర్మఫలితాలు మన చేతుల్లో వుండవు! దాన్ని గ్రహించినవాడే జ్ఞాని! ఆ ప్రకారము నడుచుకున్నవాడే యోగి! అతడు మాత్రమే యోగాన్ని అనుభవించగలడు!

46. ఆత్రేయా! త్రికరణశుద్ధితో, నన్ను (మీలోనే వున్న నన్ను) నమ్మినవాడికే నేను స్వంతం! మరి ఏ విధంగా కొలిచినా నేను మీ వాణ్ని కాను! అలా భావిస్తే అది మీ అజ్ఞానమే సుమీ!

47. ఆత్రేయా! భగవంతుడు భక్తికి మొదటి ప్రాధాన్యమిచ్చి తరువాత జ్ఞానానికి ప్రాధాన్యమిస్తాడు! తద్వార అందరూ తనను గ్రహించే అవకాశన్ని కల్పించేడు ! ఎవరైనా భగవంతుని ముందు సమానమే! ఈ తారతమ్యాలు మనం కల్పించుకున్నని మాత్రమే!

48. ఆత్రేయా! ఆత్మలేని జీవం లేదు! చైతన్యంలేని జడం లేదు! జడంలేని జీవంలేదు! జీవంలేని ఆత్మలేదు! ఆత్మలేని పరమాత్మలేదు! పరమాత్మలేని విశ్వంలేదు!

49. ఆత్రేయా! ఈ సృష్టి మొత్తం క్షేత్రం, క్షేత్రజ్ఞుడు అనే రెండింటితో నిండివుంది! ఇందు క్షేత్రం(పొలము) జడమైనది, క్షేత్రజ్ఞుడు(రైతు) చైతన్యవంతమైన జీవుడు. జీవుని శరీరం కూడా ఒక జడమైన క్షేత్రమే! ఇందులో చైతన్యవంతమైన ఆత్మయే క్షేత్రజ్ఞుడు!

50. ఆత్రేయా! రామకృష్ణ పరమహంస అనన్యభక్తితో, స్వామి వివేకానంద అమోఘజ్ఞానంతో, రమణ మహర్షి ఆత్మశోధనతో, వేదాంత ప్రభుపాదులు నామజపంతో, పరమహంస యోగానంద క్రియాయోగంతో, దయానంద సరస్వతి సంఘసేవతో "బ్రహ్మమును" పొందేరు! వారి దారులు వేరైనా "గమ్యం" ఒక్కటే!

51. ఆత్రేయా! హృదయాన్ని కదిలించేదే ప్రేమ! ప్రేమతో చేసేదే సేవ! సేవతో కలిగేదే ఆనందం! ఆనందాన్ని పంచడమే శాంతి! ఎవరిని బాధించనిదే అహింస! అందరి అభ్యుదయం కోరేదే ధర్మం! పరమాత్మను తెలియజేసేదే సత్యం!

52. ఆత్రేయా! God is Faith! One can experience, Him with undoubted Faith!

53. ఆత్రేయా! ఈ సృష్టికి కారణమైన సత్యాన్ని గ్రహించడానికి ఎన్నో మార్గాలను కనుగొన్నాడు మానవుడు! కానీ వాటిని ఆచరించే గందరగోళంలో అసలు సత్యాన్ని విస్మరించేడు!

54. ఆత్రేయా! తల్లి నిజం, తండ్రి నమ్మకం! ఆత్మ నిజం, జీవితం నమ్మకం! ఆత్మే దేహరూపంలో జీవిస్తుంది! ఆత్మే ఆత్మను గ్రహిస్తుంది! వున్నది ఒక్కటే! అదే ఆత్మ!

55. ఆత్రేయా! నారాయణుని ధ్యానిస్తూ నరుని దూషిస్తే ప్రయోజనం లేదు! మాధవుని పూజిస్తూ మానవధర్మాన్ని విస్మరిస్తే మనుగడలేదు! సత్యమును మరచి సదాశివుని స్మరిస్తే లాభంలేదు! ఆధ్యాత్మికసాధనంటే ఇదేమరి!

56. ఆత్రేయా! దేవాలయాలను, ప్రార్థనా మందిరాలను నిర్మించింది ఎవరు? మానవులే కదా! అయితే కొండలు, కోనలు, అరణ్యాలు, నదులు, సరోవరాలు, సాగరాలు నిర్మించింది ఎవరు? ఇవే నా నివాసస్థానాలు!

57. ఆత్రేయా! ఎంత మాయలో వున్నా జ్ఞానంతో ఆలోచిస్తే సృష్టి మధురం, జన్మ మధురం, కర్మ మధురం, జ్ఞానం మధురం, ధ్యానం మధురం, యోగం మధురం, అనుభూతి మధురం. అదే బ్రహ్మానందం! ఆత్మానందం!

58. ఆత్రేయా! ఈ సృష్టికి కారణమైన సత్యాన్ని గ్రహించడానికి, తలబద్దలయ్యేలా ఎన్నెన్నో కర్మజ్ఞాన మార్గాలను కనుగున్నాడు మానవుడు! కానీ పాపం ఆ సత్యం తనలోనే వుందన్న విషయాన్ని మాత్రం విస్మరించి బయట అన్వేషిస్తున్నాడు!

59. ఆత్రేయా! మానవుని ప్రణాళిక రోజుల్లో వుంటే ఆకు కూరలు, కూరగాయలు పండించొచ్చు! మానవుని ప్రణాళిక సంవత్సరం అయితే ధాన్యాలను పండించొచ్చు! మానవుని ప్రణాళిక పదేళ్లు అయితే చెట్లను నాటవచ్చు! మానవుని ప్రణాళిక జీవితాంతం అయితే జ్ఞానబీజాన్ని నాటాలి!

60. ఆత్రేయా! గురువు స్వతహాగా శాంతస్వభావుడు, కానీ శిష్యులతో కాస్త కఠినంగా వుంటాడు, కానీ వారి అభ్యున్నతికి లోలోన ఎంతో ఆనందపడతాడు! అందుకే విజ్ఞులు శాస్త్రజ్ఞానంతో పరమాత్మను కాస్త తెలుసుకోవచ్చు గానీ గురువును అర్థం చేసుకోవడం దుర్లభమని అంటారు!

61. ఆత్రేయా! ఆత్మజ్ఞానానికి, చిత్తశుద్ధి ప్రధానం! చిత్తమాలిన్యంతో అరణ్యవాసం ఉపయోగంలేదు! చిత్తశుద్ధితో జనవాసం ఆటంకంలేదు!

62. ఆత్రేయా! అందరూ బ్రతకాలి – కర్మమార్గం! అందర్నీ బ్రతికిస్తూ, తాను బ్రతికి, సత్యాన్ని గ్రహించాలి – జ్ఞానమార్గం!

63. ఆత్రేయా! కర్మను నమ్ముకుంటే సుఖకష్టాలు! జ్ఞానాన్ని నమ్ముకుంటే కష్టసుఖాలు లభిస్తాయి!

64. ఆత్రేయా! కర్మలను జ్ఞానంగా, జ్ఞానాన్ని సత్యంగా పరిశోధించు! అసలు సత్యం త్వరలోనే తెలుస్తుంది!

65. ఆత్రేయా! ధ్యానం అంటే విచారణ! దీన్నే తపస్సు అంటారు! నేడు ధ్యానం కోసం AC మరియు Non AC సదుపాయాలు వున్నాయి! ధ్యాస తప్పా ధ్యానం లేదు! ధ్యానంలో పొంద వలసింది ఒక్కటే! అదే ఆత్మానుభూతి!

66. ఆత్రేయా! “నేను, నాది” అన్నవాటిని, జీవుడు మనసావాచాకర్మణా ఎప్పుడైతే త్యజిస్తాడో, అప్పుడే ఆత్మజ్ఞానం ఉదయించినట్లు లెక్క! అంతవరకూ సంశయం, జంఝాటం తప్పవు!

67. ఆత్రేయా! మానవుల్లో ఆలోచన ప్రక్రియ నానా రకాలుగా వుంటుంది! ప్రతివ్యక్తి ఒక్కో ఆలోచనను అనుసరిస్తాడు! ఆలోచనలు వేరైనా సత్యమొక్కటే! సత్యమే పరమాత్మ! అదే సత్యం! ఎన్ని కోణాలలో విశ్లేషించినా సత్యం మారదు!

దాహం వేసి టేబుల్ మీద వున్న వాటర్ బాటిల్ ఓపెన్ చేసి నీళ్లు త్రాగేను. నా ఆలోచనలకు బ్రేక్ పడింది. టైం చూసేను. ఉదయం 05.20 అయ్యింది. అంటే సుమారు ఏడున్నర గంటల పాటు వ్రాస్తున్నాను.

ఒక్కసారి నేను వ్రాసినవి చదువుకున్నాను. ఆశ్చర్యం వేసింది. ఈ ఏడున్నర గంటల్లో 67 మహావాక్యాలు గురుదేవులే నా మదిలో ప్రవేశించి నా చేత వ్రాయించుకున్నారన్న విషయం చాలా స్పష్టంగా తెలియవచ్చింది. File ని Save చేసుకున్నాను. మనస్సులో గురుదేవులకు సాష్టాంగ ప్రణామాలు అర్పించుకున్నాను.

వేడిగా టీ త్రాగుదామని రూమ్ లాక్ చేసి హెూటల్ బయటకు వచ్చేను. ఎదురుగానే టీ స్టాల్ కనబడింది. సుమారు పదిమంది దాకా టీ త్రాగుతున్నారు. వేడిగా రెండు టీలు త్రాగి. కొంతసేపు మార్నింగ్ వాక్ చేసి రూముకి చేరుకున్నాను.

మాహుర్ లో నా ప్రశ్నలకు గురుదేవులు ఇచ్చిన సమాధానాలను "పరిప్రశ్న – గురుబోధ" పేరున ఒక Google docs File ని తయారు చేసుకున్నాను.

"పరిప్రశ్న – గురుబోధ" నా మొదటి రచన అయితే, ఈనాటి "గురుదేవుల మహావాక్యాలు" నా రెండవ రచన.

నా ఆధ్యాత్మిక రచనలకు గురుదేవులు ఈరోజు శ్రీకారం చుట్టేరు. చాలా ఆనందం కలిగింది. ఇక నిద్దర పట్టలేదు. స్నానం చేసి దగ్గరలో వున్న దత్తమందిరానికి వెళ్ళేను.

శ్రీ గురుదేవ దత్తుణ్ణి, శ్రీ స్వామి సమర్థుల వారిని, శ్రీ సాయి నాధుణ్ణి, శ్రీ కాళికా మాతను దర్శించుకొని హెూటల్ కి వచ్చి, రూమ్ చెక్ అవుట్ చేసి, టాక్సీ మాట్లాడుకొని గౌహాతి ఎయిర్పోర్ట్ కిబయలుదేరెను. ప్రయాణం కొనసాగించి రాత్రి 08.30 కి విశాఖపట్నం చేరుకున్నాను.

## అధ్యాయం - 44

## గేయం గీతా నామ సహస్రం

పూజ్య గురుదేవుల సూచన ప్రకారం 2019 మార్చ్ 31st తో నా ఉద్యోగ బాధ్యతలకు స్వస్తి పలికేను. మిగతా జీవితమంతా ఆధ్యాత్మిక సాధనలోనే గడపాలని నిశ్చయించుకున్నాను.

ఇన్నాళ్లు బిజీగా గడిచిపోయిన నా జీవితంలో ఒక్కసారిగా ఎంతో సమయం లభించింది. 2018 లోనే కొన్ని వ్యాసాలు, రచనలు వ్రాయడం ప్రారంభించినా చాలా మట్టుకు రచనలు 2019, 2020 లో పూర్తి చెయ్యడం జరిగింది.

2018 శ్రీరామనవమి రోజున సన్మతి సేవా సత్సంగం స్థాపించి, ప్రతిరోజూ Google Meets ద్వారా సత్సంగ మిత్రులతో ఆధ్యాత్మిక సత్సంగాలు జరపడం ప్రారంభించేను. Facebook లో పరిచయమైన మిత్రులు ఈ సత్సంగాలలో Regular గా పాల్గొనేవారు.

మే నెలలో నేను, నా శ్రీమతి దుబాయ్ వెళ్ళేము. రెండునెలల పాటు మా

మనవడితో, అబ్బాయి కుటుంబంతో సరదాగా గడిచిపోయింది. సెప్టెంబరులో మా అల్లుడు, అమ్మాయి అమెరికా రమ్మన్నారు.

జులై నెలలో అమెరికా వీసా కోసం హైదరాబాద్ US Consulate లో interview అటెండ్ అయ్యేము. పది సంవత్సరాలకు అంటే 2029 వరకు వీసా లభించింది. 2019 సెప్టెంబర్ 25th కి కాలిఫోర్నియా చేరుకున్నాం. అక్టోబర్ నెలంతా కూడా ఎన్నో ప్రదేశాలు చూడ్డం జరిగింది.

డిసెంబరు మూడో తేదీన మనవరాలు పుట్టింది. పర్యటనలు తగ్గడం వలన ఎక్కువ ఖాళీ సమయం లభించింది. త్వరలోనే కొన్ని రచనలు చేస్తావు అన్న గురుదేవుల మాటలు గుర్తుకు వచ్చేయి. గురుదేవులు ప్రసాదించిన జ్ఞానంతో కొన్ని రచనలు చెయ్యడం జరిగింది. వాటిలో ముఖ్యమైనవి –

"శాస్త్రీయ రామాయణము" – శాస్త్రీయదృష్టితో రామాయణము.

"విష్ణు సహస్రనామ స్తోత్రవిశ్లేషణ" – పరమాత్మ స్వరూపము.

"ఒక సత్యశోధకుని ఆత్మకథ" – సత్యశోధన దిశగా నా ప్రయాణము.

2020 మార్చి నెలలో మా తిరుగు ప్రయాణం. కానీ Covid వలన అన్ని విమానాలు Cancel అయ్యాయి. ఎప్పుడు Resume అవుతాయో తెలీదు. మొత్తం ప్రపంచమంతా కూడా ఈ మహమ్మారి బారిన పడింది. కొన్ని కోట్లమంది ప్రాణాలు కోల్పోయేరు.

సోషల్ డిస్టెన్స్ వలన మనుషుల మధ్య దూరం పెరిగింది. ఒకప్రక్క ఎంతోమంది మహాత్ములు తమ ప్రాణాలను సైతం లెక్కజెయ్యకుండా నిస్వార్ధంగా సేవలను అందిస్తూ వుంటే, ఇంకోప్రక్క స్వార్ధపరులు ఈ మహమ్మారిని అడ్డంపెట్టుకొని ప్రజలను అన్ని విధాలా దోచుకున్నారు. కాలమే వారికి తగిన బుద్ధి చెబుతుంది.

ఇది ముమ్మాటికీ సత్యం!

ఈ సమయంలో పూజ్య గురుదేవులు అనేకసార్లు నాకు తమ దర్శనభాగ్యం ప్రసాదించి నన్ను కార్యోన్ముఖులను చేసేరు. మన దేశంలో జరిగిన కొన్ని సంఘటనలు నన్ను కలిచివేసింది. నాకు తెలిసిన కొంతమంది అభాగ్యులకు "నారాయణసేవ" చేసుకునే భాగ్యం లభించింది. మనస్సు కాస్త కుదుటపడింది.

ఈ ఖాళీ సమయంలో ఇంకొన్ని రచనలు నాతో చేయించేరు నా గురుదేవులు. అవి –

"జ్ఞానగీత" – నిత్యజీవితంలో ఉపనిషత్తులు.

"జీవనగీత" – నిత్యజీవితంలో భగవద్గీత.

పై రెండు మఱియు బ్రహ్మసూత్రములు, ఈ మూడింటిని కలిపి "ప్రస్థానత్రయము" అని అంటారు. ఈ రచనల ద్వారా నేను పొందిన ఆనందం వర్ణింపశక్యం కానిది. ఇటు ప్రజ్ఞానం, అటు ఆత్మానుభూతి ఒక వరంగా నాకు ప్రసాదించేరు నా పూజ్య గురుదేవులు శ్రీ బాబాజీ మహాశయులు.

ఈ భువిపై వున్న మానవులందరూ ఆనందంగా, శాంతిగా జీవించడానికి అనాదిగా వస్తున్న "ఉపనిషత్తులు", "బ్రహ్మసూత్రములు", "భగవద్గీత" ప్రధానపాత్ర పోషించాయని మహర్షులు గుర్తించేరు.

వీటిని మతగ్రంధాలుగా కాకుండా, ఒక పరిశోధనాంశంగా తీసుకొని ఎన్నో క్రొత్త విషయాలను కనుగున్నారు నేటి శాస్త్రజ్ఞులు.

ఉపనిషత్తులు (జ్ఞానగీత) విశిష్టత –

ఉపనిషత్తులను ఎంతోమంది మహాజ్ఞానులు మనకు అందించేరు. బ్రహ్మసూత్రములు మఱియు భగవద్గీతను వ్యాసమహర్షి మనకు అందించేరు.

ఈ విశాల ధరణిపై నివసిస్తున్న మానవులందరు కూడా తమ జీవితప్రస్థానాన్ని సుసంపన్నం చేసుకోడానికి ఇవి మార్గదర్శిగా వ్యవహరిస్తాయి.

సంతోషకరమైన జీవితాన్ని గడపడానికి, శాంతితో జీవించడానికి, బ్రహ్మానందాన్ని ఆస్వాదించ డానికి, ద్వంద్వాతీతమైన జ్ఞానాన్ని పొందడానికి, తద్వారా అసలు సత్యాన్ని తెలుసుకోడానికి, ఆత్మ–పరమాత్మ తత్వాన్ని సంపూర్ణంగా ఆస్వాదించడానికి ఈ "ప్రస్థానత్రయము" ఎంతగానో సహకరిస్తుంది.

ఇందులో కులమత ప్రస్తావన లేదు. సకల మానవాళి అభ్యుదయాన్ని ఆశించి వీటిని ప్రస్తావించుట జరిగింది. అన్ని విశ్వాసాలకు ఈ "ప్రస్థానత్రయము" ఆయువుపట్టు.

నా తల్లితండ్రుల ఆశీర్వాదంతో, గురుదేవుల అనుగ్రహపూర్వక ఆదేశంతో ప్రస్థానత్రయంలో నిక్షిప్తమైన జ్ఞానాన్ని, నా ఆలోచనకు అందినంతవరకు, అందరికి తేలికగా అర్థమయ్యేటట్లు సులువైన తెలుగులో వీటిని రచించడం జరిగింది.

అమెరికాలో వుంటున్న సమయంలోనే ఈ రచనలను ముందుగా మీ అందరితో Facebook మాధ్యమం ద్వారా పంచుకున్నాను. మీరు చూపిన ఆదరాభిమానాలకు కృతజ్ఞుణ్ణి.

సనాతన ధర్మ శాస్త్రాలలో ఉపనిషత్తులు ఎంతో ప్రాధాన్యతను సంపాదించు కున్నాయి. అన్ని వేదముల చివరిభాగములే ఉపనిషత్తులు. అందుచేత వీటిని "వేదాంతములు" అని కూడా అంటారు.

ప్రతి వేదంలోను నాలుగు భాగాలున్నాయి. అవి –

1. సంహితలు – మంత్రాలు, స్తోత్రాలు, ఆవాహనలు తెలిపేవి.

2. బ్రాహ్మణాలు – సంహితలోని మంత్రమును, శాస్త్రవిధిని వివరించి, యజ్ఞయాగాదులు చేసే పద్ధతిని తెలిపేవి.

3. అరణ్యకాలు – వివిధ కర్మ, యజ్ఞ కార్యముల అంతరార్థాలను వివరించేవి.

4. ఉపనిషత్తులు – ఇవి పూర్తిగా జ్ఞానకాండను తెలిపేవి. జీవాత్మ, పరమాత్మ, జ్ఞానము, మోక్షము, పరబ్రహ్మ స్వరూపమును గురించి వివరించేవి.

నాలుగు వేదాలకు కలిపి 1180 పైగా ఉపనిషత్తులు ఉన్నాయి. వాటిలో 108 ఉపనిషత్తులు ముఖ్యమైనవి. వాటిలో 10 ఉపనిషత్తులు ఎంతో ప్రధానమైనవి. వీటినే "దశోపనిషత్తులు" అంటారు.

ఈ దశోపనిషత్తులు పరమ ప్రమాణములు గనుక శ్రీ ఆది శంకరులు వీటిమీద తమ భాష్యం రచించడం జరిగింది.

ఉపనిషత్ (ఉపంనిం షత్) పదానికి సులువైన అర్ధము చెప్పాలంటే – "ఉప" అంటే సమీపంగా, "ని" అంటే క్రింద, "షత్" అంటే కూర్చునుట.

వీటిలో జ్ఞానం ప్రధానంగా వుండుటవలన, గురువు ముందు శిష్యుడు కూర్చొని ఆ జ్ఞానాన్ని ఆర్జించాలని అర్ధం. ఇవి తత్వానికి సంబంధించిన గ్రంధాలు. ఆత్మ, ప్రకృతి, పరమాత్మల యొక్క రహస్యాలను ఇవి విపులంగా చర్చించాయి. వేదకాలం నాటి ఆలోచన ధోరణికి ఇవి పరిపూర్ణతను కలిగించాయి. జ్ఞానానికి ఇవి ఎక్కువ ప్రాముఖ్యతనిచ్చేయి.

ఈ ఉపనిషత్తులను అనేకమంది ఋషులు రూపకల్పన చేయడంవలన, చాలావాటిని వారి వారి పేరుమీద నామకరణం చేయడం జరిగింది. ఉదాహరణకి యాజ్ఞవల్క్య, ఉద్దాలక, అరుణి, శ్వేతకేతు, శాండిల్య, ఐతరేయ, పిప్పలాద ఋషుల పేరు మీదా, అలాగే గార్గి, మైత్రేయి అన్నవి ఆ మహిళా ఋషుల పేరు మీదా నామకరణం చేయడం జరిగింది.

"బ్రహ్మవిద్య" అనికూడా ఉపనిషత్తులను పిలుస్తారు. పరావిద్యను, అపరావిద్యను కూడా ఇవి భోదిస్తాయి. ఉపనిషత్తులు వేదసారమనీ, వేదరహస్యమనీ వర్ణనలు కూడా ఉన్నాయి.

కాలానుగుణంగా పది ముఖ్యమైన వాటికి, శ్రీ ఆదిశంకరులు తమ జ్ఞాన భాష్యం వ్రాశారు. అవి

ఈశావాస్యోపనిషత్తు, కేనోపనిషత్తు, కఠోపనిషత్తు, ప్రశ్నోపనిషత్తు, ముండకోపనిషత్తు, మాండూక్యోపనిషత్తు, తైత్తిరీయోపనిషత్తు, ఐతరేయోపనిషత్తు, ఛాందోగ్యోపనిషత్తు,

బృహదారణ్యకోపనిషత్తు.

శైవ, వైష్ణవ, సన్యాస వర్గాలవారు తమవిగా భావించే ఉపనిషత్తుల వర్గీకరణ కూడా ఒకటి వుంది.

శైవులు తమవని భావించే ఉపనిషత్తులు పదిహేను, అవి 1. అక్షమాలి కోపనిషత్తు, 2. అథర్వ శిరోపనిషత్తు, 3. అథర్వ శిఖోపనిషత్తు, 4. కాలాగ్ని రుద్రోపనిషత్తు, 5. కైవల్యోపనిషత్తు, 6. గణపతి ఉపనిషత్తు, 7. జాబాలోపనిషత్తు, 8. దక్షిణామూర్తి ఉపనిషత్తు, 9. పంచబ్రహ్మోపనిషత్తు, 10. బృహజ్జాబాలోపనిషత్తు 11. భస్మజా బాలోపనిషత్తు, 12. రుద్రహృదయో పనిషత్తు, 13. రుద్రాక్ష జాబాలోపనిషత్తు, 14. శరభోప నిషత్తు, 15. శ్వేతాశ్వతరో పనిషత్తు.

అలాగే వైష్ణవులు తమవిగా చెప్పే పదునాలుగు ఉపనిషత్తులు, అవి 1. అవ్యక్తోప నిషత్తు, 2. కలిసంతరణోపనిషత్తు, 3. కృష్ణోప నిషత్తు, 4. గారుడోపనిషత్తు, 5. గోపాలతాప సోపనిషత్తు, 6. తారసోపనిషత్తు, 7. త్రిపాద్వి భూతి

ఉపనిషత్తు, 8. దత్తాత్రేయో పనిషత్తు, 9. నారాయణోపనిషత్తు, 10. నృసింహ తాపసీయోపనిషత్తు, 11. రామ తాపస ఉపనిషత్తు, 12. రామరహస్యో పనిషత్తు, 13. వాసుదేవ ఉపనిషత్తు, 14. హయగ్రీవ ఉపనిషత్తు.

అలాగే సన్యాసానికి సంబంధించిన లక్షణాలను, విధి విధానాలను తెలియజేసే 17 ఉపనిషత్తులను సన్యాసోపనిషత్తులని వర్గీకరించారు. అవి 1. అరుణికోపనిషత్తు, 2. అవధూతోపనిషత్తు, 3. కఠశ్రుత్యుపనిషత్తు, 4. కుండినోపనిషత్తు, 5. జాబాలోపనిషత్తు, 6. తురీయాతీత అవధూతోపనిషత్తు, 7. నారద పరివ్రాజకో పనిషత్తు, 8. నిర్వాణోపనిషత్తు, 9. పరబ్రహ్మోపనిషత్తు, 10. పరమహంస పరివ్రాజకోపనిషత్తు, 11. పరమహంసో పనిషత్తు, 12. బ్రహ్మోపనిషత్తు, 13. భిక్షుక ఉపనిషత్తు, 14. మైత్రేయ ఉపనిషత్తు, 15. యాజ్ఞవల్క్య ఉపనిషత్తు, 16. శాట్యాయన ఉపనిషత్తు, 17. సన్యాసో పనిషత్తు.

ఇక ఒక్కో వేదంలో ప్రస్తావించిన ప్రముఖ ఉపనిషత్తులను పరిశీలిస్తే, ఋగ్వేదంలో 10, కృష్ణ యజుర్వేదంలో 32, శుక్ల యజుర్వేదంలో 19, సామవేదంలో 16, అథర్వణ వేదంలో 31. మొత్తం 108.

మనిషి తనకున్న పరిమితమైన చైతన్యంతో, ప్రజ్ఞతో సాధనచేసి, శాశ్వతమైన బ్రహ్మ చైతన్యాన్ని, బ్రహ్మ ప్రజ్ఞని సులువుగా పొందే మార్గాన్ని సూచించే జ్ఞానసంపద ఈ ఉపనిషత్తులలో వుందన్నది సత్యం.

నా ఈ "జ్ఞానగీత" రచనలో, అతి ముఖ్యమైన ఆరు ఉపనిషత్తులను ప్రస్తావించుట జరిగింది.

భగవద్గీత (జీవనగీత) విశిష్టత :

సర్వోపనిషదో గావః దోగ్ధా గోపాలనందనః ॥
పార్థో వత్స స్సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్ ॥

గోపాలకుడైన శ్రీకృష్ణుడు ఉపనిషత్తులనెడు గోవులనుండి, అర్జునుడు అనే దూడను నిమిత్తంగా చేసుకొని “గీత” అను అమృతమును పితికెను. బుద్ధిమంతులందరూ ఈ గీతామృతమును పానము చేయవచ్చును.

భగవద్గీత ఉపనిషత్తుల సారమనీ, గీతాపఠనం కర్తవ్యనిర్వహణకు ఒక మహత్తర మార్గమని తత్వసాధకుల విశ్వాసం.

ఇందు కర్మయోగము, భక్తియోగము, జ్ఞానయోగము అనే మూడు అధ్యాయాలు జీవనమార్గాన్ని బోధిస్తాయి.

భగవంతుని యొక్క తత్వము, ఆత్మ యొక్క స్వరూపము ఇందులో విపులంగా వివరించబడ్డాయి.

శ్రీమద్భగవద్గీతను ఒక మతగ్రంథంగా భావించి పూజామందిరంలో పెట్టి పూజిస్తారు కొందరు. ఇంకొంతమంది దీనిని కర్తవ్యాన్ని తెలియచెప్పే ఒక మార్గదర్శిగా ఎన్నుకొని, అందున్న సారాన్ని ఆస్వాదిస్తారు.

లోకకళ్యాణార్థమై మానవులందరి శ్రేయస్సుకోరి ఉపదేశింపబడిన ఈ గ్రంథాన్ని ప్రతిఒక్కరూ చదివి, అర్థంచేసుకొని ఆచరించడం మిన్న.

ఒక పరిపక్వత చెందిన సద్గురువు బోధించిన అక్షరసత్యమే భగవద్గీత. దీని సారాన్ని అర్థం చేసుకొని, ఆచరించి ధన్యులైన వారు కోకొల్లలు. దీనినుండి మార్గదర్శకత్వము పొందినవరిలో ఎందరో యోగులు, తాత్వికులు ఉన్నారు.

స్వామి వివేకానంద గీతలోని భక్తి, జ్ఞాన, కర్మ, రాజయోగాలకు ఎంతో విపులంగా నూతన భాష్యాన్ని వ్రాశారు. యోగులు కాదలచిన వారు గీతలోని ప్రతి అధ్యాయాన్ని చదవమని స్వామి శివానంద బోధించారు. పరమహంస యోగానంద, గీతను ప్రపంచములోని అత్యుత్తమ పవిత్ర గ్రంథముగా పేర్కొన్నారు.

ఇంతకీ గీతలో మానవుల గీతను మార్చే సత్యం ఏముంది?

ఒక సాధకునిగా అర్జునుడు యుద్ధం చేసి తన కర్తవ్యాన్ని నిర్వర్తించేడు. ఒక గురువుగా శ్రీకృష్ణుడు ఆయుధం పట్టకుండా ఒక సారధిగా వ్యవహరించాడు. అన్నీ తానై పార్థుని చేత యుద్ధాన్ని చేయించి గెలిపించాడు.

ఆలోచిస్తే జ్ఞానం కృష్ణుడిది, కర్తవ్యం అర్జునుడిది. కానీ ఇక్కడ అలా జరగలేదు. ముందుగా శ్రీకృష్ణుడు తన జ్ఞానాన్ని పార్థునికి ప్రసాదించి, అతణ్ణి తనంతవానిగా చేసి, విజయం చేకూర్చి, తాను కేవలం సాక్షిభూతంగా నిలిచాడు.

తనకి, సాధకునికి తేడా లేదని "ఏకత్వాన్ని" నిరూపించేడు. ఏకత్వమే యోగము. యోగేశ్వరుడే శ్రీకృష్ణుడు.

భగవద్గీత "ధర్మ" (మొదటి శ్లోకంలో మొదటి పదం)తో ప్రారంభమై,

"మమ" (చివరి శ్లోకంలో చివరి పదం)తో ముగుస్తుంది.

ధర్మ–మమ / మమ–ధర్మ, అంటే నా ధర్మము.

ప్రతివ్యక్తికి తన ధర్మమును తెలియజేస్తుంది భగవద్గీత.

"మమకారం"తో (మొదటి శ్లోకంలో ధృతరాష్ట్రుని ప్రశ్న) ప్రారంభమైన భగవద్గీత క్రమంగా విషాద, ఆత్మ, కర్మ, జ్ఞాన, విజ్ఞాన, ధ్యాన, విభూతి, భక్తి, అక్షర, సందర్శన, ప్రాప్తి ఇత్యాది విశేషాలను విశదీకరిస్తూ తుదకు "విజయం"తో ముగుస్తుంది.

ఇదంతా ఒక సాధకునికి, స్నేహితునికి మధ్య జరిగిన సంవాదంగా సాగుతుంది. ఇక్కడ మానవుడే సాధకుడు, భగవంతుడే స్నేహితుడు. సాధకునిగా ప్రతి మానవుని మదిలో ఉదయించే అన్ని ప్రశ్నలకు ఒక స్నేహితుడుగా పరమాత్మ

సమాధానం చెబుతాడు.

రామాయణము (శాస్త్రీయ రామాయణము) విశిష్టత :

"వేదః ప్రాచేతసాదాసీత్ సాక్షాద్రామాయణాత్మనా"

(అపౌరుషేయమైనవి వేదాలు ఐతే, పౌరుషేయమైన వేదమే రామాయణము)

విశ్వం అంతా ఒక శాస్త్రీయ పద్ధతిన సృష్టించబడినదని మహార్షులు తమ తపశక్తి ద్వారా తెలుసుకొని లోకహితార్థమై శాస్త్ర, పురాణ, ఇతిహాసాల ద్వారా మనకు అందించారన్నది సత్యం.

ఆదికావ్యమైన వాల్మీకి రామాయణంలో నిమిడియున్న శాస్త్రీయతను ఒక కథా రూపంలో అందించే ప్రయత్నమే నాచే రచింపబడిన "శాస్త్రీయ రామాయణము".

సమస్త సృష్టి (సజీవ, నిర్జీవ పదార్థాలన్ని) కొన్ని నియమిత ధర్మాల ఆదారంగా జరిగింది, అలానే కొనసాగుతుంది కూడా. మాయాధీనులైన మానవులు తమ జీవితకాలంలో సాధించ వలసినవి కూడా ఈ సత్యధర్మాలే.

ధర్మానికి గ్లాని ఏర్పడినప్పుడు నారాయణుడే ఒక నరునిగా భూమి పై ధర్మసంస్థాపనార్థం అవతరిస్తాడు. నారాయణుడు భువిపై అవతరించి నప్పుడు మాయను తన అధీనంలో నుంచుకొని అవతరిస్తాడు.

కృతయుగంలో నాలుగు పాదాలపై నిలిచిన ధర్మం త్రేతాయుగంలో ఒక పాదము కోల్పోయి నప్పుడు వచ్చినది రామావతారం, అలాగే ద్వాపార కలియుగ సంధికాలం లో రెండు పాదాలపై నిలబడ్డ ధర్మం ఇంకో పాదాన్ని కూడా కోల్పోయి ఒంటి కాలిపై నిలబడాల్సివచ్చిన వేళ వచ్చినది కృష్ణావతారం.

శ్రీ రాముడు మాయా మానుషుడు అయితే, శ్రీ కృష్ణుడు లీలా మానుషుడు.

రామాయణంలో ధర్మబోధ సూటిగా సాగితే, తత్వబోధ అంతర్లీనంగా సాగుతుంది. వాటిని వెలిబుచ్చేందుకు వాల్మీకి మహర్షియే స్వయంగా ఆద్యాత్మ రామాయణము మరియు భావ రామాయణము అనే రెండింటిని రచించాల్సి వచ్చింది.

నా శాస్త్రీయ రామాయణంలో శ్రీ సీతారాములు స్వయంగా లక్ష్మీ నారాయణులు మఱియు హనుమంతుడు సాక్షాత్ పరమ శివుడు. కథంతా శ్వీరు ముగ్గురూ వేసుకున్న ఓ ప్రణాలిక.

రామో విగ్రహవాన్ ధర్మః అన్నది రాక్షసుడైన మారీచుని సత్యవాక్యం.

రాముడు ఈ లోకంలో అవతరించినది పుత్రకామేష్టి యజ్ఞం ద్వారా, లక్ష్మణుడితో విశ్వామిత్రుడి వెంట వనాలకు వెళ్ళినది యాగ సంరక్షణార్థము, వేదాలలో పేర్కొన్న విహితకర్మలకు అనుగుణంగా రాముడు తన జీవితంలో వేసిన ప్రతి అడుగు ధర్మసంరక్షనార్థమే.

బాలకాండలో శిష్యధర్మం, అయోధ్యలో పుత్రధర్మం, అరణ్యంలో క్షాత్రధర్మం, కిష్కింధలో మిత్రధర్మం, సుందరలో స్వామిధర్మం, యుద్ధంలో వీరధర్మం నెరవేర్చాడు. రామాయణంలో గమనం, గమ్యం రెండూ రాముడే.

అలాగే ప్రతి నరుడి చరిత్ర దాదాపు అలాంటిదే! స్వస్వరూపంగా పరబ్రహ్మ స్వరూపుడే అయినప్పటికీ శరీరంతో తాదాత్మ్యం చెంది, మాయా ప్రభావం వల్ల తన దివ్యత్వం మరుగున పడిన పురుషుడికి రెండు అయణాలున్నాయి.

ఒకటి బయట, రెండవది లోపల. అంటే తన లోనికి తానే పయనించడం. తద్వారా చిత్తశుద్ధి కావించుకొని, సద్గురువు ద్వారా జ్ఞానబోధ బడిసి, అంతర్ముఖుడై, తన నిజస్వరూపాన్ని అనుభవానికి తెచ్చుకొని, ప్రారబ్ధకర్మననుభవించి, సంచిత మరియు ఆగామి కర్మలను దగ్ధం చేసుకొని ప్రజ్ఞానఘనంగా మిగులుటే నరుడు నారాయణుడు కావటం.

రామం విద్ధి పరబ్రహ్మాం సచ్చిదానందం అద్వయమ్ ॥
సర్వోపాధి వినిర్ముక్తం సత్తామాత్రం గోచరం ॥

విష్ణు సహస్రనామ స్తోత్రము (పరమాత్మ స్వరూపము) విశిష్టత :

ఆత్మజ్ఞానం పొందడానికి "గేయం గీతా నామసహస్రం" అన్నారు జగద్గురు ఆదిశంకరులు తన భజగోవిందంలో.

భగవద్గీతలోని 700ల శ్లోకాలు, విష్ణు సహస్రనామ స్తోత్రంలో వెయ్యి నామాల అంతరార్థాన్ని సంపూర్ణంగా గ్రహించి, తదనుగుణంగా సాధనచేస్తే, ఇక ఆధ్యాత్మికంగా తెలుసుకోవలసింది ఏమి వుండదు.

త్వరలోనే గురుసాక్షాత్కారం లభించి ఆత్మానుభూతి సిద్ధిస్తుంది. ఎందులో ఎటువంటి సంశయం లేదు.

విష్ణు సహస్రనామ స్తోత్రము, మహాభారతంలో కురుక్షేత్ర యుద్ధానంతరం, పరమాత్మలో విలీనాన్ని ఆసిస్తూ, అంపశయ్యపై దేహత్యాగ సమయం కోసం నిరీక్షిస్తున్న భీష్ముడు, దీన్ని యుధిష్ఠిరునకు (ధర్మరాజుకు) ఉపదేశిస్తాడు.

108 శ్లోకాలలో, వెయ్యినామాలుతో వున్న ఈ పవిత్ర స్రోత్రం, "విశ్వం" అనే మొదటి నామంతో మొదలై "సర్వ ప్రహరణాయుధ" అనే 1000వ నామంతో ముగుస్తుంది. పరమాత్మ విభూతిని ఈ వెయ్యి నామాలలో ఎంతో జ్ఞానవంతంగా వర్ణించేడు భీష్ముడు.

ఇందులో నున్న మహత్తును పూర్తిగా అనుభూతి పొందాలంటే, ప్రతినామం వెనుకనున్న అసలు అంతరార్థాన్ని అర్థం చేసుకోవాలి. ఒక్కరు పారాయణచేసినా, సామూహికంగా పారాయణ చేసినా అర్థవంతంగా వుండాలి. వినే పదిమందికీ వుపయోగపడాలి. దీని పారాయణకు కులమతాలతో, నీయమనిష్ఠలతో పనిలేదు. కేవలం అకుంఠిత విశ్వాసం, సహనం తప్పక వుండాలి.

ఈ దివ్య సహస్రనామం వినేవారికి, చదివే వారికి ఏవిధమైన భయములు, అశుభములు కలుగవు. ఆశించేవారికి చతుర్విధ ఫలపురుషార్థాలు తప్పక లభిస్తాయి.

ఆడంబరం కోసం కాకుండా ఆత్మానుభూతి కోసం భక్తిజ్ఞానాలతో అర్ధవంతంగా పారాయణ చెయ్యవలసిందిగా నా మనవి.

విష్ణు సహస్రనామ స్తోత్రంపై ఎంతోమంది మహనీయులు ఎన్నో భాష్యాలు రచించేరు. నా తండ్రి, నా మొదటిగురువు శ్రీ ఆకుండి సూర్యనారాయణ శాస్త్రి గారి ఆశీర్వాదంతో, నా పూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ బాబాజీ మహాశయుల వారి అనుగ్రహంతో 108 శ్లోకాల్లో పేర్కొన్న నామాలకు అర్థం చెబుతూ, ప్రతిశ్లోకానికి నా జ్ఞానానికి అందినంత మేర పరమాత్ముని భవ్య సచ్చిదానంద తత్వాన్ని విశ్లేషిస్తూ ఈ దివ్యరచన పూర్తిచేయడం జరిగింది.

ఆధ్యాత్మిక సాధనకు, ఆత్మజ్ఞానం పొందుటకు ఈ విశ్లేషణ కొంతమందికైనా ఉపయోగపడితే నా ఈ ప్రయత్నం సఫలమయినట్లే!

## అధ్యాయం - 45

## ఆత్మకథకు ముగింపు, ఆజ్ఞకు శ్రీకారం

వందే భారత్ పేరున 2020 ఆగష్టు లో భారత ప్రభుత్వం వారు కొన్ని ఎయిర్ ఇండియా విమానాలు resume చెయ్యడం జరిగింది. August నెలాఖరుకి వైజాగ్ చేరుకున్నాము. వైజాగులో ఇంకా కొన్ని ప్రాంతాల్లో Covid Red Zone నడుస్తోంది. మెల్లగా ఈ మహమ్మారి సద్దుమణిగింది.

మరలా 2021 లో Covid సెకండ్ వేవ్ రావడం జరిగింది. ఈ వేవ్ లో మన దేశంలో చాలా మంది మృత్యువాత పడ్డం జరిగింది. ఇది మర్చిపోలేని సంఘటన. మానవ మేధస్సుతో ప్రపంచం యావత్తు ఈ సెకండ్ వేవ్ నుండీ మెల్లగా బయటపడ్డం జరిగింది. ప్రపంచ వ్యాప్తంగా అందరికీ వాక్సినేషన్ అనేది యుద్ధప్రాతిపదికన జరిగింది.

ఈ స్వీయ గృహనిర్బంధ తరుణంలో నా ఆధ్యాత్మిక సాధన తురీయస్థితికి చేరుకుంది. ఎన్నోసార్లు పూజ్య గురుదేవుల దర్శన, స్పర్శన, సంభాషణ భాగ్యం లభించింది. ఎన్నో విషయాలు చర్చించుకోవడం జరిగింది.

ఈ అమోఘ జ్ఞానాన్ని పదిమందికి నిష్కామంగా అందజెయ్యవలసిందిగా, గురుదేవులు నన్ను ఆజ్ఞాపించేరు. Sanmathi, Gnana Vedika, TruGnan, Open Mind, Shivoham ఇలా ఎన్నో పేర్లతో WhatsApp గ్రూపులు ఏర్పాటు చేసి, గ్రూప్ మిత్రులతో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం జ్ఞాన సత్సంగాలు ప్రారంభించడం జరిగింది.

శ్రీ గురుదేవుల అనుగ్రహంతో ఈ సత్సంగాలు ఇప్పటికీ నిర్విరామంగా కొనసాగుతున్నాయి. ఎంతోమంది జిజ్ఞాసువులు, సాధకులు ఈ సత్సంగ జ్ఞానబోధ ద్వారా తాము నిరాటంకంగా ఆత్మానుభూతి పొందుతున్నామని తెలియజేస్తున్నారు. ఇది ఎంతో సంతోషకరమైన వార్త.

2022 ఫిబ్రవరి నెలలో మొదటిసారిగా రెండు ఆత్మీయ సమ్మేళనాలు జరిగేయి

ఒకటి విజయవాడలో, శ్రీ బొలిశెట్టి శివకుమార్ & శ్రీమతి శ్రీదేవి గార్ల ఆధ్వర్యంలో వారి ఇంటిలోనే జరిగింది. ఎంతో వైభవంగా నిర్వహించేరు ఆ పుణ్యదంపతులు. వారికి నా హృదయపూర్వక అభినందనలు, ఆశీస్సులు.

ఇంకోటి హైదరాబాదులో, శ్రీ విజిలాపురం వేణుగోపాల్ & శ్రీమతి సీమా గార్ల ఆధ్వర్యంలో ఒక చక్కని Farm house లో జరిగింది. ఎంతో అద్భుతంగా, నయనానందకరంగా నిర్వహించేరు ఆ పుణ్యదంపతులు. వారికి నా మనోపూర్వక అభినందనలు, ఆశీస్సులు.

ఎంతోమంది మిత్రులను ఈ రెండు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాలలో, కలవడం జరిగింది. పెద్దవారికి నా చేతులమీదుగా సన్మానించడం జరిగింది.

2022 వ సంవత్సరంలో పూజ్య గురుదేవులు నాకు రెండుసార్లు తమ ప్రత్యక్షదర్శన భాగ్యం ప్రసాదించేరు. గురుదేవుల పిలుపుమేరకు –

ఒకసారి Chhattisgarh రాష్ట్రంలోని Dongargarh పట్టణంలో కొండపై నెలకొన్న బంభలేశ్వరి అమ్మవారి మందిరానికి, రెండవసారి మళ్ళీ హిమాలయాల పాదప్రాంతం రాణిఖేత్ లో వున్న ఝూలాదేవి అమ్మవారి మందిరానికి ప్రయాణించి పూజ్య గురుదేవులను దర్శించి, భవిష్యత్ ప్రణాళికపై ఎన్నో సూచనలను / ఆజ్ఞలను వారినుండీ అందుకోవడం జరిగింది.

2022 వ సంవత్సరంలోనే Sanmati Seva Satsang మిత్రులు మఱియు మా పిల్లల ఆర్థిక సహకారంతో నేచే రచింపబడిన అన్ని పుస్తకాలను –

శాస్త్రీయ రామాయణము.

జ్ఞానగీత (నిత్యజీవితంలో ఉపనిషత్తులు)

జీవనగీత (నిత్యజీవితంలో ఉపనిషత్తులు)

సాయికథా మకరందం (సద్గురు సాయినాధుని చరితం)

విష్ణు సహస్రనామ స్తోత్ర విశ్లేషణ (పరమాత్మ స్వరూపము)

ఒక సత్యశోధకుని ఆత్మకథ

ఎంతో అందంగా పుస్తకరూపంలో ముద్రించడం జరిగింది.

అలానే అనేక సత్సంగాలలో ఆత్మీయ మిత్రులు సేకరించిన ఎన్నో అద్భుత జ్ఞాన విషయాలను, “ఆత్రేయగీత” మరియు “గురుగీత” పేరున 6 భాగాలుగా, Pocket Size పుస్తకరూపంలో ఎంతో అందంగా ముద్రించడం జరిగింది.

ప్రతీ సత్సంగాన్ని ఆడియో రికార్డింగ్ చేసి మన Facebook, WhatsApp, Telegram గ్రూప్స్ మఱియు YouTube లో TruGnan / ఆత్మజ్ఞానం పేరున ఒక Channel create చేసి వాటిలో మన సత్సంగ మిత్రులు పోస్ట్ చెయ్యడం జరుగుతోంది.

trugnan.org పేరున ఒక website create చేసి అందులో అన్ని పుస్తకాల PDF లను, అన్ని Audio & Video రికార్డింగ్స్ ఎప్పటికప్పుడు Upload చెయ్యడం జరుగుతోంది.

2023, 2024 సంవత్సరాలలో సత్సంగం తరపున ఎన్నో కార్యక్రమాలు, నారాయణసేవలు, సత్సంగమిత్రుల గ్రహంలో ఎన్నో శుభకార్యాలు, ఆత్మీయ సమ్మేళనాలు చోటుచేసుకున్నాయి.

అన్నవరం క్షేత్రంలో సత్సంగ మిత్రులతో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం మఱియు సత్సంగ సభ్యుల ఆధ్వర్యంలో నా షష్టిపూర్తి కార్యక్రమం ఎంతో ఆనందంగా జరిగేయి.

అన్ని సత్సంగ కార్యక్రమాలను తమ భుజంపై వేసుకొని, ప్రణాళికా బద్ధంగా, ఎటువంటి లోటుపాట్లు లేకుండా, ఎవ్వరికీ ఇబ్బంది లేకుండా, ఒక కర్తవ్యంగా భావించి ఎంతో శ్రద్ధా భక్తులతో నిర్వహిస్తున్న శ్రీ బాలాజీ రావు గారు & Vizag టీమ్ సభ్యులకు నా అభినందనలు, ఆశీస్సులు.

నిష్కామ భావంతో అన్ని కార్యక్రమాలలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సేవలు అందిస్తున్న సత్సంగ మిత్రులందరికీ నా కృత్ఙతలు, ఆశీస్సులు.

హనుమాన్ జంక్షన్ లో శ్రీ కొల్లిమర్ల వెంకట రంగారావు దంపతులు నిర్వహించిన అపూర్వ ఆత్మీయ సమ్మేళనంలో ఎంతోమంది క్రొత్త మిత్రులను కలవడం జరిగింది. ఆ సమ్మేళనం ఒక అపూర్వ ఘట్టం. జీవితాంతం గుర్తుండిపోయేలా అద్భుత ఆతిధ్యాన్ని ఆ పుణ్యదంపతులు అందించేరు.

నెల్లూరు మిత్రులు నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం, శ్రీ విట్టపు శ్రీకాంత్ & శ్రీమతి లక్ష్మి గార్ల ఇంటిలో జరిగిన రెండు వివాహ శుభకార్యాలు, శ్రీమతి లక్ష్మి గారు ఏర్పాటుచేసిన కొన్ని దివ్య క్షేత్రదర్శనాలు, విశాఖపట్టణంలో గృహప్రవేశం, గురుపూజ మహోత్సవం ఇలా ఎన్నో ఆనంద కార్యక్రమాలు మిత్రులలో అద్వితీయ ఆధ్యాత్మిక పురోగవృద్ధికి ఎంతో దోహదపడ్డాయి.

2024 డిసెంబర్ నెలాఖరు వరకు –

నా సత్యశోధన, నా మొదటి గురువు, పూజ్య గురుదేవులతో నా ప్రత్యక్ష పరోక్ష అనుభవాలు, నా తత్వసాధన, నేను పొందిన సమాధి స్థితి, ఆత్మానుభూతిని ఈ "నందకం" రూపంలో, నా ఆత్మకథను మీతో పంచుకున్నాను.

ఈ భాగంతో నా ఈ రచనకు ముగింపు పలుకుతున్నాను! అవసరాన్ని బట్టీ, ఆత్మీయ మిత్రుల ఆధ్యాత్మిక అభివృద్ధిని బట్టీ మిగతా అనుభవాలను మీతో పంచుకుంటాను!

ఈ సత్యశోధనలో వేదాలద్వారా, ఉపనిషత్తులద్వారా, ఎన్నో గ్రంధాలద్వారా, కావ్యాలద్వారా, ఈ సృష్టిలో అంతర్లీనంగా గోచరిస్తున్న దివ్య పరమాత్మ విభూతిద్వారా, ఎంతోమంది సద్గురువుల జీవితచరిత్రలద్వారా, సత్పురుషుల సాంగత్యంద్వారా, మదిలో నిత్యం కలిగే ఆలోచనలద్వారా, అంతర్మధనం ద్వారా, పూజ్య గురుదేవుల ప్రత్యక్ష బోధనద్వారా గ్రహించిన సత్యానికి అసలు ముగింపు "ఆత్మానుభూతి" పొందడమే!

నాకు ప్రత్యక్షదర్శనం ప్రసాదించినప్పుడల్లా, గురుదేవులు ఎక్కువగా "ఆత్మతత్వము" గురించే బోధించేవారు. ఎందుకంటే, ఆత్మకు జననమరణములు వుండవు. అలాగే భూత, భవిష్యత్, వర్తమానాలు వుండవు. అది శాశ్వతము, సనాతనము. అది అంతటా వ్యాపించియున్నది. అన్ని జీవులయందు వున్నది. దానిని తెలుసుకోవడమే అసలైన సాధన. దానిగురించే యోగుల తపన.

ఆత్మను చాలామంది చాలారకాలుగా వర్ణిస్తారు. దానిని వర్ణించేకన్నా తీవ్ర తపనతో, జ్ఞాన సాధన ద్వారా అనుభూతి పొందడం ఉత్తమం. తనను తాను పూర్తిగా తెలుసుకొని, తద్వార "ఆత్మానుభూతి" పొందడమే అసలైన సాధన.

జీవితంలో మానవుడు ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యల నుండి బయటపడాలన్నా, ఉన్నతస్థితినొంది పరమానందాన్ని ఆస్వాదించాలన్నా,

పరమాత్మకు ప్రతిరూపమైన తనను తానూ తెలుసుకోవాలన్నా,

ఈ జననమరణ చక్రం నుండి పూర్తిగా విడిపడాలన్నా,

తన నిజ స్థానానికి తిరిగిచేరుకోవాలన్నా "ఆత్మానుభూతి" పొంది తీరాల్సిందే.

పూజ్య గురుదేవుల అనుగ్రహంతో 2025 సంవత్సరం కూడా, సత్సంగ మిత్రుల ఆధ్వర్యంలో సత్య, జ్ఞాన, ఆనంద పారవశ్యంతో కూడుకున్న అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ఆత్మీయ సమ్మేళనాలు, నారాయణ సేవలు తప్పక జరుగుతాయన్నది నా ప్రగాఢ విశ్వాసం.

ప్రస్తుతం తమకు తెలియకుండానే మిత్రులందరూ ఆత్మానందం పొందుతున్నారు!

త్వరలోనే అద్వితీయ ఆత్మానుభూతిని అన్నివేళలా, అన్ని అవస్థలలో, నిర్విరామంగా తప్పక పొందుతారు! ఇదే నా వాగ్దానం!

నాకు కావాల్సిందంతా మీ దృఢమైన విశ్వాసం, విశ్వాసంతో కూడిన ఓరిమి.

చిదానంద రూపః శివోహం! శివోహం!!

అందరికీ శుభం భూయాత్!

సర్వేజనాస్సుఖినోభవంతు। లోకాస్సమస్తాసుఖినోభవంతు ॥

ఓమ్ శాంతిః శాంతిః శాంతిః